సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 233

గురువారం 14-11-2024



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



గుజరాత్ టైటాన్స్ బ్యాటింగ్ కోచ్‌గా పార్థివ్ పటేల్

ఐపీఎల్ మాజీ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ జట్టుకు కొత్త బ్యాటింగ్ కోచ్ వచ్చాడు. భారత మాజీ వికెట్ కీపర్ పార్థివ్ పటేల్ వచ్చే ఏడాది ఐపీఎల్ టోర్నీలో గుజరాత్ టైటాన్స్ జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా, అసిస్టెంట్ కోచ్‌గా నియమితుడయ్యాడు. 39 ఏళ్ల పార్థివ్ నాలుగేళ్ల క్రితం ఆటకు వీడ్కోలు పలికాడు.పార్థివ్ మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20) కలిపి భారత జట్టు తరఫున 65 మ్యాచ్‌లు ఆడి 1706 పరుగులు సాధించాడు. 93 క్యాచ్‌లు పట్టి, 19 స్టంపౌట్‌లు చేశాడు.

అర్జున్ మూడు గేమ్‌లు 'డ్రా'



టాటా స్టీల్ చెస్ ఇండియా ర్యాపిడ్ టోర్నమెంట్ ఓపెన్ విభాగంలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ తొలి రోజు ఆడిన మూడు గేమ్‌లనూ 'డ్రా' చేసుకున్నాడు. కోల్‌కతాలో జరుగుతున్న ఈ టోర్నీలో అర్జున్-నిహాల్ సరీన్ (భారత్) తొలి గేమ్ 44 ఎత్తుల్లో... అర్జున్-విదిత్ (భారత్) రెండో గేమ్ 35 ఎత్తుల్లో... అర్జున్-నారాయణన్ (భారత్) మూడో గేమ్ 67 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. మహిళల విభాగంలో భారత స్టార్స్ కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, దివ్య కూడా తమ తొలి మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు.

తన్మయ్ అజేయ సెంచరీ

- హైదరాబాద్ 244/5
- ఆంధ్రతో రంజీ మ్యాచ్



సాక్షి, హైదరాబాద్: ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (240 బంతుల్లో 124 బ్యాటింగ్; 10 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీతో చెలరేగాడు. ఫలితంగా ఉప్పల్ స్టేడియంలో ఆంధ్ర జట్టుతో మొదలైన రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 244 పరుగులు చేసింది. హైదరాబాద్ మాజీ కెప్టెన్ తన్మయ్ రోజంతా బ్యాటింగ్ చేసి అజేయ శతకంతో అలరించాడు. అభిరత్ రెడ్డి (114 బంతుల్లో 35; 3 ఫోర్లు, ఒక సిక్సర్), హిమతేజ (36; 7 ఫోర్లు) మెరుగైన ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. కెప్టెన్ రాహుల్ సింగ్ (1)తో పాటు రోహిత్ రాయుడు (0) విఫలం కాగా.. నితీశ్ రెడ్డి (22), వికెట్ కీపర్ రాహుల్ రాదేశ్ (22 బ్యాటింగ్) ఫర్వాలేదనిపించారు. ఆంధ్ర బౌలర్లలో త్రిపురాణ విజయ్ 3 వికెట్లు పడగొట్టగా... లలిత్ మోహన్, యరా సందీప్ చెరో వికెట్ తీశారు. తాజా సీజన్‌లో హైదరాబాద్ ఇప్పటి వరకు నాలుగు మ్యాచ్‌లు ఆడింది. ఒక మ్యాచ్‌లో గెలిచింది. మరో మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంది. రెండు మ్యాచ్‌ల్లో ఓడింది. మొత్తం 8 పాయింట్లతో ఆరో స్థానంలో ఉంది. మరోవైపు ఆంధ్ర జట్టు నాలుగు మ్యాచ్‌ల్లో మూడింట ఓడి, ఒక మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంది.

స్కోరు వివరాలు

హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్: తన్మయ్ అగర్వాల్ (బ్యాటింగ్) 124; అభిరత్ రెడ్డి (సి) మోహన్ (బి) విజయ్ 35; రోహిత్ రాయుడు (సి) (సబ్) జ్ఞానేశ్వర్ (బి) విజయ్ 0; హిమతేజ (సి) భరత్ (బి) సందీప్ 36; రాహుల్ సింగ్ (సి అండ్ బి) విజయ్ 1; నితీశ్ రెడ్డి (స్టంప్డ్) భరత్ (బి) మోహన్ 22; రాహుల్ రాదేశ్ (బ్యాటింగ్) 22; ఎక్స్‌ట్రాలు 4, **మొత్తం (90 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి) 244. వికెట్ల పతనం:** 1-91, 2-95, 3-151, 4-152, 5-200, **బౌలింగ్:** శశికాంత్ 15-3-32-0; రఫీ 17-3-41-0; విజయ్ 27-4-85-3; లలిత్ మోహన్ 23-4-64-1; సందీప్ 8-0-18-1.

ఆరుగురు హైదరాబాద్ క్రికెటర్లపై నిషేధం

సాక్షి, హైదరాబాద్: తప్పుడు వయో ధ్రువీకరణతో అండర్-19 క్రికెట్‌లో పాల్గొన్న హైదరాబాద్ క్రికెటర్లపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) చర్యలు తీసుకుంది. 19 ఏళ్లు పైబడిన ఆరుగురు క్రికెటర్లు (ఆకుల సాయిచంద్ర, గోనె ప్రేమ్, అనుదీప్ జవ్వాజీ, ఆదిత్య జవ్వాజీ, దివేశ్ బజాజ్, చిరాగ్ యాదవ్) అండర్-19 కేటగిరీలో పోటీపడటంతో వారిపై రెండేళ్లపాటు నిషేధం విధించింది. ఈ నెల 4 నుంచి 2026 నవంబర్ 3 వరకు రెండేళ్ల నిషేధం అమల్లో ఉంటుంది. ఈ సమయంలో బోర్డు నిర్వహించే ఏ రకమైన టోర్నీలో వారు పాల్గొనేందుకు అనర్హులు. అయితే శిక్షాకాలం తదుపరి వారంతా సీనియర్ పురుషుల టోర్నీల్లో యథావిధిగా పాల్గొనవచ్చు. హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) పరిధిలోని ఈ ఆరుగురు ప్లేయర్ల వయోవిభాగంపై హెచ్‌సీఏ ఫిర్యాదు మేరకు తెలంగాణ పోలీసులు దర్యాప్తు చేసి బీసీసీఐకి నివేదిక ఇచ్చారు. దీన్ని పరిశీలించిన బోర్డు... బీసీసీఐ మార్గదర్శకాలను అనుసరించి క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. వయో విభాగం టోర్నీల్లో నిక్కచ్చిగా వ్యవహరించడమే తమ లక్ష్యమని హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజ్ తెలిపారు.

వచ్చే నెలలో విండీస్‌తో భారత మహిళల జట్టు సిరీస్



ముంబై: వచ్చే నెలలో భారత మహిళల క్రికెట్ జట్టు వెస్టిండీస్‌తో 3 వన్డేలు, 3 టి20లు ఆడనుంది. దాంతో పాటు జనవరిలో స్వదేశంలో ఐర్లాండ్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడనుంది. ఈ మూడు సిరీస్‌ల కోసం బీసీసీఐ బుధవారం షెడ్యూల్ ప్రకటించింది. డిసెంబర్ 15 నుంచి వెస్టిండీస్ మహిళల జట్టు భారత్‌లో పర్యటించనుండగా... నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో వరుసగా మూడు టి20లు (15న, 17న, 19న) ఆడనుంది. ఆ తర్వాత వడోదరలో డిసెంబర్ 22, 24, 27వ తేదీల్లో మూడు వన్డేలు ఆడనుంది. అనంతరం వచ్చే ఏడాది జనవరి 10, 12, 15న రాజ్‌కోట్‌లో ఐర్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. వచ్చే ఏడాది భారత్ వేదికగా మహిళల వన్డే ప్రపంచకప్ జరగనుండగా... ఐసీసీ మహిళల చాంపియన్‌షిప్‌లో భాగంగా ఈ సిరీస్‌లు జరగనున్నాయి.



తిలక్ తుఫాన్

56 బంతుల్లో **8** ఫోర్లు, **7** సిక్స్‌లతో **107** నాటౌట్

8 ఈ ఏడాది భారత జట్టు టి20ల్లో 8 సార్లు 200 పైచిలుకు పరుగులు సాధించింది. గత ఏడాది భారత జట్టు ఏడుసార్లు ఈ మైలురాయిని దాటింది.

గతేడాది విండీస్ గడ్డపై టి20తో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన హైదరాబాదీ స్టార్ తిలక్ వర్మ ఇప్పటివరకు 22 మ్యాచ్‌లు (18 టి20లు, 4 వన్డేలు) ఆడాడు. అడపాదడపా రాణించినా... తాజాగా తన 19వ టి20 మ్యాచ్‌లో చేసిన తుఫాన్ సెంచరీ కెరీర్‌లో కలకాలం గుర్తుండి పోతుంది. ఇన్నింగ్స్ మూడో బంతికి క్రీజులోకి వచ్చిన తిలక్ ఆఖరి బంతిదాకా అజేయంగా నిలిచాడు. సఫారీ గడ్డపై తన అంతర్జాతీయ కెరీర్‌లో తొలి సెంచరీని సాఫల్యం చేసుకున్నాడు. ఇక ఈ సిరీస్‌లో టీమిండియాను ఓడిపోకుండా నిలబెట్టాడు. వన్డే కెరీర్‌ను కూడా విదేశీ గడ్డపై (శ్రీలంక) మొదలుపెట్టిన ఈ టాపార్డర్ బ్యాటర్ ఇప్పుడు తొలి శతకాన్ని విదేశంలోనే నమోదు చేయడం విశేషం.

మూడో టి20లో భారత్ గెలుపు
- మెరిపించిన అభిషేక్ శర్మ
- 11 పరుగులతో ఓడిన దక్షిణాఫ్రికా
- వణికించిన జాన్సెన్, క్లాసెన్

సెంచూరియన్: హైదరాబాదీ సంచలనం ఠాకూర్ తిలక్ వర్మ అజేయ సెంచరీతో భారత్‌కు విజయ తిలకం దిద్దడంతో పర్యాటక జట్టు ఇక ఈ సిరీస్ గెలిచే స్థితిలో తప్ప ఓడే అవకాశం లేదు. మూడో టి20లో 11 పరుగుల తేడాతో గెలుపొందిన టీమిండియా నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో పైచేయి సాధించింది. భారత్ 2-1తో ఆధిక్యంలో ఉండగా, శుక్రవారం (15న) జొహన్నెస్‌బర్గ్‌లో ఆఖరి నాలుగో టి20 మ్యాచ్ జరగనుంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 219 పరుగుల భారీ స్కోరు చేసింది. వన్‌డౌన్ బ్యాటర్ తిలక్ వర్మ (56 బంతుల్లో 107 నాటౌట్; 8 ఫోర్లు, 7 సిక్స్‌లు) శతక్కొట్టగా, ఓపెనర్ అభిషేక్ శర్మ (25 బంతుల్లో 50; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) దంచేశాడు. సిమ్‌లేన్, కేశవ్ మహరాజ్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం కష్టమైన లక్ష్యఛేదనకు దిగిన సఫారీ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసి ఓడింది. మార్కో జాన్సెన్ (17 బంతుల్లో 54; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), క్లాసెన్ (22 బంతుల్లో 41; 1 ఫోర్, 4 సిక్స్‌లు) విరుచుకుపడ్డారు.

51 బంతుల్లోనే సెంచరీ

వరుసగా రెండో మ్యాచ్‌లోనూ సంజూ సామ్సన్ (0) డకౌటయ్యాడు. మూడో బంతికి క్రీజులోకి వచ్చిన తిలక్... ఓపెనర్ అభిషేక్‌తో ధనాధన్ ఆటకు శ్రీకారం చుట్టాడు. ఇద్దరి జోరుతో 8.1 ఓవర్లో జట్టు స్కోరు 100కు చేరింది. అదే ఓవర్లో అభిషేక్ 24 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకొని అవుటయ్యాడు. దీంతో రెండో వికెట్‌కు 107 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కెప్టెన్ సూర్యకుమార్ (1), హార్దిక్ పాండ్యా (18; 3 ఫోర్లు) మెరిపించలేదు. 32 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాక తిలక్ విశ్వరూపం చూపించాడు. కేశవ్ వేసిన 15వ ఓవర్లో వరుసగా 4, 6, 4 కొట్టిన తిలక్... కొయెట్జీ 16వ ఓవర్లో 2 సిక్స్‌లు, ఒక బౌండరీ బాదడంతో ఈ రెండు ఓవర్ల వ్యవధిలోనే 55 స్కోరు నుంచి అమాంతం 87కు చేరాడు. 19వ ఓవర్లో ఫోర్ కొట్టి 51 బంతుల్లోనే శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. రమణ్‌దీప్ (6 బంతుల్లో 15; 1 ఫోర్, 1 సిక్స్) ధాటిగా ఆడటంతో భారత్ 200 పైచిలుకు స్కోరు చేసింది.

క్లాసెన్, జాన్సెన్ మెరుపులు

దూకుడుగా మొదలైన దక్షిణాఫ్రికా లక్ష్యఛేదనకు మూడో ఓవర్ నుంచే ముకుతాడు పడింది. రికెల్టన్ (20), హెండ్రిక్స్ (21), స్టబ్స్ (12), కెప్టెన్ మార్క్‌రమ్ (18 బంతుల్లో 29; 2 సిక్స్‌లు) ధాటిగా ఆడే క్రమంలో వికెట్లను పారేసుకున్నారు. దీంతో సగం ఓవర్లు ముగిసేసరికి టాప్-4 బ్యాటర్లను కోల్పోయిన సఫారీ 84 పరుగులు చేసింది. మిగతా సగం ఓవర్లలో 136 పరుగుల సమీకరణం ఆతిథ్య జట్టుకు కష్టమైంది. అయితే హిట్టర్ క్లాసెన్ భారీషాట్లతో విరుచుకుపడ్డాడు. వరుణ్ వేసిన 14వ ఓవర్లో క్లాసెన్ 6, 6, 6, 0, 4, 1లతో 23 పరుగుల్ని పిండుకున్నాడు. అతని జోరుకు అర్ష్‌దీప్ కళ్లెం వేయగా, తర్వాత జాన్సెన్ ధనాధన్ షోతో భారత శిబిరాన్ని వణికించాడు. చివరి 2 ఓవర్లలో దక్షిణాఫ్రికా విజయానికి 51 పరుగులు కావాలి. హార్దిక్ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్లో జాన్సెన్ 26 పరుగులు సాధించాడు. విజయం కోసం దక్షిణాఫ్రికా 6 బంతుల్లో 25 పరుగులు చేయాల్సి ఉండగా, ఆఖరి ఓవర్లో అర్ష్‌దీప్ అతన్ని అవుట్ చేయడంతో భారత్ విజయం సాధించింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: సామ్సన్ (బి) జాన్సెన్ 0; అభిషేక్ (స్టంప్డ్) క్లాసెన్ (బి) కేశవ్ 50; తిలక్ వర్మ (నాటౌట్) 107; సూర్యకుమార్ (సి) జాన్సెన్ (బి) సిమ్‌లేన్ 1; హార్దిక్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కేశవ్ 18; రింకూ సింగ్ (బి) సిమ్‌లేన్ 8; రమణ్‌దీప్ (రనౌట్) 15; అక్షర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 219. వికెట్ల పతనం:** 1-0, 2-107, 3-110, 4-132, 5-190, 6-218. **బౌలింగ్:** జాన్సెన్ 4-0-28-1, కొయెట్జీ 3-0-51-0, సిపామ్లా 4-0-45-0, సిమ్‌లేన్ 3-0-34-2, మార్క్‌రమ్ 2-0-19-0, కేశవ్ 4-0-36-2. **దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్:** రికెల్టన్ (బి) అర్ష్‌దీప్ 20; హెండ్రిక్స్ (స్టంప్డ్) (బి) వరుణ్ 21; మార్క్‌రమ్ (సి) రమణ్‌దీప్ (బి) వరుణ్ 29; స్టబ్స్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అక్షర్ 12; క్లాసెన్ (సి) తిలక్ (బి) అర్ష్‌దీప్ 41; మిల్లర్ (సి) అక్షర్ (బి) హార్దిక్ 18; జాన్సెన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్ష్‌దీప్ 54; కొయెట్జీ (నాటౌట్) 2; సిమ్‌లేన్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 208. వికెట్ల పతనం:** 1-27, 2-47, 3-68, 4-84, 5-142, 6-167, 7-202. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-37-3, హార్దిక్ 4-0-50-1, అక్షర్ 4-0-29-1, వరుణ్ 4-0-54-2, రవి బిష్ణోయ్ 4-0-33-0.

12 అంతర్జాతీయ టి20ల్లో సెంచరీ సాధించిన 12వ భారతీయ క్రికెటర్‌గా తిలక్ వర్మ గుర్తింపు పొందాడు. ఈ జాబితాలో రోహిత్ శర్మ (5), సూర్యకుమార్ యాదవ్ (4), కేఎల్ రాహుల్ (2), సంజూ సామ్సన్ (2), సురేశ్ రైనా (1), దీపక్ హుడా (1), విరాట్ కోహ్లి (1), శుబ్‌మన్ గిల్ (1), యశస్వి జైస్వాల్ (1), రుతురాజ్ గైక్వాడ్ (1), అభిషేక్ శర్మ (1) ఉన్నారు. అంతర్జాతీయ టి20ల్లో ఓవరాల్‌గా భారత క్రికెటర్లు 21 సెంచరీలు నమోదు చేశారు.

సినిమా


● ఐశ్వర్యా రాజేష్, వెంకటేశ్, మీనాక్షీ చౌదరి

గోదారి గట్టు మీద...

హీరో వెంకటేశ్, సంగీత దర్శకుడు రమణ గోగుల కాంబినేషన్ 18 ఏళ్ల తర్వాత మళ్లీ కుదిరింది. వెంకటేశ్ బ్లాక్‌బస్టర్ మూవీ 'లక్ష్మి'కి సంగీతం అందించిన రమణ గోగుల 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా ఫస్ట్ సింగిల్‌కి తన వాయిస్‌ని అందించారు. 'ఎఫ్ 2, ఎఫ్ 3' వంటి చిత్రాల తర్వాత హీరో వెంకటేశ్, డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'దిల్' రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై శిరీష్ నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'గోదారి గట్టుమీద...' అంటూ సాగే తొలి పాట త్వరలో రిలీజ్ కానుంది. ''ఈ పాటకి భాస్కరభట్ల సాహిత్యం అందించారు. రెగ్యులర్ ప్లేబ్యాక్ సింగర్‌తో కాకుండా పెక్యులియర్ వాయిస్‌తో ఈ పాట పాడించాలని అనిల్ రావిపూడి చెప్పారు. దీంతో రమణ గోగులతో పాడించాం. ఆయన ప్రత్యేకమైన వాయిస్‌తో పాడిన ఈ సాంగ్ మూవీకి ఎక్స్‌ట్రా మ్యాజిక్ యాడ్ చేయడం ఖాయం. త్వరలో ఈ పాటను విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. రాజేంద్ర ప్రసాద్, సాయికుమార్, వీకే నరేశ్ వంటి వారు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకి కెమెరా: సమీర్ రెడ్డి.


● చిరంజీవి

విదేశాలకు విశ్వంభర

విదేశాలకు పయనమవుతున్నారట విశ్వంభర. చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న ఫ్యాంటసీ యాక్షన్ అడ్వెంచరస్ మూవీ 'విశ్వంభర'. త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణను ఫారిన్‌లో ప్లాన్ చేశారట. అతి త్వరలోనే 'విశ్వంభర' టీమ్ జపాన్‌కు వెళ్లనుందని, అక్కడ ప్రధానంగా పాటలు చిత్రీకరించనున్నారని, కొంత టాకీ పార్టును కూడా షూట్ చేయాలనుకుంటున్నారని ఫిల్మ్ నగర్ సమాచారం. యూవీ క్రియేషన్స్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ సినిమాకు ఎమ్ఎమ్ కీరవాణి సంగీతం అందిస్తున్నారు. కాగా 'విశ్వంభర' 2025 సంక్రాంతికి రిలీజ్ కావాల్సింది. కానీ వాయిదా వేశారు. వేసవిలో విడుదల కానుందనే టాక్ వినిపిస్తోంది.

కార్మికుల దినోత్సవానికి...

వేసవిలో థియేటర్స్‌లోకి వచ్చేందుకు రెడీ అవుతున్నాడు కూలీ. రజనీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కూలీ'. ఈ చిత్రంలో దేవా పాత్రలో రజనీకాంత్, సైమన్‌గా నాగార్జున, కలీషాగా ఉపేంద్ర, ప్రీతిగా శ్రుతీహాసన్, రాజశేఖర్‌గా సత్యరాజ్, దయాళ్‌గా సౌబిన్ షాహిర్ నటిస్తున్నారు. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్న సినిమా ఇది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ చెన్నైలో జరుగుతోందని తెలిసింది. రజనీకాంత్‌పై ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారట. కాగా 'కూలీ' సినిమాను కార్మికుల దినోత్సవం సందర్భంగా వచ్చే ఏడాది మే 1న రిలీజ్ చేసే ఆలోచనలో చిత్రయూనిట్ ఉందని సమాచారం.


● రజనీకాంత్

ఈ నెల నాకు చాలా ప్రత్యేకం

- మీనాక్షీ చౌదరి

''అమ్మ, సిస్టర్, ప్రేయసి, భార్య... ఇలా ఏదో ఒక విధంగా ప్రతి అబ్బాయి జీవితంలో ఓ మహిళ ఉంటుంది. ఆ అబ్బాయి జీవితానికి ఎంతో ముఖ్యంగా ఉంటూ, అతని లైఫ్‌కి ఓ పాజిటివిటీని క్రియేట్ చేస్తుంది. అలా వాసు ('మట్కా' సినిమాలో వరుణ్ తేజ్ పాత్ర) జీవితానికి సుజాత (మీనాక్షీ చౌదరి పాత్ర) ఓ వెలుగు వంటిది. సుజాత పాత్రలోని పాజిటివిటీ వాసు జీవితంపై ఉంటుంది. ఈ పాజిటివిటీకి ఆడియన్స్ కూడా కనెక్ట్ అవుతారని నేను నమ్ముతున్నాను'' అని అన్నారు హీరోయిన్ మీనాక్షీ చౌదరి. వరుణ్ తేజ్, మీనాక్షీ చౌదరి జంటగా నటించిన చిత్రం 'మట్కా'. కరుణకుమార్ దర్శకత్వంలో విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా మీనాక్షీ చౌదరి మాట్లాడుతూ– ''మట్కా'లో వాసు ప్రేయసి సుజాతగా నటించాను. సుజాత పాత్రకు మూడు గెటప్స్ ఉంటాయి. ఈ గెటప్స్‌కి తగ్గట్టు బాడీ లాంగ్వేజ్ చూపించడం కొత్తగా అనిపించింది. 'మట్కా' విజయంపై నమ్మకం ఉంది'' అని అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''లక్కీభాస్కర్' చిత్రం ఆల్రెడీ విడుదలై, విజయం సాధించింది. 'మట్కా' విడుదలవుతోంది. ఇదే నెలలో 'మెకానిక్ రాకీ' చిత్రం విడుదలవుతోంది. ఇలా నెల రోజుల వ్యవధిలోనే మూడు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రావడం చాలా సంతోషంగా ఉంది. నా లైఫ్‌లో ఈ నెల చాలా ప్రత్యేకం. ఓ స్పెషల్ మూమెంట్‌గా భావిస్తున్నాను'' అన్నారు.





ఊహించని విషయాలు బయటపడతాయి

- రానా

''ది రానా దగ్గుబాటి షో'లో ఫిల్టర్స్ ఉండవు. ఊహించని విషయాలెన్నో బయటపడతాయి'' అన్నారు రానా. ఆయన ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, క్రియేటర్‌గా వ్యవహరిస్తూ, హోస్ట్ చేస్తున్న షో 'ది రానా దగ్గుబాటి షో'. స్పిరిట్ మీడియా బ్యానర్‌పై అమేజాన్ ప్రైమ్ వీడియో నిర్మించింది. ఈ నెల 23 నుండి అమేజాన్‌లో ఈ షో ప్రసారం కానుందని బుధవారం ప్రకటించారు మేకర్స్. ఈ సందర్భంగా రానా మాట్లాడుతూ– ''స్టార్స్ నిజ జీవితానికి సంబంధించిన విషయాలు తెలుసుకునేందుకు మా షో ఒక బ్యాక్ స్టే పాస్‌లాంటిది. ఈ షో 240కిపైగా ఉన్న దేశాల్లోని ఫ్యాన్స్‌ను అలరించేలా ఉంటుంది'' అని చెప్పారు. ''అతిథులు తమ సంకోచాలు విడిచిపెట్టి అభిమానులతో కనెక్ట్ అయ్యే ఆహ్లాదకరమైన వాతావరణాన్ని రానా సృష్టిస్తారు'' అని అమేజాన్ ప్రైమ్ వీడియో ఇండియా ఒరిజినల్స్ హెడ్ నిఖిల్ మధోక్ తెలిపారు. ఎనిమిది ఎపిసోడ్స్‌గా సాగనున్న ఈ షో ప్రతి శనివారం ప్రసారం అవుతుంది. ఈ షోలో రామ్‌గోపాల్ వర్మ, ఎస్ఎస్ రాజమౌళి, నాగచైతన్య, నాని, దుల్కర్ సల్మాన్, సిద్ధు జొన్నలగడ్డ, శ్రీలీల వంటి ప్రముఖులు పాల్గొంటారు.


● రాశీ ఖన్నా

నా లవ్ బ్రేకప్ అయ్యింది

''వ్యక్తిగతంగా నేను చాలా ఎమోషనల్ పర్సన్‌ని. గతంలో నాకు ఓ లవ్ స్టోరీ ఉండేది. అయితే కొన్ని కారణాల వల్ల అది బ్రేక్ అయ్యింది'' అని రాశీఖన్నా తెలిపారు. విక్రాంత్ మాస్సే, రాశీ ఖన్నా ప్రధాన పాత్రల్లో నటించిన హిందీ చిత్రం 'ది సబర్మతీ రిపోర్ట్' ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రాశీ ఖన్నా.. తన సినీ, వ్యక్తిగత జీవితానికి సంబంధించి పలు ఆసక్తికర విషయాల గురించి మాట్లాడారు. ''దక్షిణాదిలో నేను చాలా సినిమాలు చేశాను. హీరోయిన్‌గా తెలుగులో నా తొలి చిత్రం 'ఊహలు గుసగుసలాడే' (2014) విడుదలయ్యాక తిరుపతి వెళ్లాం. పెద్ద ఎత్తున జనాలు చుట్టుముట్టారు. వాళ్లందరూ నా కోసమే వచ్చారని మా మేనేజర్ చెప్పడంతో షాకయ్యాను. అభిమానుల తోపులాటలో మేనేజర్, బౌన్సర్లు ఇబ్బందిపడ్డారు. ఆ సంఘటనను ఎప్పటికీ మర్చిపోను. ఇకపోతే గతంలో నా లవ్ బ్రేక్ కావడంతో మానసికంగా కుంగిపోయాను. ఆ తర్వాత నన్ను నేను మార్చుకుని స్ట్రాంగ్‌గా నిలబడి కెరీర్‌పై దృష్టి సారించాను. ఇండస్ట్రీ కంటే బయటే నాకు ఎంతోమంది స్నేహితులు ఉన్నారు. నా కుటుంబ సభ్యులు, ఫ్రెండ్స్ అన్ని విధాలుగా నన్ను సపోర్ట్ చేస్తుంటారు'' అని చెప్పారు రాశీ ఖన్నా.

భగవంతుడి ఆదేశాల మేరకు...


● పవన్ శంకర్, యాని

పవన్ శంకర్, యాని జంటగా తనికెళ్ల భరణి, హెబ్బా పటేల్, బ్రహ్మాజీ, నాగ మహేష్, నవీన్ ముఖ్య పాత్రల్లో 'జీపీఎల్' (గాడ్స్ ప్రీమియర్ లీగ్) సినిమా ప్రారంభమైంది. ఈ సినిమా ద్వారా జీఎం నాయుడు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. అల్లు లత సమర్పణలో అల్లు సాయి లక్ష్మణ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా పూజాకార్యక్రమాలు హైదరాబాద్‌లో జరిగాయి. జీఎం నాయుడు మాట్లాడుతూ– ''మనందరం భగవంతుడి ఆదేశాల మేరకు నడుస్తామనే పాయింట్‌తో ఈ సినిమా కథాంశం ఉంటుంది. 'జీపీఎల్' టైటిల్ ఈ కథకు సరిగ్గా సరిపోతుంది'' అని తెలిపారు. ''లవ్, ఇన్వెస్టిగేషన్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న చిత్రమిది'' అని చెప్పారు అల్లు సాయి లక్ష్మణ్. ఈ చిత్రానికి కెమెరా: రామ్ కంద, సంగీతం: మణిశర్మ.

డబ్బింగ్ చెబుతున్నా... కానీ బాధగా ఉంది

- రష్మిక



'పుష్ప2: ది రూల్' సినిమా కోసం డబ్బింగ్ షురూ చేశారు శ్రీవల్లి. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా సినిమా 'పుష్ప2: ది రూల్'. ఈ చిత్రంలో పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్, శ్రీవల్లి పాత్రలో రష్మికా మందన్నా నటిస్తున్నారు. కాగా ఈ సినిమాలో తన పాత్రకు డబ్బింగ్ చెప్పే పనిలో ఉన్నారు రష్మికా మందన్నా. ''పుష్ప 2: ది రూల్' సినిమా ఫస్టాఫ్‌కు డబ్బింగ్ పూర్తయింది. సెకండాఫ్‌కు డబ్బింగ్ చెబుతున్నాను. ఫస్టాఫ్ సూపర్‌గా ఉంది. సెకండాఫ్ అంతకుమించి ఉంటుంది. 'పుష్ప 2' తో ఆడియన్స్ అద్భుతమైన అనుభూతిని ఆస్వాదించనున్నారు. ఇక ఈ ఫొటోలో నా ముఖం కాస్త బాధగా కనిపిస్తోంది కదా? ఎందుకంటే... ఈ సినిమాలో నా వంతు షూటింగ్ దాదాపు పూర్తయింది. దీంతో ఈ సినిమా నుంచి కాస్త దూరంగా ఉండాలి. అందుకే కాస్త బాధగా ఉంది'' అంటూ ఇన్‌స్టా వేదికగా రష్మికా మందన్నా ఓ పోస్టును షేర్ చేశారు. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'పుష్ప2: ది రూల్' సినిమా డిసెంబరు 5న విడుదల కానుంది.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 233
గురువారం 14-11-2024


'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పొలాల్లో సోలార్ ప్లాంట్లు
పీఎం కిసాన్ పథకం కింద 4 వేల మెగావాట్ల ఉత్పత్తికి నిర్ణయం -16లో



4 నెలల కనిష్టానికి నిఫ్టీ
రెండు రోజుల్లో రూ.13.07 లక్షల కోట్ల సంపద ఆవిరి -15లో



ప్రాంతీయ భాషల్లో వైద్యవిద్య
హిందీతోపాటు ప్రాంతీయ భాషల్లోనూ త్వరలో వైద్యవిద్యను అందుబాటులోకి తీసుకురానున్నట్లు మోదీ ప్రకటించారు.
వివరాలు 6లో ▸



66.18% పోలింగ్
జార్ఖండ్ శాసనసభ ఎన్నికల తొలి దశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 66.18 శాతం పోలింగ్ నమోదైంది.
వివరాలు 6లో ▸



యంత్రాంగ ప్రక్షాళనకో శాఖ
ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామిలకు కీలక బాధ్యతలు అప్పగించాలని అమెరికా కాబోయే అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయించారు.
వివరాలు 6లో ▸



బ్రిటిష్ రచయిత్రికి బుకర్
బ్రిటిష్ రచయిత్రి సమంతా హార్వేను 2024 బుకర్ ప్రైజ్ వరించింది. ఆమె రాసిన సైన్స్ ఫిక్షన్ 'ఆర్బిటాల్'కు ఈ అవార్డు వచ్చింది.
వివరాలు 6లో ▸

'సెగ'చర్ల!

లగచర్లలో కలెక్టర్, అధికారులపై దాడి ఘటనలో కీలక పరిణామాలు

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టు.. తర్వాత టార్గెట్ కేటీఆర్?


బుధవారం ఉదయం హైదరాబాద్‌లో పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

- రిమాండ్ రిపోర్టులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రస్తావన
- నరేందర్‌రెడ్డిని కేటీఆర్ ప్రోత్సహించారని వికారాబాద్ పోలీసుల అభియోగం
- కుట్ర ఆరోపణలను ఖండించిన బీఆర్ఎస్
- తాజా పరిణామాలతో ఎప్పుడేం జరుగుతుందోనన్న ఉత్కంఠ
- అరెస్టు అనుమానంతో కేటీఆర్ నివాసానికి పోటెత్తిన నేతలు, కార్యకర్తలు
- అర్ధరాత్రి వరకు మాజీ మంత్రి హరీశ్, ఇతర నేతలతో కేటీఆర్ భేటీ
- రేవంత్ ప్రభుత్వ తీరుపై క్షేత్రస్థాయి పోరాటాలు చేపట్టాలని నేతల నిర్ణయం
- ఒకట్రెండు రోజుల్లో కార్యాచరణ ప్రకటించేందుకు ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రాజకీయ వేడి మరింత పెరుగుతోంది. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని దుద్యాల మండలం లగచర్లలో కలెక్టర్, ఇతర అధికారులపై దాడి ఘటనలో బుధవారం కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. అంతేకాదు ఈ కేసులో మొదటి నిందితుడిగా చేర్చారు. హైదరాబాద్‌లో నాటకీయంగా అరెస్టు చేసిన నరేందర్‌రెడ్డిని కోర్టులో హాజరుపరచడం, న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించడం, పోలీసులు ఆయన్ను జైలుకు తరలించడం చకచకా జరిగిపోయాయి. ముఖ్యంగా నరేందర్‌రెడ్డి రిమాండ్ రిపోర్టులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు పేరును ప్రస్తావించడం కలకలం రేపింది. నరేందర్‌రెడ్డిని కేటీఆర్ స్వయంగా ప్రోత్సహించినట్లుగా దర్యాప్తులో వెల్లడైందని... ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు కుట్ర జరిగిందని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. లగచర్లలో దాడి చేసినట్లుగా గుర్తించిన 46 మందిలో 19 మందికి భూములు లేవని తేలిందని ఐజీ చెప్పడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు అధికారులపై దాడిని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తోందని, ఇందులో ఎంతటివారున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ ఆగ్రహం
మిగతా 5వ పేజీలో ▶

పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టు.. రిమాండ్
5లో

ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర
ఈ విషయంలో ఎంతవరకైనా వెళ్లండని కేటీఆర్ అన్నారు.. రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు


భట్టి విక్రమార్క
డిప్యూటీ సీఎం

బీఆర్ఎస్ అరాచక శక్తులతో కలిసి జిల్లా కలెక్టర్, ఆర్డీవో స్థాయి అధికారిపై దాడి చేయించింది. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ తలకిందులుగా తపస్సు చేసినా మా ప్రభుత్వాన్ని అస్థిర పర్చలేరు. ఘటన వెనుక ఎంతటి పెద్దవారున్నా ఉపేక్షించేది లేదు. ఉద్యోగులు అధైర్యపడకుండా ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాలి.


కేటీఆర్
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు మఫ్టీలో వచ్చి అక్రమంగా అరెస్టు చేసి భయానక వాతావరణం సృష్టించారు. భూమిని కోల్పోతామని బాధపడుతున్న గిరిజన, దళిత, బీసీ రైతులను జైళ్లలో పెట్టి, చిత్రహింసలు పెడుతున్న నికృష్ట ప్రభుత్వమిది. రేవంత్ భూదాహ యజ్ఞంలో అతి వేషాలు వేసి అధికారులు బలిపశువులు కావద్దు.


డీకే అరుణ
బీజేపీ ఎంపీ

రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవు. సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థతే ఇందుకు కారణం. తన సొంత నియోజకవర్గంలో జరిగిన ఘటనకు స్థానిక ఎమ్మెల్యే అయిన ముఖ్యమంత్రే బాధ్యత వహించాలి. సీఎం నియోజకవర్గంలో అధికారులు తిరగలేని దుస్థితి నెలకొంది. రైతుల నుంచి భూములు తీసుకునే పద్ధతి ఇది కాదు.

- వివరాలు 5లో ▶

న్యూస్‌రీల్

సర్కారుపై బీజేపీ సమరం

కాంగ్రెస్ ప్రభుత్వంపై వరుస పోరాటాలకు బీజేపీ కార్యాచరణను రూపొందిస్తోంది. ధాన్యం కొనుగోళ్లపై ఇప్పటికే కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు మద్దతు ప్రకటించిన ఆ పార్టీ నేతలు.. 16, 17 తేదీల్లో 'మూసీ నిద్ర'కు సిద్ధమవుతున్నారు.
- వివరాలు 3లో ▶

భగ్గుమంటున్న డీఏపీ!

రైతులు పొలాల్లో వాడే డీఏపీ ఎరువు ధర భారీగా పెరిగింది. ఒక్కో బస్తాపై ఏకంగా రూ.300 పెరిగిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 50 కిలోల బస్తా డీఏపీ ధర రూ.1,350 ఉండగా.. రూ.1,650కు పెంచడం గమనార్హం.
- వివరాలు 16లో ▶

అర్హులకు 24 లక్షల ఇళ్లు

రాష్ట్రంలో 24 లక్షల ఇళ్లను అర్హులైన పేదలకు ఇస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి ఆయన వినతులు స్వీకరించారు.
- వివరాలు 2లో ▶

ఒక్కో ఫైల్‌కు రూ.20 వేలు

బీసీ సంక్షేమ శాఖ కార్యాలయాల్లో వసూళ్ల పర్వం మొదలైంది. ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి ఇటీవల రూ.1502.82 కోట్లు విడుదలయ్యాయి. ఈ బకాయిల విడుదలకు అధికారులు ఇష్టానుసారం వసూళ్లు చేస్తున్నారు.
- వివరాలు 2లో ▶

ఇదండీ సంగతి



నేను చెప్పానా సార్! మన మేనిఫెస్టోతో ఏ పార్టీ మేనిఫెస్టో సరితూగదని..!



నవంబర్ 14 బాలల దినోత్సవం నేపథ్యంలో వారం రోజులుగా 'లిటిల్ స్టార్స్' పేరిట 'సాక్షి' మీడియా జరిపిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కేన్సర్, తలసీమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులను, మృత్యువుతో పోరాడుతున్న చిన్నారులను, తండ్రిని కోల్పోయిన వారిని, అనాథ బాలలను కలిశారు పలువురు బాల తారలు. కాసేపు ఆ చిన్నారులు తమ కష్టాన్ని మరచిపోయేలా చేసి, వారితో ఆడి పాడారు.. నవ్వించారు. చివరగా 'సాక్షి' మీడియా హౌస్‌లో జరిగిన వేడుకలో స్కూల్ విద్యార్థులతో కలిసి ఈ బాలతారలు సందడి చేశారు. ఈ కథనం ఫ్యామిలీలో..
- వివరాలు 12లో ▶

తారే జమీన్ పర్ 'లిటిల్ స్టార్స్'
సాక్షి SAKSHI TV — నేటి మధ్యాహ్నం 12.15 గంటలకు సాక్షి టీవీలో


బతుకమ్మకుంట వద్ద స్థానికులతో మాట్లాడుతున్న రంగనాథ్


ఇళ్లు కూల్చం.. చెరువులు పునరుద్ధరిస్తాం

పంథా మార్చుకున్న హైడ్రా.. చర్యలకు ముందు స్థానికులతో సమావేశం

- అంబర్‌పేటలోని బతుకమ్మకుంటతో మరూ
- స్థానికులలో పూర్తి నమ్మకం కలిగించే ప్రయత్నం
- స్వయంగా రంగంలోకి కమిషనర్ రంగనాథ్
- చెరువు పునరుద్ధరణతో లాభాలపై స్థానికులకు అవగాహన.. ఇకపై ఇదే విధానాన్ని కొనసాగించాలని నిర్ణయం

- వివరాలు 3లో

బుల్డోజర్ న్యాయం రాజ్యాంగ విరుద్ధం

- ముందస్తు షోకాజ్ నోటీసు ఇవ్వకుండా ఏ ఒక్క ఇంటినీ కూల్చడానికి వీల్లేదు
- నోటీసుపై ప్రతిస్పందించడానికి కనీసం 15 రోజుల సమయం ఇవ్వాలి
- సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు

6లో

వెన్నుపోటుదారులకు బుద్ధి చెప్పండి

- మహాయుతి కూటమిని ఓడించండి
- ముంబై ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి
- భారీగా తరలివచ్చిన స్థానిక తెలంగాణ వాసులు



ముంబై: దివంగత శివసేన అధినేత బాల్ ఠాక్రేకు ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌కు అజిత్ పవార్, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి మిలింద్ దేవ్‌రా వెన్నుపోటు పొడిచారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ ముగ్గురు మోసగాళ్లకు మహారాష్ట్ర ప్రజలు ముఖ్యంగా అక్కడి తెలుగు ప్రజలు తమ ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ)ల మహావికాస్ ఆఘాడీ (ఎంవీఏ)కూటమిని గెలిపించాలని కోరారు. రేవంత్ బుధవారం సాయంత్రం ముంబైలో తెలుగు ప్రజలు నివసించే
మిగతా 14వ పేజీలో ▶

• బూచిగా అప్పుల భూతం..

సూపర్ సిక్స్‌కు ఎగనామం

ఏపీ అప్పులపై చంద్రబాబు దుష్ప్రచారం బడ్జెట్ సాక్షిగా బట్టబయలు

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ స్పష్టీకరణ



సూపర్ 6, సూపర్ 7లను తెరమరుగు చేసేందుకే అప్పులపై దుష్ప్రచారం

అప్పులు రూ.14 లక్షల కోట్లని తప్పుడు ప్రచారం చేశారు

అప్పులు రూ.10 లక్షల కోట్లంటూ గవర్నర్‌తోనూ అబద్ధాలు చెప్పించారు

2024-25 బడ్జెట్‌లో రాష్ట్ర అప్పు రూ.6.46 లక్షల కోట్లేనని తేల్చారు

మీ ఐదేళ్లలో అప్పుల వార్షిక సగటు వృద్ధి రేటు 22.63% ఉంటే మా హయాంలో 13.57 శాతమే.. మరి ఇప్పుడు చెప్పండి.. అప్పుల రత్న బిరుదు ఎవరికివ్వాలి?

ఈ బడ్జెట్ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రవేశపెట్టిన డాక్యుమెంట్‌లా ఉంది

హామీలు నెరవేర్చ లేక అధికారంలోకి వచ్చాక కూడా అదే విష ప్రచారం

రూ.42,183.80 కోట్ల బకాయిలు మేము చెల్లించాం

13లో


'మేడిగడ్డ'లో భారీ కుట్ర!

ఇంజనీర్లు, నిర్మాణ సంస్థ కుమ్మక్కై ఖజానాకు భారీ నష్టం కలిగించారు

మేడిగడ్డ బరాజ్‌పై మధ్యంతర నివేదికలో విజిలెన్స్ స్పష్టీకరణ

- అధికారుల తీరుతో నిర్మాణ సంస్థకు అనుచిత లబ్ధి..
- పనులను పరిశీలించకుండానే వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చారు
- కాఫర్ డ్యామ్ తొలగించకుండా నిర్మాణ సంస్థ తప్పిదం చేసింది
- దానితోపాటు నిర్వహణ లోపాలతో బరాజ్‌కు ముప్పు కలిగింది
- అధికారులు, సంస్థపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేపట్టాలని సూచనలు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ నిర్మాణంలో ఇంజనీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థ 'ఎల్ అండ్ టీ' కుమ్మక్కై రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాలకు విరుద్ధంగా భారీ కుట్రకు పాల్పడ్డారని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పేర్కొంది. రాష్ట్ర ఖజానాకు తీవ్ర నష్టం కలిగించినందుకు ఆ అధికారులు, నిర్మాణ సంస్థపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేపట్టవచ్చని స్పష్టం చేసింది. మేడిగడ్డ బరాజ్ నిర్మాణంపై ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన మధ్యంతర నివేదికలో ఈ వివరాలను వెల్లడించింది. విజిలెన్స్ ఆ నివేదికలో పేర్కొన్న కీలక అంశాలివీ..



ఈఈ, ఎస్ఈలపై క్రిమినల్ చర్యలు!
మేడిగడ్డ బరాజ్‌లో మిగులు పనుల పూర్తికి ఎలాంటి హామీ తీసుకోకుండానే.. పనులు దాదాపుగా పూర్తయినట్టుగా ధ్రువీకరిస్తూ నిర్మాణ సంస్థ 'ఎల్ అండ్ టీ'కి మహదేవ్‌పూర్
మిగతా 14వ పేజీలో ▶



మూడురోజుల క్రితం మెదక్ జిల్లాలోని ఓ డిగ్రీ కాలేజీ యజమాని విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధుల విషయమై చర్చించేందుకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి కార్యాలయానికి వెళ్లాడు. అయితే సరిపోను బడ్జెట్ రాలేదంటూ బుకాయించిన అధికారులు సదరు వ్యక్తిని తిప్పి పంపారు. ఆ మరుసటి రోజు అదే కార్యాలయానికి వెళ్లి రెండేళ్లకు సంబంధించిన బిల్లులు క్లియర్ చేయాలంటూ ఒక్కో బిల్లుకు రూ.20 వేలు చొప్పున.. మొత్తం రూ.40 వేలు కవర్‌లో పెట్టి ఇచ్చాడు. దీంతో వెంటనే ఆ కాలేజీకి సంబంధించిన పెండింగ్ బిల్లులు తమ కార్యాలయం నుంచి క్లియర్ చేస్తూ టోకెన్ జనరేట్ చేసి ట్రెజరీకి పంపారు.

ఒక్కో ఫైల్‌కు రూ.20 వేలు

బీసీ సంక్షేమశాఖ జిల్లాల కార్యాలయాల్లో కొందరు అధికారుల చేతివాటం

కాలేజీలకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపులకు వసూలు

ఇటీవలే ఫీజులు, స్కాలర్‌షిప్ పథకాల కింద రూ.1,502.82 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయాల్లో వసూళ్ల సందడి మొదలైంది. పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు సంబంధించి వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖకు అక్టోబర్ 7వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం రూ.1502.82 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జీఓ 160 జారీ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ఆ రెండు పథకాలకు వినియోగించాలని ముఖ్య కార్యదర్శి ఆదేశించారు. సుదీర్ఘ కాలం తర్వాత పెద్ద మొత్తంలో నిధులు విడుదల కావడంతో అటు విద్యార్థులు, ఇటు కాలేజీ యాజమాన్యాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు తమకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని కోరుతూ బీసీ సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయాల చుట్టూ కాలేజీ యాజమానులు చక్కర్లు కొడుతున్నారు.

జిల్లాల వారీగా కేటాయింపులతో..

ఒకే దఫా రూ.1,502.82 కోట్లు విడుదల కాగా, జిల్లాల వారీగా విభజన చేసిన, ఆ మేరకు అధికారులు కేటాయింపులు జరిపారు. కాలేజీలు, కోర్సుల వారీగా నిధులు విడుదల చేయాల్సిన బాధ్యత జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయాలకు అప్పగించారు. అయితే ఈ అవకాశాన్ని ఆసరా చేసుకున్న కొందరు అధికారులు ఎవరికి వారు ఇష్టానుసారంగా కాలేజీలకు కేటాయింపులు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కార్యాలయంలోకి వచ్చి అధికారులను సంప్రదించిన వారికే నిధుల విడుదలకు ఆమోదం తెలుపుతున్నట్టు కళాశాలల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి.

రెండు రకాల పద్దులు కావడంతో...

ప్రభుత్వం విడుదల చేసిన నిధులను రెండు రకాల పద్దుల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రొఫెషనల్, నాన్‌ప్రొఫెషనల్ కేటగిరీల్లో చెల్లించాలి. ఈమేరకు వేర్వేరుగా ప్రభుత్వం నిధులు కేటాయించగా, ఆమేరకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యాలయ అధికారులు అదే పద్ధతిలో జిల్లాలకు కేటాయింపులు జరిపారు. ఈ క్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి కార్యాలయాల్లో వేర్వేరు సెక్షన్ల ద్వారా నిధులు విడుదల చేయాలి. కాలేజీల వారీగా విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు వేర్వేరుగా ఫైళ్లు తయారు చేసి ఆమేరకు బిల్లులు రూపొందించి ఆమోదించిన తర్వాత నిధులు విడు దల చేస్తారు. ఈ క్రమంలో ఒక్కో కాలేజీ యాజమాన్యం నుంచి ప్రతి ఫైల్‌కు రూ.20 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. నిర్దేశించిన మొత్తాన్ని చెల్లించిన కాలేజీ బిల్లులు మాత్రమే ఆన్‌లైన్‌లో ఆమోదించి టోకెన్లు జనరేట్ చేస్తున్నారు. దాదాపు మూడేళ్లుగా బీసీ సంక్షేమ శాఖకు బడ్జెట్ విడుదల కాకపోవడంతో భారీగా పేరుకుపోయిన బకాయిలను క్లియర్ చేయించేందుకు కొన్ని కాలేజీ యాజమాన్యాలు అడిగినంత చెల్లించుకుంటున్నాయి.

గతనెల 10న కేటగిరీల వారీగా విడుదల చేసిన నిధులు ఇలా..

కేటగిరీ	నిధులు(రూ.కోట్లలో)
పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్స్	112.80
స్కాలర్‌షిప్స్(నాన్ ప్రొఫెషనల్)	224.96
ఫీజు రీయింబర్స్‌మెంట్	704.87
ఫీజు రీయింబర్స్‌మెంట్(నాన్ ప్రొఫెషనల్)	273.29
స్కాలర్‌షిప్స్(ఈబీసీ)	155.75
ఫీజు రీయింబర్స్‌మెంట్-ఈబీసీ (నాన్‌ప్రొఫెషనల్)	31.15

21 నుంచి రాష్ట్రంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పర్యటన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈనెల 21, 22వ తేదీల్లో రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ప్రభుత్వ శాఖల అధికారులను ఆదేశించారు. ఈమేరకు బుధవారం ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో సీఎస్ సమావేశం నిర్వహించారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో తగు ఏర్పాట్లు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ తగిన భద్రతా ఏర్పాట్లు, సరైన ట్రాఫిక్, బందోబస్తు ప్రణాళికను రూపొందించాలన్నారు. అగ్నిమాపక శాఖ అవసరమైన సిబ్బందితో పాటు అన్ని వేదికల వద్ద తగిన ఏర్పాట్లు, ఫైర్ టెండర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రపతి బస చేసే ప్రదేశం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖను సీఎస్ ఆదేశించారు. సమావేశంలో డీజీపీ జితేందర్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, ఆర్అండ్‌బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్‌రావు, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ కుటుంబ దోపిడీని బయటపెడతాం

బీజేపీతో కాళ్ల బేరానికే గవర్నర్‌ను కలిశారా: కేటీఆర్

- మూర్ఖపు నిర్ణయాల వల్లే ప్రజల తిరుగుబాటు
- రేవంత్ అల్లుడి కంపెనీల కోసమే భూ సేకరణ
- ఫార్మా విలేజీల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, సబిత, ప్రశాంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసేందుకు వెళితే కాళ్ల బేరాలు అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా బీజేపీతో కాళ్ల బేరంలో భాగంగానే గవర్నర్‌ను కలిశారా? ఈడీ దాడుల నుంచి బయటపడేందుకు అదానీ కాళ్లు మొక్కిన విషయం బయటపెట్టండి. అమృత్ పథకంలో సీఎం రేవంత్‌రెడ్డి బావమరిది బాగోతం చెప్పేందుకే ఢిల్లీకి వెళ్లా. ఇక ముఖ్యమంత్రి బావమరుదులు, అన్నదమ్ములు, అల్లుడి అవినీతి కుంభకోణాలు, దోపిడీని బయటపెడతాం'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. ముఖ్యమంత్రి మూర్ఖపు నిర్ణయాల వల్లే అధికారులపై ప్రజలు తిరగబడుతున్నారన్నారు. కష్టార్జితాన్ని కాపాడుకునేందుకు బడుగు రైతులు చేస్తున్న పోరాటానికి అండగా నిలుస్తామని కేటీఆర్ ప్రకటించారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి కేటీఆర్ బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.

కష్టపడి 14 వేల ఎకరాలు సేకరించాం..

'ఫార్మా రంగంలో తెలంగాణను రారాజుగా చేసేందుకు ముందుచూపుతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ముచ్చర్లలో ఫార్మాసిటీని డిజైన్ చేశారు. వచ్చే 50 ఏళ్ల పాటు ఎలాంటి సమస్య లేకుండా ప్రణాళికలు సిద్ధం చేయించారు. ఫార్మారంగ విస్తరణ, అంతర్జాతీయ ఫార్మా యూనివర్సిటీ స్థాపన కోసం 8 ఏళ్లపాటు కష్టపడి 14 వేల ఎకరాలను సేకరించాం. భూములు ఇచ్చిన రైతులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతోపాటు మళ్లీ అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని పూర్తి చేయాలని భావించాం. ఫార్మాసిటీతో ముచ్చర్ల ప్రాంతం కలుషితం అవుతుందని రేవంత్ ప్రజలను రెచ్చగొట్టారు. కానీ అధికారంలోకి వచ్చిన వెంటనే తుగ్లక్ మాదిరిగా ఫార్మాసిటీని రద్దు చేసి ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేస్తామని రేవంత్ అన్నారు. ఫార్మా సిటీ రద్దుతో తమ భూములు తిరిగి తమకే దక్కుతాయని రైతులు ఆశపడ్డారు'అని కేటీఆర్ పేర్కొన్నారు.

రేవంత్ అల్లుడి కంపెనీ కోసమే...

'రేవంత్‌రెడ్డి అల్లుడికి చెందిన మ్యాక్స్ బీఎస్ కంపెనీ విస్తరణ కోసమే కొడంగల్‌లో రైతుల భూములు తీసుకుంటున్నారు. మెడికవర్ హాస్పిటల్ యజమాని అన్నం శరత్, రేవంత్‌రెడ్డి అల్లుడు ఇద్దరూ ఒకే సంస్థలో డైరెక్టర్లుగా ఉన్నారు. ఈ ఇద్దరికీ ప్రయోజనం కలిగించేందుకే ఫార్మా విలేజ్ పేరిట ముఖ్యమంత్రి అక్రమాలకు కుట్రలు చేస్తున్నాడు. ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టించి భూసేకరణ పేరిట ఎస్సీ, ఎస్టీ, పేద బీసీల భూములను రేవంత్‌రెడ్డి తన అనుచరులు, కుటుంబ సభ్యులకు ఇచ్చి రియల్ ఎస్టేట్ దందాకు యత్నిస్తున్నారు. ఆరు నెలల క్రితం నుంచే దుద్యాల ప్రజలు ఫార్మా విలేజ్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్నారు. సీఎం తుగ్లక్ నిర్ణయాలపై ప్రజలు తిరుగుబాటు చేయడంలో ఎవరి కుట్రలూ లేవు. ఓ వైపు రైతులను పోలీసులు అరెస్టు చేస్తుంటే సీఎం మాత్రం మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. జాతీయ కాంగ్రెస్ నేతలకు తాబేదారుగా వ్యవహరిస్తూ రాష్ట్రంలో పాలన గాలికి వదిలేశాడు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

అర్హులైన పేదలకు 24 లక్షల ఇళ్లు

మొదటి విడతలో స్థలం ఉన్నవారికి దశలవారీగా రూ.5 లక్షలు

- గ్రామ సభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక
- గాంధీభవన్‌లో మంత్రులతో ముఖాముఖిలో మంత్రి పొంగులేటి



గాంధీభవన్‌లో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 24 లక్షల ఇళ్లను అర్హులైన పేదలకు ఇస్తామని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. దాదాపు 300 దరఖాస్తులు రాగా, ఇందులో ప్రధానంగా భూములు, ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగాలు, పెన్షన్లకు సంబంధించిన అర్జీలే ఎక్కువగా ఉన్నాయి. వీటిపై స్పందించిన మంత్రి ఆయా జిల్లాల కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. దాదాపు 150 దరఖాస్తుల వరకు అక్కడే అధికారులకు పరిష్కారాలపై సిఫారసు చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ధరణి కారణంగా భూములకు సంబంధించి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు దరఖాస్తుదారులు చెప్పారని తెలిపారు. కాగా, బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నమూనా చూపించి ప్రజలను మోసం చేసిందే తప్ప ఇళ్లు కట్టించి ఇవ్వలేదన్నారు. ఇందిరమ్మ ఇళ్లను 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో కట్టుకోవలసి ఉంటుందని పేర్కొన్నారు. మొదటి విడతలో స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం దశలవారీగా రూ. 5 లక్షలు ఇస్తుందని తెలిపారు. గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని, మహిళా యజమాని పేరిట ఇల్లు ఇవ్వాలనేది తమ లక్ష్యమని వివరించారు. దేశంలోనే రోల్‌మోడల్‌గా ఉండేలా కొత్త ఆర్‌ఓఆర్ చట్టం తీసుకురానున్నట్లు మంత్రి చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పారు. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇబ్బందుల్లో ఉన్న మాట వాస్తవమని, అయితే ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకే కృషి చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో రైతులు పండించిన చివరి ధాన్యం గింజను కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు.

రైతుల ముసుగులో దౌర్జన్యం

రైతుల ముసుగులో పింక్ రంగేసుకొని కొందరు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని మంత్రి పొంగులేటి అన్నారు. రైతుల పేరిట కుట్రలకు పాల్పడుతున్నవారి గుట్టు బయటపెడతామని చెప్పారు. 'మంత్రులతో ముఖాముఖి'సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, ఇతర అధికారులపై దాడి ఘటనపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొద్ది గంటల్లోనే దోషులెవరో తేలుతుందని అన్నారు. ప్రజలకు మంచి చేద్దాం అనుకుంటున్న అధికారులను, ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు గులాబీ ముసుగులో కుట్రలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. జిల్లా అధికార యంత్రాంగంపై దాడి చేసిన వారిని ఉపేక్షించేది లేదన్నారు.

ఇళ్లు కూల్చం.. చెరువులు పునరుద్ధరిస్తాం

- పంథా మార్చుకున్న హైడ్రా.. చర్యలకు ముందు స్థానికులతో సమావేశం
- స్వయంగా రంగంలోకి కమిషనర్ రంగనాథ్



బతుకమ్మకుంట చెరువు పనులను పునరుద్ధరిస్తున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్/ అంబర్‌పేట: 'పేదల ఇళ్లు కూల్చం.. చెరువులను పునరుద్ధరిస్తాం''.. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) తాజాగా ఎత్తుకున్న నినాదమిది. ఇటీవలి వరకు చెరువుల పరిధిలో కూల్చివేతలతో కలకలం రేపిన హైడ్రా తన పంథా మార్చుకుంది. ఎక్కడైనా నీటి వనరుల పునరుద్ధరణ చర్యలకు ఉపక్రమించే ముందు స్థానికులతో భేటీ కావాలని.. తమ లక్ష్యం, దాని వల్ల ఒనగూరే ప్రయోజనాలను వారికి వివరించాలని నిర్ణయించింది. దీనికోసం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా రంగంలోకి దిగారు. అంబర్‌పేటలోని బతుకమ్మకుంట నుంచి దీనికి శ్రీకారం చుట్టారు. బుధవారం ఆ ప్రాంతానికి వచ్చిన రంగనాథ్.. పేదల ఇళ్లు కూల్చబోమని, ఆక్రమణలకు గురై ఖాళీగా ఉన్న స్థలాలను మాత్రమే శుభ్రం చేస్తామని వివరించారు. బతుకమ్మకుంట పునరుద్ధరణ జరిగితే.. ముంపు తప్పడంతోపాటు భూగర్భ జలాల లభ్యత పెరుగుతుందని స్థానికులకు అవగాహన కల్పించారు. ఆ ప్రాంతంలో ఓ ఆహ్లాదకరమైన పార్కును నిర్మిస్తామని తెలిపారు. దీంతో బతుకమ్మకుంటలో ఉన్న ఆక్రమణల తొలగింపునకు స్థానికులు ముందుకు వచ్చారని అధికారులు చెబుతున్నారు.

పక్షం రోజుల పాటు కసరత్తు చేసి..

బతుకమ్మకుంటకు పునరుద్ధరణకు సంబంధించి క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టడానికి ముందు హైడ్రా దాదాపు పక్షం రోజుల పాటు కసరత్తు చేసింది. ఈ అంశాన్ని న్యాయ నిపుణులతో వివిధ కోణాల్లో చర్చించింది. న్యాయస్థానంలో కేవియట్ పిటిషన్ దాఖలు చేసి ముందుకు వెళ్లింది. ప్రొక్లెయినర్లతో తొలగింపు ప్రక్రియ చేపట్టడానికి ముందే స్థానికులకు అవగాహన కల్పించింది. ఇది విజయవంతమైందని, ఇకపై ఇదే విధానాన్ని కొనసాగించాలని కమిషనర్ ఏవీ రంగనాథ్ నిర్ణయించారు. బతుకమ్మకుంటలో ఉన్న వీకర్ సెక్షన్ కాలనీ వాసులతో మాట్లాడిన రంగనాథ్.. హైడ్రా పేరుతో ఎవరైనా భయపెట్టాలని, బ్లాక్‌మెయిల్ చేయాలని చూస్తే ఉపేక్షించవద్దని సూచించారు.

పదహారు ఎకరాల నుంచి ఐదెకరాలకు..

అంబర్‌పేటలోని బతుకమ్మకుంటను పునరుద్ధరించి, పూర్వ వైభవం తీసుకురావాలని నిర్ణయించిన హైడ్రా అధికారులు దాని పూర్వాపరాలను అధ్యయనం చేశారు. 1962–63 నాటి రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 563లో 14.06 ఎకరాల విస్తీర్ణంలో బతుకమ్మ కుంట విస్తరించి ఉండేది. ఫుల్ ట్యాంక్ లెవల్, బఫర్ జోన్లతో కలిపి దీని వైశాల్యం 16.13 ఎకరాలని అధికారులు తేల్చారు. తాజా సర్వే ప్రకారం బతుకమ్మకుంటలో మిగిలినది 5.15 ఎకరాలేనని గుర్తించారు. దీంతో అంత మేరకు కుంటను పునరుద్ధరించాలని హైడ్రా కమిషనర్ నిర్ణయించారు. ఇప్పటికే అక్కడ నివసిస్తున్న వారిని ఖాళీ చేయించకుండా.. ఎలాంటి ఇబ్బందులూ రాకుండా చెరువు తవ్వకాలు చేపట్టాలని ఆదేశించారు. దీనితో స్థానికులు హైడ్రాకు సహకరించేందుకు ముందుకొచ్చారు. ఒకప్పటి ఎర్రకుంటనే బతుకమ్మకుంటగా మారిందని.. రెవెన్యూ రికార్డులూ అదే చెప్తున్నాయని స్థానికులు హైడ్రా దృష్టికి తెచ్చారు. అయితే ఇటీవలి పలు పరిణామాల నేపథ్యంలో బతుకమ్మకుంట వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆ స్థలం ప్రైవేటుది అని వాదించిన బీఆర్‌ఎస్ నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు.

తార్నాకలోని ఎర్ర కుంటను పరిశీలించి..

బుధవారం తార్నాకలోని ఎర్రకుంటను రంగనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలాంటి వివాదాలు తలెత్తకుండా చూస్తూ, ఎర్రకుంటను పునరుద్ధరించాలని నాగార్జున కాలనీ సంక్షేమ సంఘం వినతి పత్రం సమర్పించింది. ఈ మేరకు పునరుద్ధరణ చర్యలు తీసుకోవాలని రంగనాథ్ అధికారులను ఆదేశించారు.

జనావాసాల జోలికి హైడ్రా వెళ్లదు

హైడ్రా ఎట్టి పరిస్థితుల్లోనూ పేదల జనావాసాల జోలికి వెళ్లదు. పెద్ద చెరువుగా ఉండాల్సిన బతుకమ్మకుంట క్రమేణా కుంచించుకుపోయింది. దానిని పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటున్నాం. దీని పక్కన ఉన్న బస్తీ వాసులకు గతంలో పట్టాలు ఇచ్చారు. ఆ ఇళ్లను హైడ్రా కూలుస్తుందనే దుష్ప్రచారం నేపథ్యంలో.. ఇక్కడికి వచ్చి స్థానికులకు వాస్తవాలు వివరించాం. వారి సహకారంతోనే బతుకమ్మకుంట పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నాం. రాజకీయాలకు అతీతంగా వచ్చిన విజ్ఞప్తుల నేపథ్యంలో చట్టపరంగా అన్ని అంశాలను పరిశీలిస్తూ, అన్ని విభాగాలతో సమావేశాలు ఏర్పాటు చేసుకుని తుది నిర్ణయం తీసుకున్నాం. కొందరు బతుకమ్మకుంట ప్రైవేటు స్థలమని వాదిస్తున్నప్పటికీ సరైన ఆధారాలు చూపలేదు. – ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్

ఇళ్లు కూల్చబోమని హామీ ఇచ్చారు



హైడ్రా కమిషనర్ వచ్చి మాతో మాట్లాడారు. మా ఇళ్లను కూల్చబోమని హామీ ఇచ్చారు. దోమలు, దుర్వాసన లేకుండా బతుకమ్మకుంటను పునరుద్ధరిస్తామని చెప్పారు. కేవలం ఖాళీగా ఉన్న జాగానే చెరువుగా అభివృద్ధి చేస్తామన్నారు. అలా చేస్తే మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. – అరుణ, వీకర్ సెక్షన్ కాలనీ

రంగనాథ్ సార్ వచ్చి ధైర్యం చెప్పారు



బతుకమ్మకుంటలో సుమారు 50 ఏళ్లుగా నివసిస్తున్నాం. నగరంలో అక్కడక్కడా ఇళ్లు కూలుస్తుంటే భయం వేసింది. మా వద్దకు కూడా వచ్చి ఇళ్లు కూల్చేస్తారని కొందరు భయపెట్టారు. ఈ రోజు రంగనాథ్ సార్ వచ్చి ధైర్యం చెప్పారు. ఇళ్లు కూల్చబోమని, ఖాళీగా ఉన్న స్థలంలోనే కుంటను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. – సుంకమ్మ, వీకర్ సెక్షన్ కాలనీ

ధాన్యం సేకరణలో ఇబ్బందులు రావొద్దు: తుమ్మల



సాక్షి, హైదరాబాద్: ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్న దృష్ట్యా తరలింపు, నిల్వల విషయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఎండీ ఉదయ్‌కుమార్, ఆగ్రోస్ ఎండీ రాములుతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచాలన్నారు. వరి కోతలు, సెంటర్లకు వస్తున్న ధాన్యాన్ని బట్టి అవసరమైతే మరిన్ని ధాన్యం క్లీనర్లు ఏర్పాటు చేయాలన్నారు. దీనికి సంబంధించి పౌరసరఫరాలు, మార్కెటింగ్‌శాఖ అధికారులతో కలసి సమన్వయంతో పనిచేయాలని ఆగ్రోస్ ఎండీ రాములును ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపునకు తీసుకోవాల్సిన చర్యలపై మార్కెటింగ్, వేర్‌హౌసింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కొనుగోళ్లకు తగ్గట్లుగా నిల్వ సామర్థ్యాన్ని అందుబాటులోకి తెచ్చేవిధంగా ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు.

ధాన్యం తరలింపులో లారీల కొరత రావొద్దు

మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని మిల్లులు, గోడౌన్‌లకు తరలించేందుకు అవసరమైన లారీలు, ఇతర వాహనాలను సమకూర్చాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద వాహనాల కొరత లేకుండా రవాణా శాఖ తీసుకుంటున్న చర్యలపై బుధవారం ఆయన అధికారులతో చర్చించారు. తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు లేదా గోడౌన్‌లకు తరలించే విషయంలో జిల్లా రవాణా అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమన్వయం చేసుకునేలా చూడాలని రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి వికాస్‌రాజ్‌ను మంత్రి ఆదేశించారు. అలాగే జిల్లా కలెక్టర్లు కూడా దీనిపై దృష్టిపెట్టాలని సూచించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

అధికారులకు భట్టి విక్రమార్క ఆదేశం



సాక్షి, హైదరాబాద్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజా ప్రభుత్వం నిర్వహించనున్న సెమీ క్రిస్మస్ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు. సెమీ క్రిస్మస్ వేడుకల నిర్వహణ, కమిటీ ఏర్పాటుపై బుధవారం సచివాలయంలోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. క్రిస్మస్ సెలబ్రేషన్ నిర్వహణపై రాష్ట్రస్థాయి కమిటీతో పాటు ప్రతి నియోజకవర్గంలో నిర్వహించే వేడుకలకు సంబంధించి కూడా కమిటీలు త్వరగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా భట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీలో కూడా వేడుకల నిర్వహణకు కమిటీలు ఏర్పాటు చేయాలని, కమిటీల ఏర్పాటు తర్వాత పూర్తి కార్యాచరణ ప్రణాళికతో హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి తాఫ్సీర్ ఇక్బాల్, కమిషనర్ యాస్మిన్, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఎండీ సబిత తదితరులు పాల్గొన్నారు.

వడ్లు కొనమంటే నోట్ల లోడ్ ఎత్తుతున్నారు

- రేవంత్ మహారాష్ట్ర ఎన్నికలకు డబ్బుల మూటలు పంపుతున్నారు: హరీశ్‌రావు
- సన్న వడ్లను కొనడంలో ప్రభుత్వం విఫలం... రైతులను సమీకరించి ఉద్యమాలు చేస్తాం



ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నిర్వాహకురాలితో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

మర్రిగూడ: రాష్ట్రంలో రైతుల వడ్ల లోడ్ ఎత్తమంటే సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నోట్ల కట్టల లోడ్ ఎత్తుతున్నారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ధ్వజమెత్తారు. గత సంవత్సరం నల్లగొండ జిల్లాలో 4 లక్షల ఎకరాల్లో వరి సాగైతే ఈ సంవత్సరం కృష్ణా నదిలో పుష్కలంగా నీరు రావడం వల్ల 5.50 లక్షల ఎకరాల్లో వరి సాగైందన్నారు. కానీ, సీఎం రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం వల్ల నల్లగొండలో కనీసం 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కూడా కొనుగోలు చేసే పరిస్థితి లేదని మండిపడ్డారు. హరీశ్‌రావు బుధవారం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని, రైతులకు అవసరమైనన్ని గన్నీ బ్యాగులను అందించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోవడంతో రైతులు రూ.1,800కే దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ ఇస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటివరకు నల్లగొండ జిల్లాలో ఒక కిలో సన్న వడ్లనూ కొన్న పాపాన పోలేదన్నారు. వడ్లు కొనకపోతే అధికారులను ఎందుకు కొనట్లేదని అడగడం లేదు కాని మద్యం తక్కువ అమ్మిన ఎక్సైజ్ అధికారులకు మాత్రం మెమోలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటామని ప్రభుత్వం ప్రకటించిందని, కానీ 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కూడా కొనే పరిస్థితి లేదన్నారు. పక్క రాష్ట్రం నుంచి దళారులు వచ్చి తెలంగాణ రైతుల వద్ద తక్కువ రేటుకు ధాన్యాన్ని కొంటున్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డి రాజ్యంలో రైతులు రోదిస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులను సమీకరించి బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కాగా, గతంలో ధాన్యం కొనుగోలులో జరిగిన అవకతవకల్లో రూ.48 లక్షలు అవినీతి చోటుచేసుకోగా.. కొనుగోలు డబ్బులు నేటికీ రైతుల ఖాతాలో జమ కాలేదని రైతు మోదుగు రాజేందర్.. హరీశ్‌రావుకు చెబుతుండగా మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

సర్కారుపై బీజేపీ సమరం

డిసెంబర్ 1 నుంచి 7 దాకా పాదయాత్రలు

- అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహణ
- కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి నాయకత్వం
- పార్టీలోని సకల శ్రేణులు పాల్గొనేలా కార్యాచరణ
- కాంగ్రెస్ హామీలు.. సర్కారు వైఫల్యాలపై పోరాటం
- ఈ నెల 16, 17 తేదీల్లో 'మూసీ నిద్ర'కు సమాయత్తం
- రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై బీజేపీ వరుస పోరాటాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై వరుస పోరాటాలకు బీజేపీ వేగంగా కార్యాచరణను రూపొందిస్తోంది. ధాన్యం కొనుగోళ్లపై ఇప్పటికే ఈ నెల 9, 11, 13 తేదీల్లో కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు మద్దతు ప్రకటించిన ఆ పార్టీ నేతలు, 16, 17 తేదీల్లో మూసీ ప్రాజెక్టు బాధితుల సమస్యలు తెలుసుకొనేందుకు 'మూసీ నిద్ర'కార్యక్రమానికి సిద్ధమవుతున్నారు. దానికి కొనసాగింపుగా మరో భారీ కార్యాచరణను సిద్ధం చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలు, గత ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రజాక్షేత్రంలో ఎండగట్టేందుకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాదయాత్రలు నిర్వహించాలని నిర్ణయించారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు వారంపాటు ఈ పాదయాత్రలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ నాయకత్వం వహించనుండగా, బీజేపీలోని కింది స్థాయి కార్యకర్త నుంచి రాష్ట్ర స్థాయి నేత వరకు అందరూ తప్పనిసరిగా పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా: 2028 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా, ఇప్పటి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టేందుకు వరుస కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ నిర్ణయించింది. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుపైనే పోరాట కార్యాచరణ చేపడుతున్నది. పాదయాత్రలో ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలపైనే బీజేపీ నేతలు దృష్టి పెట్టనున్నట్లు సమాచారం. శాసనసభ నియోజకవర్గాల పరిధిలోని మండలాలు, గ్రామాలకు చేరుకునే వీలును బట్టి ఐదు నుంచి ఏడురోజుల పాటు పాదయాత్రలు నిర్వహించనున్నారు.

రోజుకు 15 నుంచి 17 కి.మీ. యాత్ర

నియోజకవర్గాల్లో రోజుకు 15 నుంచి 17 కి.మీ. దూరం పాదయాత్ర కొనసాగేలా రోడ్‌మ్యాప్‌ను రూపొందిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లోని నియోజకవర్గాల్లో రోజుకు అంతకంటే ఎక్కువ దూరం యాత్ర చేసే వీలుండటంతో ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి కొందరు నాయకులతో కూడిన బృందాన్ని ఏర్పాటుచేసి పర్యవేక్షణ బాధ్యత అప్పగిస్తారు. ప్రతిరోజు ఎక్కడి నుంచి ఎక్కడి దాకా యాత్ర నిర్వహించాలి? నైట్ హాల్ట్ ఎక్కడ ఉండాలి? అనే అంశాలన్నింటినీ ఈ బృందాలు చూసుకొంటాయి. వచ్చే నాలుగేళ్లపాటు నిరంతరం ప్రజల్లోనే ఉంటూ, ప్రజాసమస్యలపై పోరాడేందుకు పార్టీ పరంగా వివిధ రూపాల్లో చేపట్టబోయే నిరసనలు, ఆందోళనలకు ఈ పాదయాత్ర పూర్వరంగంగా ఉపయోగపడుతుందని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం మొగ్గుచూపినా, చూపకపోయినా... గ్రామ, మండల స్థాయిల్లో బీజేపీ బలపడేందుకు ఈ పాదయాత్రలు దోహదపడతాయని భావిస్తున్నారు.

25 ప్రాంతాల్లో మూసీ నిద్ర

ఈ నెల 16 నుంచి 17వ తేదీ ఉదయం వరకు మూసీ పరీవాహక ప్రాంతాల్లోని 25 ప్రాంతాల్లో మూసీ నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ప్రకాష్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డితోపాటు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలంతా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. 3 పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూసీ పరీవాహక ప్రాంత ప్రజలతో కలిసి భోజనం చేసి బస చేస్తామని వెల్లడించారు. ప్రక్షాళన పేరుతో ఇళ్లను కూల్చితే ఊరుకోబోమని హెచ్చరించారు. బుల్డోజర్లను తమపై నుంచి ఎక్కించిన తర్వాతే ప్రజల ఇళ్లను ముట్టుకోవాల్సి ఉంటుందని అన్నారు.

మంత్రి సురేఖ మాటలు అసభ్యకరం

సత్యవతి రాథోడ్, తుల ఉమ, బాల్క సుమన్ వాంగ్మూలం

సిటీ కోర్టులు: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ మాటలు అభ్యంతరకరంగా, అసభ్యకరంగా ఉన్నాయని బీఆర్‌ఎస్ నేతలు సత్యవతి రాథోడ్, తుల ఉమ, బాల్క సుమన్ నాంపల్లి కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు. వారి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్న జడ్జి ఎస్.శ్రీదేవి తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేశారు. సురేఖపై కేటీఆర్ పరువు నష్టం కేసు విచారణ నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, ఎక్సైజ్ కోర్టులో జరిగింది. కేటీఆర్ తరఫున న్యాయవాదులు సిద్ధార్థ, అరవింద్ హాజరయ్యారు.





మీకు ఉపయోగించుకోవడం తెలిస్తే జీవితం దీర్ఘంగా ఉంటుంది.
– సెనెకా

సాక్షి
గురువారం, 14 నవంబర్ 2024

ఓట్ల వేటలో వాగ్దానవర్షం

మహారాష్ట్రలో ఎన్నికల పర్వం ఇప్పుడు కాక పుట్టిస్తోంది. ఈ 20న జరగనున్న ఎన్నికల కోసం ఇటు బీజేపీ సారథ్యంలో అధికార 'మహాయుతి' కూటమి, అటు కాంగ్రెస్ నేతృత్వంలో ప్రతిపక్ష 'మహా వికాస్ ఆఘాడీ' (ఎంవీఏ)... రెండూ సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. ఓటర్లను ఆకర్షించేందుకు వరాల జల్లు కురిపిస్తున్నాయి. దేశంలోని అత్యంత సంపన్న రాష్ట్రంలో ఇప్పుడు ఉచితాల పోరు సాగుతోంది. గృహాలకు 100 యూనిట్ల మేర కరెంట్ ఉచితం, గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఆడపిల్లలకు ఉచిత టీకాకరణ, మహిళా ఉద్యోగులకు ప్రతి నెలా రెండు రోజులు ఋతుక్రమ సెలవుల లాంటి గ్యారెంటీలతో ఎంవీఏ ముందుకొచ్చింది. ఫలితంగా మహాయుతి సైతం మరింత ఎక్కువ వాగ్దానాలు చేయక తప్పలేదు. దాంతో, ఎన్నికల మేనిఫెస్టోలు కలకలం రేపుతున్నాయి. ఖజానాపై భారం రీత్యా పథకాల సాధ్యాసాధ్యాలపై చర్చ మొదలైంది. దేశాభివృద్ధికి ఉచితాల సంస్కృతి ప్రమాదకరమన్న మోదీ సొంతపార్టీ బీజేపీ సైతం 'మహా'పోరులో ప్రతిపక్షం బాట పట్టక తప్పలేదు. అయితే, వైరిపక్షం వాగ్దానాలు సాధ్యం కావంటూ ప్రతి పార్టీ పక్కవారిపై ఆరోపణలు చేయడమే విడ్డూరం.

మహిళలు, రైతులు, విద్యార్థులు – నిరుద్యోగులైన యువతరం, సీనియర్ సిటిజన్లు... ఇలా వివిధ వర్గాలను లక్ష్యంగా చేసుకొని ఇచ్చిన పోటాపోటీ హామీలు అనేకం. సమాజంలోని వెనుకబడిన వర్గాలను పైకి తీసుకురావడానికీ, అవసరంలో ఉన్నవారికి చేయూత అందించడానికీ సంక్షేమ పథకాలను హామీ ఇవ్వడం, వాటిని చిత్తశుద్ధితో అమలు చేయడం తప్పు కాదు, తప్పనిసరి కూడా! అయితే, ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా అమలు చేయడానికి వీలే కాని వాటిని హామీ ఇచ్చినప్పుడే అసలు సమస్య. అధికారంలో ఉండగా అవసరార్థులను పట్టించుకోకుండా, తీరా ఎన్నికల వేళ మేనిఫెస్టోలతో మభ్యపెట్టాలనుకోవడం మరీ దారుణం. ఎన్నికల వాగ్దానపత్రాలపై విమర్శలు వస్తున్నది అందుకే. ఆర్థికభారం సంగతి అటుంచితే, స్త్రీలకు తప్పనిసరి ఋతుక్రమ సెలవు లాంటివి పని ప్రదేశాల్లో వారికే ప్రతికూలంగా మారే ప్రమాదముందని జూలైలో సుప్రీమ్ కోర్ట్ అభిప్రాయపడింది. అయినా, ఆ అంశాన్ని పార్టీలు చేపట్టడం విచిత్రమే. పని గంటల్లో వెసులుబాటు, వర్క్ ఫ్రమ్ హోమ్ తదితర ప్రత్యామ్నాయాలను పట్టించుకోకుండా, జపాన్, స్పెయిన్, ఇండొనేసియా లాంటి చోట్ల ఆదరణకు నోచుకోని పద్ధతిని తెస్తామని హామీ ఇవ్వడం ఒకింత ఆశ్చర్యకరం.

ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే బలమైన ఓటరు వర్గంగా మహిళలు మారిన సంగతిని పార్టీలు గుర్తించాయి. స్త్రీలు స్వీయ నిర్ణయంతో ఓట్లేస్తున్న ధోరణి పెరుగుతోందనీ గ్రహించాయి. అందుకే, 4.5 కోట్ల మంది మహిళా ఓటర్లున్న మహారాష్ట్రలో రెండు కూటములూ వారిని లక్ష్యంగా చేసుకున్నాయి. లడకీ బెహిన్ యోజన కింద ఇస్తున్న నెలవారీ భృతిని పెంచుతామనీ, స్వయం సహాయక బృందాల్లోని మహిళా సభ్యులకు 'లఖ్‌పతీ దీదీ' పథకంతో చేయూతనిచ్చి, 2027 కల్లా 50 లక్షల మందిని లక్షాధికారిణుల్ని చేస్తామనీ 'మహాయుతి' మాట. ఎంవీఏ కూటమి ఏమో 'మహాలక్ష్మి పథకం' ద్వారా నెలవారీ ఆర్థికసాయం, ఆడవారికి ఉచిత బస్సు ప్రయాణం వగైరా హామీలిస్తోంది. నిజానికి, పశ్చిమ బెంగాల్‌లో కన్యాశ్రీ, మధ్యప్రదేశ్‌లో లాడ్లీ బెహనా యోజన... ఇలా రకరకాల పేర్లతో మహాలక్ష్మి పథకం లాంటివి ఇప్పటికే కొన్నిచోట్ల ఉన్నాయి. ఈ తీపి మాటల్ని అటుంచితే,, మహారాష్ట్రలోని 288 స్థానాలకు గాను రెండు కూటముల పక్షాన కలసి ఈ ఎన్నికల్లో 56 మంది మహిళలే బరిలో ఉన్నారు. లెక్కలు తీస్తే, మొత్తం అభ్యర్థుల్లో స్త్రీల సంఖ్య 10 శాతమే. వెరసి, ఆడవారికి ఉచితాలిచ్చి ఓటర్లుగా వాడుకోవడమే తప్ప, చట్టసభల్లో సరైన భాగస్వామ్యం కల్పించడంలో పార్టీలకు ఆసక్తి లేదు. మహిళా రిజర్వేషన్లను పైకి ఆమోదించినా, ఆచరణలో ఇదీ దుఃస్థితి.

పార్లమెంట్‌కు అతిపెద్ద సంఖ్యలో రాజ్యసభ సభ్యుల్ని పంపే రాష్ట్రాల్లో రెండోది అయినందున మహారాష్ట్ర ఎన్నికలను బీజేపీ కీలకంగా భావిస్తోంది. బలవంతపు మతమార్పిడులకు వ్యతిరేక చట్టం చేస్తామంటూ కాషాయపార్టీ హిందూత్వ కార్డును విసురుతుంటే, ఓబీసీలు గణనీయంగా ఉన్న రాష్ట్రమైనందున కులగణన, ఉద్యోగాల రిజర్వేషన్లలో 50 శాతం పరిమితి ఎత్తివేత లాంటి మాటలతో ఎంవీఏ సామాజిక న్యాయం నినాదాన్ని భుజానికి ఎత్తుకుంది. ఇక, విభజనవాద నినాదాలైన 'బటేంగే తో కటేంగే' (హిందువులు విడిపోతే నష్టపోతాం), 'ఏక్ రహేంగే తో సేఫ్ రహేంగే' (కలసివుంటే భద్రంగా ఉంటాం) మధ్య రైతాంగ సమస్యలు, రైతుల ఆత్మహత్యలు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వగైరా అసలు అంశాలు వెనక్కిపోవడమే విషాదం.

స్థూలంగా 6 జోన్లయిన మహారాష్ట్రలో ఆర్థికంగా వెనకబడ్డ విదర్భ, మరాఠ్వాడా, ఉత్తర మహారాష్ట్ర ప్రాంతానికీ – రెండు, మూడు రెట్లు తలసరి ఆదాయం ఎక్కువుండే ముంబయ్, థానే – కొంకణ్, పశ్చిమ మహారాష్ట్రలకూ మధ్య ఆలోచనలో తేడా ఉంటుంది. మొత్తం స్థానాల్లో నాలుగోవంతు పైగా సీట్లలో ఎప్పుడూ హోరాహోరీ పోరే. అలాగే, మూడోవంతు పైగా స్థానాల్లో విజేత మెజారిటీ కన్నా మూడోస్థానంలో నిలిచిన అభ్యర్థి ఓట్ షేర్ ఎక్కువ. కాబట్టి, ఫలితాల అంచనా అంత సులభం కాదు. రాష్ట్రాన్ని పాలించేది ఎవరన్నది ఒక్కటే కాదు... ఉద్ధవ్ ఠాక్రే, శిందే వర్గాలలో ఎవరిది అసలైన శివసేన అన్నదీ ప్రజలు ఈ ఎన్నికల్లో తీర్పునివ్వనున్నారు. వాగ్దానపర్వంలో ఏ పార్టీని ఎంత నమ్మిందీ చెప్పనున్నారు. తక్షణ ఆర్థిక సహాయం పట్ల గ్రామీణ ఓటర్లు ఆకర్షితులయ్యే అవకాశం కనిపిస్తోంది కానీ, వచ్చే ఏడేళ్ళలో రూ. 2.75 లక్షల కోట్ల అప్పు తీర్చాల్సిన రాష్ట్రంలో రేపు ఏ కూటమి అధికారంలోకి వచ్చినా తమ హామీలను అమలు చేయగలుగుతుందా అన్నది ప్రశ్న.

మంచి పనిని కించపరుస్తారా?

విశ్లేషణ



దిలీప్ రెడ్డి

జనాభా సమీకరణాల్లో వస్తున్నంత పరివర్తన సామాజికార్థిక పరిస్థితుల్లో రాకపోవడం దేశంలో ఏకరీతి ప్రగతికి సవాల్ విసురుతోంది. అసమగ్ర అభివృద్ధికి ప్రభుత్వాలే కారణమయ్యే సంకేతాలు కనిపిస్తున్నాయి. 'జనాభా ఆధారంగా చట్టసభలకు ప్రాతినిధ్య' పద్ధతి సమాఖ్య స్ఫూర్తికే విఘాతం కలిగించేలా పరిణమించింది. నియోజకవర్గ పునర్విభజనతో జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాల్లో నియోజకవర్గాల సంఖ్య పెరుగనుండగా, దక్షిణాది రాష్ట్రాల్లో తగ్గనున్నాయి. జనాభా నియంత్రిస్తే తప్పయినట్టు, ఎక్కువ మంది పిల్లల్ని కనడమే గొప్పయినట్టు అధికారిక ప్రచారాలు, అమలు చర్యలు మొదలయ్యే ప్రమాదముంది. ఈ పరిస్థితులపై లోతైన సమగ్ర అధ్యయనం, దిద్దుబాటు చర్యలు తక్షణావసరం.

మనమిపుడు 140 కోట్ల మందితో ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల దేశంగా ఉన్నాం. వనరులు, సదుపాయాలు, జనాభా నిష్పత్తిలో చూసినపుడు ఇదొక సంక్లిష్ట నమూనా! ఇటీవలి వరకు అధిక జనాభా దేశంగా ఉన్న చైనా కొన్నేళ్లుగా కట్టుదిట్టమైన నియంత్రణ చర్యలతో జనాభా వృద్ధిని నిలువరించింది. మనం కూడా నియంత్రణ చర్యలు చేపట్టినప్పటికీ, ఆశించిన లక్ష్యాలు అందుకోలేకపోయాం. అయితే, దేశంలోని కొన్ని, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు ఈ విషయంలో మంచి విజయాలు సాధించాయి. అర్థవంతమైన సంతానోత్పత్తి రేటు తరుగుదలను నమోదు చేశాయి. ఇది ప్రగతి సంకేతమే! కానీ, అదే తమ పాలిట శాపంగా పరిణమించిందని ఇప్పుడా రాష్ట్రాలు నెత్తి బాదుకుంటున్నాయి.

ప్రధానంగా రెండు సమస్యల్ని ఎదుర్కొంటున్నామని ఆ యా రాష్ట్రాల అధినేతలు భావిస్తున్నారు. ఒకటి, సంతానోత్పత్తి రేటు నియంత్రణ వల్ల పిల్లలు, యువ జనాభా తగ్గుతూ, వృద్ధుల జనాభా నిష్పత్తి పెరుగుతోంది. రెండోది, జనాభా నిలువరింపు కారణంగా, జాతీయ సగటు జనాభా ఆధారంగా జరిగే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతో ఆ యా రాష్ట్రాల్లో ఎంపీ స్థానాల సంఖ్య తగ్గనుంది. ఇది దేశంలోని అత్యున్నత విధాన నిర్ణాయక సభలో ప్రాతినిధ్యం కోతగా భావిస్తూ వారు కలత చెందుతున్నారు. ఇంకోవైపు, జనాభాను అదుపు చేయక, సంతానోత్పత్తి రేటును అధికంగానే చూపుతున్న రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్య పెరుగనుండటం దేనికి సంకేతం? అనే ప్రశ్న పుట్టుకొస్తోంది.

తగ్గిన సంతానోత్పత్తి రేటు

దక్షిణాది రాష్ట్రాలు, ఈశాన్య భారతంలోని చిన్న రాష్ట్రాల్లో సంతానోత్పత్తి రేటులో రమారమి తరుగుదల నమోదైంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లోనూ ఈ రేటు తక్కువగానే ఉంది. 2019–21 కాలంలో, దేశంలోనే అత్యల్పంగా తమిళనాడు, పశ్చిమ బెంగాల్లో సంతానోత్పత్తి రేటు 1.4గా ఉంటే... తెలంగాణ, ఏపీ, కేరళ, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్‌లలో ఇది 1.5గా నమోదయినట్టు 'భారత రిజిస్ట్రార్ జనరల్' నివేదిక చెబుతోంది. 'పిల్లలు కనే వయసు' కాలంలో మహిళలకు పుట్టిన పిల్లల సంఖ్య సగటును, ఆ ప్రాంతపు లేదా ఆ రాష్ట్రపు సంతానోత్పత్తి రేటుగా పరిగణిస్తారు. అదే సమయంలో బిహార్ (3), ఉత్తర ప్రదేశ్ (2.7), మధ్యప్రదేశ్ (2.6) రాష్ట్రాల్లో సంతానోత్పత్తి రేటు అధికంగా నమోదవుతోంది. ఎక్కువ సంతానోత్పత్తి రేటున్న రాష్ట్రాల్లో అభివృద్ధి మందగించడం సహజం.

సంతానోత్పత్తి పరిమితుల్లో ఉండటం ప్రగతి సంకేతమే అయినా, మరో సమస్యకు అది కారణమవుతోంది. ఒక వంక పుట్టే పిల్లల సంఖ్య తగ్గుతుంటే, మరోవంక శాస్త్ర సాంకేతికత పురోగతి పుణ్యమా అని మనిషి సగటు జీవనకాలం పెరగటం వల్ల వృద్ధుల సంఖ్య అధికమవుతోంది. అభివృద్ధి చెందిన దేశాల్లోలాగా ఒక నిర్దిష్ట వయసు దాటినవారికి ప్రభుత్వమే కల్పించే సామాజిక భద్రత పథకాలు, కార్యక్రమాలు మనవద్ద లేకపోవడంతో వారి పోషణ, ఆరోగ్య నిర్వహణ కుటుంబాలకు అదనపు ఆర్థిక భారంగా పరిణమిస్తున్నాయి. జనాభా ఆధారంగానే వివిధ కేంద్ర పథకాలు, సంక్షేమ కార్యక్రమాల నిధుల కేటాయింపులు, చివరకు చట్టసభల్లో ఆయా రాష్ట్రాల ప్రాతినిధ్య సంఖ్య ఖరారు కూడా జరగటం తమకు నష్టం కలిగిస్తోందని ఏపీ, తమిళనాడు ముఖ్యమంత్రులు వ్యాఖ్యానించారు.



ఆధారపడే జనాభా రేటులో వృద్ధి

ప్రపంచంలోనే అత్యధిక యువజనాభా కలిగిన దేశంగా భారత్ రికార్డులకెక్కింది. కానీ, ఇటీవలి కాలంలో వృద్ధుల జనాభా శాతం క్రమంగా పెరుగుతున్నట్టు, మున్ముందు అది మరింత పెరుగనున్నట్టు ఐక్యరాజ్యసమితి విభాగమొకటి (యూఎన్ఎఫ్పీయే) తన నివేదికలో చెప్పింది. భారత వైద్య, కుటుంబ ఆరోగ్య విభాగం అందించిన సమాచారం ఆధారంగా అంచనాలు లెక్కగట్టిన ఈ విభాగం 2021లో 10.1 శాతంగా ఉన్న వృద్ధుల జనాభా 2036 నాటికి 15 శాతానికి చేరవచ్చని చెప్పింది.

అయితే, వృద్ధుల జనాభా పెరుగుదల రేటు సమస్య కాదు... సదరు జనాభా పనిచేసే వయస్కుల మీద ఆధారపడే స్థితి అధికమవడం ఇబ్బంది. అంటే, వంద మంది పనిచేసే (18–59 ఏళ్లు) వయస్కులున్నపుడు, వారిపై ఆధారపడే వృద్ధుల జనాభా అధికంగా ఉండటం కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై నేరుగా ప్రభావం చూపుతుందనేది అంతర్జాతీయ ప్రమాణాల లెక్క. ఆ నిష్పత్తి పెరుగుతోంది. అది 15 శాతాన్ని దాటితే సమస్యను 'వృద్ధుల సంక్షోభం'గా లెక్కిస్తారు. భారత జాతీయ జనాభా కమిషన్ (ఎన్సీపీ) 2021 లెక్కల ప్రకారం, కేరళలో ఇది ఇప్పటికే 26.1 శాతంగా ఉంది. తమిళనాడు (20.5), హిమాచల్ ప్రదేశ్ (19.6), ఏపీ (18.5) శాతాలు కూడా అధికంగానే ఉన్నాయి. 2036 నాటికి అవి మరింత గణనీయంగా పెరగటం ఖాయంగా కనిపిస్తోంది. సంతానోత్పత్తి రేటును, తద్వారా జనాభాను నియంత్రించినందుకు, సదరు కుటుంబాల్లో లభించే ఆ ప్రయోజనం... వృద్ధుల పోషణ, వారి ఆరోగ్య పరిరక్షణలోనే కరిగిపోతోందనే వాదన బలంగా వినిపిస్తోంది.

కట్టడి చేసినందుకు కనీస స్థానాలా?

2026 తర్వాతి జనాభా లెక్కల ఆధారంగా దేశంలో నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది. రాష్ట్ర విభజన చట్ట నిర్దేశ్యం ప్రకారం ఏపీ, తెలంగాణల్లోనూ సంఖ్య పెంపుతో పునర్విభజన జరగాల్సి ఉంది. దేశవ్యాప్తంగా గడువు లోపల జనాభా తాజా లెక్కలు అందించడానికి వీలుగా జనగణన ప్రక్రియ సత్వరం చేపట్టనున్నట్టు కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యనే ప్రకటించింది. దశాబ్దానికి ఒకసారి జరిపే జనగణన, పాత సంప్రదాయం ప్రకారం 2020లో మొదలు కావాల్సింది. కోవిడ్ మహమ్మారి వల్ల అది వాయిదా పడింది. ఇప్పుడు 2025లో చేపట్టి, పదేళ్ల సైకిల్ని (ఇదివరకటిలా 2021 –2031 కాకుండా 2025 –2035గా) మారుస్తున్నారు. జనాభా వృద్ధి రేటు తీరుతెన్నుల్ని బట్టి కె.ఎస్. జేమ్స్, శుభ్ర కృతి జరిపిన అధ్యయనం ప్రకారం, వచ్చే పునర్విభజనతో ఉత్తరాది రాష్ట్రాల్లో నియోజకవర్గాల సంఖ్య పెరుగనుండగా దక్షిణాది రాష్ట్రాల్లో తగ్గనుంది. ఉత్తరప్రదేశ్ (12), బిహార్ (10), రాజస్థాన్ (7) లలో లోక్‌సభ నియోజకవర్గాలు పెరుగనున్నాయి. తమిళనాడు (9), కేరళ (6), ఏపీ (5) లలో తగ్గనున్నాయి. జాతీయ జనాభాలో వాటా పెరుగుదల, తరుగుదలను బట్టి ఈ సంఖ్య మారనుంది.

'ఎక్కువ పిల్లలు కలిగిన తలిదండ్రులకు ప్రోత్సాహకాలివ్వాలి, ఆ మేరకు చట్టం తేవాలని నేను ఆలోచిస్తున్నాను' అంటూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల అన్నారు. ఇటువంటి పంథా మంచిది కాదనీ, దాని వల్ల ఏ మంచీ జరుగదనేది ప్రపంచ వ్యాప్తంగా రుజువైన అంశమనీ సామాజికవేత్తలు అంటున్నారు. ప్రభుత్వాలిచ్చే ప్రోత్సాహకాలు అదనంగా పుట్టే సంతాన పోషణ, వారి విద్య –వైద్య అవసరాలు తీర్చవనీ, అధిక సంతానం కుటుంబ జీవన ప్రమాణాల పతనానికే కారణమవుతుందనీ విశ్లేషణలున్నాయి.

ఈ పరిణామాలను ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకొని ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి. జనాభా వృద్ధిని నిలుపుదల చేసిన వారిని ప్రోత్సహించేలా నిర్ణయాలుండాలి. సరైన జనాభా నిష్పత్తి ఉండేలా చూడాలి. వయసు మళ్లినవారు ఆయా కుటుంబాలకు భారం కాకుండా సార్వత్రిక సాంఘిక భద్రతా పథకాలు ఉండాలి. 'పనిచేసే వయసు' కాలం నిడివి పెరిగేట్టు జీవన ప్రమాణాల వృద్ధికి చర్యలు తీసుకోవాలి. జనాభా నియంత్రణ తప్పు కాదు. ముసలితనం శాపం కాకూడదు. మంచి పనులకు ప్రోత్సాహం ఉండాలే తప్ప, శిక్షలు ఉండకూడదు.

వ్యాసకర్త 'పీపుల్స్ పల్స్' రిసెర్చ్ సంస్థ డైరెక్టర్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అదీ సమర్థత



ప్రభుత్వ సమర్థత విభాగం (డోగ్) పేరిట (అమెరికాలో) ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామికి బాధ్యతలు అప్పజెప్పడమే కాదు, దానికి చివరి తేదీ కూడా ఇచ్చారు – జూలై 4, 2026. నేను ఇలాంటివి ఎప్పుడూ చూడలేదు.

– సునందా వశిష్ఠ్, వ్యాఖ్యాత

పెరగాల్సిన సమర్థత



1991 నాటి సంస్కరణలు జరిగినప్పటికీ, ఈ దేశంలో బ్యూరోక్రసీ, రెడ్ టేపిజం ఇంకా భారీగానే ఉన్నాయి. భారత దేశానికి కూడా అమెరికాలా ఒక 'డోగ్' (ప్రభుత్వ సమర్థత విభాగం) అవసరం.

– మోనికా వర్మ, పరిశోధకురాలు

బద్దలైన భావన



ఎక్కడో ఒక చోట డాక్టర్‌పై దాడి జరుగుతోందని ప్రతి రోజూ వార్తలు వస్తూనే ఉన్నాయి. నిజం చెప్పాలంటే– అది ఎక్కడి వార్తో అనిపించేది. దూరప్రాంతాల్లోని వైద్యులకు ఇలాంటివి జరిగాయి, చెన్నై అలా కాదు, ఇది సురక్షితమైనది అనుకున్నాను, లేదా ఊహించుకున్నాను. ఆ భద్రతా భావనేదో బద్దలైంది. (చెన్నైలో ఆంకాలజిస్ట్ మీద దాడి జరిగిన నేపథ్యంలో.)

– కార్తీక్ బాలచంద్రన్, ఎండోక్రినాలజిస్ట్

ముందటి సంగతి?



బుల్డోజర్ వాడకంపై సుప్రీంకోర్టు మార్గదర్శకాల నేపథ్యంలో– ఈ తీర్పునకు ముందు బుల్డోజర్ అన్యాయానికి గురైన కేసులకు సంబంధించి ఒక ప్రజా కమిషన్‌ను ఆశించవచ్చా? చట్టం పేరుతో ఆ మోసపూరితమైన నిబంధనలను అమలుచేసిన అధికారులను శిక్షించలేక పోవచ్చు; కానీ వారు సిగ్గుపడేలా చేయాలి.

– సుహాస్ పల్శీకర్, ప్రొఫెసర్

వద్దనుకున్నవాళ్లు



ట్రంప్ గెలిచినప్పుడు, నా సోషల్ మీడియా పోస్టుల కారణంగా, ఇద్దరు పేషెంట్లే నన్ను వద్దనుకున్నారు. ఇద్దరూ యూదు వామపక్ష మహిళలే; నా ముస్లిం, ఆఫ్రికన్ అమెరికన్ లేదా లాటినో రోగులు కాదు. యూదుకు యూదే శత్రువు.

– ఆఫ్షైన్ ఇమ్రానీ, యూఎస్ కార్డియాలజిస్ట్

ఇన్ బాక్స్

బాలలపై మరింత దృష్టి

జాతికి నిజమైన సంపద బాలలే. బాలల అభివృద్ధి... వారికి లభించే నాణ్యమైన ఆహారం, ఆరోగ్యం, విద్య, వినోదం, కుటుంబ జీవనం వంటి వాటిపై ఆధారపడి ఉంటుంది. అప్పుడే ఉత్తమ పౌర సమాజం నిర్మితమవుతుంది. అత్యధిక బాల జనాభా గల భారతదేశంలో రాజ్యాంగం, చట్టాల ద్వారా బాలలకు ప్రత్యేక రక్షణలు కల్పించారు. అయినప్పటికీ బాలల సర్వతోముఖాభివృద్ధి నేటికీ సవాల్ గానే నిలిచింది. నేటి పోటీ ప్రపంచంలో పిల్లలపై ఒత్తిడి, వేధింపులు, దౌర్జన్యాలు, నిర్లక్ష్యం, అక్రమ రవాణా, వెట్టిచాకిరీ లాంటివి ఆందోళన కలిగిస్తున్నాయి. మరోవైపు సామాజిక మాధ్యమాలు సైతం వారి పాలిట శాపంగా మారాయి. కాబట్టి బాలల శారీరక, మానసిక అభివృద్ధికి మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తున్నప్పటికీ బాలల హక్కుల రక్షణలో ఆశించిన స్థాయిలో పురోగతి లేదు. వారి విద్యాభివృద్ధికి కీలకమైన 'విద్యా హక్కు చట్టా'న్ని తీసుకొచ్చారు. అయినప్పటికీ ఎంతోమంది పిల్లలు విద్యకు దూరంగానే ఉన్నారు. దీంతో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ లాంటివి పెరుగుతున్నాయి. కనీస అవసరాలు తీరని పిల్లల సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతూనే ఉంది. 'ప్రపంచ ఆకలి సూచిక – 2024' ప్రకారం ఇప్పటికీ మనదేశంలో 13.7 శాతం పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. మరోవైపు 5 ఏళ్ళ లోపు పిల్లలు 35.5 శాతం మంది వయస్సుకు తగ్గ ఎత్తు లేకపోగా... 18.7 శాతం మంది ఎత్తుకు తగిన బరువు లేకుండా ఉన్నారు. 'జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–5' ప్రకారం ఇప్పటికీ భారతదేశంలో 23% బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తేలింది.

దేశ జనాభాలో 37 శాతం బాలలున్నారు. వీరందరికీ ఉచిత విద్య, వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలి. పిల్లలను పేదరికం నుండి విముక్తి చేయడానికి కుటుంబ సామాజిక భద్రత కార్యక్రమాలపై దృష్టి పెట్టాలి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించడానికి మంచి నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలి. పిల్లలకు ప్రశ్నించే తత్వం పెంపొందే విద్యనందించాలి. వారి హక్కుల పట్ల ప్రభుత్వం, పౌర సమాజం విస్తృతంగా ప్రచారం చేయాలి. అప్పుడే బాలల సర్వతోముఖాభివృద్ధికి బాటలు పడతాయి.

– సంపతి రమేశ్ మహారాజ్
జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర ఎడ్యుకేషన్ సబ్ కమిటీ సభ్యులు
(నేడు బాలల దినోత్సవం)

వారు వీరూ... వీరు వారూ అయ్యారు!

అభిప్రాయం



రఘునందన్ రావు

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తోన్న కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా కంపెనీ ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం దుద్యాల మండలంలోని ప్రజల కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. భూసేకరణ అనగానే మనకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో నందిగ్రామ్, సింగూర్‌లలో భూసేకరణకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలు గుర్తుకొస్తాయి. ఈ ఉద్యమాలు హింసాత్మకంగా మారి మొత్తం దేశం దృష్టిని ఆకర్షించాయి.

ఇప్పుడు తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలసత్వం, పరిపాలన లోపాలతో ఆయన సొంత నియోజకవర్గంలో లంబాడాలు నివసించే తండాలతో సహా నాలుగు గ్రామాల ప్రజలు గత కొద్ది నెలలుగా భూసేకరణకు వ్యతిరేకంగా గళమెత్తుతున్నారు. ప్రజలు తమ భవిష్యత్తు కోసం, హక్కుల కోసం నిరసన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. దీంతో చివరికి ఆ యా గ్రామాల రైతుల నిరసనలు తీవ్ర రూపం దాల్చాల్సిన పరిస్థితి దాపురించింది. దీనికి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కారు బాధ్యత వహించాల్సిందే.

ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ఫార్మా కంపెనీల ఏర్పాటుకు వ్యతిరేకంగా గొంతెత్తుతున్న ప్రజలను పట్టించుకోని గుడ్డి ప్రభుత్వం తెలంగాణలో ఉండడం మన దురదృష్టం. 2014 నుంచి 2 దఫాలుగా అధికారంలో ఉన్న కేసీఆర్ సర్కారు గతంలో 'మల్లన్న సాగర్'లో సృష్టించిన దమనకాండ మరోసారి గుర్తుకొస్తోంది. మల్లన్న సాగర్ ప్రాజెక్ట్ కోసం భూసేకరణ జరిపే విషయంలో ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహార శైలిలోనే కేసీఆర్–హరీశ్‌రావుల వ్యవహారం కూడా సాగింది. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న రేవంత్ రెడ్డి 48 గంటల పాటు మల్లన్న సాగర్ ముంపు బాధిత గ్రామాల ప్రజలకు సంఘీభావం తెలుపలేదా?

ఇప్పుడు ఆ రెండు పార్టీల హోదాలు మారాయి. ఒకరు ప్రతిపక్షంలో కూర్చుంటే మరొకరు అధికార పీఠంపై కూర్చున్నారు. అంతేకాదు ఆ రెండు పార్టీల విధానాలు కూడా మారాయి. అధికారంలో ఉంటే ఒకలాగా, ప్రతిపక్షంలో ఉంటే మరొక లాగా రెండు పార్టీలూ వ్యవహరిస్తున్నాయి. ఇది ఆ పార్టీల ద్వంద్వ నీతికీ, దమనకాండకూ ప్రత్యక్ష నిదర్శనం. ఇటువంటి పార్టీలు ఇప్పుడు తెలంగాణ ప్రజల కోసమై మాట్లాడే అర్హతను కూడా కోల్పోయాయి.



సింగూరు, నందిగ్రామ్ ఉద్యమాలతో బెంగాల్ రాష్ట్ర ప్రజలు 35 సంవత్సరాల కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాన్ని ఒక్క ఉదుటున మార్చివేసిన సందర్భాన్ని మనం గుర్తు చేసుకోక తప్పదు. అధికారంలోకి వచ్చిన కేవలం 11 నెలల వ్యవధిలోనే ఇంతటి ప్రజా వ్యతిరేకత, ప్రజా ఆగ్రహాలను చవి చూసిన ప్రభుత్వం మరొకటి లేదనడం అతిశయోక్తి కాదేమో. కనీసం తన వ్యవహార శైలిని సరి చేసుకునే ప్రయత్నం కూడా రేవంత్ సర్కారు చేయకపోవడం శోచనీయం.

లగచర్ల రైతుల ఆగ్రహం నిజం. వారిని కలిసి, ఓదార్చి, నచ్చచెప్పి... వారికి కావలసిన విధంగా పరిహారమిచ్చి భూసేకరణ చేసే పనిలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యింది. ఇప్పుడు ఆ రైతుల ఉద్యమాన్ని నిన్నటి వరకు అధికార పీఠాన్ని ఏలిన కొందరు తమ రాజకీయ అవసరాల కోసం వాడుకో చూస్తుండడం తీవ్రంగా ఖండనీయం. అయితే లగచర్లతో పాటు మిగిలిన భూములు కోల్పోతున్న రైతుల ఆవేదన నిజం కాదా? వారిలో ఆక్రోశం లేదా? మరి రాత్రికి రాత్రి రైతులను నేరస్థులుగా చిత్రీకరించి అరెస్ట్ చేసే విధానాన్ని ఏ విధంగా కాంగ్రెస్ సర్కారు సమర్థించుకుంటుంది?. ఖమ్మంలో మిర్చి రైతుల చేతులకు బేడీలు వేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించిన గత సర్కారు అకృత్య దృశ్యాలను కాంగ్రెస్ సర్కారు నిర్వాకం గుర్తు చేస్తోంది.


'పారిశ్రామిక అభివృద్ధి అక్కర్లేదా? పరిశ్రమలు రావాలంటే భూ సేకరణ చేయాలి కదా' అనేటువంటి ప్రశ్నలు ఈ సందర్భంగా ఉత్పన్న మవుతున్నాయి. అభివృద్ధికీ, పరిశ్రమల ఏర్పాటుకూ భారతీయ జనతా పార్టీ ఏ రోజూ వ్యతిరేకంగా లేదు. అయితే నోరులేని పేద బక్క బడుగు బలహీన వర్గాల భూమిని ఇష్టానుసారంగా గుంజుకునేటువంటి విధానాన్ని మాత్రమే బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది.

గత సర్కారు రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో ఫార్మాసిటీ పేరు మీద వేల ఎకరాల భూములు సేకరించింది. అక్కడ ఫార్మా కంపెనీలకు బదులు కొత్తగా కాంగ్రెస్ ముఖ్యమంత్రికి నచ్చిన 'స్కిల్ యూనివర్సిటీ'కీ, ఇతరత్రా వాటికీ ఉపయోగిస్తూ ఉన్నారు. అదే సమయంలో మరొకసారి ఫార్మా కంపెనీల కోసమని భూములు సేకరించ పూనుకోవడం ఎంతవరకు సమంజసం? కొత్తగా సేకరించే భూముల్లో ఏ కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయి అనే అంశాన్ని ప్రజలకు రేవంత్ సర్కారు ఎందుకు చెప్పలేకపోతోంది?

వ్యాసకర్త మెదక్ పార్లమెంట్ సభ్యులు

సామాజిక సమరసతా శిల్పి

జాతి భేద భావాలను అణచి సోదర భావాన్ని నిర్మాణం చేసేందుకు సిక్కుమతాన్ని స్థాపించిన తాత్వికుడు గురునానక్ దేవ్. గురునానక్ జయంతిని ప్రపంచవ్యాప్తంగా ప్రధానంగా సిక్కులు కార్తీక పౌర్ణమి రోజున జరుపుకుంటారు. దీనినే 'ప్రకాశ పర్వం' అని కూడా అంటారు. ఈ రోజున సిక్కులు 'గురు గ్రంథ్ సాహిబ్'ను విధిగా పారాయణం చేస్తారు. గురుగ్రంథ్ సాహిబ్‌ను పూలతో అలంకరించిన రథంలో ఊరేగింపుగా తీసుకెళతారు. సిక్కు సమాజానికి 10 మంది గురువులు ఉన్నప్పటికీ, సిక్కు ప్రజల మొదటి గురువు, సిక్కు మతానికి పునాది వేసిన వ్యక్తి గురునానక్ కాబట్టి ఆయన జయంతికి సిక్కులు అధిక ప్రాధాన్యం ఇస్తారు.



గురునానక్ దేవ్ 1469లో ప్రస్తుతం పాకిస్తాన్ (పంజాబ్)లోని తల్వాండి గ్రామంలో కార్తీక పౌర్ణమి నాడు జన్మించారు. 20వ ఏటనే ఇల్లు వదిలి 30 ఏళ్లు ఆధ్యాత్మిక ప్రయాణం చేశారు. భారత దేశమే కాక, శ్రీలంక, టిబెట్, సౌదీ, అఫ్గానిస్తాన్ వంటి దేశాలు పర్యటించారు.

స్వదేశ – స్వధర్మ రక్షణ చేస్తూ సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని చాటి చెప్పే 'సిక్కుపంథా'ను ప్రారంభించారు. దురాక్రమణదారుల నుండి జాతిని రక్షించేందుకు, మూఢాచారాలను రూపుమాపేందుకు 'గురు గ్రంథ్ సాహెబ్' ద్వారా బోధనలు అందించారు. గురునానక్ బోధనల్లో మంచితనం, స్వచ్ఛత, నిస్వార్థ సేవ, శాంతి సామరస్యాలను పెంపొందింపజేసే వివిధ సూత్రాలు ఉన్నాయి. ఆయన బోధనల ప్రకారం సిక్కులకు మూడు మార్గదర్శక సూత్రాలు ఉన్నాయి. అవి 1. నామ్ జపన (దేవుణ్ణి ఎప్పటికప్పుడు గుర్తు చేసుకోవడం). 2. కిరాత్ కర్ణ (నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండటం). 3. వండ్ చకనా (మీతో ఉన్న దానిని ఇతరులతో పంచుకోవడం).

కులానికి ప్రాధాన్యత ఇవ్వకుండా నేరుగా పరమాత్మతో భక్తి బాంధవ్యాన్ని ఏర్పరచుకోవాలని గురునానక్ తెలిపారు. ఆయన శిష్యులలో లాలో అనే వడ్రంగి, శివనాగుడు అనే రాజు, చతుర్దాసు అనే బ్రాహ్మణుడు, సజ్జన్ అనే ముస్లిం ఉండేవారు. సామాజిక సామరస్యానికి ఆయన మూడు ముఖ్య సూత్రాలు ప్రవేశపెట్టారు. అవే సామూహిక ప్రార్థన, సామూహిక భోజనం, సామూహిక వసతి. ఈ మూడు సమాజంలో ధనిక–పేద, ఎక్కువ–తక్కువ అనే భావనలను దూరం చేస్తాయనటంలో ఏ సందేహం లేదు. అన్ని జీవులలో భగవంతుణ్ణి దర్శించి, అందరం సమానమే అనే ధర్మసూత్రాన్ని అందించిన గురునానక్ బోధనలు శాశ్వత సత్యాలు.

– సాకి । 99511 72002
(రేపు కార్తీక పౌర్ణమి నాడు గురునానక్ జయంతి)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.త్రయోదశి ఉ.7.35 వరకు, తదుపరి చతుర్దశి తె.5.12 వరకు (తెల్లవారితే శుక్రవారం), **నక్షత్రం:** అశ్వని రా.12.03 వరకు తదుపరి భరణి, **వర్జ్యం:** రా.8.22 నుండి 9.50 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.53 నుండి 10.41 వరకు, తదుపరి ప.2.24 నుండి 3.12 వరకు, **అమృతఘడియలు:** సా.5.24 నుండి 6.55 వరకు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.07, **సూర్యాస్తమయం:** 5.21.

అది కేసీఆర్, కేటీఆర్ ప్లాన్

- దాడి చేసిన వారు ఎంతటివారైనా వదిలేది లేదు: కోమటిరెడ్డి



నల్లగొండ: వికారాబాద్ కలెక్టర్‌పై దాడి పథకం ప్రకారమే జరిగిందని, బీఆర్‌ఎస్ నాయకులు బరితెగించి కలెక్టర్‌పై రైతులను దాడికి ప్రేరేపించారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. దాడి చేసిన వారు ఎంతటివారైనా వదిలేది లేదన్నారు. బీఆర్‌ఎస్ నాయకుడు రౌడీషీటర్ సురేష్ అనే వ్యక్తి కలెక్టర్‌ను అక్కడికి పిలిపించి దాడిచేశారని, ఇది కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ కలిసి చేసిన ప్లాన్ అని ఆరోపించారు. బుధవారం నల్లగొండలో తన క్యాంపు కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. 'ఒకవైపు విద్యుత్ కమిషన్ రిపోర్టు ఇస్తుందని కేసీఆర్ దానిమీద హైకోర్టుకు పోయి స్టే తెచ్చుకున్నారు. కాళేశ్వరం అవినీతి విచారణ నివేదిక త్వరలో రాబోతుంది. ఫోన్ ట్యాపింగ్ ఉచ్చు కూడా బిగుస్తుందన్న ఫ్రస్టేషన్‌లో కలెక్టర్‌పై దాడిచేయించి అరెస్టులను డైవర్ట్ చేయాలని చూస్తున్నారు'అని కోమటిరెడ్డి చెప్పారు. భవిష్యత్‌లో అధికారులపై దాడులు జరగకుండా పీడీ యాక్టు పెట్టి, జీవితాంతం జైల్లో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో నల్లగొండ జిల్లాకు చెందిన దొంగలు అధికంగా ఉన్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు అందాయని, ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావు వస్తే ఎంతమంది జైలుకు పోతారో తెలియదన్నారు.

సీఎం అసమర్థత వల్లే ఈ దుస్థితి: డీకే అరుణ



వికారాబాద్: 'రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ అట్టర్ ఫ్లాప్ అయ్యింది.. సీఎం అసమర్థత వల్లే ఈ దుస్థితి తలెత్తింది'అని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. తన సొంత నియోజకవర్గంలో జరిగిన ఘటన విషయాలను నేరుగా తెలుసుకునేందుకు బుధవారం ఆమె లగచర్లకు బయలుదేరగా, మన్నెగూడ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. లగచర్లకు వెళ్తే శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని తెలిపి, మన్నెగూడ పీఎస్‌కు రావాలని కోరారు. ఇందుకు నిరాకరించిన ఎంపీ, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అయితే 144 సెక్షన్ అమలులో ఉన్నందున కలెక్టర్ అనుమతి తీసుకోవాలని సూచించడంతో కలెక్టరేట్‌కు వెళ్లారు. కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి మాట్లాడగా.. ప్రస్తుత పరిస్థితి బాగోలేదని, తర్వాత వెళ్లాలని ఎంపీకి సూచించారు. అనంతరం బయటకు వచ్చిన అరుణ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. తన సొంత నియోజకవర్గంలో జరిగిన ఘటనకు స్థానిక ఎమ్మెల్యే అయిన ముఖ్యమంత్రే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

'దాడిని తీవ్రంగా పరిగణిస్తున్నాం'


సాక్షి, హైదరాబాద్: వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఇతర అధికారులపై జరిగిన దాడిని తీవ్రంగా పరిగణిస్తున్నట్టు తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శశాంక్ గోయల్, జయేశ్ రంజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఈ ఘటనను తీవ్రంగా పరిగణిస్తోందని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలతో అధికారుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరని పేర్కొన్నారు.

'అధికారులపై దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు'

సాక్షి, హైదరాబాద్: ప్రజల అభిప్రాయాలను తెలుసుకుందామని వచ్చిన అధికారుల మీద దాడి చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు గోపి అన్నారు. నిరసనలు, ఆందోళనలు లాంటి అనేక మార్గాలుండగా దాడులకు పూనుకోవడాన్ని ప్రజాస్వామిక వాదులు ఖండించాలని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'లగచర్లలో ఉన్నతాధికారుల మీద దాడి చేసిన వారి అరెస్టులను ఖండిస్తున్నామని, పోలీసుల చర్యలను వ్యతిరేకిస్తున్నామని, లగచర్ల గ్రామస్తుల పోరాటానికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని హామీ ఇస్తున్నా'అని 'ఎక్స్'లో కేటీఆర్ అనడం పూర్తిగా అప్రజాస్వామికమని ఆయన పేర్కొన్నారు. అధికారుల మీద దాడి చేసిన వారు ముమ్మాటికీ చట్ట వ్యతిరేకులని, వారిని అరెస్టు చేయడం పోలీసుల విధి అని అన్నారు.

కేటీఆర్ వ్యాఖ్యలను నిరూపిస్తే రాజీనామా చేస్తా

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పరిగి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని, వాటిని నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తన అల్లుడి కోసం ఫార్మా పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించడం అవాస్తవమన్నారు. కేటీఆర్ తన వ్యాఖ్యలు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, లేదంటే కేటీఆర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఆయన సవాలు విసిరారు.

పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టు.. రిమాండ్

- హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న వికారాబాద్ పోలీసులు
- మార్నింగ్ వాక్ చేస్తుండగా బలవంతంగా కారులోకి ఎక్కించి తరలింపు
- 14 రోజులు రిమాండ్ విధించిన న్యాయమూర్తి
- చర్లపల్లి జైలుకు పట్నం, మరికొందరు నిందితులు

బంజారాహిల్స్ (హైదరాబాద్)/కొడంగల్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని వికారాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్‌లో నివసించే నరేందర్‌రెడ్డి బుధవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో సమీపంలోని లోటస్ పాండ్ వద్దకు ప్రతిరోజూ లాగానే మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. మఫ్టీలో ఉన్న పోలీసులు ఆయన్ను అనుసరిస్తూ వెళ్లి లోటస్ పాండ్ వద్ద వాకింగ్ చేస్తుండగానే బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. ఏ అధికారంతో తనను అరెస్టు చేస్తున్నారని ప్రశ్నిస్తూ నరేందర్‌రెడ్డి వారితో వెళ్లడానికి నిరాకరించగా, నలుగురైదుగురు పోలీసులు ఆయనను బలవంతంగా ఎత్తుకెళ్లి కారులో కూర్చోబెట్టారు. ఆయన బయటకు రావడానికి ప్రయత్నించినా అడ్డుకుని వికారాబాద్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడికి చేరుకునే లోపే తీసుకెళ్లిపోయారు. వాస్తవానికి మంగళవారం రాత్రి నుంచే నరేందర్‌రెడ్డి ఇంటి పరిసరాలపై పోలీసులు నిఘా వేసి రెక్కీ నిర్వహించినట్లు తెలిసింది. కాగా నరేందర్‌రెడ్డితో పాటు మరో నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు వారిని తొలుత కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా, వాదనలు విన్న మేజిస్ట్రేట్ అందరికీ 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు వీరిని చర్లపల్లి జైలుకు తరలించారు.



నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

నరేందర్‌రెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసులు

లగచర్ల కేసులో పట్నం నరేందర్‌రెడ్డిని ఏ- 1గా చేర్చిన పోలీసులు..సెక్షన్లు 61(2), 49, 191 (2), (3), 132, 109, 121 (1), 126 (2), 336(4), 324 (4), 190 బీఎన్‌ఎస్, పీడీపీపీ యాక్టు, 128 బీఎన్‌ఎస్‌ఎస్ కింద కుట్ర కోణం, కుట్ర పన్నాగం, నేర ప్రేరేపిత కేసులు నమోదు చేశారు.

రేవంత్‌రెడ్డి ప్రైవేట్ సైన్యంలా పోలీసులు

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్
- నరేందర్‌రెడ్డిని మఫ్టీలో వచ్చి అరెస్టు చేశారు
- లగచర్లకు సీఎం అన్న తిరుపతిరెడ్డిని ఎలా అనుమతించారు?
- పట్నం కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్న మాజీమంత్రి

బంజారాహిల్స్ (హైదరాబాద్): పోలీసులు సీఎం రేవంత్‌రెడ్డి ప్రైవేట్ సైన్యంలా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు మఫ్టీలో వచ్చి అక్రమంగా అరెస్టు చేసి భయానక వాతావరణం సృష్టించారని మండిపడ్డారు. ఆయనకు ఆరోగ్యం బాలేదని కుటుంబసభ్యులు చెప్తున్నా విన్పించుకోకుండా, కేసు ఏంటో చెప్పకుండా అరెస్టు చేశారని చెప్పారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని నరేందర్‌రెడ్డి ఇంటికి వెళ్లిన కేటీఆర్.. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

దుర్మార్గ, నికృష్ట ప్రభుత్వం

భూమిని కోల్పోతామని బాధపడుతున్న గిరిజన, దళిత, బీసీ రైతులను జైళ్లలో పెట్టి, వాళ్లను చిత్రహింసలు పెడుతున్న నికృష్ట ప్రభుత్వమిదని కేటీఆర్ మండిపడ్డారు. ఒక ఇంట్లో మహిళ ఛాతీపై కాలితో తొక్కి ఆ మహిళ భర్తను అరెస్టు చేశారని, గతంలో ఏ నియంత, అప్రజాస్వామిక పాలకుడు కూడా చేయని దుర్మార్గ వ్యవహారం రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో చేస్తున్నాడని అన్నారు. స్థానిక ఎంపీ అయిన డీకే అరుణ తన సొంత గ్రామానికి వెళ్తానంటే ఆమెను పోలీసులు అడ్డుకున్నారని, కానీ ముఖ్యమంత్రి అన్న తిరుపతిరెడ్డిని మాత్రం 300 మందితో కలిసి లగచర్లకు వెళ్లనిచ్చారని చెప్పారు. ఒక వార్డు మెంబర్ కూడా కానటువంటి తిరుపతిరెడ్డిని కేవలం ముఖ్యమంత్రి అన్న అనే ఒకే ఒక అర్హతతో అక్కడికి వెళ్లనిచ్చారని, ఇదేం న్యాయమని అన్నారు.

లగచర్లలో సీఎం అన్న స్వైర విహారం

తిరుపతిరెడ్డి లగచర్ల గ్రామంలో తన అనుచరులతో స్వైర విహారం చేస్తూ భూములు ఇస్తేనే మీ వాళ్లను విడుదల చేస్తామంటూ ఇంటింటికీ వెళ్లి ప్రజలను బెదిరిస్తున్నాడని కేటీఆర్ చెప్పారు. 144 సెక్షన్ ఉన్నప్పటికీ 300 మందితో తిరుపతిరెడ్డి లగచర్ల వెళ్లేందుకు ఎలా అనుమతించారని డీజీపీని ప్రశ్నించారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అతి చేస్తే ఏపీలో ఏం జరిగిందో అదే జరుగుతుందని అన్నారు. రేవంత్‌రెడ్డి తన అల్లుడి కోసం ఫార్మా కంపెనీ పేరిట పేదల భూములు గుంజుకోవటానికి చేస్తున్న ప్రయత్నంలో భాగస్వాములు కావద్దని సూచించారు. అరెస్టయిన పేద రైతులు అందరికీ బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని చెప్పారు. రైతులను కొట్టిన ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. దీనిపై బీజేపీ సహా అన్ని పార్టీలూ స్పందించాలని కేటీఆర్ అన్నారు.



నరేందర్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న కేటీఆర్

పథకం ప్రకారమే అధికారులపై దాడి

- ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిని పరామర్శించిన మంత్రులు దామోదర, శ్రీధర్‌బాబు

హస్తినాపురం: పథకం ప్రకారమే అధికారులపై దాడులకు పాల్పడ్డారని.. వారిని గుర్తించి చట్ట ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హెచ్చరించారు. లగచర్లలో జరిగిన దాడిలో గాయపడిన కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిని ఆయన నివాసమైన హస్తినాపురంలోని ఆర్‌కేఆర్ ఎన్‌క్లేవ్‌లో బుధవారం మంత్రులు పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలపాలే తప్ప.. దాడులకు పాల్పడటం మంచిది కాదని, హింసకు తావులేదన్నారు. జరిగిన ఘటనలో రాజకీయ కుట్ర ఉందని ప్రభుత్వం భావిస్తుందని వెల్లడించారు. గతంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ, రంగనాయకసాగర్ భూ నిర్వాసితులు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు తెలిపి తమ హక్కులను సాధించుకున్నారని, తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేశామే తప్ప.. ఎక్కడ కూడా దాడులకు పాల్పడలేదని వారు గుర్తు చేశారు. మంత్రుల వెంట చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వెంకట్‌రెడ్డిని పరామర్శిస్తున్న మంత్రులు దామోదర, శ్రీధర్‌బాబు తదితరులు

దాడి బీఆర్‌ఎస్ కుట్రే!

- కలెక్టర్‌పై దాడి వెనక ఎంతటి పెద్దవారున్నా ఉపేక్షించం
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్ తలకిందులుగా తపస్సు చేసినా ప్రభుత్వాన్ని అస్థిరపరచలేరు
- కేసు నుంచి తప్పించుకోవడానికి బీజేపీతో కేటీఆర్ ఒప్పందం
- కేసీఆర్ బాధ్యత కలిగిన ప్రతిపక్ష నాయకుడిగా బయటికొచ్చి మాట్లాడాలి
- విలేకరుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి పొన్నం

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అరాచక శక్తులతో కలిసి కుట్రపూరితంగా దళిత, గిరిజన రైతులను రెచ్చగొట్టి లగచర్లలో జిల్లా కలెక్టర్, ఆర్డీవో స్థాయి అధికారిపై దాడి చేయించిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు తలకిందులుగా తపస్సు చేసినా ఈ ప్రభుత్వాన్ని అస్థిరపర్చలేరని చెప్పారు. లగచర్ల ఘటనలో నిందితుల కాల్ డేటాను సేకరించగా, బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన అభ్యర్థి ఉన్నట్టు తేలిందన్నారు. దీని వెనుక ఎంతటి పెద్దవారున్నా ఉపేక్షించేది లేదని, చట్టప్రకారం కఠినంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఏదైనా సమస్య ఉంటే అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం, వారితో చర్చించడం, న్యాయ స్థానాలకు వెళ్లడం వంటి అవకాశాలుండగా, బీఆర్‌ఎస్ నేతలు రైతులను రెచ్చగొట్టి అధికారులపై దాడులు చేయించడం దుర్మార్గమన్నారు. భట్టి బుధవారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పరిశ్రమలు, నిరుద్యోగులకు ఉద్యోగాలు రావొద్దని, అభివృద్ధి జరగొద్దనే దుర్మార్గమైన ఆలోచనతో ప్రతిపక్షం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. 'గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మల్లన్నసాగర్ కోసం భూసేకరణ చేపట్టినప్పుడు ప్రతిపక్ష పార్టీగా ప్రజాస్వామ్యయుతంగా రైతుల పక్షాన గొంతెత్తాం. అధికారులను కలిశాం. న్యాయస్థానాలకు వెళ్లాం. పత్రికల ద్వారా నిరసనను తెలియజేశాం. కానీ ఏనాడు ఇలా దాడులకు తెగబడలేదు'అని భట్టి అన్నారు. ఇలా దాడులు చేయించడం సబబేనా? అని కేసీఆర్‌ను ప్రశ్నించారు. బాధ్యత కలిగిన ప్రతిపక్ష నాయకుడిగా బయటకు వచ్చి ఈ అంశంపై మాట్లాడాలని కోరారు. అధికారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, కుట్రపూరిత దాడుల పట్ల కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. ఉద్యోగులు అధైర్యపడకుండా ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాలని హితవు పలికారు.



మీడియాతో మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో పొన్నం

అభివృద్ధిని అడ్డుకునే కుట్రలు...

ప్రజాప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవడానికి బీఆర్‌ఎస్ కుట్రలు చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. అత్యంత వెనుకబడిన కొడంగల్ నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటుచేసి పరిశ్రమల అభివృద్ధితో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి.. ఇక్కడికొచ్చే పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్న లక్ష్యంలో భాగంగానే రీజినల్ రింగ్ రోడ్- ఔటర్ రింగ్ రోడ్ మధ్య పరిశ్రమల ఏర్పాటుకు క్లస్టర్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

బీజేపీ పెద్దలతో కేటీఆర్ ఒప్పందం

ఫార్ములా ఈ-రేస్ కేసు నుంచి తప్పించుకోవడానికి కేటీఆర్ ఢిల్లీకి పోయి బీజేపీ పెద్దలను కలిసి ఒప్పందం చేసుకున్నాడని భట్టి ఆరోపించారు. అందుకే మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటేయమని పిలుపునిచ్చి బీజేపీకి ఓటేయాలని కేటీఆర్ పరోక్షంగా చెప్పారని ఆరోపించారు. గవర్నర్‌పై సంపూర్ణమైన విశ్వాసం ఉందని, ఫార్ములా ఈ-రేస్ కేసు విచారణకు ప్రభుత్వానికి సహకరిస్తారని ఆశిస్తున్నామన్నారు. గవర్నర్ తిరస్కరిస్తే చట్టం ప్రకారం ఏం చేయాలో అదేవిధంగా ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నేతలు రైతుల పట్ల మొసలికన్నీరు కారుస్తున్నారని, అధికారులపై దాడిని వారు కనీసం ఖండించలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు.

అస్థిరపరిచే కుట్ర

- కేటీఆర్ ఆదేశాలతో కుట్రకు నేతృత్వం వహించినట్లు నరేందర్‌రెడ్డి చెప్పారు
- అధికారులను అంతమొందించే పథకంలో భాగంగానే దాడి
- ఈ విషయంలో ఎంతవరకైనా వెళ్లండని కేటీఆర్ అన్నారు
- నరేందర్‌రెడ్డి రిమాండ్ రిపోర్టులో పోలీసులు

వికారాబాద్: లగచర్లలో కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులపై జరిగిన దాడి ఘటన పూర్తిగా కుట్రపూరితమని.. ప్రభుత్వాన్ని అస్థిర పరచడంతో పాటు అప్రతిష్టపాలు చేసేందుకే ఈ ప్లాన్ వేశారని పోలీసులు పేర్కొన్నారు. దాడి వెనుక కుట్రదారు, ప్రధాన నిందితుడు (ఏ-1) నరేందర్‌రెడ్డేనని ఆరోపించారు. 'బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆదేశాల మేరకే తాను ఈ కుట్రకు నేతృత్వం వహించానని ఆయన అంగీకరించారు..'అని నరేందర్‌రెడ్డి రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. 'బుధవారం ఉదయం 7 గంటల సమయంలో హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లో నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నాం. ఉదయం 9.30 గంటలకు పరిగి సీఐ కార్యాలయానికి తీసుకొచ్చి విచారించాం. ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకే కుట్ర పన్నినట్లు ఆయన ఒప్పుకున్నారు. అధికారులపై దాడి చేసి, అంతమొందించాలనే పథకంలో భాగంగానే లగచర్ల ఘటన చోటుచేసుకుంది. దాడిలో కీలకంగా వ్యవహరించిన బోగమోని సురేశ్‌తో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తరచూ ఫోన్‌లో మాట్లాడారు. ఈ వివరాలను ఎప్పటికప్పుడు కేటీఆర్‌కు చేరవేశారు. కేటీఆర్ ఆదేశాలతోనే నరేందర్‌రెడ్డి కుట్రకు ప్లాన్ చేశారు. దాడి చేసిన వ్యక్తులకు ఆర్థికంగా, నైతికంగా సహకారం అందించారు. 'మీ భూములు మీకు దక్కాలంటే ప్రభుత్వం, అధికారులపై తిరగబడాలి..'అని ప్రేరేపించారు. ఫార్మా భూ నిర్వాసిత గ్రామాల్లో గొడవలు సృష్టించేందుకు సురేశ్ ద్వారా కొంతమందికి నగదు అందజేశారు. పక్కా ప్రణాళిక ప్రకారమే కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్, కడా అధికారిపై స్థానికులు, ఇతరులు దాడులకు తెగబడేలా స్కెచ్ వేశారు. హకీంపేట్, పోలేపల్లి, రోటిబండ తండా, పులిచర్ల తండా, లగచర్ల రైతులను రెచ్చగొట్టడం, సమాయత్తం చేయడంలో ప్రధాన కుట్రదారుడు, కీలక పాత్రధారి నరేందర్‌రెడ్డి అని ఇతర నిందితులు పేర్కొన్నారు. రైతులకు సురేశ్ బ్రెయిన్ వాష్ చేశాడు. సర్వే చేసేటప్పుడు లేదా బహిరంగ విచారణ జరిపేటప్పుడు ప్రభుత్వ అధికారులను చంపేలా దాడికి పురిగొల్పారు.

రాజకీయ లబ్ధికి కేటీఆర్ యత్నం

ప్రభుత్వ వ్యవస్థను భయభ్రాంతులకు గురి చేయడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందాలని కేటీఆర్ యత్నించారు. ఈ పథకం అమలు కోసం నరేందర్‌రెడ్డి.. సురేశ్‌ను మధ్యవర్తిగా ఎంచుకుని తరచూ ఆయనతో ఫోన్‌లో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ వ్యూహాలను రచించారు. ఏ అవసరం వచ్చినా, ఏ సమస్య ఎదురైనా తమ నుంచి, బీఆర్‌ఎస్ పార్టీ నుంచి అన్నిరకాల సహకారం ఉంటుందని నరేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. వీరి అండదండలతోనే రెచ్చిపోయిన పలువురు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. ఈ విషయాలన్నింటినీ నరేందర్‌రెడ్డి పోలీసుల ముందు అంగీకరించారు. ప్లాన్‌లో భాగంగానే కలెక్టర్‌ను భూ సేకరణ జరిపే రైతుల వద్దకు రావాలని సురేశ్ కోరినట్లు చెప్పారు. సురేశ్ విజ్ఞప్తితోనే కలెక్టర్, ఇతర ప్రభుత్వ అధికారులు ఘటన జరిగిన గ్రామానికి వచ్చినట్లు వెల్లడించారు. దాడి జరిగిన రోజు కూడా నరేందర్‌రెడ్డి పలుమార్లు కేటీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వీరి కాల్ డేటా, సంభాషణలను సేకరించాం. 'ఈ విషయంలో ఎంతవరకైనా వెళ్లండి.. అస్సలు తగ్గొద్దు.. మీకు అండగా నేనున్నా..'అని కేటీఆర్ హామీ ఇచ్చారు. భూ నిర్వాసితుల ముసుగులో సంబంధం లేని వ్యక్తులు ఘటనలో పాల్గొన్నారు. నిందితులంతా ముందుగా సమావేశమై దాడి ఎలా చేయాలో నిర్ణయించుకున్నారు. రాళ్లు, కర్రలతో దాడి చేసి ప్రభుత్వ అధికారులను చంపాలని అనుకున్నారు. నరేందర్‌రెడ్డి రచించిన కుట్రలో పాలు పంచుకున్నట్లు ఏ 21(బి.మహేశ్), ఏ 22 (విశాల్), ఏ 24 (నీరటి సాయిలు), ఏ 27 (నీరటి రమేశ్) అంగీకరించారు. వీరి వాంగ్మూలాన్ని సాక్షుల సమక్షంలో రికార్డు చేశాం..'పోలీసులు తమ రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. అక్టోబర్ 25న రోటిబండ తండాలో కూడా శేఖర్ అనే వ్యక్తిపై దాడికి పాల్పడ్డారని, నిందితులు కొందరు అప్పటి దాడిలో కూడా పాల్గొన్నారని పోలీసులు పేర్కొన్నారు. దీనిపై బొమ్రాస్‌పేట్ పీఎస్‌లో కేసు కూడా నమోదైనట్లు తెలిపారు. ఆ దాడితో కూడా నరేందర్‌రెడ్డికి సంబంధం ఉందని పేర్కొన్నారు.

'సెగ'చర్ల

▶ మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేసిన నేపథ్యంలో.. తాజా పరిణామాలు ఎటువైపు దారితీస్తాయో, ఎప్పుడేం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

అరెస్టు ప్రచారం.. కేటీఆర్ నివాసానికి బీఆర్‌ఎస్ నేతలు

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కుటుంబాన్ని కలిసి ధైర్యం చెప్పిన కేటీఆర్.. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని నందినగర్ నివాసానికి చేరుకున్నారు. అయితే లగచర్ల ఘటనకు సంబంధించి కేటీఆర్‌ను అరెస్టు చేస్తారనే ప్రచారంతో బీఆర్‌ఎస్ పార్టీ అప్రమత్తమైంది. పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కేటీఆర్ నివాసానికి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, కార్తీక్‌రెడ్డి తదితర నేతలు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా అక్కడే వేచి ఉన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు నందినగర్ నివాసానికి చేరుకుని కేటీఆర్‌తో భేటీ అయ్యారు. లగచర్ల ఘటన అనంతరం జరుగుతున్న రాజకీయ పరిణామాలపై చర్చించారు. లగచర్ల ఘటనలో ఎలాంటి కుట్ర లేదని.. బలవంతంగా భూసేకరణ చేస్తుండడంతో కడుపు మండిన రైతులు తిరగబడ్డారే తప్ప మరొకటి కాదని నేతలు పేర్కొంటున్నారు. పోలీసు యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకొని రేవంత్ ప్రభుత్వం అనుసరిస్తున్న అణచివేత విధానాలపై క్షేత్రస్థాయి పోరాటానికి సిద్ధం కావాలని పార్టీ నేతలు నిర్ణయించారు. దీనికి సంబంధించి ఒకటి రెండు రోజుల్లో కార్యాచరణ ప్రకటించాలని భావిస్తున్నారు. కాగా కలెక్టర్, ఇతర అధికారులపై దాడిని పలు ఉద్యోగ సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

మెజార్టీ నిందితులకు భూముల్లేవు

- ముందస్తు కుట్రతోనే కలెక్టర్, అధికారులపై దాడి
- పక్కా సాక్ష్యాధారాలతో నరేందర్‌రెడ్డిని ఏ-1గా చేసి అరెస్టు చేశాం
- మొత్తం 21 మందిని రిమాండ్‌కు తరలించాం
- లగచర్ల ఘటనపై ఐజీ సత్యనారాయణ

వికారాబాద్: తమ వద్ద పక్కా సాక్ష్యాధారాలు ఉన్నందునే లగచర్ల ఘటనలో పట్నం నరేందర్‌రెడ్డిని ఏ-1గా చేర్చి అరెస్టు చేశామని ఐజీ సత్యనారాయణ చెప్పారు. బుధవారం కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో భేటీ అయిన ఆయన, ఆ తర్వాత ఎస్పీ నారాయణతో కలిసి మీడియాతో మాట్లాడారు. లగచర్ల ఘటనకు సంబంధించి నరేందర్‌రెడ్డితో పాటు మరో 20 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. కోర్టులో హాజరుపర్చిన సమయంలో జరిగిన వాదనల సందర్భంగా సాంకేతిక ఆధారాలతో పాటు ఇతర ప్రాథమిక ఆధారాలు సమర్పించామని వెల్లడించారు. కలెక్టర్‌తో పాటు అధికారులపై జరిగిన దాడిపై అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామని చెప్పారు. ముందుగా 57 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని, ప్రశ్నించిన తర్వాత ఘటనతో సంబంధం లేని 40 మందిని విడుదల చేశామని చెప్పారు. దాడిలో పాల్గొన్న వారిలో 42 మందిని గుర్తించామని, అయితే ఇందులో 19 మంది ఏ సంబంధం లేకుండానే దాడిలో పాల్గొన్నారని వెల్లడించారు. మెజార్టీ నిందితులకు అక్కడ భూములు లేవని, ముందస్తు కుట్రలో భాగంగానే ఈ ఘటన జరిగినట్టుగా ఆధారాలున్నాయని ఐజీ చెప్పారు. మిగిలిన నిందితుల కోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నామన్నారు. తొలుత ఏ-1గా సురేశ్ ఉండగా దర్యాప్తు తర్వాత లభ్యమైన సాక్ష్యాధారాలతో నరేందర్‌రెడ్డిని ఏ-1గా చేర్చామని వివరించారు. దాడిలో సురేష్, మహేశ్, దేవదాస్, గోపాల్‌నాయక్, విశల్, రాజు, విజయ్ ప్రధాన భూమిక పోషించారన్నారు. ఈ కేసులో ఇంకా చాలామందిని గుర్తించాల్సి ఉందన్నారు. గతంలో సురేష్‌పై కేసులున్నాయని, రేప్ కేస్ ఉంటే మేనేజ్ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. తదుపరి దర్యాప్తులో అన్ని విషయాలను గుర్తిస్తామని పేర్కొన్నారు.



వికారాబాద్‌లో ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడుతున్న ఐజీ సత్యనారాయణ

రిమాండ్‌కు తరలించింది వీరినే..

ఏ1 పట్నం నరేందర్‌రెడ్డి, ఏ 21 బోగమోని మహేశ్, ఏ 22 బ్యాగరి విశాల్, ఏ 24 నీరటి సాయిలు, ఏ 27 నీరటి రమేశ్ (వీరిని బుధవారం అరెస్టు చేశారు), ఏ 3 ఎ.శివకుమార్, ఏ 11 మైలారం విష్ణువర్ధన్‌రెడ్డి, ఏ 14 హీర్యానాయక్, ఏ 15 పతీవత్ శ్రీను, ఏ 16 పతీవత్ ప్రవీణ్, ఏ 17 పతీవత్ వినోద్, ఏ 18 రాథోడ్ వినోద్, ఏ 19 జర్పాల హీర్యానాయక్, ఏ 20 బాస్యానాయక్, ఏ 23 బ్యా గరి యాదయ్య, ఏ 25 దోరేమోని రమేష్, ఏ 26 కావ లి రాఘవేందర్, ఏ 28 లక్ష్మయ్య, ఏ29 నీలి రవి, ఏ 30 శ్రీశైలం, ఏ 31 బాలకిష్టయ్య (వీరిని మంగళవారం రాత్రి అరెస్టు చేశారు).

బుల్డోజర్ న్యాయం రాజ్యాంగ విరుద్ధం

తలదాచుకోవడానికి ఒక సొంత గూడు సమకూర్చుకోవాలని ప్రతి వ్యక్తి, ప్రతి కుటుంబం కలలు కంటుంది. ఆ కలను సాకారం చేసుకోవడానికి ఎన్నో సంవత్సరాలు కష్టపడతారు. ఇల్లు అంటే ఒక కుటుంబమంతటి ఆశల కలబోత. ఇల్లు జీవితానికి స్థిరత్వాన్ని, భద్రతను ఇస్తుంది. మనుషులకు సంతృప్తి, ఆత్మవిశ్వాసం, గౌరవాన్ని అందిస్తుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21(వ్యక్తిగత స్వేచ్ఛ, జీవితానికి రక్షణ)లో పౌరులు ఒక గూడు కలిగి ఉండే హక్కు కూడా ఒక భాగమే. ఏదైనా కేసులో ఒక వ్యక్తి నిందితుడు లేదా దోషి అయితే.. అతడి కుటుంబం నివసిస్తున్న ఇంటిని ప్రభుత్వ అధికారులు కూల్చివేయవచ్చా? వారికి నిలువ నీడ లేకుండా చేయొచ్చా? ఒక్కరు నేరం చేస్తే అతడి కుటుంబం మొత్తం శిక్ష అనుభవించాలా? అనేది చాలా ముఖ్యమైన విషయం. న్యాయ వ్యవస్థ అధికారాలను కార్యనిర్వాహక వ్యవస్థ తమ చేతుల్లోకి తీసుకోకూడదు. బుల్డోజర్ న్యాయం ఎంతమాత్రం సరైంది కాదు. ఒక వ్యక్తి ఒక కేసులో నిందితుడు లేదా దోషి అయినంత మాత్రాన అతడి ఇంటిని కూల్చివేయడం చట్టబద్ధ పాలనా సూత్రాలకు వ్యతిరేకం. పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం - సుప్రీంకోర్టు





ఒక్కరు చేసే నేరానికి కుటుంబమంతటికీ శిక్షా?

- నిందితుడి నేరం రుజువు కాకముందే అతడిని శిక్షించవద్దు
- మహిళలు, పిల్లలను రాత్రిపూట రోడ్డున పడేయొద్దు
- ముందస్తు షోకాజ్ నోటీసు ఇవ్వకుండా ఏ ఒక్క ఇంటినీ కూల్చడానికి వీల్లేదు.
- నోటీసుపై ప్రతిస్పందించడానికి కనీసం 15 రోజుల సమయం ఇచ్చి తీరాలి
- మార్గదర్శకాలు పాటించకపోతే అధికారులపై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తప్పవు
- సుప్రీంకోర్టు కీలక తీర్పు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో అనధికారికంగా అమలవుతున్న 'బుల్డోజర్ న్యాయం'పై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. బుల్డోజర్ చర్యలు చట్ట విరుద్ధం, రాజ్యాంగ విరుద్ధమని తేల్చిచెప్పింది. నిందితుడు లేదా దోషి ఇంటిని కూల్చే అధికారం ప్రభుత్వ అధికారులకు లేదని, ఒక వ్యక్తి నేరాన్ని నిర్ధారించే బాధ్యత న్యాయవ్యవస్థపైనే ఉందని వెల్లడించింది. ఎవరైనా దుర్వినియోగానికి పాల్పడితే జరిమానా తప్పదని, దుర్మార్గంగా ప్రవర్తించిన వారిని న్యాయస్థానం వదిలిపెట్టబోదని హెచ్చరించింది. ఉత్తరప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో బుల్డోజర్లతో ఇళ్ల కూల్చివేతలను వ్యతిరేకించడంతోపాటు ఇలాంటి కూల్చివేతల విషయంలో మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ధర్మాసనం.. బుల్డోజర్ న్యాయం చట్టపరంగా ఆమోదయోగ్యం కాదని పేర్కొంటూ అక్టోబర్ 1న తమ తీర్పును రిజర్వ్ చేసింది. ఈ కేసుపై బుధవారం జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. 95 పేజీల తీర్పు వెలువరించింది. ఒకరు నేరానికి పాల్పడితే అతడి కుటుంబాన్ని శిక్షించడాన్ని రాజ్యాంగం గానీ, నేర న్యాయ వ్యవస్థ గానీ అనుమతించబోవని వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వంతోపాటు కొన్ని రాష్ట్రాల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. కొన్ని కేసుల్లో స్థానిక మున్సిపల్ చట్టాలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను కూల్చి వేస్తున్నారని, అయితే, కొన్ని సందర్భాల్లో అవి నిందితులవి అయి ఉంటున్నాయని చెప్పారు. ధర్మాసనం స్పందిస్తూ.. తప్పనిసరిగా కూల్చివేయాల్సి వస్తే అదే చివరి మార్గం తప్ప మరో మార్గం లేదని నిరూపించాలని పేర్కొంది. అనివార్యంగా నేలమట్టం చేయాల్సిన ఇళ్ల విషయంలోనూ 'రూల్ ఆఫ్ లా'ను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది.

అది ప్రభుత్వ అధికారుల విధి కాదు

నిందితుడి నేరం రుజువు కాక ముందే అతడిని శిక్షించే విధానాన్ని న్యాయవ్యవస్థ హర్షించదని, రాత్రిపూట మహిళలను, పిల్లలను వీధుల్లో నిలబడేలా చేయడం ఆమోదయోగ్యం కాదని సుప్రీంకోర్టు ధర్మాసనం ఉద్ఘాటించింది. ఏదైనా కేసులో ఒక వ్యక్తిని దోషిగా తేల్చడం, జరిమానా లేదా శిక్ష కింద అతడికి ఇంటిని కూల్చడం ప్రభుత్వ అధికా రుల విధి కాదని వెల్లడించింది. ముందస్తుగా షోకాజ్ నోటీసు ఇవ్వకుండా ఏ ఒక్క ఇంటినీ కూల్చడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. నోటీసుపై ప్రతిస్పందించడానికి కనీసం 15 రోజుల సమయం ఇవ్వాలని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఇవి దేశం మొత్తానికి వర్తిస్తాయని పేర్కొంది. అయితే.. రహదారులు, నదీ తీరాల్లోని నిర్మాణాలు, అక్రమ భవనాలు లేదా నిర్మాణాలపై తీసుకునే చర్యలకు ఈ మార్గదర్శకాలు వర్తించబోవని సుప్రీంకోర్టు ధర్మాసనం వివరించింది.

సుప్రీం కోర్టు మార్గదర్శకాలు

- ముందస్తుగా నోటీసు ఇవ్వకుండా ఇళ్ల కూల్చివేతలు ప్రారంభించకూడదు. అధికారులు నోటీసు ఇచ్చాక 15 రోజుల్లోగా లేదా స్థానిక మున్సిపల్ చట్టాలు నిర్దేశించిన సమయంలోగా స్పందించాల్సి ఉంటుంది. నోటీసు అందుకున్న వ్యక్తి వివరణ ఇవ్వాలి.
- ఇంటి సొంతదారు/అందులో ఉంటున్న వ్యక్తికి రిజిస్టర్డ్ పోస్టు ద్వారా నోటీసు పంపించాలి. అదనంగా నోటీసు కాపీని ఇంటి బయట స్పష్టంగా కనిపించేలా అతికించాలి. భవనాన్ని ఎందుకు కూలుస్తున్నారో ఆ నోటీసులో వివరించాలి. కూల్చివేత చర్యను నిరోధించడానికి ఏం చేయవచ్చో కూడా అదే నోటీసులో చెప్పాలి.
- నోటీసు జారీ చేయడానికి, రిజిస్టర్డ్ పోస్టులో పంపడానికి, ప్రతిస్పందనను స్వీకరించడానికి, షోకాజ్ నోటీసుల వివరాలు, ఇతర ఉత్తర్వుల కోసం పురపాలక సంఘాలు, మున్సిపల్ కార్పొరేషన్లు, స్థానిక సంస్థలు మూడు నెలల్లోగా ఒక డిజిటల్ పోర్టల్ సిద్ధం చేసుకోవాలి.
- ప్రజల వినతులు తెలుసుకోవడానికి, తుది ఉత్తర్వులు జారీ చేయడానికి ఒక అధికార వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
- అనధికారిక కట్టడాన్ని తొలగించడానికి లేదా పూర్తిగా కూల్చివేయడానికి 15 రోజుల సమయం ఇవ్వాలి.
- ఇళ్ల కూల్చివేత వీడియోను చిత్రీకరించాలి. వీడియో రికార్డ్‌ను భద్రపర్చాలి.
- సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అధికారులు తప్పనిసరిగా పాటించాలి. లేకపోతే కోర్టు ధిక్కరణ కింద విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుంది. దోషిగా తేలితే జరిమానా లేదా చట్ట ప్రకారం శిక్ష తప్పదు.
- కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి ఇంటిని కూల్చివేసినట్లు తేలితే సంబంధిత అధికారులు అందుకు బాధ్యత వహించాలి. ఆ ఇంటిని వారి సొంత ఖర్చులతోనే మళ్లీ నిర్మించాల్సి ఉంటుంది. అదనంగా డ్యామేజీ ఖర్చులు చెల్లించాలి.
- ఏదైనా ఆస్తిపై బుల్డోజర్ చర్య తీసుకునే ముందు, వ్యక్తిగతంగా విచారించడానికి ఆ ఆస్తి యజమానికి అవకాశం కల్పించాలి. అంతేకాదు.. ఉత్తర్వులపై అధికారులు మౌఖిక సమాచారం ఇవ్వాలి.
- బుల్డోజర్ చర్యపై నిబంధనలు పాటిస్తున్నారా? లేదా? అనేది జిల్లా మేజిస్ట్రేట్(డీఎం) చూడాలి. నిబంధనలు పాటించకుండా ఇళ్లు, భవనాలను కూల్చివేసే అధికారులపై చర్యలు తీసుకోవాలి.
- చట్టం ప్రకారం పౌరులందరినీ సమానంగా చూడాలి. ఇంటిని కూల్చడమనేది ప్రాథమిక హక్కుకు విరుద్ధం. ఒక నిర్మాణాన్ని కూల్చివేయాలంటే నిందితుడి నేపథ్యాన్ని, అతని సామాజికవర్గాన్ని పట్టించుకోవద్దు.
- సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను తెలియజేస్తూ జిల్లా మేజిస్ట్రేట్లు, స్థానిక అధికారులకు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు సర్క్యులర్లు జారీ చేయాలి.

ప్రాంతీయ భాషల్లో వైద్య విద్య

రాబోయే ఐదేళ్లలో మరో 75 వేల ఎంబీబీఎస్ సీట్లు

ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి	బిహార్‌లోని దర్భంగాలో ఎయిమ్స్‌కు శంకుస్థాపన	జన ఔషధి కేంద్రాలకు శ్రీకారం

దర్భంగా: దేశంలో వైద్యుల సంఖ్యను మరింత పెంచడమే ధ్యేయంగా హిందీతోపాటు పలు ప్రాంతీయ భాషల్లో వైద్య విద్యను త్వరలో అదుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. దేశవ్యాప్తంగా రాబోయే ఐదేళ్లలో మరో 75 వేల ఎంబీబీఎస్ సీట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 24కుపైగా ఎయిమ్స్‌లు సేవలందిస్తున్నాయని, 1.5 లక్షల ఆరోగ్య మందిరాలతో పేదలకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు ఆయుష్మాన్ భారత్ పథకంతో 4 కోట్ల మందికిపైగా ప్రజలు లబ్ధి పొందారని వెల్లడించారు. బుధవారం బిహార్‌లోని దర్భంగాలో ఎయిమ్స్ నిర్మాణానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. రూ.12,100 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. జన ఔషధి కేంద్రాలను సైతం ప్రారంభించారు. దర్భంగా ఎయిమ్స్‌తో ఈ ప్రాంత ప్రజలతోపాటు పశ్చిమ బెంగాల్, నేపాల్ ప్రజలు కూడా ప్రయోజనం పొందుతారని, వారికి ఆధునిక వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు. ఉత్తర బిహార్‌లో అధికంగా మాట్లాడే మైథిలీ భాషలో రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చామని, పాలీ భాషకు ప్రాచీన భాష హోదా కల్పించామని గుర్తుచేశారు.

నితీశ్‌ను ఎంత పొగిడినా తక్కువే

బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై ప్రధాని మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. గతంలో జంగిల్‌రాజ్‌గా అపకీర్తి పొందిన బిహార్‌ను నితీశ్ అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. నితీశ్ 'లోకప్రియ ముఖ్యమంత్రి' అని అభివర్ణించారు. జంగిల్‌రాజ్ హయాం నుంచి బిహార్‌ను బయటకు తీసుకొచ్చిన నితీశ్‌ను ఎంత పొగిడినా తక్కువేనని వ్యాఖ్యానించారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వంలో బిహార్ వేగంగా ప్రగతి సాధిస్తోందని, అన్ని రంగాల్లో దూసుకెళ్తోందని హర్షం వ్యక్తం చేశారు.



పాదాభివందనం చేసేందుకు నితీశ్ యత్నం

దర్భంగా సభలో ప్రధాని మోదీ కాళ్లు మొక్కేందుకు బిహార్ సీఎం నితీశ్ కుమార్ ప్రయత్నించారు. తన పాదాలను తాకడానికి చేతులు జోడించి కిందికి వంగిన నితీశ్‌ను మోదీ వెంటనే వారించారు. ఆయనతో ఆప్యాయంగా కరచాలనం చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మోదీకి పాదాభివందనం చేయడానికి నితీశ్ ప్రయత్నించడం ఈ ఏడాది ఇది మూడోసారి. జూన్‌లో పార్లమెంట్ సెంట్రల్ హాల్లో మోదీకి పాదాభివందనం చేయడానికి నితీశ్ ప్రయత్నించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అలాగే ఏప్రిల్‌లో లోక్‌సభ ఎన్నికల ప్రచార సభలోనూ మోదీ కాళ్లను నితీశ్ మొక్కారు. ఇదిలా ఉండగా, దర్భంగా సభలో బీజేపీ కార్యకర్తలు ప్రధాని మోదీ మెడలో పూలమాల వేస్తున్న సమయంలో తనకు సమీపంలో ఉన్న నితీశ్‌ను మోదీ దగ్గరకు తీసుకున్నారు. ఈ దృశ్యం అందరినీ ఆకర్షించింది. నితీశ్ నేతృత్వంలోని జేడీ(యూ) మద్దతుతో కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం మనుగడ సాగిస్తున్న సంగతి తెలిసిందే. అధికార ఎన్డీయేలో రెండో అతిపెద్ద పార్టీ జేడీ(యూ) కావడం గమనార్హం.



పీట్ హెగ్సెత్



క్రిస్టీ నోయెమ్



జాన్ రాట్‌క్లిఫ్

రక్షణ మంత్రిగా హెగ్సెత్

- సీఐఏ డైరెక్టర్‌గా రాట్‌క్లిఫ్
- ట్రంప్ అనూహ్య నిర్ణయాలు
- హోమ్‌లాండ్ సెక్యూరిటీ చీఫ్‌గా క్రిస్టీ

వాషింగ్టన్: అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం పలు అనూహ్య నిర్ణయాలు తీసుకున్నారు. ఫాక్స్ న్యూస్ చానల్ హోస్ట్, మాజీ సైనికాధికారి పీట్ హెగ్సెత్‌ను రక్షణ మంత్రిగా, కీలకమైన సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ డైరెక్టర్‌గా జాన్ రాట్‌క్లిఫ్‌ను ఎంపిక చేశారు. సౌత్ డకోటా గవర్నర్ క్రిస్టీ నోయెమ్‌ను హోమ్‌లాండ్ సెక్యూరిటీ విభాగం చీఫ్‌గా, అర్కన్సాస్ మాజీ గవర్నర్ మైక్ హకబీ (69)ని ఇజ్రాయెల్‌లో అమెరికా రాయబారిగా నియమించాలని నిర్ణయించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి స్టీవెన్ విట్కాఫ్‌ను పశ్చిమాసియాకు తన ప్రత్యేక దూతగా నియమించారు. డొనాల్డ్ రమ్స్‌ఫెల్డ్ తర్వాత అతి పిన్న వయస్కుడైన రక్షణ మంత్రిగా 44 ఏళ్ల హెగ్సెత్ రికార్డు సృష్టించనున్నారు. ఆయన జీవితమంతా సైనికుల కోసం, దేశం కోసం యోధుడిగా గడిపారంటూ ట్రంప్ ప్రశంసించారు. ఇక క్రిస్టీది సరిహద్దు భద్రతపై ఏమాత్రం రాజీ పడని తత్వమంటూ కొనియాడారు. హెగ్సెత్ 2003లో సైన్యంలో చేరారు. ఇరాక్, ఆఫ్గానిస్తాన్లలో పని చేశారు. 2016 నుంచి ఫాక్స్ న్యూస్ వీకెండ్ మార్నింగ్ టాక్ షో నిర్వహిస్తున్నారు. 'ది వార్ ఆఫ్ వారియర్స్'పేరుతో పుస్తకాలు రాశారు.


సీఐఏ డైరెక్టర్‌గా సన్నిహితుడు

కీలకమైన సీఐఏ డైరెక్టర్‌గా ఎంపికైన రాట్‌క్లిఫ్ ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడు. భారత సంతతికి చెందిన కశ్యప్ (కాష్) పటేల్‌కు ఈ పదవి దక్కుతుందని తొలుత ఊహాగానాలు వినిపించాయి. ''2016 ఎన్నికలప్పుడు రష్యా కుట్ర అంటూ సాగిన తప్పుడు ప్రచారం డెమొక్రాట్ల అధ్యక్ష అభ్యర్థి హిల్లరీ క్లింటన్ పనేనని బయట పెట్టడం మొదలుకుని సత్యం కోసం, నిజాయితీ కోసం పోరాడిన యోధుడు జాన్ రాట్‌క్లిఫ్. అధ్యక్షుడు జో బైడెన్ కుమారుడు హంటర్ బైడెన్ ల్యాప్‌టాప్ గురించి 51 మంది ఇంటెలిజెన్స్ అధికారులు అబద్ధాలు చెప్పినా ఆయన మాత్రమే అమెరికన్ ప్రజలకు నిజం చెప్పారు''అంటూ ట్రంప్ ప్రశంసించారు. ట్రంప్ తొలిసారి అధ్యక్షునిగా ఉన్నప్పుడు రాట్‌క్లిఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్‌గా పనిచేశారు. 2020లో ఆయన్ను అమెరికా అత్యున్నత గూఢచారిగా ధ్రువీకరించారు.

ప్రభుత్వ యంత్రాంగ ప్రక్షాళనకో శాఖ

సారథులుగా మస్క్, వివేక్

- కీలక బాధ్యతలు అప్పగించిన ట్రంప్
- వారి సారథ్యంలో బ్యూరోక్రసీ ప్రక్షాళన



ఎలాన్ మస్క్



వివేక్ రామస్వామి

వాషింగ్టన్: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్, భారత మూలాలున్న రిపబ్లికన్ నేత వివేక్ రామస్వామిలకు కీలక బాధ్యతలు అప్పగించాలని అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించారు. యంత్రాంగంలో సమూల ప్రక్షాళన కోసం వారి సారథ్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ (డోజ్) ఏర్పాటును ప్రకటించారు. ''ప్రభుత్వ యంత్రాంగ ప్రక్షాళన, మితిమీరిన నిబంధనలకు కోత, అనవసర ఖర్చు తగ్గింపు, ఫెడరల్ ఏజెన్సీల పునర్ వ్యవస్థీకరణ తదితరాలను ఈ శాఖ పర్యవేక్షించనుంది. ఇందుకు 'ది గ్రేట్' మస్క్, 'అమెరికా దేశభక్తుడు' వివేక్ నాయకత్వం వహిస్తారు. తమ అమూల్య సలహాలతో సేవ్ అమెరికా ఉద్యమానికి మార్గదర్శనం చేస్తారు'' అని పేర్కొన్నారు. అమెరికా స్వాతంత్ర్య ప్రకటనకు 250 ఏళ్లు నిండే 2026 జూలై 4వ తేదీకల్లా ప్రక్షాళన ప్రక్రియను పూర్తి చేయాలని మస్క్, వివేక్‌లకు డెడ్‌లైన్ విధించారు. 'డోజ్'ను ఈ కాలపు మన్‌హాటన్ ప్రాజెక్టుగా ట్రంప్ అభివర్ణించారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో అణుబాంబుల నిర్మాణానికి చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టు 'మన్‌హాటన్'. డోజ్ పనితీరుపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఇది ఫెడరల్ అడ్వైజరీ కమిటీ చట్టం పరిధిలోకి రావచ్చంటున్నారు. ప్రభుత్వోద్యోగులు ఆస్తులు తదితర వివరాలను ఎప్పటికప్పుడు వెల్లడించాల్సి ఉంటుంది. అయితే మస్క్, రామస్వామి ప్రభుత్వంలో చేరకుండా బయటి నుంచే పనిచేస్తారని ట్రంప్ చెప్పడంతో ఆ నిబంధన వారికి వర్తించే అవకాశం లేదు. గతంలోనూ అమెరికా అధ్యక్షులు ఇలా ప్రత్యేక కమిషన్లు ఏర్పాటు చేశారు. రిపబ్లికన్ పార్టీకే చెందిన రొనాల్డ్ రీగన్ 1981–1989 మధ్య 'గ్రేస్ కమిషన్'ను స్థాపించారు.

ఇక ప్రకంపనలే: మస్క్

డోజ్ ఏర్పాటును మస్క్ స్వాగతించారు. ఇది ప్రభుత్వ వ్యవస్థలో ప్రకంపనలు సృష్టిస్తుందన్నారు. ప్రభుత్వ వృథా ఖర్చులను తగ్గించడంలో ప్రజలందరూ భాగస్వాములు కావచ్చన్నారు. పారదర్శకత కోసం డోజ్ చర్యలన్నింటినీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. ప్రజా ధనం వృథాను అరికట్టేందుకు లీడర్ బోర్డ్ ఏర్పాటవుతుందని తెలిపారు.

ట్రంప్ టీమ్‌లో తొలి భారత అమెరికన్

ట్రంప్ 2.0 టీమ్‌లో చోటు సంపాదించిన తొలి భారత అమెరికన్‌గా 39 ఏళ్ల వివేక్ నిలిచారు. డోజ్ ఏర్పాటుపై ఆయన హర్షం వెలిబుచ్చారు. ప్రభుత్వ యంత్రాంగ ప్రక్షాళనలో సున్నితంగా వ్యవహరించబోమని స్పష్టం చేశారు. కాలం చెల్లిన పలు ఫెడరల్ ఏజెన్సీలను తొలగించాలంటూ ప్రచార పర్వంలో రిపబ్లికన్లు తరచూ ఉపయోగించిన నినాదం 'షట్ ఇట్ డౌన్'ను ఈ సందర్భంగా రీ పోస్ట్ చేశారు. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కు వివేక్ పూర్తిస్థాయిలో మద్దతివ్వడం తెలిసిందే. ట్రంప్ విజయానంతరం పలు టీవీ షోల్లో మాట్లాడుతూ ఆయన్ను ఆకాశానికెత్తారు. వివేక్ 1985 ఆగస్టు 9న ఒహాయోలోని సిన్సినాటిలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు తమిళనాడుకు చెందిన కేరళ బ్రాహ్మణులు. ఆయన ఒహాయోలోని రోమన్ కాథలిక్ స్కూల్లో చదివారు. హార్వర్డ్ నుంచి జీవశాస్త్రంలో పట్టా పొందారు. యేల్ లా స్కూల్ నుంచి పట్టభద్రుడయ్యారు. హెడ్జ్ ఫండ్ ఇన్వెస్టర్‌గా చేశారు. యేల్‌లో డిగ్రీ పూర్తవకముందే మిలియన్ల కొద్దీ సంపాదించానని చెప్పుకుంటారు. 2014లో ఓ బయోటెక్ కంపెనీని స్థాపించారు. 2023 నాటికే వివేక్ సంపద ఏకంగా 63 కోట్ల డాలర్లని ఫోర్బ్స్ అంచనా వేసింది.

18 ఏళ్లకే అద్భుత ప్రసంగం

హైస్కూల్ విద్యార్థిగా సెయింట్ 18 ఏళ్ల వయసులో జేవియర్ స్కూల్లో వివేక్ చేసిన ప్రసంగ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ప్రసంగం పొడవునా ఆయన కనబరిచిన ఆత్మవిశ్వాసం, భవిష్యత్తును గురించి మాట్లాడిన తీరు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

జార్ఖండ్ తొలి దశలో 66.18% పోలింగ్

రాంచీ: జార్ఖండ్ శాసనసభ ఎన్నికల తొలి దశ పోలింగ్ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. రాత్రి 10 గంటలకు అందిన సమాచారం మేరకు 66.18 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ సమయం ముగిసేలోపు క్యూ వరుసల్లో నిల్చున్న వారిని సైతం ఓటేసేందుకు అనుమతిస్తున్నారు. దాంతో పోలింగ్ శాతం ఇంకా పెరిగే వీలుందని ఎన్నికల అధికారులు చెప్పారు. తొలి దఫాలో 43 నియోజకవర్గాలకుగాను 1.37 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ, నక్సల్ ప్రభావిత ఘటన లు లేకుండా పోలింగ్ సాఫీగా సాగింది. వెస్ట్ సింఘ్‌భమ్ జిల్లాలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రాకుండా ఒక చోట మావోయిస్టులు చేసిన ప్రయ త్నాన్ని అధికారులు, పోలీసులు అడ్డుకు న్నారు. లోహార్‌దాబా జిల్లాలో అత్యధికంగా 73.21 శాతం పోలింగ్ నమోదైంది. కాంగ్రెస్ మాజీ మహిళా ఎంపీ గీతా కోరా, రాజ్యసభ సభ్యురాలు మహువా మాజీసహా 73 మంది మహిళలు తొలి దశ పోరులో నిలిచారు. మొదటి దశలో మొత్తం 683 మంది అభ్యర్థులు పోటీపడ్డారు.

బరిలో ముఖ్య నాయకులు

సెరాయకేలాలో బీజేపీ నేత, మాజీ ముఖ్యమంత్రి చంపయి సోరెన్, ఘాట్‌శిలా నుంచి ఆయన కుమారు డు బాబూలాల్, జగన్నాథ్‌పూర్ నుంచి మాజీ సీఎం మధుకోడా భార్య గీత పాట్లా స్థానంలో మాజీ సీఎం అర్జున్‌ముండా భార్య మీరా తదితరులు ఈ విడతలో పోటీ పడ్డారు.

31 అసెంబ్లీ ఉప ఎన్నికలూ ప్రశాంతం

బుధవారం 10 రాష్ట్రాల్లోని 31 అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. రాజస్థాన్‌లోని ఏడు, పశ్చిమబెంగాల్‌లోని ఆరు, అస్సాంలోని ఐదు, బిహార్‌లోని నాలు గు, కర్ణాటకలోని మూడు, మధ్యప్రదేశ్‌లోని రెండు, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, కేరళ, మేఘాలయలోని చెరో ఒక స్థానంలో ఉపఎన్నిక జరిగింది. మేఘాలయలోని వెస్ట్‌గారో హిల్స్ జిల్లాలోని ఏకైక గంబేగ్రి స్థానంలో ఏకంగా 90.84 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ వాద్రా తొలిసారిగా పోటీచేస్తున్న వయనాడ్ లోక్‌సభ స్థానంలో 65 శాతం పోలింగ్ నమోదైంది.

సమంతాకు 'బుకర్'



లండన్: బ్రిటిష్ రచయిత్రి సమంతా హార్వేను 2024 బుకర్ ప్రైజ్ వరించింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోని ఆరుగురు వ్యోమగాముల జీవితంలో ఒక్క రోజు జరిగే ఘటనలను వర్ణిస్తూ ఆమె రాసిన సైన్స్ ఫిక్షన్ నవల 'ఆర్బిటాల్'కు ఈ అవార్డు వచ్చింది. ఈ అవార్డు సాధించిన తొలి అంతరిక్ష నేపథ్య రచనగా ఆర్బిటాల్ నిలిచింది. ఈ నవలను 2023 నవంబర్‌లో ప్రచురించారు. బ్రిటన్లో అత్యధికంగా అమ్ముడుపోయిన నవలగా నిలిచింది. అంతరిక్షపు అందాలను అద్భుతంగా కళ్లముందు ఉంచిందని జడ్జింగ్ ప్యానెల్ ఛైర్మన్ ఎడ్మండ్ కొనియాడారు.



బుధవారం వైట్‌హౌస్‌లో అధ్యక్షుడు జో బైడెన్‌తో భేటీ అయిన కాబోయే అధ్యక్షుడు ట్రంప్

బైడెన్‌తో ట్రంప్ భేటీ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో నెగ్గిన అనంతరం డొనాల్డ్ ట్రంప్ బుధవారం తొలిసారి వాషింగ్టన్‌లో అడుగు పెట్టారు. అధ్యక్షుడు జో బైడెన్ ఆహ్వానం మేరకు వైట్‌హౌస్‌లో ఆయనతో భేటీ అయ్యారు. ఓవల్ ఆఫీస్‌లో జరిగిన ఈ సమావేశంలో అధికార మార్పిడికి సంబంధించిన ప్రాథమిక అంశాలు వారి నడుమ చర్చకు వచ్చినట్టు సమాచారం. తన భార్య, ఫస్ట్ లేడీ జిల్ బైడెన్‌తో కలిసి 'వెల్‌కం బ్యాక్' అంటూ ట్రంప్‌ను బైడెన్ స్వాగతించారు. అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించినందుకు అభినందించారు. అనంతరం నేతలిద్దరూ కరచాలనం చేసుకున్నారు. ''రాజకీయాలు కఠినమైన వ్యవహారం. అధికార మార్పిడి ప్రక్రియ సజావుగా సాగుతున్నందుకు ఆనందంగా ఉంది'' అని ట్రంప్ పేర్కొన్నారు.

మెలానియా డుమ్మా

బైడెన్‌తో ట్రంప్ భేటీకి ఆయన భార్య మెలానియా డుమ్మా కొట్టారు. ట్రంప్‌పై నమోదైన రహస్య పత్రాల కేసులో బైడెన్ వ్యవహరించిన తీరుపై ఆగ్రహంతోనే ఈ సమావేశానికి ఆమె దూరంగా ఉన్నట్టు చెబుతున్నారు. ఆ కేసు దర్యాప్తులో భాగంగా ఫ్లోరిడా నివాసంలో సోదాల సందర్భంగా మెలానియా వార్డ్ రోబ్‌ను అధికారులు అణువణువూ శోధించారు. ఆ క్రమంలో ఆమె లోదుస్తులున్న షెల్ఫ్‌ను కూడా వదిలి పెట్టలేదు. మెలానియా భేటీకి రాకున్నా ఆమెకు జిల్ అభినందన లేఖ రాశారు. దాన్ని ట్రంప్‌కు స్వయంగా అందజేశారు.

కారుణ్య నియామకాలు హక్కు కాదు: సుప్రీం

న్యూఢిల్లీ: కారుణ్య నియామకాలకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వోద్యోగం పొందేందుకు వాటిని హక్కుగా భావించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ ఎహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీలతో కూడిన ధర్మాసనం మంగళవారం తీర్పు ఈ మేరకు వెలువరించింది. ''విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వోద్యోగి మరణంతో ఆయన కుటుంబం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవద్దన్నది మాత్రమే కారుణ్య నియామకాల వెనక ఉన్న సదుద్దేశం. అందుకోసం సదరు నియామకానికి అవసరమైన నియమ నిబంధనలను విధిగా సంతృప్తి పరచాల్సి ఉంటుంది'' అని పేర్కొంది.

సాక్షి హైదరాబాద్

గురువారం । 14 । నవంబర్ । 2024



బాల్యమొక స్ఫూర్తి
పిల్లల చిన్నప్పటి అభిరుచులే వారి లక్ష్యాలుగా మార్పు చెందుతాయి. పసిప్రాయంలోనే విభిన్న రంగాల్లో స్ఫూర్తిగా నిలుస్తున్నారు.
- సిటీప్లస్‌లో



భాగ్యనగరం మురిసేలా..
'లోక్ మంథన్' వేడుకలకు సర్వం సిద్ధమైంది. భారతీయ జానపద సాంస్కృతిక ఉత్సవాలను ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించనున్నారు.
- సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/22.0

వాతావరణం
నగరంలో గురువారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.







శోభాయమానంగా నగర కీర్తన

సిక్కుల మత గురువు గురునానక్ 555వ జయంతిని పురస్కరించుకొని బుధవారం గురుద్వార గురుసింగ్ సాహెబ్ ఆధ్వర్యంలో నగర కీర్తన శోభాయాత్రను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గౌలిగూడ సెంట్రల్ గురుద్వార నుంచి ప్రారంభమై గౌలిగూడ చమన్, శంకర్ షేర్ హోటల్, అఫ్జల్‌గంజ్, సిద్దిఅంబర్ బజార్, ఎంజాయ్ మార్కెట్ చౌరస్తా, జాంబాగ్ మీదుగా గౌలిగూడ గురుద్వారకు చేరుకుంది. సిక్కు యువకుల కత్తి విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.
- అఫ్జల్‌గంజ్

జన ఔషధి కేంద్రాలు ఎంతో ప్రయోజనకరం

డీఆర్‌ఎం లోకేష్ విష్ణోయ్



జన ఔషధి కేంద్రం ప్రారంభోత్సవంలో డీఆర్‌ఎం లోకేష్ విష్ణోయ్ తదితరులు

కాచిగూడ: భారతీయ జన ఔషధి కేంద్రం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) లోకేష్ విష్ణోయ్ అన్నారు. ప్రజలకు అతి తక్కువ ధరలకు ఔషధాలు అందించడమే లక్ష్యంగా ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రాన్ని బుధవారం కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద ప్రారంభమైంది. ప్రధాని నరేంద్రమోదీ బిహార్‌లోని దర్భంగా నుంచి వర్చువల్‌గా జన ఔషధి కేంద్రాన్ని కాచిగూడలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో లోకేష్ విష్ణోయ్ మాట్లాడుతూ.. అతి తక్కువ ధరలతో ఔషధాలను ప్రజలు కొనుగోలు చేయవచ్చన్నారు. ఈ కేంద్రంలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. రైలు ప్రయాణికులతో పాటు స్థానిక ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత, జన ఔషధి కేంద్రం ప్రతినిధి గోపు రమణారెడ్డి, రైల్వే అధికారులు రెహ్మాన్, ఏకే సింగ్, డాక్టర్ శారద, ఖాన్, రైల్వే సీపీఆర్‌ఓ ఎ.శ్రీధర్, కాచిగూడ రైల్వే స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ పాల్గొన్నారు.

వేసవికి ముందే గిర్రున మీటర్

రికార్డు స్థాయికి చేరిన విద్యుత్ వినియోగం
- గత నవంబర్ రెండో వారంతో పోలిస్తే ప్రస్తుతం 23.4 శాతం అధికం



గ్రేటర్‌లో 2023.. 2024 నవంబర్‌లో విద్యుత్ వినియోగం ఇలా..

తేదీ	2023 (ఎంయూ)	2024 (ఎంయూ)
05	54.02	64.17
06	59.18	64.15
07	59.76	63.29
08	58.82	64.07
09	59.17	62.25
10	58.97	57.44
11	55.54	61.20
12	51.11	62.85

సాక్షి, సిటీబ్యూరో: ఉత్తరాది నుంచి వీస్తున్న చలి గాలులతో సిటిజన్లు ఒకవైపు గజగజ వణికిపోతుంటే.. మరోవైపు రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌తో ఇంజినీర్లు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వేసవికి ముందే విద్యుత్ డిమాండ్ పీక్ స్టేజీలో నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. గత ఏడాది నవంబర్ రెండో వారంతో పోలిస్తే.. ప్రస్తుత విద్యుత్ డిమాండ్ 23.4 శాతం పెరిగినట్లు అంచనా వేసింది. సాధారణంగా చలిగాలులకు ఇంట్లో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం తక్కువగా ఉంటుంది. గ్రేటర్‌లో సీజన్‌తో సంబంధం



లేకుండా రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం జరుగుతుండటం గమనార్హం. కొత్త కనెక్షన్లకు తోడు ఇంట్లోకి కొత్తగా వచ్చి చేరుతున్న ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం రెట్టింపునకు ప్రధాన కారణమని డిస్కం భావిస్తోంది. వేసవికి ముందే వినియోగం రెట్టింపు కావడంతో.. ఇంజినీర్లు అప్రమత్తమయ్యారు. ఏప్రిల్/మే నాటికి రోజు సగటు వినియోగం వంద మిలియన్ యూనిట్ల (ఎంయూ)కు చేరుకునే అవకాశం లేకపోలేదని అంచనా వేస్తోంది. ఈమేరకు ఇప్పటి నుంచి సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, లైన్ల పునరుద్ధరణ, చెట్ల కొమ్మల తొలగింపు, అధిక ఒత్తిడికి లోనవుతున్న ఫీడర్లు, డీటీఆర్‌ల గుర్తించి, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం వంటి పనులు చేపడుతున్నట్లు సీఎండీ ముషారఫ్ ఫారూఖీ స్పష్టం చేశారు.

బల్దియా బడ్జెట్ ఎప్పుడో?

ఈ నెల 10 వరకే స్టాండింగ్ కమిటీ ముందు పెట్టాలి
- ఇప్పటికీ పూర్తికాని కొత్త బడ్జెట్ ప్రతిపాదనలు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ చట్టం, నిబంధనల మేరకు ప్రతి ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూపకల్పన, ఆమోదం వంటి వాటి కోసం ఓ కేలండర్ ఉంది. నిబంధనల మేరకు నిర్ణీత వ్యవధుల్లోగా ఆ పనులు పూర్తి కావాలి. వచ్చే సంవత్సరం (2025–26) బడ్జెట్ ముసాయిదాను ఈ నెల 10వ తేదీన స్టాండింగ్ కమిటీ ముందుంచాలి. కానీ.. ఇప్పటి వరకు ఆ ప్రక్రియ పూర్తికాలేదు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఝార్ఖండ్ ఎన్నికల విధుల్లో భాగంగా అక్కడికి వెళ్లడం ఇందుకు ఓ కారణమైనప్పటికీ, ఇప్పటిదాకా కొన్ని విభాగాలు, జోన్ల నుంచి బడ్జెట్‌కు సంబంధించిన ప్రతిపాదనలే ప్రధాన కార్యాలయంలోని ఆర్థిక విభాగానికి అందకపోవడంతో కొందరికి మెమోలు కూడా జారీ చేసినట్లు తెలుస్తోంది.

నిబంధనల మేరకు..

జీహెచ్‌ఎంసీ నిబంధనల మేరకు వచ్చే ఆర్థిక సంవత్సర బడ్జెట్ రూపకల్పనకు ఈ ఏడాది సెప్టెంబర్ 25 నుంచే పనులు ప్రారంభం కావాల్సి ఉంది. నిర్ణీత వ్యవధుల్లో ఆయా పనులు పూర్తిచేసి ఫిబ్రవరి 20వ తేదీ నాటికి పాలకమండలి ఆమోదం పొందేలా చూడాలి. అనంతరం సమాచారం నిమిత్తం ప్రభుత్వానికి పంపించాలి. ఈ మొత్తం ప్రక్రియ మార్చి నెల ఆరంభం నాటికి పూర్తికావాలి.

వ్యవధిలోగా ఆమోదం ?

వచ్చే ఆర్థిక సంవత్సర బడ్జెట్ ఇంకా స్టాండింగ్ కమిటీ ముందుకు రాకపోయినప్పటికీ, నిర్ణీత వ్యవధిలోగానే పాలకమండలి ఆమోదం పొందేలా అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు చెబుతున్నారు.



బడ్జెట్ కేలండర్ ప్రకారం..

బడ్జెట్ కేలండర్ మేరకు దిగువ పేర్కొన్న తేదీల్లో పనులు జరగాలి. ప్రత్యేక సందర్భాల్లో, తప్పనిసరి పరిస్థితుల్లో ఒకటి రెండు రోజులు అటూ ఇటూ కావచ్చు.

సెప్టెంబర్ 25: బడ్జెట్ రూపకల్పనకు సిద్ధం కావాల్సిందిగా తెలియజేసేందుకు అన్ని విభాగాల అధిపతులతో కమిషనర్ సమావేశం నిర్వహించాలి.
అక్టోబర్ 1: బడ్జెట్ అంచనాలతో ప్రతిపాదనలు పంపించాల్సిందిగా సర్క్యులర్ జారీ చేయాలి.
అక్టోబర్ 10: అన్ని విభాగాలు తమ అవసరాలు, చేయాల్సిన పనులకయ్యే అంచనా వ్యయం వివరాలను నివేదించాలి.
అక్టోబర్ 25: అన్ని విభాగాల నుంచి అందిన అంచనా ప్రతిపాదనల్నింటిని ఒక చోట చేర్చి కమిషనర్ సమీక్షించేందుకు సిద్ధం చేయాలి.
నవంబర్ 10: కమిషనర్ వాటిని సమీక్షించి ఓకే చేశాక స్టాండింగ్ కమిటీ ముందుంచాలి.
డిసెంబర్ 10: స్టాండింగ్ కమిటీ సమీక్షించి, అవసరమైన మార్పులు చేర్పులు చేయాలి.
డిసెంబర్ 15: రూపొందించిన బడ్జెట్ ప్రతులు కార్పొరేటర్లకు అందాలి.
ఫిబ్రవరి 20: పాలకమండలి ఆమోదం పొందాలి.
మార్చి 1: సమాచార నిమిత్తం ప్రభుత్వానికి అందాలి.

ఇలా జరగాల్సి ఉన్నప్పటికీ, ఇంకా స్టాండింగ్ కమిటీ ముందుకు రాలేదు. కమిషనర్ నగరంలో లేకపోవడంతో ఆయన సమీక్షించేందుకు అవకాశం లేకుండా పోయింది. ఈ వారాంతంలో వచ్చి.. బడ్జెట్ ప్రతిపాదనల్ని సమీక్షించి, మళ్లీ వెళ్లనున్నట్లు జీహెచ్‌ఎంసీ వర్గాలు భావిస్తున్నాయి. దాదాపు నెలరోజులుగా అసలు స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరగలేదు.

ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ

ముగ్గురిని కోర్టులో హాజరుపర్చిన పోలీసులు

సిటీ, కోర్టులు: ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ బుధవారం నాంపల్లి కోర్టులో జరిగింది. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ప్రణీత్‌రావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావును పోలీసులు ఎస్కార్ట్ సహాయంతో కోర్టులో హాజరుపర్చారు. మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై బయటికి వచ్చిన భుజంగరావు కోర్టుకు హాజరుకాకపోవడంతో ఆయన తరపు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణ చేపట్టిన 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు వైద్య పరీక్షల కోసం మధ్యంతర బెయిల్‌పై బయటికి వచ్చిన భుజంగరావు బెయిల్‌ను రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. నేటి (గురువారం) సాయంత్రం 4 గంటలలోపు కోర్టు ముందు లొంగిపోవాలని ఆదేశించింది. అనంతరం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ముగ్గురు ప్రణీత్‌రావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావు రిమాండ్‌ను ఈ నెల 27కు పొడిగించింది. తదుపరి విచారణను అదే రోజుకు వాయిదా వేస్తున్నట్లు కోర్టు తెలిపింది.

కేబీఆర్ పార్కును సందర్శించిన జూనియర్ సివిల్ జడ్జీలు



బంజారాహిల్స్: సికింద్రాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 36 మంది జూనియర్ సివిల్ జడ్జీలు బుధవారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా పార్కు అధికారులు అటవీ ప్రాంతాన్ని కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలను వారికి వివరించారు. కేబీఆర్ పార్కు ఫారెస్ట్‌లో ఎన్ని రకాల మొక్కలున్నాయి? ఎన్ని రకాల పక్షులున్నాయి? అనే వివరాలను జడ్జీలకు చెప్పారు. పార్కు లోపల ఉన్న నిజాం ప్యాలెస్‌ను వారికి చూపించారు. పార్కు లోపల ఉన్న మొక్కలను గుర్తించేలా ఏర్పాటు చేసిన విధానాలను వివరించారు. రాష్ట్రంలో తొలిసారిగా రాక్ ప్లాంటేషన్‌ను ఏ విధంగా ఏర్పాటు చేశారు? అది ఏ విధంగా విజయవంతమైంది? అనే వివరాలను జూనియర్ జడ్జిలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేబీఆర్ పార్కు రేంజ్ అధికారి లక్ష్మీపతిరావు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

మనీమ్యూల్స్‌లో ఐటీ ప్రొఫెషనల్స్!



విషయం తెలిసీ సైబర్ నేరగాళ్లకు సహకారం
- కమీషన్ల కోసం బ్యాంకు ఖాతాలు అందజేత
- పది మంది ఏజెంట్లు సహా 48 మంది అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రం సైబర్ నేరగాళ్లు, వారికి సహకరించే వారికి అడ్డాగా మారకూడదనే లక్ష్యంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. వివిధ కేసుల విశ్లేషణతో లభించిన డేటా ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సైబర్ నేరగాళ్ల అనుచరులపై దృష్టి పెట్టింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి 24 గంటల పాటు నిర్విరామంగా పని చేసిన అధికారులు 10 మంది ఏజెంట్లు సహా 48 మందిని అరెస్టు చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ బుధవారం ప్రకటించారు. మనీమ్యూల్స్‌గా పిలిచే వీరిలో ఐటీ ప్రొఫెషనల్స్, లెక్చరర్ సైతం ఉన్నట్లు వివరించారు. ఈ వ్యవహారంలో సూత్రధారులను గుర్తించడానికి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చిక్కకుండా ఉండేందుకు..

వివిధ రకాల సైబర్ నేరాలు చేసే సూత్రధారులు పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు అనేక జాగ్రత్తలు తీసుకుంటారు. ఇందులో భాగంగా ఎట్టి పరిస్థితుల్లోనూ బాధితుల నుంచి నగదు డిపాజిట్/బదిలీ చేయించుకోవడానికి సొంత బ్యాంకు ఖాతాలు వాడరు. కమీషన్లు తీసుకుంటూ తమ బ్యాంకు ఖాతాలను అందించడానికి, వీరికి అవసరమైన ఖాతాలు సరఫరా చేయడానికి కొందరు ఖాతాదారులు, దళారులు ఉంటారు. వీళ్లు దేశ వ్యాప్తంగా అన్ని నగరాలు, పట్టణాల్లోనూ పని చేస్తూ టెలిగ్రామ్, వాట్సాప్ గ్రూపులు ద్వారా సంప్రదింపులు జరుపుతూ ఉంటారు. దళారులు తమ చుట్టుపక్కల ఉన్న వారికి కమీషన్లు ఆశ చూపి వారి ఆధార్, పాన్ కార్డులు, ఫొటోలు తీసుకుంటారు. వీటి ఆధారంగా కంపెనీల పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి కరెంట్ ఖాతాలు తెరుస్తారు. ఈ ఖాతాల నెట్ బ్యాంకింగ్ వివరాలను తమ పైన ఉన్న వారికి లేదా సూత్రధారులకు అందిస్తుంటారు. ఇలా బ్యాంకు ఖాతాలు అందించే వారిని సాంకేతికంగా మనీమ్యూల్స్ అని పిలుస్తుంటారు.

డేటా విశ్లేషించిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో..

ఇటీవల కాలంలో రాష్ట్రంతో పాటు దేశ వ్యాప్తంగా నమోదైన వివిధ రకాలైన సైబర్ నేరాలను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో విశ్లేషించింది. ఈ నేపథ్యంలోనే మనీమ్యూల్స్‌లో కొందరు రాష్ట్రంలోనూ ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. దీంతో ఏసీపీలు కేవీ సూర్యప్రకాష్, ఎస్‌వీ హరికృష్ణ, కేవీఎం ప్రసాద్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసింది. మంగళవారం నుంచి హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండలతో పాటు పలు జిల్లాల్లో వరుస దాడులు చేశారు. మొత్తం 38 మంది మనీమ్యూల్స్ చిక్కారు. వీరి నుంచి గుర్తింపుకార్డులు తీసుకుని, బ్యాంకు ఖాతాలు తెరిచిన పది మంది ఏజెంట్లను గుర్తించి పట్టుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న శిఖా గోయల్

బ్యాంకుల పాత్రపై దర్యాప్తు..

ఈ మనీమ్యూల్స్, ఏజెంట్లు ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న ఇతర ఏజెంట్ల కింద పని చేస్తున్నారు. రూ.8,16,44,785కు సంబంధించిన నేరాల్లో నిందితులుగా ఉన్నారు. పెద్ద నెట్‌వర్క్‌తో వ్యవస్థీకృతంగా ఈ దందా నడుస్తోంది. ఈ బ్యాంకు ఖాతాలు కేవలం రెండుమూడు నెలలు మాత్రమే వినియోగిస్తారు. అందులోనూ రెండుమూడు రోజుల్లోనే భారీ లావాదేవీలు జరుగుతాయి. ఈ వ్యవహారంలో బ్యాంకుల పాత్రనూ ఆరా తీస్తున్నాం. అరెస్టు అయిన 48 మందిలో 22 మంది డిగ్రీ, ఆపైన చదువుకున్న వాళ్లే ఉన్నారు. క్యాబ్ డ్రైవర్ల నుంచి ఐటీ ప్రొఫెషనల్స్ వరకు చిక్కారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 13 వేల మందికి రూ.138 కోట్లు రిఫండ్ చేసి దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్నాం.
- శిఖాగోయల్, డైరెక్టర్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో

కల్తీ ఆహార పదార్థాల నియంత్రణకు నిరంతర తనిఖీలు

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

లక్డీకాపూల్: నిరంతర తనిఖీలతో కల్తీ ఆహార పదార్థాలను నియంత్రించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఫుడ్ సేఫ్టీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నగరంలో ఆహార భద్రత మెరుగుపడటానికి తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన విధానాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఫుడ్ సేఫ్టీ, అనుబంధ శాఖల అధికారులు మరింత సమర్థంగా, అంకిత భావంతో విధులు నిర్వర్తించాలన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, స్ట్రీట్ వెండర్స్, ఫుట్‌పాత్‌లపై విక్రయించే తిను బండారాలలో కల్తీ లేకుండా ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేయాలని సూచించారు. నాణ్యత లేని ఆహార పదార్థాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ పంకజ, సీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి డా.అబ్దుల్ వకీల్, ఫుడ్ సేఫ్టీ అధికారి మూర్తి రాజు తదితరులు ల్గొన్నారు.

పరిశుభ్రత పాటించని హోటళ్లను మూసేస్తాం

నగర ప్రజలకు నాణ్యత ప్రమాణాలతో కూడిన ఆహార పదార్థాలు అందించేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం మేయర్ లక్డీకాపూల్‌లోని మొఘల్ రెస్టారెంట్, మాసబ్ ట్యాంక్‌లోని డైన్ హిల్ హోటల్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హోటళ్ల కిచెన్‌లలో పరిశుభ్రత పాటించడం లేదని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. హోటల్ యజమానులు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని కోరారు. తనిఖీల్లో వండిన ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లో ఉంచి మళ్లీ వేడి చేసి వినియోగదారులకు అందిస్తున్నట్లు గుర్తించామన్నారు. తరచుగా తనిఖీలు కొనసాగించి, పరిశుభ్రత పాటించని హోటళ్లను మూసివేసేందుకు వెనకాడబోమని మేయర్ హెచ్చరించారు. ట్రేడ్ లైసెన్స్, ఫుడ్ లైసెన్స్ లేకుండా నడుపుతున్న హోటళ్లపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.



హోటల్‌లోని ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న నగర మేయర్ విజయలక్ష్మి

4,44,275 ఇళ్ల సర్వే పూర్తి

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) ఆధ్వర్యంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. బుధవారం 1,45,901 ఇళ్లను సర్వే చేశారు. ఇప్పటి వరకు మొత్తం 4,44,275 ఇళ్ల సర్వే పూర్తయింది. కొన్ని సర్కిళ్లలో ఎన్యూమరేటర్లు రోజుకు 10 నుంచి 15 ఇళ్లను సర్వే చేస్తుండగా, మరికొన్ని సర్కిళ్లలో 8 నుంచి 10 ఇళ్లను మాత్రమే సర్వే చేస్తున్నారు. సర్వేలో తప్పులు లేకుండా, సమర్థ నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రత్యేక మానిటరింగ్ అధికారులను నియమించింది.

ఎల్అండ్‌టీ మెట్రోకు ప్రతిష్టాత్మక పురస్కారాలు



సాక్షి, సిటీబ్యూరో: బ్రాండ్ కమ్యూనికేషన్స్ రంగంలో ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్‌కు పలు పురస్కారాలు లభించాయి. సంస్థ అంతర్గతంగా, వెలుపల అత్యుత్తమ కమ్యూనికేషన్ సామర్థ్యాలను ప్రదర్శించినందుకు ఈ అవార్డులు అందుకుంది. ట్రావెల్ రంగంలో ఉత్తమ కంటెంట్‌తో మార్కెటింగ్ క్యాంపెయిన్ నిర్వహించినందుకు గాను ప్రతిష్టాత్మక బ్రాండ్ స్టోరీజ్ అవార్డు లభించింది. అసాధారణ బ్రాండ్ కంటెంట్ మార్కెటింగ్ వ్యూహంతో ప్రయాణికులపై విశేషమైన ప్రభావాన్ని చూపినట్లు గుర్తించారు. ఢిల్లీలో పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీఆర్‌సీఐ) నిర్వహించిన 18వ గ్లోబల్ కమ్యూనికేషన్స్ కాంక్లేవ్‌లో ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఉత్తమ ఇంటర్నల్ కమ్యూనికేషన్స్ క్యాంపెయిన్, ఉత్తమ సోషల్ మీడియా క్యాంపెయిన్ పురస్కారాలను కూడా అందుకున్నారు. 73 కంపెనీలు ఈ అవార్డుల కోసం పోటీపడ్డాయి. ఈ సందర్భంగా ఎల్అండ్‌టీ మెట్రోరైల్ ఎండీ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ ప్రతిష్టాత్మక పురస్కారాలను దక్కించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తమ సిబ్బంది కఠోర పరిశ్రమకు, అంకితభావానికి ఇవి నిదర్శనాలని పేర్కొన్నారు. తమ కృషిని గుర్తించినందుకు ఆయా సంస్థలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు స్ట్రాటజిక్ ఆఫీసర్ మురళీవరదరాజన్ చెప్పారు.

ఇండియా గేమ్ డెవలపర్స్ కాన్ఫరెన్స్ ప్రారంభం

మాదాపూర్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ ఏర్పాటు ద్వారా వీడియో గేమింగ్ సెక్టార్‌లో స్కిల్ డెవలప్‌మెంట్‌కు అవకాశాలు ఏర్పడ్డాయని కేంద్ర ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న 16వ ఇండియా గేమ్ డెవలపర్స్ కాన్ఫరెన్స్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలతో పోటీపడుతూ ఇండియాలో గేమింగ్ రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రసార భారతికి సంబంధించిన ఓటీటీని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గేమింగ్, యానిమేషన్‌లలో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ రీజినల్ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

డాక్టర్ శ్రీపూజకు జేసీఐ 'ఎక్సలెన్స్' అవార్డు



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ప్రముఖ క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ శ్రీపూజ సిద్ధంశెట్టికి జేసీఐ అలుమ్ని క్లబ్ వారి ప్రతిష్టాత్మక ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె అవార్డు అందుకున్నారు. విద్య, ఆరోగ్యం, క్లినికల్ సైకాలజీలో ఎంతో పేరొందిన డాక్టర్ శ్రీపూజ సిద్ధం శెట్టి సేవలను గుర్తించి జేసీఐ అలుమ్ని క్లబ్ వారు ప్రతిష్టాత్మక ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేశారు. జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ అలుమ్ని క్లబ్ (జేసీఐ) వారు సమాజాభివృద్ధికి, మానవాళికి మేలు చేసే వారికి ఈ అవార్డును అందిస్తుంటారు. జోన్ బోర్డు మెంబర్‌గా ఆమె చేసిన విశేష కృషికి ఈ గుర్తింపు లభించింది. మైండ్ వెల్‌నెస్, విద్య, మానసిక ఆరోగ్యం విషయంలో పరిశోధనలు చేసి ఆయా రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీపూజ శ్రీకారం చుట్టారు. ఇక ఇటీవల జరిగిన జేసీఐ అవార్డు ప్రదానోత్సవంలో జేసీఐ జాతీయ ప్రతినిధులు సునీల్‌కుమార్ రుమల్లా, వినయ్ మెహతా, మనోజ్ ఠాకర్, జోన్ చైర్మన్ జీవీఎస్. రాజు తదితరులు పాల్గొని ఆమెకు అవార్డు అందజేశారు.

నివాస ప్రాంతాల్లోకి కొండచిలువ.. చంపిన యువకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ హనుమాన్‌నగర్‌లోని నివాస ప్రాంతంలోకి మంగళవారం రాత్రి ఓ కొండచిలువ చొరబడింది. స్థానిక యువకులు గమనించి రాళ్లతో కొట్టి దానిని చంపారు. తరుచూ విషసర్పాలు నివాస ప్రాంతాల్లోకి వస్తున్నాయని, తాము తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నామని స్థానికులు తెలిపారు. గత నెల రోజుల్లో మూడు విషసర్పాలు నివాస ప్రాంతాల్లోకి వచ్చాయని స్థానికులు వాపోయారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

మణికొండ: నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్‌లో మంగళవారం డిగ్రీ చదువుతున్న ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..సిరిసిల్లకు చెందిన సాంబశివరావు కూతురు శ్రీజ(18)ను డిగ్రీ చదివేందుకు ఈ సంవత్సరం కోఠి ఉమెన్స్ కళాశాలలో చేరింది. అక్కడే హాస్టల్‌లో ఉంటుంది. అయితే ఆమెకు హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేదని చెప్పినా వినిపించుకోకపోవడంతో మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. ఈమేరకు మంగళవారం ఉదయం శ్రీజ హైదర్‌షాకోట్‌లో ఉండే తన అక్క అక్షయ ఇంటికి వచ్చింది. అక్క, బావ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కావటంతో వారు ఉద్యోగానికి వెళ్లగా శ్రీజ ఒక్కతే ఇంట్లో ఉంది. రాత్రికి వచ్చి చూడగా ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసింది. అక్క అక్షయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నార్సింగి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ చోరీ కోసమే న్యాయవాదిపై దాడి

- ఇది ఇద్దరు మైనర్ల పనిగా గుర్తింపు..అరెస్టు
- 12 గంటల్లోపే రెండు కేసులను ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీలు చంద్రశేఖర్, సంజయ్‌కుమార్ తదితరులు

అబిడ్స్: మార్నింగ్ వాక్ చేస్తున్న న్యాయవాదిపై కత్తితో దాడి చేసి సెల్‌ఫోన్ లాక్కెళ్లిన కేసులో ఇద్దరు మైనర్లను అబిడ్స్, ఖైరతాబాద్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. ఈ మేరకు బుధవారం అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో అబిడ్స్ డివిజన్ ఏసీపీ ఎ.చంద్రశేఖర్, సైఫాబాద్ డివిజన్ ఏసీపీ సంజయ్ కుమార్‌లు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో గన్‌ఫౌండ్రీ ప్రాంతంలోని ప్రసాద్ అపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న వాచ్‌మెన్‌ను యాక్టివాపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు కత్తితో బెదిరించి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను తీసుకొని పరారయ్యారు. పరారైన ఇద్దరు నిందితులు ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐమ్యాక్స్ థియేటర్ ఎదురుగా ఉన్న రోడ్డుపై మార్నింగ్ వాక్ చేస్తున్న న్యాయవాది కళ్యాణ్ వంశీని అడ్డుకొని.. జేబులో ఉన్న సెల్‌ఫోన్ లాక్కునే ప్రయత్నం చేశారు. ఆయన అడ్డుకోవడంతో ఇద్దరిలో ఒక బాలుడు కత్తితీసి న్యాయవాది తొడ, చేతిపై పొడిచి సెల్‌ఫోన్ లాక్కుకొని పరారయ్యారు.

12 గంటల వ్యవధిలోనే...

ఈ రెండు కేసుల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం సెంట్రల్‌జోన్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, అబిడ్స్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహా, ఖైరతాబాద్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సైదులుతో కూడిన ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం 12 గంటల వ్యవధిలోనే ఈ రెండు కేసులను ఛేదించినట్లు ఏసీపీలు చంద్రశేఖర్, సంజయ్‌కుమార్‌లు తెలిపారు. ముందుగా సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి రాంనగర్ చేపల మార్కెట్ వద్ద ఒక మైనర్ నిందితుడిని పట్టుకోగా..అతడి నుంచి గన్‌ఫౌండ్రీలోని వాచ్‌మెన్ వద్ద లాక్కున్న సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. ఆ మైనర్ నిందితుడిని విచారించగా అతడి సమాచారంతో చాంద్రాయణగుట్ట బండ్లగూడలో మరో మైనర్ నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద కత్తితో పాటు న్యాయవాది వద్ద లాక్కున్న సెల్‌ఫోన్‌ను స్వాధీనపరచుకున్నారు.

ఉద్దేశపూర్వక దాడి కాదు..

ఐమ్యాక్స్ థియేటర్ వద్ద న్యాయవాది కళ్యాణ్ వంశీపై జరిగిన దాడి ఉద్దేశపూర్వకమైనది కాదని ఏసీపీలు తెలిపారు. సెల్‌ఫోన్లు దొంగిలించేందుకే వారు దాడి చేశారని వివరించారు. ఈ దాడికి వేరే ఉద్దేశాలు ఆపాదించవద్దని విజ్ఞప్తి చేశారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు నిందితులు న్యాయవాది వద్ద సెల్‌ఫోన్ లాక్కోవడానికి వచ్చినట్లే సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యిందన్నారు. అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాల్లో నమోదైన రికార్డులను మీడియాకు ప్రదర్శించారు. 12 గంటల్లోపే రెండు కేసులను ఛేదించిన క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌లు నర్సింహ, సైదులును సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, అడిషనల్ డీసీపీ ఆనంద్‌లు ప్రశంసించి వారికి రివార్డులు అందజేస్తామని వెల్లడించారు. న్యాయవాదిపై కత్తితో దాడి చేసిన ఇద్దరు నిందితులు మైనర్లు కావడంతో వారిని ఉస్మానియా ఆసుపత్రికి వైద్య పరీక్షల కోసం తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌గోపాల్‌రెడ్డి, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ, ఖైరతాబాద్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఇద్దరు సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్యంపై విద్యార్థులకు అవగాహన



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ధ్వని, వాయు కాలుష్యం, వాటి ప్రభావాలపై విద్యార్థులతో బుధవారం ఇంటరాక్టివ్ సెషన్స్ నిర్వహించింది. ఈసందర్భంగా డీఆర్ఎస్ స్కూల్ మూడో తరగతి విద్యార్థులకు పర్యావరణ బాధ్యత, సుస్థిర జీవన ఆవశ్యకతల గురించి పీసీబీ సీనియర్ సోషల్ సైంటిస్ ప్రసన్న కుమార్ వివరించారు. ఫిల్టర్ పేపర్‌లపై కాలుష్య స్థాయిని ప్రదర్శించడంతో పాటు సున్నితమైన, నివాస, వాణిజ్య, పారిశ్రామిక ప్రాంతాలలో వివిధ స్థాయిల వాయు కాలుష్యాన్ని, శబ్దం స్థాయిలను కొలత ద్వారా వివరించారు. వాయు, నీరు, ధ్వని కాలుష్యాలతో కలిగే ఒత్తిడి, ఆరోగ్య సమస్యలు, వన్యప్రాణులపై దాని ప్రభావాలను విద్యార్థులకు తెలియజేశారు. వ్యర్థాలను తగ్గించడం, రీసైక్లింగ్ చేయడం, నీరు, విద్యుత్ ఆదా చేయడం, చెట్లను నాటడం వంటి కాలుష్యాన్ని తగ్గించే మార్గాల గురించి వివరించారు.

ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందాలి

సాక్షి, సిటీబ్యూరో: ప్రజలందరికి మెరుగైన వైద్య సేవలందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వైద్య ఆరోగ్య రంగానికి చెందిన పలువురు నిపుణులు అభిప్రాయపడ్డారు. క్రై, ఎఫోర్ట్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు 'అందరికీ ఆరోగ్యం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ మారుమూల ఆదివాసీ ప్రాంతాలలో వైద్య సేవలు అందక అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని, పేదవారికి వైద్య సేవలు అందించడానికి మరింత కృషి చేయాలని ఆయన సూచించారు. డాక్టర్ వీణ శత్రుఘ్న మాట్లాడుతూ పౌష్టికాహార లోపం వల్ల ఎదుగుదలలో మించిన లోపాలు వస్తున్నాయని, మారుమూల ప్రాంతాల్లో ప్రత్యేకంగా కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ ఎల్. కందారే మాట్లాడుతూ తాగునీరు, పౌష్టికాహారం లోపం వల్ల నల్గొండ వంటి ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో పిల్లల ఎముకల ఎదుగుదల సరిగ్గా ఉండడం లేదన్నారు. కిడ్నీ, న్యూరోలాజికల్ సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. అమూల్య నిధి మాట్లాడుతూ ఉత్తమ వైద్య సేవలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు అందించాల్సిన అవసరం ఉందని సూచించారు. క్రై ప్రతినిధి పీటర్ సునీల్ బాబు మాట్లాడుతూ అందరికీ వైద్య సేవలు అందించేందుకు ధనిక, పేద వర్గాల మధ్య తారతమ్యాలను తొలగించుకోవాలని అభిప్రాయపడ్డారు. తెలుగు రాష్ట్రాల క్రై ప్రతినిధి బడుగు చెన్నయ్య అధ్యక్షత వహించిన కార్యక్రమంలో లక్ష్మణరావు, కె.రమేష్, హిమబిందు, డాక్టర్ కంచుకట్ల సుభాష్, కొమ్ము తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

హాష్ ఆయిల్ రవాణాదారుల అరెస్టు

నాగోలు: నగరంలో అక్రమంగా హాష్ ఆయిల్‌ను రవాణా చేస్తూ విక్రయిస్తున్న ముగ్గుర్ని ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఏపీలోని విశాఖపట్నం జిల్లా జి.మాడుగుల మండలం, పెద్దబయలు, రావుపల్లికి చెందిన వంతల నారాయణ అలియాస్ సిద్దు, వంతల రమేష్, కిల్లో అర్జున్, శివ, కిషోర్, ఎల్‌బీనగర్‌కు చెందిన రాహుల్‌లు కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వీరిలో నారాయణ, రమేష్, అర్జున్‌లు విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతం నుంచి ప్లాస్టిక్ కవర్‌లో హాష్ ఆయిల్ తీసుకుని వచ్చి ఎల్‌బీనగర్ రాహుల్ ద్వారా విక్రయించడానికి ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం రాత్రి ఎల్‌బీనగర్ ఫ్లైఓవర్ వద్ద ముగ్గురు నిందితులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 1104 గ్రాముల హాష్ ఆయిల్, 3 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

మాన్గార్ బస్తీలో డామినేషన్ రైడ్



మాన్గార్ బస్తీలో పోలీసుల కవాతు

నాంపల్లి: హబీబ్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని మాన్గార్ బస్తీలో పోలీసులు ఏరియా డామినేషన్ రైడ్‌ను చేపట్టారు. సుమారు రెండు ప్లటూన్ల బలగాలతో మొహరించి కవాతును ప్రదర్శించారు. మాన్గార్ బస్తీలో గంజాయి విక్రేతలను అరెస్టు చేసేందుకు మంగళవారం రాత్రి నార్కోటిక్ పోలీసులు వెళ్లారు. ముందస్తు ప్రణాళిక లేకుండా గంజాయి విక్రేతలను పట్టుకుంటామంటూ స్థానిక హబీబ్‌నగర్ ఎస్సై శివ కుమార్‌ను తీసుకుని బస్తీలోకి వెళ్లారు. బస్తీలోకి వెళ్లాక అక్కడి మహిళలు బీరు సీసాలతో దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ఎస్సై శివ కుమార్ గాయాలు అయ్యాయి. అతడి మెడలోని గొలుసు మాయమైంది. ఇద్దరు బ్యూరో ఇన్‌స్పెక్టర్లను కూడా చితకబాదారు. ఎస్సై శివకుమార్‌పై దాడికి పాల్పడిన కాంబ్లే దీపక్, కాంబ్లే అరుణ్‌లపై కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు మాన్గార్ బస్తీలో ఏరియా డామినేషన్ రైడ్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అశ్వాక్, ఏసీపీలు విజయ్ శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు పాల్గొన్నారు.

హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్‌గా రవీందర్

సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏ సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.రవీందర్‌కు చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ (మున్సిపల్) ప్రిన్సిపల్ కార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా ఇన్‌చార్జి చీఫ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ పరంజ్యోతికి చీఫ్ జనరల్ మేనేజర్ (టెక్నికల్)గా పదోన్నతి లభించింది.

ముగిసిన అగ్రి స్టార్టప్‌ల సదస్సు



నూతన స్టార్టప్ ఐడియాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నార్మ్‌లో వ్యవసాయ స్టార్టప్‌ల తయారీ కోసం ఏర్పాటు చేసిన జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ఇందులో వ్యవసాయాభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ముఖ్యంగా నూతన స్టార్టప్‌లను ఏ విధంగా తయారు చేయాలి, వారికి ఎలాంటి ప్రోత్సాహం ఇవ్వాలి అనే అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. వినియోగదారులకు పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా వారి డిమాండ్‌కు సరిపడేలా స్టార్టప్‌ల ఆలోచన ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా నార్మ్ డైరెక్టర్ జనరల్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ వ్యవసాయంలో ఉన్న పరిష్కారాలు, వ్యవసాయేతర పరిష్కారాలను ఒకే వేదిక మీదకు తీసుకొచ్చి ఉత్తమ పరిష్కారాలను కనుక్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు.

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 25 ఏళ్లు జైలు

అబిడ్స్: తొమ్మిదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి 25 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమాన విధిస్తూ నాంపల్లిలోని 12వ అదనపు సెషన్స్ జడ్జి టి.అనిత తీర్పు ఇచ్చారు. మంగళ్‌హాట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మల్లేపల్లి, అఫ్జల్‌సాగర్‌కు చెందిన హత్‌గేడ్ సుమిత్ (19) వృత్తి రీత్యా పెళ్లిళ్లు, శుభకార్యాలలో బ్యాండ్ వాయించే పని చేస్తుంటాడు. 2021 సెప్టెంబర్ 15న బాధిత బాలిక తల్లి తనతో భర్త రోజూ గొడవపడుతున్నాడని స్థానిక హబీబ్‌నగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లింది. దీంతో పోలీసులు ఆమెతోపాటు భర్తను కూడా పీఎస్‌కు పిలిపించి ఇద్దరికీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇదే సమయంలో ఇంట్లో తల్లిదండ్రులు కనిపించడం లేదని తొమ్మిదేళ్ల బాలిక బయటకు వచ్చి వెదుకుతుండగా... గమనించిన సుమీత్ ఆ బాలికను తీసుకొని అర్ధరాత్రి సమయంలో మల్లేపల్లి చౌరస్తా సమీపంలోని ఖాళీ ప్రదేశానికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం బాలిక తన తల్లికి విషయం చెప్పడంతో మంగళ్‌హాట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన అప్పటి గోషామహల్ ఏసీపీ నరేందర్‌రెడ్డి, అనంతరం వచ్చిన ఏసీపీ సతీష్‌కుమార్‌లు కేసుకు సంబంధించి కోర్టులో ఛార్జీషీటు వేశారు. ఈ కేసులో బుధవారం నాంపల్లి కోర్టు నిందితుడికి 25 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. ప్రస్తుత గోషామహల్ ఏసీపీ కోట్ల వెంకట్ రెడ్డి, మంగళ్‌హాట్ సీఐ మహేష్‌గౌడ్‌లు ఈ కేసులో నిందితుడికి కఠిన శిక్ష పడేలా అవసరమైన సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించారు.

ఓఆర్ఆర్ పై రోడ్డు ప్రమాదం..మహిళ మృతి



రోషిణి మృతదేహం



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కీసర: కీసర అవుటర్ రింగు రోడ్డుపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా భర్తతో పాటు కూతురుకు తీవ్ర గాయాలయ్యాయి. కీసర సి.ఐ వెంకటయ్య తెల్పిన వివరాల ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం లింగంపల్లికి చెందిన కొలిపలక సుమన్ (32) గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు బ్యాంకులో మార్కెటింగ్ ఏజెంటుగా పనిచేస్తూ ఉప్పల్ భగాయత్‌లో భార్య రోషిణి (23), కూతురు వైష్ణవి(2)తో కలిసి నివసిస్తున్నాడు. రెండు రోజుల క్రితం భార్య, కూతురుతో కలిసి కారులో సొంతూరు వేములవాడకు వెళ్లారు. బుధవారం ఉదయం తిరిగి వస్తూ శామీర్‌పేట్ వద్ద రింగు రోడ్డు ఎక్కి కీసర మీదుగా ఘట్‌కేసర్ వైపు వెళ్తుండగా..ప్రమాదవశాత్తు కీసర సమీపంలో ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో కారు ముందు సీటులో కూర్చున్న రోషిణి తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. కారు నడుపుతున్న సుమన్, కూతురు వైష్ణవికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లారు. గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం మొదట ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుండి మేడిపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా రోషిణి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ కేసును కీసర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

2,380 కిలోల డ్రగ్స్ ధ్వంసం

సాక్షి, సిటీబ్యూరో: రూ.7.17 కోట్ల విలువ చేసే 2,380 కిలోల వివిధ రకాల మాదక ద్రవ్యాలను సైబరాబాద్ పోలీసులు ధ్వంసం చేశారు. డ్రగ్ డిస్పోజల్ కమిటీ రంగారెడ్డి జిల్లాలోని ఏదులపల్లి గ్రామంలోని జీజే మల్టీక్లేవ్ (ఇండియా) ప్రై.లి.కు చెందిన బయో మెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో ఆయా డ్రగ్స్‌ను బుధవారం ధ్వంసం చేశారు. కమిషనరేట్ పరిధిలోని ఐదు జోన్లలో 155 ఎన్‌డీపీఎస్ కేసులలో ఆయా మాదక ద్రవ్యాలను పోలీసులు పట్టుకున్నారు. వీటిల్లో అత్యధికంగా 2,286 కిలోల గంజాయి ఉండగా.. 354 గ్రాముల గంజాయి మొక్కలు, 45.75 కిలోల గంజాయి చాక్లెట్లు, 8 లీటర్ల హాష్ ఆయిల్, 87 గ్రాముల ఎండీఎంఏ, 72 గ్రాముల కొకైన్ తదితర డ్రగ్స్ ఉన్నాయి. ఈ కార్యక్రమంలో డీసీపీ క్రైమ్స్ కె.నర్సింహ, ఏసీపీ సైబర్ క్రైమ్స్ రవీందర్ రెడ్డి, సీసీఆర్బీ ఏసీపీ కళింగ రావు, నార్కోటిక్స్ అదనపు డీసీపీ జి. నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల సమక్షంలో డ్రగ్స్‌ను ధ్వంసం చేస్తున్న దృశ్యం

కొనసాగుతున్న అంబేడ్కర్‌ వర్సిటీ ఉద్యోగుల నిరసనలు



ఆందోళన చేస్తున్న అంబేడ్కర్‌ వర్సిటీ ఉద్యోగులు

బంజారాహిల్స్‌: అంబేడ్కర్‌ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్‌ నెహ్రూ ఆర్కిటెక్చర్‌ అండ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ విశ్వవిద్యాలయానికి కేటాయించాలన్న ప్రభుత్వ ఆలోచనను నిరసిస్తూ అంబేడ్కర్‌ వర్సిటీ కార్యాచరణ సమితి సభ్యులు నిరసనలు కొనసాగుతున్నాయి. బుధవారం విశ్వవిద్యాలయ సైన్స్‌ విద్యార్థులు సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ మల్టీఫంక్షన్‌ ల్యాబ్‌ భవనం నుంచి పరిపాలన భవనం వరకు ర్యాలీ తీశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు నిరసనకు మద్దతు తెలిపారు. జేఏసీ కన్వీనర్‌ ప్రొఫెసర్‌ వడ్డానం శ్రీనివాస్‌, విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్‌ విజయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విశ్వవిద్యాలయ అధికారులను సంప్రదించకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకుందన్నారు. విద్యార్థులకు కంప్యూటర్‌, సైన్స్‌ ల్యాబ్స్‌ నిర్మాణం, నూతన విద్యా విధానం ప్రకారం ఎక్కువ మంది విద్యార్థులకు విద్యావకాశాలనుఅందించేందుకు వివిధ కోర్సులు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జేఏసీ చైర్‌పర్సన్‌ పల్లవీ కాబ్డే, జేఏసీ నేతలు పుష్పా చక్రపాణి, రవీంద్రనాథ్‌ సోలమన్‌, ప్రమీల కేతావత్‌, కాంతం ప్రేమ్‌కుమార్‌, అవినాష్‌, కిశోర్‌, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే

బంజారాహిల్స్‌: సర్కిల్‌–17 పరిధిలో సమగ్ర సర్వే సాఫీగా కొనసాగుతున్నదని డీసీ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం 2,917 ఇళ్లను సందర్శించి వివరాలు నమోదు చేయగా ఇప్పటివరకు మొత్తం 8,990 మందిని సర్వే చేశామని పేర్కొన్నారు. ప్రజల నుంచి మంచి సహకారం లభిస్తున్నదని, ఆయన పేర్కొన్నారు.



వివరాలు నమోదు చేస్తున్న ఎన్యుమరేటర్‌ జయంతి

నాగాలాండ్‌ వాస్తవ్యుడి వివరాల నమోదు

బంజారాహిల్స్‌ రోడ్డునంబర్‌–12లో నివసించే నాగాలాండ్‌ వాస్తవ్యుడి వివరాలను ఎన్యుమరేటర్‌ నమోదు చేసుకున్నారు. నాగాలాండ్‌కు చెందిన హెవిన్‌ 10 క్రితం హైదరాబాద్‌కు వచ్చి నగరానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుని ఇక్కడే ఉంటున్నాడు. భార్యాభర్తలు ఇద్దరూ కలిసి బ్యూటీ పార్లర్‌ నడుపుతూ ఉపాధి పొందుతున్నారు. వీరు 75 ప్రశ్నలకు సమాధానాలు చెప్పడమే కాకుండా తమ ఆధార్‌ కార్డు నంబర్లు కూడా అందజేశారు.

రహమత్‌నగర్‌ డివిజన్‌లో..

రహమత్‌నగర్‌: రహమత్‌నగర్‌ డివిజన్‌లో సర్వేను అధికారులు బృందం బుధవారం పరిశీలించింది. డిప్యూటీ సీఎం కార్యాలయానికి చెందిన అధికారులు నవీత హర్షే, దీప్తి జీహెచ్‌ఎంసీ సర్కిల్‌ 19 డీఎంసీ జకీయా సుల్తానాతో కలిసి కార్మికనగర్‌, వినాయకనగర్‌లో సర్వేను పరిశీలించారు. ఎఎంసీ బాలరాజు, ఈఈ రాజ్‌కుమార్‌, పీఆర్‌ఏ వెంకటకృష్ణ, ఈఈ భరత్‌ పాల్గొన్నారు.

హైకోర్టు సిట్టింగ్‌ జడ్జితో విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు కృష్ణస్వరూప్‌

లిబర్టీ: విద్యార్థుల ఆత్మహత్యలపై తెలంగాణ ప్రభుత్వం హైకోర్టు సిట్టింగ్‌ జడ్జితో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్‌ డిమాండ్‌ చేశారు. పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి మెరుగైన విద్య అందించాల్సిన ప్రభుత్వం అనేక సమస్యల్లో విద్యార్థులు కొట్టుమిట్టాడుతున్న పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టాలని కోరారు.

ఆపరేషన్‌ ఫుట్‌పాత్‌..!

అభాగ్యులు ఎవరు..? ఆవారా ఎవరు..?



ఫుట్‌పాత్‌పై ఉంటున్న వారి వివరాలు సేకరిస్తున్న బంజారాహిల్స్‌ డీఐ బషీర్‌ అహ్మద్‌

జూబ్లీహిల్స్‌, బంజారాహిల్స్‌ పోలీసుల డ్రైవ్‌

- బసవతారకం కేన్సర్‌ ఆసుపత్రి ఎదుట నిరాశ్రయుల విచారణ
- షెల్టర్లకు 20 మంది తరలింపు

బంజారాహిల్స్‌: నగరంలో ఇటీవల కొందరు సైకోలు ఆలయాల్లోకి వెళ్లి ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తున్నారు. మరికొందరు నగ్నంగా రోడ్లపై తిరుగుతుండగా, ఇంకొందరు మతిస్థిమితం లేక చేతుల్లో రాడ్లు, కర్రలు పట్టుకుని రోడ్లపై భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. కొందరు పిక్‌ పాకెటింగ్‌కు పాల్పడుతూ మద్యం, గంజాయికి అలవాటుపడి జులాయిగా తిరుగుతూ జనాలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఈ ఘటనల నేపథ్యంలో ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. వీరి నేపథ్యాన్ని విచారించి జీహెచ్‌ఎంసీ షెల్టర్‌ హోమ్‌లకు తరలించాలని, ఇళ్లు ఉన్నవారిని కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఆదేశాలు జారీ కావడంతో బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌ పోలీసులు మూడు రోజులుగా బసవతారకం కేన్సర్‌ ఆస్పత్రి ఎదురుగా పార్కు, ఫుట్‌పాత్‌లపై ఉంటున్న వారిని విచారిస్తున్నారు. ఇక్కడకి ఎందుకు వచ్చారంటూ ప్రశ్నిస్తే కొన్నిసార్లు విస్తుపోయే సమాధానాలు వినిపిస్తున్నాయని పోలీసులు చెబుతున్నారు. ఇంట్లో తినేందుకు తిండి లేక ఇక్కడకు భోజనాల కోసం వస్తున్న వారి సంఖ్య 300 దాకా ఉంటుందని పేర్కొంటున్నారు. ఇదే అదునుగా కొందరు జల్సాల కోసం జేబు దొంగతనాలకు పాల్పడుతున్నారు. 4 రోజుల క్రితం ఆస్పత్రికి వచ్చిన ఓ వ్యక్తి తన కొడుకు చికిత్స కోసం రూ.25 వేలు జేబులో పెట్టుకోగా అన్నం కోసం క్యూలో నిలబడితే దొంగలు కొట్టేశారు. మరోవైపు రాత్రి 11 దాటితే గంజాయి బ్యాచ్‌ వాహనదారులను ఆపి బ్లేడ్లు, కత్తులు చూపిస్తూ బెదిరించి డబ్బులు లాక్కున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు వీరి వివరాలు సేకరిస్తూ ఫొటోలు తీసుకుని వారి వేలిముద్రలు సేకరిస్తున్నారు. గతంలో ఏమైనా నేరాలకు పాల్పడ్డారా..? ఆరా తీస్తున్నారు. ఇప్పటివరకు 20 మందిని షెల్టర్లకు తరలించారు. అయితే పోలీసులు విచారణకు వస్తుండడంతో కొంతమంది పారిపోయి మళ్లీ రాత్రికి ఇక్కడకే చేరుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. బసవతారకం ఆస్పత్రి ఎదుట, కేబీఆర్‌ పార్కును ఆనుకుని మానవత్వంతో ఉచితంగా భోజనాలు పెట్టడం మంచిదే అయినా ఈ ముసుగులో 150 నుంచి 200 మంది ఆవారా యువకులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లుగా పోలీసుల డ్రైవ్‌లో తేలింది. దీనికితోడూ ఇక్కడ పారిశుధ్య సమస్య కూడా తలెత్తుతోంది. మరోవైపు రాత్రిపూట నేరాలు కూడా జరుగుతుండడంతో పోలీసులు ఎలా చెక్‌ పెడతారో వేచి చూడాల్సి ఉంది.

ఒక్కొక్కరిది ఒక్కో వ్యథ..

- నాది బెంగుళూరు. చిన్న ఉద్యోగిని. భార్యతో గొడవపడి ఏడాది క్రితం హైదరాబాద్‌ వచ్చాను. బసవతారకం కేన్సర్‌ ఆస్పత్రి ఎదుట ఫుట్‌పాత్‌పై కేబీఆర్‌ పార్కుకు ఆనుకుని ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, రాత్రి పూట ఉచితంగా టిఫిన్లు, భోజనం పెడుతుండడంతో ఇక్కడే తింటూ ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్నాను అంటూ నారాయణ అనే వ్యక్తి పోలీసుల ఎదుట తన గోడు వెళ్లబోసుకున్నాడు.
- నాది ఆంధ్రప్రదేశ్‌. పదేళ్లుగా బంజారాహిల్స్‌ రోడ్డునంబర్‌–2లోని ఇందిరానగర్‌లో కొడుకు వద్ద ఉంటున్నాను. కుమారుడు, కోడలు కూలీ పనులు చేస్తుంటారు. మధ్యాహ్నం తిండి పెట్టడం వారికి చాలా కష్టంగా ఉంది. అందుకే నా భర్తతో కలిసి ఉదయం ఆస్పత్రి వద్దకు వస్తుంటాను. ఉదయం టిఫిన్‌, మధ్యాహ్నం, రాత్రి భోజనం చేసిన తర్వాత ఇంటికి వెళ్తున్నాం అంటూ ధనమ్మ, ప్రకాశం దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు.
- నాకు ఇల్లు లేదు. 20 ఏళ్లుగా రోడ్లపైనే తిరుగుతున్నాను. బసవతారకం ఆస్పత్రి వద్ద ఉచితంగా భోజనం పెడుతుండడంతో ఇక్కడే తిని పడుకుంటున్నాను. ఎవరైనా డబ్బులు ఇస్తే మద్యం తాగుతాను.. అంటూ సైదయ్య అనే వ్యక్తి పోలీసులకు వివరించాడు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి

బంజారాహిల్స్‌: మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి క్యాంప్‌ కార్యాలయంలో 16 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాళోజీకి ఘన నివాళి

లిబర్టీ: లోక్‌దళ్‌ పార్టీ కార్యాలయంలో బుధవారం కాళోజీ నారాయణరావు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పుల్లూరు వెంకట రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళోజీ బాటలో తెలంగాణ సమాజం ముందుకు సాగాలని కోరారు.

అవార్డు ప్రదానం

ఫిలింనగర్‌: 'ప్రమోటింగ్‌ ఎక్స్‌పీరియన్షియల్‌ లెర్నింగ్‌ ప్రోగ్రాం'లో జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌కు ప్రతిష్టాత్మకమైన ఎల్‌ డ్రోక్‌ ఇండియా కే–12 అవార్డు వరించింది. మంగళవారం సమ్మిట్‌లో అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్‌ కాంచనవల్లి మాట్లాడుతూ అకాడమిక్‌ ఎక్సలెన్స్‌ బోధనలో నూతన ఆవిష్కరణలు, నిబద్ధతకు, అంకితభావానికి ఈ అవార్డు నిదర్శనంగా నిలుస్తుందన్నారు.



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్‌ కాంచనవల్లి

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి

కాచిగూడ: జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్‌ చేశారు. కులగణన సర్వేలో బీసీలందరూ స్వచ్ఛందంగా పాల్గొని మన కులాన్ని గర్వంగా చెప్పుకుని భవిష్యత్‌ తరాల మన అభివృద్ధికి బాటలు వేసుకుందామన్నారు. కొన్ని పార్టీలు కులగణనకు అడ్డుపడేలా మాట్లాడుతున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. బీసీల జనాభా ఎంత ఉందో తెలిస్తేనే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెరిగే అవకాశం ఉందని, కులగణనకు వ్యతిరేకంగా మాట్లడొద్దని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా చండీహోమం



చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌లోని బసవతారరకం కేన్సర్‌ ఆస్పత్రి ఆవరణలోని శ్రీ విజయగణపతి ఆలయంలో రుద్రయాగ సహిత నవచండీ మహాయాగం పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం నిర్వహించిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పటోలా మేళా.. భళా..!



సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్‌లోని రోడ్‌ నంబర్‌ 1లో లేబుల్స్‌ పాప్‌–అప్‌ స్పేస్‌లో డిసన్స్‌ పటోలా ఆర్ట్‌ వస్త్ర ప్రదర్శన ఆకట్టుకుంటున్నది. వెడ్డింగ్‌ ప్రత్యేక కలెక్షన్‌ వేదికగా ఏర్పాటైన ప్రదర్శనలో రాజ్‌కోట, పటోలా దుపట్టా, పటోలా శాలువాలు, సింగిల్‌ పటాన్‌ చీరలు, సింగల్‌ పటాల్‌ చీరలు, సింగల్‌ పటోలా దుప్పట, పటాన్‌ చీరలు, సిల్క్‌ టిష్యూ పటోలా వంటి 10 వేల రకాల ఉత్పత్తులు మగువల మనస్సు దోచేస్తున్నాయి. పటోలా ఆర్ట్‌ చీరలు, పటోలా హ్యాండ్లూమ్‌, సిల్క్‌ వస్త్రోత్పత్తులు నేరుగా వినియోగదారులకు అందించేందుకే ప్రదర్శన ఏర్పాటు చేశామని, ఈనెల 16 వరకు కొనసాగుతుందని డిసన్స్‌ పటోలా ఆర్ట్స్‌ నిర్వాహకుడు భవిన్‌ మక్వాన్‌ తెలిపారు.

అట్టడుగు కులాలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలి



జస్టిస్‌ షమీమ్‌ అక్తర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

పంజగుట్ట: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ ఉప వర్గీకరణ చేయకుండా ఇప్పటివరకు రిజర్వేషన్‌ ఫలాలు పొందని అట్టడుగు కులాల వారికి ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించి వారు ఆర్థికంగా ఎదిగేలా తోడ్పాటు అందించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల ఐక్య వేదిక విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు వన్‌మెన్‌ కమిషన్‌ చైర్మన్‌ జస్టిస్‌ షమీమ్‌ అక్తర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. కలిసిన వారిలో మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్‌, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక అధ్యక్షుడు చెట్లపల్లి అరుణ్‌ కుమార్‌, అంబేడ్కర్‌ ఉత్సవాల కమిటీ మాజీ చైర్మన్‌ రావల విజయ్‌ కుమార్‌, మాల సంక్షేమ సంఘం నాయకులు చొక్కంపేట ఆంజనేయులు, మన్నెగూడెం వేణుగోపాల్‌, కుల్పగురి రాజేశ్‌ తదితరులు ఉన్నారు.

పెండింగ్‌ వేతనాలు చెల్లించాలి

వెంగళరావునగర్‌ : 3 నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఆయాల వేతనాలను తక్షణమే చెల్లించాలని శిశువిహార్‌ వర్కర్స్‌ అండ్‌ హెల్పర్స్‌ యూనియన్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ రాపర్తి అశోక్‌, గౌరవాధ్యక్షుడు ఎం.వెంకటేశ్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు మధురానగర్‌లోని మహిళా శిశుసంక్షేమశాఖ డైరెక్టర్‌ కాంతి వెస్లీకి బుధవారం వినతిపత్రం అందజేశారు. కాగా బడ్జెట్‌ లేకపోవడంతో జీతాలు ఇవ్వలేకపోయామని, రాగానే అందిస్తామని ఆమె హామీనిచ్చినట్లు వారు తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన సిద్దిపేట ఏసీపీపై ఫిర్యాదు

వెంగళరావునగర్‌: విధులకు ఆటంకం కలిగించిన సిద్దిపేట ఏసీపీతో పాటు మరో ముగ్గురిపై మధురానగర్‌ పీఎస్‌లో కేసు నమోదు అయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్‌ఆర్‌నగర్‌ ట్రాఫిక్‌ ఎస్‌ఐ జి.కాంతారావు సిబ్బందితో కలిసి మంగళవారం అర్ధరాత్రి మైత్రీవనం వద్ద డ్రంకన్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నారు. ఓ వాహనాన్ని ఆపి టెస్ట్‌ కోసం చూడగా వెంటనే డ్రైవింగ్‌ సీటులో ఉన్న వ్యక్తి పక్కకు మారి పక్కనున్న మరొక వ్యక్తి డ్రైవింగ్‌ సీటుకు వచ్చాడు. గమనించిన మహిళా కానిస్టేబుల్‌ విషయాన్ని ఎస్‌ఐకు తెలియజేశారు. దీంతో ఎస్‌ఐ వారిని దిగమని చెప్పాడు. కారు నుంచి దిగిన వ్యక్తి తన పేరు సుమన్‌కుమార్‌ అని సిద్దిపేట ఏసీపీ అంటూ తెలిపారు. అయినా డ్రంకన్‌ డ్రైవ్‌ టెస్ట్‌కు సహకరించాలని ఎస్‌ఐ కోరగా నెట్టివేశారు. ఈ విషయాన్ని ట్రాఫిక్‌ ఎస్‌ఐ కంట్రోల్‌రూంకు తెలపగా మధురానగర్‌ పీఎస్‌ నుంచి సిబ్బంది వచ్చారు. అప్పటికీ కూడా సహకరించకపోవడంతో ఏసీపీతో పాటుగా డ్రైవింగ్‌ సీటులో ఉన్న ఎస్‌.జయపాల్‌రెడ్డి, కారులో ఉన్న ఎస్‌.శ్రీనివాస్‌, జీ వెంకట్‌రావుపై మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేయగాపోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూల్చివేతలో హైడ్రామా

శ్రీనగర్‌కాలనీ : ఎర్రగడ్డ ప్రధాన రహదారిలో మంగళవారం కూల్చివేతలో హైడ్రామా చోటు చేసుకున్నది. కొంతమంది ప్రైవేట్‌ ల్యాండ్‌లో చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇటీవల ఆయా దుకాణానికి వెనుక వైపు ఓ బడాబాబు భవనాన్ని నిర్మించుకున్నాడు. అయితే తన భవనానికి ముందు అవి అడ్డుగా ఉన్నాయని కూల్చివేయాలని పలుమార్లు జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్‌ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న చిరు వ్యాపారులు కోర్టు ద్వారా స్టే తెచుకున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం సాయంత్రం జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్‌ అధికారులు అక్రమ నిర్మాణాలు, ఫుట్‌పాత్‌పై అక్రమంగా ఏర్పాటు చేసిన వ్యాపారాల తొలగించేందుకు జేసీబీతో వచ్చారు. టౌన్‌ ప్లానింగ్‌ అధికారి వ్యాపారులతో చర్చిస్తుండగానే ముసుగు ధరించిన ఓ యువకుడు జేసీబీపైకి ఎక్కి చిరు వ్యాపారుల దుకాణాలను కూల్చివేశాడు. అధికారి రావడాన్ని చూసిన యువకుడు వెంటనే పారిపోయాడు. తమకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. టౌన్‌ ప్లానింగ్‌ అధికారి మాట్లాడుతూ కూల్చివేతకు జీహెచ్‌ఎంసీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తాను జీహెచ్‌ఎంసీ ఉద్యోగినని జేసీబీ డ్రైవర్‌కు చెప్పి కూల్చాడని పేర్కొన్నారు. సదరు యువకుడిపై సనత్‌నగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ విషయమై సర్కిల్‌–19 డీఎంసీ జకియాబేగంను వివరణ కోరగా దుకాణాల కూల్చివేతపై విచారణ చేపట్టి సదరు వ్యక్తిపై కేసు పెడుతామని పేర్కొన్నారు.


కేకేపై తప్పుడు ఆరోపణలు చేసిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్‌: ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపీ కేశవరావు అధికారాన్ని అడ్డుపెట్టుకుని తన స్థలాన్ని కబ్జా చేశారంటూ బంజారాహిల్స్‌ రోడ్డునంబర్‌–12లోని ఎన్‌బీటీనగర్‌ బస్తీ వాసి వెంకట్‌రెడ్డి సోషల్‌ మీడియాలో ఆరోపణలు చేశారు. అయితే ఈ నిరాధారమైన ఆరోపణలతో తమ నేత ప్రతిష్ట దెబ్బతిన్నదని వెంకట్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ ఎన్‌బీటీనగర్‌ బస్తీ కాంగ్రెస్‌ నేత విజయ్‌కుమార్‌ బంజారాహిల్స్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు వెంకట్‌రెడ్డిపై బీఎన్‌ఎస్‌ సెక్షన్‌ 352 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రేడింగ్‌ పేరిట మోసం

వెంగళరావునగర్‌ : ట్రేడింగ్‌ పేరిట నగదు తీసుకుని వ్యాపారి పారిపోయిన ఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్‌పేటలో నివాసం ఉండే దుర్గాప్రసాద్‌కు షేర్‌ మార్కెట్‌పై ఆసక్తి ఉండడంతో మధురానగర్‌లోని రాఘవేంద్ర ట్రేడింగ్‌ అకాడమీలో మూడునెలల ఆన్‌లైన్‌ కోర్స్‌ చేశాడు. గమనించిన అకాడమీ నిర్వాహకుడు రాఘవేంద్ర తనకు చెందిన ధన్‌ ట్రేడింగ్‌ సంస్థలో పెట్టుబడి పెడితే ప్రతినెల 10 శాతం రిటర్న్‌ వస్తుందని, నగదు అలాగే ఉంటుందని డబ్బులు కావాలంటే 10 రోజులు ముందుగా చెబితే పెట్టుబడి మొత్తం ఇస్తామని నమ్మించాడు. దీంతో దుర్గాప్రసాద్‌ తనతో పాటు తన సోదరుడు శివ ఇద్దరూ కలిసి రూ.12.50 లక్షలు పెట్టుబడి పెట్టారు. అనంతరం రిటర్న్‌ ఇవ్వకపోగా తన లాగిన్‌, ఫోన్‌ నంబర్‌ మార్చి రాఘవేంద్ర మోసం చేశాడు. దీంతో డబ్బులు ఇవ్వాలని కోరగా తప్పించుకుని తిరుగుతున్నాడు. గత జులైలో రాఘవేంద్రతో పాటు అతని సోదరి ధన్‌ ట్రేడింగ్‌ సంస్థకు వచ్చారనే విషయం తెలుసుకుని సోదరులిద్దరు వెళ్లి తమ పెట్టుబడి గురించి అడగ్గా నవంబర్‌ 4 లోగా మొత్తం చెల్లిస్తామని చెక్‌ ఇచ్చారు. అది బ్యాంక్‌లో వేయగా చెక్‌ బౌన్స్‌ అయింది. దీంతో బాధితులు మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



కాచిగూడ: హిమాయత్‌నగర్‌లోని గౌతమ్‌ మోడల్‌ స్కూల్‌ విద్యార్థులు యూసుఫ్‌గూడలో నిర్వహించిన ఇంటర్నేషనల్‌ కరాటే పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటారు. కార్తికేయ గోల్డ్‌మెడల్‌, సిల్వర్‌ మెడల్‌ సాధించగా, అవినాష్‌, జస్వంత్‌ రెండు గోల్డ్‌మెడల్స్‌ సాధించారు. దీంతో విద్యార్థులను బుధవారం స్కూల్‌లో ప్రిన్సిపాల్‌ సెబాస్టియన్‌, ఇన్‌చార్జి సునిత అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ సెబాస్టియన్‌ మాట్లాడుతూ పిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలంటే కరాటేను ప్రోత్సహించాలని సూచించారు.

18లోగా డిగ్రీ సెమిస్టర్‌ పరీక్ష ఫీజు చెల్లించండి

కాచిగూడ: డిగ్రీ మొదటి సంవత్సరం ఫస్ట్‌ సెమిస్టర్‌ పరీక్ష ఫీజును ఈ నెల 18 లోగా ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించాలని హిమాయత్‌నగర్‌లోని బాబు జగ్జీవన్‌రామ్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ విజయ్‌కుమార్‌ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫీజును క్యూర్‌ కోడ్‌, ఆన్‌లైన్‌, నేరుగా చెల్లించే అవకాశం ఉందని పేర్కొన్నారు. రూ.500 అపరాధ రుసుంతో ఈనెల 21 వరకు చెల్లించవచ్చని తెలిపారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీలకు గుర్తింపునివ్వాలి



సమావేశంలో పాల్గొన్న డాక్టర్లు వెంకట్‌రెడ్డి, శంకర్‌ తదితరులు

కాచిగూడ: ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని ఆర్‌ఎంపీ, పీఎంపీ, సీపీ అండ్‌ ఈపీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ వెంకట్‌ రెడ్డి కోరారు. జనవిజ్ఞాన దర్శిని రాష్ట్ర అధ్యక్షుడు టీ రమేశ్‌ ఆధ్వర్యంలో డాక్టర్‌ చొప్పరి శంకర్‌ అధ్యక్షతన ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్య సంఘాల ఉమ్మడి వేదిక రాష్ట్ర నాయకుల కీలక సమావేశం బుధవారం హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జరిగింది. వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్‌ కార్యాచరణపై చర్చించారు. అనంతరం డాక్టర్‌ వెంకట్‌ రెడ్డి మాట్లాడుతూ ఆర్‌ఎంపీ, పీఎంపీలకు చట్టబద్ధత కల్పించడంతో పాటు ఐడీ కార్డులు, సర్టిఫికెట్స్‌ ఇవ్వాలన్నారు. త్వరలోనే సీఎం, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను కలిసి తమ సమస్యలను విన్నవిస్తామని తెలిపారు. త్వరలోనే నగరంలో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్లు మోహన్‌, రమాశంకర్‌, తన్వీర్‌ సత్యనారాయణ, రవిశంకర్‌, జగదీశ్‌, అక్బర్‌ పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవం



లిబర్టీ: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని బుధవారం కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలీలా ఫౌండేషన్‌ జాతీయ అధ్యక్షుడు డాక్టర్‌ ఎస్‌.ఆదినారాయణ ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో మాతృదేవోభవ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్‌, సభ్యులు పాల్గొన్నారు.

వెంకయ్యనాయుడి ఇంట సర్వే



సమగ్ర సర్వేలో వివరాలు తెలియజేస్తున్న వెంకయ్య నాయుడు

బంజారాహిల్స్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, కులగణన కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేటర్లు జూబ్లీహిల్స్ రోడ్ నెం 25లో నివాసం ఉండే మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు నివాసంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లు అందించిన ఫారంను క్షుణ్ణంగా చదివిన ఆయన పలు వివరాలను అందించారు. కార్యక్రమంలో ఎన్యుమరేటర్ ఉమాదేవి, సూపర్‌వైజర్ శివకుమార్, సర్కిల్ నోడల్ ఆఫీసర్ సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులకు స్వాగతం



హైదరాబాద్‌కు చేరుకున్న ఉమ్రా యాత్రికుల బృందం

శంషాబాద్: ఉమ్రా యాత్ర పూర్తి చేసుకున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన బృందం బుధవారం హైదరాబాద్‌కు చేరుకుంది. శంషాబాద్ విమానాశ్రయంలో యాత్రికులకు వారి కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. యాత్ర దిగ్విజయంగా పూర్తి అయిందని అల్ మిజాన్ సంస్థ నిర్వాహకులు ఫయాజ్ అలీ పేర్కొన్నారు.

ఫ్యాక్టర్ ఇంజక్షన్లు అందుబాటులో ఉంచాలి

హీమోఫిలియా హైదరాబాద్ చాప్టర్ విజ్ఞప్తి



మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి హీమోఫిలియా హైదరాబాద్ అసోసియేషన్ సభ్యులు

బంజారాహిల్స్: హీమోఫిలియా వ్యాధిగ్రస్తులకు అవసరమయ్యే ఫ్యాక్టర్ ఇంజక్షన్లను ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచాలని హీమోఫిలియా సొసైటీ హైదరాబాద్ చాప్టర్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. హీమోఫిలియా వ్యాధిగ్రస్తులకు ఆస్పత్రుల్లో ఫ్యాక్టర్ 8, 9 ఇంజక్షన్లు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని మంత్రికి వివరించారు. రోగులకు సకాలంలో ఫ్యాక్టర్ ఇంజక్షన్లు ఇవ్వకపోతే శాశ్వత వైకల్యం ఏర్పడటమే కాకుండా ఒక్కోసారి మరణానికి కూడా దారితీస్తుందని పేర్కొన్నారు. హీమోఫిలియా బాధితులకు వైకల్య ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో హీమోఫిలియా సొసైటీ హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు, ఉపాధ్యక్షుడు హేమంత్‌కుమార్, జాయింట్ సెక్రటరీ వంశీకృష్ణ, హెచ్ఎఫ్ఐ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ అనుపమ ఉన్నారు.

ట్రస్మా రాష్ట్ర కార్యవర్గం ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న ట్రస్మా రాష్ట్ర నూతన కార్యవర్గం


కవాడిగూడ: రాష్ట్ర గుర్తింపు పొందిన పాఠశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బుధవారం ప్రమాణ స్వీకార కార్యక్రమం దోమలగూడలో ఘనంగా జరిగింది. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్ఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అనిల్ కుమార్, కోశాధికారిగా కె. శ్రీకాంత్‌రెడ్డితోపాటు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ ఎన్.బి.సుదర్శన్ ఆచార్య, ట్రస్మా రాష్ట్ర అధికార ప్రతినిధి చింతల రాంచందర్, ఫౌండర్ ప్రెసిడెంట్ కందాల పాపిరెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ట్రస్మా ప్రతినిధులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తామని హామీని ఇచ్చారు.

లగచర్లలో నిర్బంధకాండను ఆపాలి

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్

ముషీరాబాద్: వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల తదితర గ్రామాల్లో ఫార్మా కంపెనీల కోసం భూసేకరణపై ప్రజల ఆందోళనను ప్రభుత్వం అర్థం చేసుకొని, నిర్బంధ కాండను ఆపాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. కొందరు ప్లాన్ ప్రకారం అధికారులపై చేసిన దాడిని అవకాశంగా తీసుకొని ప్రజల మీద తీవ్ర నిర్బంధం ప్రయోగించడం సరికాదన్నారు. దేశవ్యాప్తంగా బడా కంపెనీల కోసం చేస్తున్న భూసేకరణ తమ బతుకులపై దాడిగా భావించి నిర్వాసితులు ఆందోళన చేస్తున్నారని పేర్కొన్నారు. లగచర్ల భూములను ఫార్మా కంపెనీలకు బలవంతంగా సేకరించవద్దని కోరారు. ఫార్మా కంపెనీల ఏజెంట్‌గా ప్రభుత్వం మారొద్దని పేర్కొన్నారు. నిర్వాసితులకు అన్ని రకాలుగా అవకాశాలు కల్పించి వారిని ఒప్పించిన తరువాతనే భూసేకరణ జరగాలని డిమాండ్ చేశారు.

ఓయూ పూర్వ విద్యార్థి పేరిట గోల్డ్‌మెడల్



చరణ్‌కౌశిక్ యాదవ్‌కు జ్ఞాపిను అందచేస్తున్న వీసీ

హబ్సిగూడ: ఓయూ పూర్వవిద్యార్థి, కాంగ్రెస్ పార్టీ స్టేట్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ చరణ్‌కౌశిక్ యాదవ్ నిజాం కాలేజీ విద్యార్థుల కోసం గోల్డ్‌మెడల్ విరాళంగా అందజేశారు. కాలేజీలో ప్రతి ఏటా జరిగే స్నాతకోత్సవంలో అధిక మార్కులు సాధించిన బీకాం విద్యార్థికి చరణ్‌కౌశిక్ యాదవ్ పేరున గోల్డ్‌మెడల్ ప్రదానం చేయనున్నారు. నిజాం కాలేజీలో బీకాం పూర్తి చేసి ఎంబీఏలో పీహెచ్‌డీ డాక్టరేట్ అందుకున్న ఆయన విద్యార్థి నేతగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. బుధవారం నిజాం కాలేజీలో జరిగిన స్నాతకోత్సవం వీసీ ప్రొ.కుమార్ డాక్టర్ చరణ్‌కౌశిక్ యాదవ్‌ను సన్మానించి, జ్ఞాపికను అందజేశారు.

చనిపోయినా.. ఆసరా!

నెలనెలా పింఛన్ డ్రా చేస్తున్న కుటుంబసభ్యులు / లబ్ధిదారుల మృతి సమాచారం అధికారులకు ఇవ్వని వైనం



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ నగరంలోని మారేడుపల్లి మండలం మెట్టుగూడకు చెందిన ఓ వితంతుకు 2022 ఆగస్టులో ఆసరా పింఛన్ మంజూరైంది. సరిగ్గా 8 నెలల తర్వాత 2023లో ఆమె అనారోగ్యంతో మృతి చెందింది. అయితే కుటుంబసభ్యులు ఆ సమాచారాన్ని లిఖితపూర్వకంగా అధికారులకు ఇవ్వకుండా నెలనెలా ఆసరా పింఛన్‌ను డ్రా చేస్తున్నారు. ఇలాంటి ఉదాంతాలు నగరంలో అనేకం. రెవెన్యూ, జీహెచ్ఎంసీ యంత్రాంగాల మధ్య సమన్వయలోపం వల్ల ప్రభుత్వ ఖజానాకు ఈ విధంగా గండిపడుతోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మున్సిపల్ రికార్డుల్లో మృతి చెందినట్లు నమోదై ధ్రువీకరణ పత్రాలు సైతం జారీ అవుతున్నా సెర్ప్ (ఆసరా) రికార్డుల్లో మాత్రం జీవించి ఉన్నట్లు నెలవారీగా పింఛన్లు విడుదల కావడం విడ్డూరంగా ఉంది. క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బందికి ప్రాథమిక సమాచారం ఉన్నప్పటికీ లిఖితపూర్వకంగా దరఖాస్తులు అందకపోవడంతో పింఛన్ల జాబితాల నుంచి మృతుల వివరాల డిలీషన్‌కు ఆసక్తి కనబర్చకపోవడం గమనార్హం. నిబంధనల ప్రకారం ఆసరా జిల్లా స్థాయి నోడల్ అధికారులు అయినా డీఆర్వోలు సమీక్ష సమావేశాలు నిర్వహించి డెత్ కేసుల డిలీషన్‌కు చర్యలు చేపట్టాలని తహసీల్దార్లకు స్పష్టమైనా ఆదేశాలు ఇవ్వాల్సి ఉండగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

పది శాతంపైనే..

గ్రేటర్ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో సమారు 6.33 లక్షల పెన్షన్ దారులు కాగా, అందులో పది శాతం వరకు డెత్ కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. డెత్ కేసులకు సంబంధించి కుటుంబసభ్యుల నుంచి లిఖితపూర్వకంగా దరఖాస్తు అందితే కానీ రెవెన్యూ సిబ్బంది స్పందించని పరిస్థితి ఉంది. సరిగ్గా నాలుగేళ్ల క్రితం జీహెచ్ఎంసీ డెత్ డాటాను సెర్ప్ డాటాకు అనుసంధానం చేసి పింఛన్ కేసులను గుర్తించేందుకు ప్రయత్నించి ఆ తరువాత మిన్నకుండిపోయారు. లబ్ధిదారులు చనిపోయినప్పుడు ఆయా కుటుంబాల వారు అవగాహన లోపం, మరికొందరు కక్కుర్తితో అధికారులకు సమాచారం ఇవ్వకుండా పింఛన్లను స్వాహా చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దివ్యాంగులకు 4,016, మిగిలిన వారికి రూ.2016 పెన్షన్ అందుతోంది.

ఆర్ఆర్ చట్టం ప్రయోగం

అధికార యంత్రాంగం డెత్ కేసుల డ్రా చేసిన పింఛన్ల వసూళ్ల కోసం రెవెన్యూ రికవరీ చట్టం ప్రయోగించడం మాములే. అయితే కొందరు అక్రమార్కులు వ్యవహారం బయట పడిన నేపథ్యంలో సంబంధిత అధికారుల అండదండలతో ఇటీవల మృతి చెందినట్లు దరఖాస్తు సమర్పించి రెండు మూడు నెలలు పింఛన్ జమ చేసి మిగతా భారం నుంచి తప్పించుకుంటున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. దీంతో డెత్ కేసుల పింఛన్ల స్వాహాకు అడ్డుకట్టపడటం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నగరంలో నేడు

- సూపర్‌స్టార్ మహేశ్ కృష్ణ సేన ఆధ్వర్యంలో పద్మభూషణ్ ఘట్టమనేని కృష్ణ ద్వితీయ వర్ధంతి సభ రవీంద్రభారతిలో సాయంత్రం 6 గంటలకు జరుగుతుంది.
- నాసర్ స్కూల్ 59వ వార్షిక స్పోర్ట్స్ డే వేడుకలు ఖైరతాబాద్‌లోని నాసర్ స్కూల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతాయి.
- రిసోనాన్స్ హైదరాబాద్ సెంటర్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో ఉదయం 9.45 గంటలకు రిసో ఫెస్ట్ 2024 కార్యక్రమం జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

మియాపూర్‌లో కిడ్నాప్.. ఏపీలో నిర్బంధం

- మూడురోజుల తర్వాత సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు..
- ఆటోడ్రైవర్ సమాచారం మేరకు రక్షించిన పెద్దాపురం పోలీసులు

మియాపూర్: మియాపూర్‌లో కిడ్నాప్‌నకు గురై ఏపీలోని పెద్దాపురంలో నిర్బంధించిన బాలికను పోలీసులు సురక్షితంగా మూడు రోజుల తర్వాత తిరిగి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. మియాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాని, అనసూయ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. నగరానికి వలస వచ్చి మియాపూర్ కల్వరి టెంపుల్ రోడ్డులోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో నాని వాచ్‌మేన్‌గా, అనసూయ స్వీపర్‌గా పనిచేస్తున్నారు. పెద్ద కూతురు సూర్య మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో 10వ తేదీన ఉదయం సదరు బాలిక ఇంటి నుంచి బయటకువెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే అదే కళాశాలలో వంటమనిషిగా పనిచేసే ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా జెడ్డంగి గ్రామానికి చెందిన ఆనంద్(25)పై అనుమానముందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు చుట్టుపక్కల సీసీ కెమెరాలను పరిశీలించగా బాలిక మెట్రోస్టేషన్ వైపు నడుచుకుంటూ వెళ్తున్నట్లు గమనించారు. బాలికకు ఆనంద్ మాయమాటలు చెప్పి కాకినాడకు తీసుకువచ్చి పెద్దాపురం పరిధిలోని పరదేశమ్మ కాలనీలోని ఓ ఇంట్లో నిర్బంధించాడు. బాలికను ఆటోలో తీసుకెళ్తుండగా ఆనంద్ మాటలను అనుమానించిన ఆటోడ్రైవర్ పెద్దాపురం పోలీసులకు సమాచారం అందించాడు. బాలికను నిర్బంధించిన ఇంటికి చేరుకుని తలుపులు బద్దలు కొట్టి ఆమెను రక్షించారు. ఆమెను తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఆనంద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. బాలికపై నిందితుడు అత్యాచారానికి పాల్పడ్డాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆశయాలు నెరవేరడం లేదు: తమ్మినేని

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆవేదన
- కమ్యూనిస్టులకు భవిష్యత్ ఉందా అనే చర్చ సాగుతోంది



కమ్యూనిస్టు యోధుడు కె.ఎస్.రాజన్ సంస్మరణ సభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మన ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరడం లేదని, కమ్యూనిస్టులు ఇంకా వెనక్కుపోతున్నట్లుగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులకు భవిష్యత్ ఉందా అనే చర్చ జరుగుతోందని, ఈ తరుణంలో ఆత్మపరిశీలన చేసుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జరిగిన కమ్యూనిస్టు యోధుడు కె.ఎస్.రాజన్ సంస్మరణ సభలో తమ్మినేని మాట్లాడారు. సమాజం కోసం పనిచేయాలనే ఆలోచన కలిగి ఉండటం మంచి పరిణామమే అయినప్పటికీ, నేటి రాజకీయాలు నికృష్టస్థాయికి దిగజారాయని అన్నారు. అవినీతి, బంధుప్రీతి, ప్రలోభాలతో నడుస్తున్న రాజకీయాలలో కమ్యూనిస్టులు తట్టుకోవడం కష్టంగా ఉందని పేర్కొన్నారు. అయితే కమ్యూనిస్టులు లేకుంటే ఈ దేశ భవిష్యత్ ఏమిటీ అనే చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ సంస్థలన్నీ బీజేపీకి కాపాలాదారులుగా ఉంటున్నాయని విమర్శించారు. దేశంలో మతోన్మాదం పెరిగిపోయిందని, దేశ సంపద కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోతోందని అన్నారు. మనుధర్మ శాస్త్రాన్ని అమలులోకి తీసుకురావడానికి రాజ్యాంగాన్ని తీసివేయడానికి బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు.

రాజన్ గొప్ప కమ్యూనిస్టు

పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ కె.ఎస్.రాజన్ విలువలతో కూడిన జీవితాన్ని గడిపిన గొప్ప కమ్యూనిస్టు అని కొనియాడారు. సీపీఎం ప్రజల పార్టీ అని చెప్పడానికి రాజన్ లాంటి వ్యక్తుల సేవలే కారణమని అన్నారు. పార్లమెంటు ఆఫీసును ప్రజల ఆఫీసుగా తీర్చిదిద్దిన గొప్ప వ్యక్తి రాజన్ అని పేర్కొన్నారు. సీపీఎం నగర కార్యదర్శి ఎం. శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కె.ఎస్ రాజన్ సతీమణి, కె.ఎస్ ఆశాలత, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, రాష్ట్ర నాయకులు టి. జ్యోతి, రాజన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మం కాలజ్ఞానం నేటికీ అవసరమే..

- హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్



వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జస్టిస్ చంద్రకుమార్ తదితరులు

కవాడిగూడ: పోతులూరి వీరబ్రహ్మం కాలజ్ఞానం నేటి సమాజానికి కూడా ఎంతో అవసరమని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఈ తరంవారికి వీరబ్రహ్మం బోధనలు, కాలజ్ఞానం అందుబాటులోకి తేవాలన్నారు. మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 416వ జయంతి ఉత్సవాలు బుధవారం ట్యాంక్‌బండ్‌పై జరిగాయి. వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో చంద్రకుమార్ మాట్లాడుతూ పోతులూరి జ్ఞానమార్గాన్ని చూపిస్తూ సమాజ సమతుల్యతను నిలబెట్టారని పేర్కొన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ కులమత భేదాలకు అతీతంగా సర్వమానవ సమానత్వాన్ని చాటిచెప్పిన వీరబ్రహ్మేంద్రస్వామి సామాజిక విప్లవకారుడు అని కొనియాడారు. వీరబ్రహ్మం జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ సమితి కన్వీనర్ అట్టూరి రవీంద్రచారి, ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకట్రామయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు రవీంద్రచారి, ఎ.జితేంద్ర, రాఘవేంద్ర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బయో డైవర్సిటీ కాన్ఫరెన్స్‌కు రండి..!

మేయర్ విజయలక్ష్మికి ఆహ్వానం



మేయర్ విజయలక్ష్మిని కలిసిన అచలెందర్ రెడ్డి

లక్డీకాపూల్: హైదరాబాద్‌లో ఈ నెల 29, 30 తేదీల్లో జరుగనున్న బయోడైవర్సిటీ కాన్ఫరెన్స్‌కు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని జాతీయ బయోడైవర్సిటీ చైర్మన్ అచలెందర్‌రెడ్డి ఆహ్వానించారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో పచ్చదనం పెంచడానికి యూబీడీ విభాగం విశేష కృషి చేసిందన్నారు. పచ్చదనంలో గ్రేటర్ హైదరాబాద్‌కు అంతర్జాతీయ గ్రీన్ సిటీ అవార్డు కూడా వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ యూబీడీ సుభద్ర దేవి, డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు

ఏడాది బాలుడికి అరుదైన చికిత్స

పుట్టుకతోనే కిడ్నీల వాపు.. ప్రీతి ఆస్పత్రిలో రోబోటిక్ విధానంలో వైద్యం



అరుదైన చికిత్స చేయించుకున్న బాలుడితో ప్రీతి యూరాలజీ కిడ్నీ ఆస్పత్రి వైద్య బృందం

లక్డీకాపూల్: కిడ్నీల వాపుతో బాధపడుతున్న ఏడాది వయసున్న ఓ బాలుడికి నగరంలోని ప్రీతి ఆస్పత్రి వైద్యులు అరుదైన చికిత్స చేశారు. ప్రీతి యూరాలజీ కిడ్నీ ఆస్పత్రికి చెందిన చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, రోబోటిక్ సర్జన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వి.చంద్రమోహన్ బుధవారం తాజ్ దక్కన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన ఓ క్యాబ్ డ్రైవర్ కుమారుడికి పుట్టుకతోనే రెండు కిడ్నీలలో వాపు సమస్య ఏర్పడింది. చికిత్స చేయకపోతే మూత్రపిండాల పనితీరు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. స్వదేశీ టెక్నాలజీతో రూపొందించిన ఎస్ఎస్ఐ మంత్ర అనే రోబోటిక్ పైలోప్లాస్టీ సిస్టంతో విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. రోబోటిక్ సర్జరీలో వైద్యులు ఒక కన్సోల్ వద్ద ఉండి, లోపలి దృశ్యాలను మరింత పెద్దగా చూస్తూ అత్యంత కచ్చితత్వం, యాంత్రిక చేతులతో కేవలం నాలుగు రంధ్రాలు చేసి చికిత్స నిర్వహించారు. ఒక్కో కిడ్నీకి 38 నిమిషాల సమయం పట్టింది. దీనివల్ల ఎనస్థీషియా ఎక్కువగా ఇవ్వాల్సిన అవసరం తప్పింది. రోగిని 24 గంటల్లోనే డిశ్చార్జి చేశారు. బాధిత కుటుంబానికి ఖర్చు కూడా గణనీయంగా తగ్గింది. ఏడాది వయసున్న బాబుకు ఇండియన్ రోబోటిక్ శస్త్రచికిత్స చేయడం చాలా సంక్లిష్టమైన విషయమని డాక్టర్ చంద్ర మోహన్ తెలిపారు.

ప్రైవేట్ సెక్యూరిటీలకు లైసెన్స్ ఉండాల్సిందే..

- పోలీసులు, మిలటరీ యూనిఫామ్‌లు ధరించొద్దు
- సైబరాబాద్ ఎస్‌బీ డీసీపీ సాయిశ్రీ వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇంటెలిజెన్స్ విభాగం లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) డీసీపీ సాయిశ్రీ స్పష్టం చేశారు. భద్రతా సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ పోలీసులు, మిలిటరీ, పారామిలిటరీ బలగాలను పోలి ఉండే యూనిఫామ్ ధరించొద్దని అన్నారు. యూనిఫామ్ దుర్వినియోగంతోపాటు ప్రజ ల్లో గందరగోళం నెలకొంటుందని తెలిపారు. ప్రజల భద్రతను పటిష్టం చేయడం, ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు, పోలీసుల మధ్య సమన్వయాన్ని మెరుగుపర్చడమే లక్ష్యంగా ప్రైవేట్ ఏజెన్సీల ప్రతినిధులతో బుధవారం కమిషనరేట్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరాలను అరికట్టడంలో పోలీసులకు మద్దతుగా ప్రైవేట్ ఏజెన్సీలు పోషిస్తున్న పాత్ర కీలకమైందని కొనియాడారు. వృత్తి నైపుణ్యం, చట్టబద్ధమైన కార్యకలాపాల్లో ఉన్న ప్రమాణాలను నిర్వహించేందుకు ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల నియంత్రణ చట్టం (పీఎస్ఏఆర్ఏ)-2005ను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అన్ని ఏజెన్సీలు తమ సిబ్బంది, క్లయింట్లు, కార్యాకలాపాలకు సంబంధించిన రికార్డ్‌లను సమర్థవంతంగా నిర్వహించాలని, సెక్యూరిటీ గార్డ్‌లకు అధికారిక ఫొటో గుర్తింపుకార్డ్‌లను అందజేయాలని పేర్కొన్నారు. 160 గంటల శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేసిన తర్వాతే సిబ్బందికి విధులు అప్పగించాలని సూచించారు. సైబరాబాద్‌లో 355 లైసెన్స్‌డ్ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు ఉన్నాయని చెప్పారు.

16 నుంచి ఇన్సూరెన్స్ ఉద్యోగుల మహాసభలు



సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 16 నుంచి19 వరకు బెంగళూరులో మూడు రాష్ట్రాల దక్షిణ మధ్య జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ 13వ మహాసభలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం నగరంలో ఎల్ఐసీ హైదారాబాద్ జోనల్ ఆఫీసు ప్రాంగణం నుంచి హైదరాబాద్, సికింద్రాబాద్ ఐసీఈయూ డివిజన్ల ఆధ్వర్యంలో ఎల్ఐసీ ఉద్యోగుల కళాజాతను జోనల్ మేనేజర్ పునీత్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. పునీత్‌కుమార్ మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి బెంగళూరు వరకు ప్రధాన రోడ్లలో ప్రజలకు ఎల్ఐసీ సంస్థ గొప్పతనాన్ని, అది దేశ అభివృద్ధికి ఎంత తోడ్పడుతున్నదనే విషయాలను కళారూపాల ద్వారా తెలియజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. మూడు రోజులపాటు దాదాపు ఏడు వందల యాభై కిలోమీటర్ల ఈ ప్రస్థానంలో 10 కేంద్రాల్లో ప్రదర్శనలు ఇచ్చి, చివరగా 16వ తేదీన బెంగళూరుకు కళాజాత చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం జాతీయ కోశాధికారి బీఎస్ రవి, కళాజాత ముఖ్య సమన్వయకర్త తిరుపతయ్య, నాయకులు కె.వేణుగోపాల్, పి.సతీష్, టీవీఎస్ఎస్ రవీంద్రనాథ్, కేఎస్ రాజశేఖర్, వెంకట్‌రెడ్డి, ఎస్ఏ రాజకుమార్, ప్రతాప్ వీరగోని రమేష్ పాల్గొన్నారు.

హం సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు రద్దు

- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

సికింద్రాబాద్: తిరుపతి నుంచి జమ్మూ వెళ్లే జమ్ముతావి హం సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు రద్దు కావడంతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో బుధవారం ప్రయాణికులు ఆందోళనకు దిగారు. హంస ఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం 8.50 గంటలకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరాల్సింది. అంతకుముందే 200 మంది ప్రయాణికులు రైల్వేస్టేషన్‌కు చేరుకొని ఆ రైలు కోసం ఎదురు చూస్తున్నారు. రైలు రద్దు గురించిన సమాచారం చాలాసేపటి వరకు అందకపోవడంతో రెండు గంటలపాటు వేచిచూసిన ప్రయాణికులు చివరికి ఆందోళనకు దిగారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తాము రైల్వేస్టేషన్‌లో గంటల తరబడి పడిగాపులు కాస్తున్నా రైల్వే అధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దపెల్లి- రామగుండం మధ్య గూడ్స్ రైలు పట్టాలు తప్పిన కారణంగా జమ్ముతావి హం సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును అధికారులు దారిమళ్లించారు. ఈ ఘటన కారణంగా ఈ మార్గంలో వెళ్లాల్సిన పలు రైళ్లు రద్దయ్యాయి. అధికారులు రాత్రి 9 గంటలకు ప్రత్యేక రైలును ఏర్పాటు చేస్తామని ప్రయాణికులకు అధికారులు హామీ ఇవ్వడంతో ప్రయాణికులు శాంతించారు.

కోటి దీపోత్సవం వైభవోపేతం

ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మంత్రి డాక్టర్ సుకంత మజుంధార్

కవాడిగూడ: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నగరంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో భక్తి టీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవం బుధవారం 5వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అత్యంత వైభవంగా దామోదర కళ్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి డాక్టర్ సుకంత మజుందార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటి దీపోత్సవానికి హాజరైన భక్తులకు అవని శృంగేరి జగత్‌గురువు శ్రీ అవతానంద భారతీ స్వామి ఆశీర్వచనాలు అందజేయగా, డాక్టర్ అనంతలక్ష్మీ ప్రవచనామృతాలు వినిపించారు. అనంతరం పల్లకీపై దేవతామూర్తులను కోటి దీపోత్సవ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.






ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహించిన తులసీ దామోదర కళ్యాణంలో పాల్గొన్న కేంద్ర మంత్రి డాక్టర్ సుకంత మజుందార్

హైదరాబాద్ వైబ్స్



- శిల్పారామంలో ఈ నెల 21 నుంచి 24 వరకు..
- దేశంలోనే అతిపెద్ద కల్చరల్ ఫెస్టివల్

1500 కళాకారులు
350 ఎగ్జిబిట్స్
100 స్పీకర్స్
12 దేశాలు



భాగ్యనగరం మురిసేలా..
లోక్ మంథన్

సాక్షి, సిటీబ్యూరో: రెండేళ్లకోసారి ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'లోక్ మంథన్' వేడుకలకు సర్వం సిద్ధమైంది. భారతీయ జానపద సాంస్కృతిక ఉత్సవాలను ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించనున్నారు. కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి ప్రముఖులు, సుమారు 2 వేల మందికి పైగా జానపద కళాకారులు తరలి రానున్నారు. ఇప్పటికే ప్రీ లోక్ మంథన్ పేరిట అవగాహన సదస్సులను, ప్రచార కార్యక్రమాలను చేపట్టారు. దేశంలో విశిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థ అమలులో ఉండేదని, విదేశీయుల దండయాత్రల కారణంగా గ్రామీణ ప్రజలకంటే పట్టణవాసులు ఉన్నతులుగా భావించే వివక్ష ఏర్పడిందని, ఈ నేపథ్యంలో గ్రామీణ విజ్ఞానం నిర్లక్ష్యానికి గురైందని లోక్ మంథన్ నిర్వాహకులు భావిస్తారు. అందుకే ప్రకృతి జానపదుల గొప్పతనాన్ని లోకానికి చాటిచెప్పే లక్ష్యంతోనే 'లోక్ మంథన్' నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జానపదుల విశ్వాసాలు, జీవన విధానం, దృక్పథం, వేల ఏళ్లుగా సమాజాన్ని ఏలిన వ్యవస్థల వివరాలను వెలికి తీసుకురావాలనేదే లోక్‌మంథన్ ఉద్దేశం. ప్రజ్ఞా భారతి ఆధ్వర్యంలో ఈ లోక్‌మంథన్ వేడుకలు ఇప్పటి వరకు రాంచీ, భోపాల్, గువాహటి, తదితర నగరాల్లో ఘనంగా జరిగాయి.

భాగ్యనగరం వేదికగా..

ఈ బృహత్తర కార్యక్రమానికి హైదరాబాద్ నగరం వేదిక కానుంది. సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, ఆహారం, ఆరోగ్యం, ఆధ్యాత్మికత తదితర అంశాలపై సమాలోచనల సమాహారమే లోక్‌మంథన్. అర్మేనియా, లూథియానా వంటి దేశాల మూల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పలు కళా ప్రదర్శనలు, సమాలోచనలు చేసేందుకు వేలాది మంది తరలిరానున్నారు. బాలి నుంచి పద్మశ్రీ గ్రహీత వాయన్ దిబియా తన బృందంతో కలిసి రామాయణ ఇతిహాసం ప్రదర్శించనున్నారు. నగరీకరణ కారణంగా అస్తిత్వాన్ని మరిచిపోతున్న నేటి తరానికి భారతీయ సామాజిక జీవిత మూలాలను తెలియజేసే ప్రయత్నమే లోక్ మంథన్. మన వ్యవస్థలో మొదటి నుంచి అడవి బిడ్డల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రముఖ స్థానం ఉండేది. కానీ కాలక్రమేణా ఆ సంస్కృతి మరుగునపడింది. దీంతో అసలైన భారతీయతను నగర ప్రజలకు తెలియజేసేందుకు దేశంలోని వివిధ నగరాల్లో లోక్ మంథన్ నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగే ఈ లోక్‌మంథన్‌కు దేశ విదేశాలకు చెందిన వందలాది మంది కళాకారులు, మేధావులు, పరిశోధకులు హాజరుకానున్నారు.



మనది అడవి బిడ్డల సంస్కృతి



నగర ప్రజలు కెరీర్ వైపు, ఆధునికత వైపు విస్తారంగా పరుగులు తీస్తున్నారు. సమాజాన్ని ప్రభావితం చేస్తున్న ఈ సమూహానికి.. మన సమాజం మూలాలను గుర్తు చేసే ప్రయత్నమే లోకమంథన్. మన భారతీయల వ్యవస్థలో మొదటి నుంచీ అడవి బిడ్డల సంస్కృతి, సంప్రదాయాలకు ముఖ్యమైన స్థానం ఉండేది. కానీ కాలక్రమేణా అది మరుగున పడిపోయింది. అందుచేత అసలైన భారతీయతను నగర ప్రజలకు తెలియ చెప్పేందుకు దేశంలోని వివిధ నగరాలలో లోక మంథన్ నిర్వహిస్తున్నాం.

– నందకుమార్, ప్రజ్ఞా ప్రవాహ్ అఖిల భారతీయ కన్వీనర్

బాల్యం అనేది ప్రతీ ఒక్కరి జీవితానికి భవిష్యత్ పాఠశాల. చిన్నారులు ఎదిగే క్రమంలో వారి ఆలోచనలపై చూపించే ప్రభావమే వారి జీవిత గమ్యాలను నిర్దేశిస్తాయి. పిల్లల చిన్నప్పటి అభిరుచులే వారి లక్ష్యాలుగా మార్పు చెందుతాయి. ఈ ప్రయాణంలో కొందరు చిన్నారులు చదువులపై ఆసక్తి కనబరిస్తే మరి కొందరు సంగీతం, క్రీడలు, డాన్స్, పెయింటింగ్, సాహస కృత్యాలు ఇలా తదితర అంశాలపై మక్కువ చూపుతుంటారు. ఒకవైపు వారి చదువులను కొనసాగిస్తూనే ఇలాంటి ఎక్స్‌ట్రా కరిక్యులం యాక్టివిటీస్‌లో రాణిస్తుంటారు. పసిప్రాయంలోనే ఇలాంటి విభిన్న రంగాల్లో అత్యుత్తమ నైపుణ్యాలతో రాణించిన కొందరు చిన్నారులను చిల్డ్రన్స్ డే సందర్భంగా 'సాక్షి' పలకరించింది. బాల్యం నుంచే తమకంటూ కొన్ని లక్ష్యాలు నిర్దేశించుకుని అటు చదువులను ఇటు వారి ప్రయత్నాలను కొనసాగిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్న బాలతారల ఆలోచనలను తడిమి చూద్దామా..?

- సాక్షి, సిటీబ్యూరో

బాల్యమొక స్ఫూర్తి

పసిప్రాయంలోనే వినూత్న అభిరుచులు

- చదువులతో పాటు జీవన నైపుణ్యాలు
- విభిన్న రంగాల్లో రాణింపు
- క్రీడలు, కళల్లో ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు
- చిల్డ్రన్స్ డే నేపథ్యంలో వండర్ కిడ్స్ అభిప్రాయాలు



హ్యాపీగా.. సాగుతున్న కెరీర్

ఓరి దేవుడా, సలార్ సినిమాలతో పాటు పలు వెబ్ సిరీస్‌లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించాను. ప్రభాస్ వంటి ప్యాన్ ఇండియన్ స్టార్‌తో సినిమా చేయడం చాలా సంతోషంగా ఉంది. సినిమాలతో పాటు చదువు, క్రీడల్లోనూ ముందంజలో ఉన్నాను. సినిమాలతో మొదలై కెరీర్ హ్యాపీగా ముందు సాగుతోంది. సామాజిక బాధ్యతలను ప్రతిబింబించేలా, చిన్నారుల హక్కులను తెలియజేసేలా మంచి ప్రాజెక్టులను చేసే యోచనలో ఉన్నాను. ప్రస్తుతం మరో రెండు పెద్ద ప్రాజెక్టుల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటిస్తున్నాను. మ్యాథ్స్ ఇంగ్లిష్ సబ్జెక్ట్ అంటే చాలా ఇష్టం. అంతేగాకుండా సంగీతంపైన కూడా ఆసక్తి. నేను పాటలు చాలా బాగా పాడగలను.

– ఫర్హానా, చైల్డ్ ఆర్టిస్ట్



సలార్ సినిమాతో గుర్తింపు..

ప్రతి విషయాన్ని వినూత్నంగా ఆలోచించడం నాకిష్టం. చిన్నప్పటి నుంచి విభిన్న కళల్లో ఆసక్తి కనబర్చేవాడిని. అనంతరం సినిమాలు, నటనపై మక్కువ పెరిగింది. ఏ చిన్న ఆడిషన్స్ ఉన్నా వెళ్లేవాడిని. ఈ ప్రయత్నంలో పలు మంచి ప్రాజెక్టుల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించే అవకాశం వచ్చింది. ప్రముఖ సినీ హీరో అజిత్, త్రిష నటించిన గుడ్, బాడ్, అగ్లీ సినిమా, ప్రభాస్ సలార్ వంటి సినిమాలు మంచి గుర్తింపునిచ్చాయి. మరికొద్ది రోజుల్లో రానున్న వరుణ్ తేజ్ సినిమా మట్కాలో మంచి రోల్ చేస్తున్నారు. అంతేగాకుండా జగపతిబాబు తదితర టాలీవుడ్ స్టార్స్‌తో మరికొన్ని ప్రాజెక్ట్‌లు చేస్తున్నాను. సినిమాలతో పాటు చదువులోనూ రాణిస్తున్నాను. సినిమాల ప్రభావం నా చదువులపై పడకుండా చూసుకుంటున్నాను. భవిష్యత్తులో వైవిధ్యమైన క్యారెక్టర్లు చేసే మంచి హీరోగా రాణించాలని ఉంది.

– కార్తికేయ దేవ్, ప్రముఖ చైల్డ్ ఆర్టిస్ట్





హైదరాబాద్‌ను నంబర్ వన్ స్థానంలో..

అతి సాధారణ కుటుంబం మాది. మేము ముగ్గురం అక్కాచెల్లెళ్లం. మేము ఏది చేసినా మా కుటుంబానికి గుర్తింపు రావాలి. మా అమ్మా నాన్నలకు మంచి పేరు తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. నగరంలోని యాచ్ క్లబ్ ఆధ్వర్యంలో సుహేమ్ షేక్ అందిస్తున్న సహకారంతో ఈ సెయిలింగ్‌లో రాణించాను. వైఎవి నార్త్ ఈస్ట్ రేగట్ట 2023 ఆప్టిమిస్టిక్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాను. వైఎవి సికింద్రాబాద్ యూత్ క్లబ్ రేగట్ట 2023లో సిల్వర్ పతకం సాధించాను. వైఎవి యూత్ నేషనల్‌లో ఆప్టిమిస్టిక్ విభాగంలో కాంస్యం గెలుపొందాను. మా ప్రయత్నంలో భాగంగా ఇప్పటికే జాతీయ స్థాయిలో హైదరాబాద్‌ను నంబర్ వన్ స్థానంలో తీసుకువచ్చారు. నాతోపాటు నా సహోదరి కూడా సెలింగ్లోనే జాతీయ స్థాయిలో పలు పతకాలను సాధించింది.

– లహరి, జాతీయస్థాయి సెయిలర్

చిన్న వయసులో..

పిట్ట కొంచెం కూత ఘనం అనే సామెతకు అచ్చు గుద్దినట్టు ఈ పాప సరిపోతుందనడంలో అతిశయోక్తి లేదు. ఎందుకంటే 9 ఏళ్ల వయసులోనే తన కంటే నాలుగేళ్లు పెద్ద వాళ్లతో తలపడి, గెలుపొంది ఔరా అనిపించుకుంటోంది. బ్యాడ్మింటన్ ఆటలో అద్భుతాలు సృష్టిస్తోంది లట్టాల శాన్వి. నగరంలోని మణికొండకు చెందిన శాన్వికి చిన్నప్పటి నుంచే తల్లిదండ్రులు బ్యాడ్మింటన్‌లో శిక్షణ ఇప్పిస్తున్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న శాన్వి.. ఆటపై పూర్తిగా ఫోకస్ పెట్టేందుకు చదువు కూడా మానేసింది. రోజులో కనీసం 8 గంటల పాటు ఆటపైనే శ్రద్ధ పెడుతూ ప్రాక్టీస్ చేస్తోంది. ఒలంపిక్స్‌లో దేశం తరఫున ఆడి బంగారు పతకాన్ని సాధించడమే తన జీవిత లక్ష్యమని చెబుతోంది. ఇటీవల అసోంలో జరిగిన జాతీయస్థాయి అండర్–13 ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో సింగిల్స్, డబుల్స్ విభాగంలో మెయిన్ డ్రాకు అర్హత పొంది సంచలనం సృష్టించింది.


శాన్వి

టీం ఇండియాకు ఆడటమే..

క్రికెట్ అంటే నాకు చాలా ఇష్టం.. ప్రస్తుతం నేను హిమాయత్‌నగర్‌లోని స్లేట్ ది స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాను. బాగ్‌లింగంపల్లిలోని స్పాట్ లైట్ అకాడమీలో క్రికెట్‌లో శిక్షణ తీసుకుంటున్నాను. ఈ మధ్యనే స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు అండర్–17 విభాగంలో ఎంపికయ్యాను. ఇండియన్ క్రికెట్ టీమ్‌కు ఆడటమే లక్ష్యంగా క్రికెట్‌లో రాణిస్తున్నాను. సిటీలో జరిగిన పలు టోర్నమెంట్‌లలో మంచి స్కోర్ సాధించాను. అందరిలా కాకుండా విభిన్న క్రీడల్లో రాణించడానికి నాన్న అందించే ప్రోత్సాహం మాటల్లో చెప్పలేను. ఇటు చదువులు, అటు క్రికెట్‌లో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడానికి నాన్న విశేషంగా కృషి చేస్తున్నాడు.

– వరీష





సంస్కృతి, సంప్రదాయాల్లో
కలిశారిలా..

ఇండియన్ ట్రెడిషైన్.. ఫ్యాషన్ వాక్

భారతీయ సంస్కృతికి అద్దం పట్టే రీతిలో సాగిన ఫ్యాషన్ వాక్ ఔరా అనిపించింది. ఆయా రాష్ట్రాల వస్త్రధారణతో సాగిన క్యాట్ వాక్ అందరినీ ఆకట్టుకుంది. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ ఆడిటోరియంలో ప్రధాని నరేంద్ర మోదీ భావజాలమైన వారసత్వ చేనేత వస్త్రాలను ప్రోత్సహించేందుకు చేపట్టిన అవతరణ్–2024లో భాగంగా బుధవారం ఫ్యాషన్ వాక్ నిర్వహించారు. ఎఫ్‌డీడీఐ(ఫుట్‌వేర్ డిజైన్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్)లోని ఫ్యాషన్ డిజైన్ విభాగం రెండో సంవత్సరం విద్యార్థులు ఫ్యాషన్ వాక్ నిర్వహించారు. ఆయా రాష్ట్రాల్లో వివిధ పేర్లతో పిలిచే చీర కట్టు, పంచెకట్టుతో ర్యాంప్‌పై విద్యార్థులు మెరిశారు. యువతులు వివిధ రాష్ట్రాల సంప్రదాయాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. సాంఘిక సంస్కరణల చుట్టూ ఉండే సంప్రదాయ కథలలో భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే రీతిలో వస్త్రాలను డిజైన్ చేశారని ఎఫ్‌డీడీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.తేజ్ లోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. నిఫ్ట్ అసోసియేట్ ప్రొఫెసర్ మధుప్రియ ఝా ఠాకూర్, ఎల్‌జీఏడీ సీనియర్ ఫ్యాకల్టీ సి.వేణుగోపాల్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. బెస్ట్ డిజైనర్, బెస్ట్ మోడల్‌ను ఎంపిక చేయనున్నారు. – గచ్చిబౌలి





ఆసక్తికరంగా విద్యా సదస్సు
టి–హబ్ వేదికగా..

సాక్షి, సిటీబ్యూరో: యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్(యుఈఎల్), సిమెన్స్ యుకె, టి–హబ్ హైదరాబాద్ సంయుక్తంగా 'అచీవింగ్ సస్టైనబుల్ హయ్యర్ ఎడ్యుకేషన్: ది పార్ట్‌నర్‌షిప్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ యూనివర్సిటీస్' (స్థిరమైన ఉన్నత విద్యను చేరుకోవడం.. పరిశ్రమ, విశ్వవిద్యాలయాల భాగస్వామ్యం) అనే అంశంపై నగరంలోని టి–హబ్‌లో జరిగిన కార్యక్రమం ఆసక్తికరంగా సాగింది. విద్యలో స్థిరమైన భవిష్యత్తుకు ఎదురవుతున్న సవాళ్లపై వినూత్న పరిష్కారాలపై ఈ సదస్సులో జాతీయ అంతర్జాతీయ విద్యా పారిశ్రామిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు చర్చించారు. ఇందులో భాగంగా పర్యావరణ అనుకూల నిర్మాణం, ఇంజినీరింగ్ గ్రీన్ టెక్నాలజీలలో కేస్ స్టడీస్‌ను ప్రదర్శించారు.







'సాక్షి' టీవీ స్టూడియోలో స్కూల్ విద్యార్థులు



'సాక్షి' టీవీ స్టూడియో పీసీఆర్‌లో బాల తారలు

తారే జమీన్ పర్

బాలల దినోత్సవం సందర్భంగా సాక్షి కార్యాలయంలో సందడిచేసిన లిటిల్ స్టార్స్



'మేం పాటలు పాడతాం. డైలాగ్స్ గుక్కతిప్పకోకుండా చెప్పేస్తాం. పొడుపుకథలు వేస్తాం, ప్రశ్నలతో తికమక పెట్టేస్తాం. స్కూల్లో చదువుకుంటాం, సినిమాల్లో నటిస్తాం, డ్యాన్స్‌లే కాదు అల్లరి కూడా చేస్తాం ...' అంటూ బాలల దినోత్సవం సందర్భంగా బుధవారం 'సాక్షి' మీడియా హౌస్ హైదరాబాద్ ఆఫీసులో ఏర్పాటు చేసిన వేదిక ద్వారా పలువురు బాల తారలు తమ ఆనందాలను పంచుకున్నారు. స్కూల్ విద్యార్థులు అడిగిన పొడుపు కథలకు ఈ 'లిటిల్ స్టార్స్' ఆన్సర్ చేయడం, లిటిల్ స్టార్స్ కోరిన పాటలను స్కూల్ విద్యార్థులు పోటీ పడుతూ పాడటంతో కార్యక్రమం సందడిగా మారింది.

స్కూల్లో రన్నింగ్, ఖోఖో, కబడ్డీ, క్రికెట్, బాస్కెట్ బాల్... వంటి ఆటలన్నీ ఆడతాం అంటూ మొదలు పెట్టిన పిల్లలు కరెంట్ షాక్ ఎందుకు తగులుతుంది? బాల్‌ని కొడితే ముందుకు ఎలా వెళుతుంది? అంటూ సైన్స్ పాఠాలనూ వినిపించారు. లెక్కలు ఇష్టం అంటూనే డాక్టర్లం అవుతాం అనే భవిష్యత్తు ప్రణాళికలనూ చెప్పారు. సోషల్ మీడియాలో తమకున్న ఫాలోవర్స్ గురించి, చేస్తున్న రీల్స్ గురించి వివరించారు. 'సాక్షి' మీడియా హౌస్ వారం రోజుల పాటు జరిపిన 'లిటిల్ స్టార్స్' కార్యక్రమంలో భాగంగా కలిసిన చిన్నారులను గుర్తుకు తెచ్చుకొని, 'మరో ప్రపంచం తెలుసుకున్నాం' అంటూ తమ స్పందనను తెలియజేశారు బాల తారలు. టీవీ చానల్‌కి సంబంధించిన న్యూస్‌రూమ్, పీసీఆర్ వంటి వాటిని చూసి సంభ్రమాశ్చర్యాలను వెలిబుచ్చారు.

ఈ వారమంతా లిటిల్ స్టార్స్ సందడిని సాక్షి యూట్యూబ్‌లో చూడటానికి ఈ QR కోడ్‌ను స్కాన్ చెయ్యండి

నాకు నటుడిగా గుర్తింపు వచ్చిందంటే మా అమ్మే కారణం. ఇప్పటి వరకు పది సినిమాల్లో బాల నటుడిగా నటించే అవకాశం వచ్చింది. సినిమా చూసిన తరువాత స్కూల్లో ఫ్రెండ్స్ నీ క్యారెక్టర్ సూపర్‌గా ఉందంటూ కాంప్లిమెంట్స్ ఇస్తుంటారు. రెండు మూడు పేజీల డైలాగ్‌లు కూడా ఒకే సారి చెప్పగలను. ఈ కార్యక్రమం ద్వారా నేను సినిమాల్లోని డైలాగ్స్ చెప్పే అవకాశం లభించింది. అలాగే, న్యూస్ ఎలా రెడీ అవుతుందో తెలుసుకున్నాను. ఈ ప్రోగ్రామ్ మాకు పాఠంలా కొత్తదనాన్ని పరిచయం చేసింది. థాంక్యూ సాక్షి.
- కె. హర్ష

ఏడేళ్ల వయసు నుంచి సినిమాలలో నటిస్తున్నాను. చదువు, సినిమాలతో పాటు బాస్కెట్ బాల్, క్రికెట్, డ్యాన్స్ కూడా చాలా ఇష్టం. స్కూల్, సినిమా షూటింగే కాదు 'సాక్షి' ఏర్పాటు చేసిన 'లిటిల్‌స్టార్స్'లో భాగంగా నిస్సహాయ స్థితిలో ఉన్న పిల్లలను కలిసినప్పుడు చాలా బాధపడ్డాను. తలస్సేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలను చూసి, అందరూ త్వరగా కోలుకోవాలని కోరుకున్నాను. అలాగే ఈ ఫైనల్ ఈవెంట్‌లో 'అల్లూరి సీతారామ రాజు' సినిమాలోని డైలాగ్ చెప్పినప్పుడు అందరూ గ్రేట్ అంటూ మెచ్చుకుంటే చాలా ఆనందంగా అనిపించింది. మమ్మల్ని ఎంకరేజ్ చేసే ఈ ప్రోగ్రామ్ చాలా బాగుంది. అందరికీ థ్యాంక్స్.
- మోక్షజ్ఞ

తలసీమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులను కలవడానికి 'సాక్షి' మీడియా ద్వారా వెళ్లాను. చిన్న చిన్న పిల్లలు ఆ వ్యాధితో బాధపడుతుండటం చూసి, చాలా బాధగా ఫీలయ్యాను. కాసేపు వాళ్ల బాధని మరచిపోయేలా చేయాలని వాళ్లు అడిగిన డైలాగ్స్ చెప్పాను. వాళ్లను ఎంకరేజ్ చేసేలా మాట్లాడాను. మామూలుగా నేను చదువుకుంటాను. సినిమాలు చేస్తుంటాను. రీల్స్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుంటాను. అలాంటి నాకు ఇలాంటి పిల్లలతో కాసేపు టైమ్ స్పెండ్ చేయడం ఓ డిఫరెంట్ వరల్డ్‌లోకి వెళ్లినట్లు అనిపించింది. ఇక 'సాక్షి మీడియా' హౌస్‌లో ఏర్పాటు చేసిన "లిటిల్‌స్టార్స్'లో నాతోటి యాక్టర్స్‌తో కలిసి ఎంజాయ్ చేయడం చాలా బాగుంది.
- అనన్య ఈగ

చేసే పనిపై ఇష్టం ఉంటుంది కాబట్టి చదువు–సినిమా రెండింటినీ బ్యాలెన్స్ చేసుకుంటాను. ఈ ప్రోగ్రామ్ ద్వారా ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాను. 'స్పర్శ్' హాస్పిస్ కేంద్రంలో సేవలు పొందుతున్న చిన్నారులను కలిశాం. వారి పరిస్థితి చూశాక చాలా బాధ అనిపించింది. వారి ముఖాల్లో నవ్వులు తెప్పించాలని డ్యాన్స్‌లు చేశాం, పాటలు పాడాం... ఈ ఎక్స్‌పీరియన్స్‌ను ఎప్పటికీ మరిచిపోలేను. ఈ చిల్డ్రన్స్ డే మాకు సాక్షి ఇచ్చిన ఓ పెద్ద గిఫ్ట్.
- సయ్యద్ ఫర్జానా

మేమిద్దరం కవలలం. కలిసే చదువుకుంటాం. సినిమాల్లోనూ కలిసే వర్క్ చేస్తాం. మేం ఇద్దరం పెద్దయ్యాక సాఫ్ట్‌వేర్ బిజినెస్ పెట్టాలనుకుంటున్నాం. ఈ ప్రోగ్రామ్ ద్వారా మా ఇద్దరి ఆలోచనలను, మా ప్రతిభను షేర్ చేసుకునే అవకాశం లభించింది. ఇక్కడ న్యూస్ ఎలా రెడీ అవుతుందో తెలుసుకొని ఆశ్చర్యపోయాం. ఈ చిల్డ్రన్స్ డే మాకు వెరీ వెరీ స్పెషల్.
- అర్జున్, అర్విన్



రైతు స్వరాజ్య వేదిక ద్వారా అక్కడి పిల్లలను కలిసినప్పుడు వాళ్లు ఎంత కష్టపడుతున్నారో అనిపించింది. వాళ్ల నాన్న చనిపోయిన బాధలో ఉన్నప్పటికీ బాగా చదువుకుని, అమ్మను బాగా చూసుకుంటాం అని వారు చెప్పినప్పుడు 'గ్రేట్' అనిపించింది. అలాగే కలెక్టర్ అవుతామని, డాక్టర్ అవుతామని వాళ్లు తమ భవిష్యత్తు గురించి, తమ ప్లాన్స్ గురించి చెప్పినప్పుడు వారి ధైర్యం చూసి భేష్ అనిపించింది. ఈ కార్యక్రమం ద్వారా ఓ కొత్త ప్రపంచాన్ని చూశాం.
- హనీష

ఎం.ఎన్.జె. క్యాన్సర్ హాస్పిటల్‌లో ఉన్న పిల్లలను చూసినప్పుడు చాలా ఎమోషనల్ అయ్యాను. తర్వాత వాళ్లను హ్యాపీగా ఉంచాలనిపించింది. అందుకే మాటలు, పాటలతో వారితో కలిసిపోయాను. ఇంటికి వెళ్లాక మా నాన్నతో ఆ విషయాలన్నీ పంచుకున్నాను. 'సాక్షి మీడియా' వల్ల వాళ్లను కలిసి, నా వంతుగా కాసేపు వాళ్లని సంతోషపెట్టడానికి ట్రై చేశాను. ఈ చిల్డ్రన్స్ డే నాకెప్పటికీ గుర్తుండిపోతుంది.
- సాన్విక

ఎం.ఎన్.జె. క్యాన్సర్ హాస్పిటల్‌లో చాలా మంది చిన్న చిన్న పిల్లలు కూడా ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారు. వాళ్లని చూడగానే ఫస్ట్ చాలా ఏడుపొచ్చింది. అయితే మేం వాళ్లని హ్యాపీ చేయడానికి వెళ్లాం కాబట్టి, వాళ్లతో జోక్‌గా మాట్లాడాను. వాళ్లు నవ్వడం హ్యాపీ అనిపించింది. అలాగే 'సాక్షి' టీవీకి వచ్చి, అందరితో మాకు క్లాసులు చెప్పినవి, మేం సినిమాల్లో చేసినవి షేర్ చేసుకోవడం హ్యాపీ. పెద్దయ్యాక మహేష్‌బాబు లాగా పెద్ద హీరోని అవుతాను. ఇక్కడ గోగో (బొమ్మ)తో కలిసి చేసిన అల్లరి బాగుంది. అలాగే, మాకు అన్ని న్యూస్ రూమ్‌లు చూపించారు. చాలా కొత్తగా అనిపించింది.
- స్నితిక్

ఈ కార్యక్రమం ద్వారా తలసేమియాతో బాధపడుతున్నవారిని కలిశాను. వారిని నవ్వించాను కూడా... పాటలు పాడాను, డ్యాన్సులు చేశాను. అలాగే బుధవారం జరిగిన వేడుకలో నాలా సినిమాల్లో నటిస్తున్న మిగతా అన్నయ్యలు, అక్కలను కలుసుకోవడం హ్యాపీగా అనిపించింది. మా ఇష్టాలు, చదువు, ఆటలు, పాటలు, డైలాగ్స్ మీ అందరికీ చెప్పడం.. అన్ని విషయాలను షేర్ చేసుకోవడం బాగుంది. గోగో (బొమ్మ)తో బాగా ఎంజాయ్ చేశాం.
- తనస్వి

కేంద్రీయ విద్యాలయాలో చదువుకుంటున్నాను. సినిమాల్లో నటిస్తున్నాను. తబలా వాయిస్తాను. డ్యాన్స్, మ్యూజిక్ నేర్చుకుంటున్నాను. సీరియల్స్‌లో కూడా నటిస్తున్నాను. 'బాలోత్సవం'లో నాకు వచ్చిన పాటలు పాడాను. అందరూ సూపర్ అని మెచ్చుకున్నారు.
- శ్రేయాన్ కోట

మూడేళ్ల నుంచి సినిమాలు చేస్తున్నాను. ఇప్పటి వరకు 25 యాడ్స్, 30 సినిమాల్లో నటించాను. హిందీ మూవీలో కూడా నటించాను. డ్యాన్స్, సంగీతం నేర్చుకుంటున్నాను. బాలరత్న అవార్డు కూడా వచ్చింది. 'సాక్షి' మీడియాతో కలిసి రైతు స్వరాజ్య వేదికకి వెళ్లి అక్కడి పిల్లలతో మాట్లాడటం బాగా అనిపించింది. 'మా నాన్న లేరు' అని వాళ్లు చెప్పినప్పుడు ఏడుపొచ్చింది. ఇక ఫైనల్ ఈవెంట్‌లో గోగో (బొమ్మ)తో మాటలు బాగా నచ్చాయి. ఎంత టైమ్ స్పెండ్ చేశామో తెలియనే లేదు.
- శ్రేష్ఠ కోట

మూడేళ్లుగా సినిమాల్లో నటిస్తున్నాను. భరతనాట్యం కూడా నేర్చుకుంటున్నాను. నేను కోపం, బాధ, హ్యాపీ సీన్లలో బాగా నటిస్తాను అని చెబుతారు. ఏడుపు సీన్లలో గ్లిజరిన్ లేకుండా నటించడం చూసి, అందరూ మెచ్చుకున్నారు. టీవీలో అందరి ముందు నా టాలెంట్‌ను ప్రదర్శించే అవకాశం లభించింది. ఇప్పుడు స్వయంగా టీవీ న్యూస్‌రూమ్, స్టూడియో... ఇవన్నీ చూడటం కొత్తగా అనిపించింది.
- ఖుషీ రెడ్డి

- డి.జి. భవాని
- నిర్మలారెడ్డి
- దామోదర్

ఫొటోలు: గడిగె బాలస్వామి, అనిల్ కుమార్ మోర్ల

చిన్ని మనసులు కదిలిన వేళ...

పసి హృదయాలు కదిలిపోయాయి. చిన్న మనసులే అయినప్పటికీ తోటి చిన్నారులు పడుతున్న బాధ చూసి, చలించిపోయాయి. బాలల దినోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు 'సాక్షి' మీడియా హౌస్ జరిపిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కేన్సర్, తలసీమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులను, మృత్యువుతో పోరాడుతున్న పసిబాలలకు, తండ్రిని కోల్పోయిన వారిని, అనాథ బాలలను కలిశారు పలువురు బాల తారలు. కాసేపు ఆ చిన్నారులు తమ కష్టాన్ని మరచిపోయేలా చేసి, వారితో ఆడి పాడారు... నవ్వించారు. చివరగా 'సాక్షి' మీడియా హౌస్‌లో జరిగిన వేడుకలో స్కూల్ విద్యార్థులతో కలిసి ఈ బాల తారలు సందడి చేశారు. ఈ 'బాలల దినోత్సవం' ఎప్పటికీ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు.

టీవీలో న్యూస్ చదువుతారు కదా.... ఆ రూమ్ ఎలా ఉంటుందో చూస్తారా? ఎడిటింగ్ ఎలా జరుగుతుందో చూడాలని ఉందా? అసలు టీవీ స్టూడియో ఎలా ఉందో చూడాలనుకుంటున్నారా? అనడమే ఆలస్యం 'ఓ' అంటూ ఆసక్తి కనబరిచారు లిటిల్ స్టార్స్. 'సాక్షి టీవీ' న్యూస్ రూమ్, పీసీఆర్ (ప్రొడక్షన్ కంట్రోల్ రూమ్) వంటివి చూసి, ఆశ్చర్యపోయారు. టీవీ స్టూడియోలో జరుగుతున్న పనులను నిశితంగా గమనించారు.



డిజిటల్ బాల సాహిత్యం

చందమామ లేదు యూట్యూబ్ ఉంది

నెల నెలా వచ్చే చందమామ లేదు. బాలమిత్ర, బుజ్జాయి, బొమ్మరిల్లు లేవు. ఇంట్లో కథలు వినిపించే వారు లేరు. స్కూళ్లలో బుక్ రీడింగ్ అవర్ కనిపించడం లేదు. పిల్లల ఊహను పెంచి ఆలోచనను పంచే బాలసాహిత్యం వారికి అందక పోతే బూస్టు, హార్లిక్సు, ఆర్గానిక్ ఆహారం ఇవి ఏమిచ్చినా ఉపయోగం లేదు. శరీరం ఎదిగే ఆహారంతోపాటు బుద్ధి వికసించే ఆహారం ఇవ్వాలి. అది కథల్లో దొరుకుతుంది. కనీసం డిజిటల్ మీడియాలోని కథలైనా వారికి చేరువ చేయాలి.

ఏమిటి, ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఎందుకు– వీటిని 'ప్రశ్నాపంచకం' అంటారు. ఏ మనిషి జిజ్ఞాస అయిన అడుగంటిపోకుండా ఉండాలంటే ఈ ఐదు ప్రశ్నల్ని సజీవంగా ఉంచుకోవాలి. పిల్లలు అనుక్షణం ఈ పంచ ప్రశ్నలను అడుగుతూ ఉంటారు. గతంలో ప్రశ్నలు అడిగే పిల్లలను తెలివైన వారుగా భావించి మెచ్చుకునేవారు. నేడు ప్రశ్నిస్తే విసుక్కుంటున్నారు. కథ చెప్పమంటే తీరిక లేదంటున్నారు. మారాం చేస్తే సెల్ చేతికిస్తున్నారు. మరీ గొడవ చేస్తే సినిమాకు పంపిస్తున్నారు. కాని వారి చేత కథ చదివించడం లేదు. దాని వల్ల పిల్లల్లో ప్రశ్నించే కుతూహలం చచ్చిపోతుంది. కుతూహలం లేని బాలబాలికలు బాధ్యతాయుతులైన పౌరులుగా వికసించలేరు. కనుక ఇది అంతిమంగా సమాజానికే నష్టం.

అసలు మన సమాజంలో పిల్లలను గౌరవించడం ఉందా? వారి ఎదుగుదల గురించి చింత ఉందా? వారికి ఎలాంటి జ్ఞానం అందుతోందన్న ఆలోచన ఉందా? ఆలోచించడం, ప్రశ్నలు వేసుకోవడం, ప్రశ్నించడం, జవాబులు వెదుక్కోవడం, సమాధానాలు సృష్టించుకోవడం ఇవన్నీ పిల్లలు నిరంతరం చేయాలంటే పుస్తకాలు చదవాలి. పుస్తకాలు చదవడం ఎంత చిన్నవయసులో అలవడితే అంత త్వరగా వాళ్ళు స్వతంత్రులవుతారు. అయితే మన దగ్గర బాలసాహిత్యంగా చలామణి అయ్యేది పూర్తిగా బాల సాహిత్యం కాదు. పాశ్చాత్య దేశాల్లో ఉన్నట్టుగా శాస్త్రీయంగా ఫలానా వయసు వారు ఫలానా స్థాయి పుస్తకాలు చదవాలని వాటిని రాసి, ప్రచురించరు. ఉన్నవల్లా ఏవో కొన్ని కథలే. అయితే అవన్నా వారు చదవకుండా బాలల పత్రికలన్నీ మూతపడటం విషాదం. ఇళ్లల్లో పెద్దలు కథలు వినిపించే ఆనవాయితీ పోవడం మరో విషాదం. అందుకే కనీసం పిల్లలు అలవాటు పడ్డ సెల్‌ఫోన్ ద్వారా అయినా వారికి కథలు అలవాటు చేయాలి.

ఇంటర్నెట్‌లో పిల్లల కోసం సైట్‌లు, యాప్‌లు, యూట్యూబ్ చానెళ్లు ఉన్నాయి. కుప్పలు తెప్పలుగా పుట్టుకొస్తున్నాయి. ఇవన్నీ కూడా పిల్లల కోసం నిర్వహించేవి, పిల్లలకే ప్రధాన భూమికను పోషించేవిగా ఉన్నాయి. వాటిలో https://manchipustakam.inని చూడటం పిల్లలకు అలవాటు చేయాలి. ఇక్కడ మంచి బాలల పుస్తకాలు ఉంటాయి. అలాగే https://storyweaver.org.in/en పిల్లల ఉచిత ఆన్‌లైన్ పుస్తకాలతో పాటు రాయడం, చదవడం, అనువదించడం పట్ల ఆసక్తి వున్న వారికి సహకరించే వేదిక. యూట్యూబ్‌లో పిల్లల కథల వీడియోలు చాలానే వున్నాయి. Geethanjali Kids&Telugu అనే యూట్యూబ్ చానల్‌లో 375 వీడియోలు వున్నాయి. MintuTelugu Rhymes అనే యూట్యూబ్ చానల్‌లో 178 కథల వీడియోలు దొరుకుతాయి. 'పిల్లల కంటెంట్' అనే ప్రత్యేకమైన ఆప్షన్ కూడా యూట్యూబ్‌లో వుంది. పిల్లలు తమ తమ ఊహలకు కొంత సాంకేతికతను జోడిస్తే అద్భుతమైన కథల వీడియోలతో వారే ఒక చానెల్ నిర్వహించవచ్చు. ఇప్పుడు ఏఐ టూల్స్ కూడా అందుబాటులోకి రావడంతో రకరకాల యానిమేషన్ థీమ్స్‌తో కథలను క్రియేట్ చేసేందుకు పిల్లలు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే అలాంటి వీడియోలు యూట్యూబ్‌లో చాలానే వున్నాయి. వీడియోలు ఎలా క్రియేట్ చేయాలో తెలిపే ట్యుటోరియల్స్ కూడా వున్నాయి. ఎవరు ఏ అంశంపై వీడియోలు చేయాలన్నా, వినాలన్నా, నేర్చుకోవాలన్నా. యూట్యూబ్‌లోని సెర్చ్ ఆప్షన్ ద్వారా వాటిని పొందవచ్చు.

పల్లెలకు చేరుతున్న కథలు



సెల్‌ఫోన్ ప్రతి ఒక్కరి జీవితంలో భాగం అయ్యాక నేను బాలల కథల వ్యాప్తికి దానినే సాధనంగా మలచుకున్నాను. మొదట అడుగు పెట్టింది ఫేస్‌బుక్‌లో. ఆ తరువాత వాట్సప్, ప్రతి లిపి, కహానియా.కాం, టెలిగ్రాం, ఇన్‌స్టాగ్రాం, డైలీహంట్, షేర్ చాట్, కూ, బ్లూపాడ్, స్టోరీ మిర్రర్.. ఇలా ప్రతిదానిలో బాలసాహిత్యాన్ని వాటి నిబంధనల మేరకు పోస్ట్ చేస్తుంటాను. ఈ మధ్య కోరాలో కొత్తగా అడుగుపెట్టాను. అంతేగాక కథలు, గేయాలు, బొమ్మలతో సామెతలు, పొడుపు కథలు సింగిల్ పేజీలుగా మార్చి అందమైన బొమ్మలతో ఆకర్షణీయంగా తయారు చేస్తుంటాను. వీటిని ఆర్కైవ్స్‌లో కూడా అప్ లోడ్ చేశాను. కథలు రాయడం ఎంత ముఖ్యమో వాటిని పాఠకులకు చేర్చడం కూడా అంతే ముఖ్యం. అందుకే రోజూ కొంత సమయం వీటికోసం కేటాయిస్తా. మారుతున్న కాలానికి తగినట్టుగా మనమూ మారక తప్పదు. నిజానికి సామాజిక మాధ్యమాల వల్లనే కొత్త పాఠకులు విపరీతంగా పెరిగారు. నగరాలను దాటి పల్లెలకు కూడా సాహిత్యాన్ని చేర్చగలుగుతున్నా. పుస్తకాల అమ్మకాలు కూడా వీటివల్ల విపరీతంగా పెరిగాయి. అడిగి మరీ కొంటున్నారు. 'హరి కథలు కర్నూల్' అనే పేరుతో యూట్యూబ్ చానెల్ ప్రారంభించి కథలను అక్కడ స్వయంగా చెప్పి పోస్ట్ చేస్తున్నాను. ఇవి కాకుండా 'వంద రోజులు – వంద కథలు' వాట్సాప్ గ్రూప్‌లో కథలు పోస్ట్ చేస్తుంటాను. ఇప్పుడు ఇందులో 38 వేల మంది సభ్యులు ఉన్నారు.

- డా. ఎం.హరికిషన్, బాలల రచయిత

• బూచిగా అప్పుల భూతం..

సూపర్ సిక్స్‌కు ఎగనామం

ఏపీ అప్పులపై చంద్రబాబు దుష్ప్రచారం బడ్జెట్ సాక్షిగా బట్టబయలు

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ స్పష్టీకరణ



చంద్రబాబు ఒక అబద్ధాన్ని సృష్టిస్తారు.. ఆ అబద్ధాన్ని తన చేతిలో ఉన్న ఎల్లో మీడియాతో పదే పదే రాయిస్తాడు. అదే విషయాలను పదే పదే మాట్లాడతాడు. పనిలో పనిగా తన దత్త పుత్రుడు, వివిధ పార్టీల్లోని టీడీపీ నాయకుల తోనూ పదేపదే అవే బద్ధాలను మాట్లాడిస్తారు. ట్వీట్లు పెట్టిస్తారు. చివరకి దాన్ని అంతర్జాతీయ అంశంగా చిత్రీకరిస్తారు. ఇది చంద్రబాబు ఆర్గనైజ్డ్ క్రైమ్ చేసే తీరు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పులపై చంద్రబాబు ఇదే రీతిలో ఆర్గనైజ్డ్ క్రైమ్‌కు పాల్పడ్డారు.

ఈ ఏడాది జూలై 22న అసెంబ్లీలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో గవర్నర్ ప్రసంగంలో 'రాష్ట్రం అప్పు రూ.10 లక్షల కోట్లు' అని చెప్పించారు. కనీసం రూ.14 లక్షల కోట్ల నుంచి రూ.10 లక్షల కోట్లకు తగ్గించినందుకు సంతోషం. అయినా అది కూడా తప్పుడు ప్రచారమే కదా!

ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సందర్భంగా చంద్రబాబు అప్పుల గురించి ఎంత గొప్పగా చెప్పారో (చంద్రబాబు ప్రసంగం వీడియోను ప్రదర్శించారు) చూద్దాం. బాధగా ఉందంటాడు.. ఆవేదనగా ఉందంటాడు.. హామీలు ఇచ్చాం.. సూపర్‌సిక్స్ ఇస్తామని చెప్పామంటాడు.. రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉందంటాడు.. భయం వేస్తుందంటాడు.. ముందుకు కదల్లేక పోతున్నామంటాడు.. ఈ విషయం రాష్ట్ర ప్రజలు కూడా ఆలోచించాలంటాడు.. చంద్రబాబు యాక్షన్ చూస్తుంటే దాన వీర శూర కర్ణలో ఎన్టీ రామారావును మించి నటిస్తున్నాడు.

చంద్రబాబు ముఠా ప్రచారం చేసినట్టుగా రాష్ట్ర అప్పు రూ.14 లక్షల కోట్లు, రూ.12.50 లక్షల కోట్లు, రూ.11లక్షల కోట్లు, రూ.10.లక్షల కోట్లు ఏమైంది? మీ బడ్జెట్ డాక్యుమెంట్‌లో మీరు చూపించిన అప్పులు రూ.6.46 లక్షల కోట్లు మాత్రమే కదా! అంటే ఇప్పటి వరకు మీరు చేసినవన్నీ దుష్ప్రచారాలే కదా! ఇది ధర్మమేనా? అప్పుల వార్షిక సగటు వృద్ధి రేటు ఎవరి హయాంలో తక్కువగా ఉంది? ఎవరి పాలనలో రాష్ట్రం శ్రీలంక అయ్యింది? అప్పు రత్న బిరుదు ఎవరికి ఇవ్వాలి? ఎవరు ఉంటే రాష్ట్రం శ్రీలంక అయ్యే అవకాశం ఎక్కువగా ఉందో ప్రజలందరూ అర్థం చేసుకోవాలి.

వారు అబద్ధాలనే గంభీరంగా ప్రచారం చేశారు. నిజానికి కోవిడ్ వల్ల దేశమే కాదు ప్రపంచంలోని చాలా దేశాలు అతలాకుతలం అయ్యాయి. ప్రభుత్వ ఆదాయం తగ్గింది. మరోవైపు ఖర్చు పెరిగింది. అయినా సరే చంద్రబాబు హయాంలో కంటే మా హయంలోనే ఆర్థిక నిర్వహణ చాలా బాగుంది. వాస్తవాలు ఇలా ఉంటే బాబు మాత్రం అప్పులపై ఆర్గనైజ్డ్ క్రైమ్ చేశారు.

చంద్రబాబు ఇప్పుడు మరో అడుగు ముందుకేసి చెల్లించాల్సిన బిల్లులు, బకాయిలున్నాయంటూ ప్రచారం చేస్తున్నాడు. బకాయిలనేవి కొత్తగా ఇప్పుడే ఈ ప్రభుత్వ హయాంలో ఉన్నట్టు చెబుతున్నారు. ప్రతి ప్రభుత్వంలో ప్రతి సంవత్సరంలో బిల్లులు అప్లోడ్ అవుతాయి. కొన్ని స్పిల్ ఓవర్ ఉంటాయి. ఇవన్నీ సర్వసాధారణం. ఇదే చంద్రబాబు తాను దిగిపోతూ 2019లో డిస్కమ్‌లు విద్యుత్ కొన్నందుకు డబ్బులు ఇవ్వలేదు. ఏకంగా రూ.21,541 కోట్లు బకాయి పెడితే మేము చెల్లించాం. రూ.42,183.80 కోట్ల బాకాయిలు మాకు గిఫ్ట్‌గా ఇచ్చి పోయాడు. అవన్నీ మేము కట్టాం.

- వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలు ఇస్తున్నప్పుడే వాటిని అమలు చేయలేనని తెలిసినా, మోసం చేయడమే తన నైజంగా పెట్టుకున్న చంద్రబాబు.. ప్రజల దృష్టిని మళ్లించేందుకు రాష్ట్ర అప్పులు రూ.11 లక్షల కోట్లు.. రూ.12.50 లక్షల కోట్లు.. రూ.14 లక్షల కోట్లు అంటూ చేసిన దుష్ప్రచారం బడ్జెట్ సాక్షిగా బట్టబయలైందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పులపై ఒక అబద్ధాన్ని సృష్టించి.. దాన్నే ఎల్లో మీడియాతో రాయించి.. ఆ తర్వాత దత్త పుత్రుడు, బీజేపీలోని టీడీపీ నాయకురాలు, తన వదినమ్మ, ఇతర పార్టీల్లోని టీడీపీ నాయకులతో పదే పదే మాట్లాడించి దుష్ప్రచారం చేసిన ఆర్గనైజ్డ్ క్రిమినల్ (వ్యవస్థీకృత నేరగాడు) చంద్రబాబు అని ధ్వజమెత్తారు. రాష్ట్రం శ్రీలంకలా దివాలా తీసినట్లు సీఎం ప్రకటిస్తారేమో అంటూ ఒక పద్ధతి ప్రకారం దుష్ప్రచారం చేశారని గుర్తు చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అప్పులపై చంద్రబాబు చేసిన దుష్ప్రచారాన్ని ఆధారాలతో సహా ఎండగట్టారు. అధికారంలోకి వచ్చాక కూడా ఆర్థిక శాఖపై నిర్వహించిన సమీక్షలో రాష్ట్ర అప్పు రూ.14 లక్షల కోట్లకు చేరుకుందంటూ సీఎం చంద్రబాబు లీకులు ఇచ్చారని.. రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని చిత్రీకరిస్తూ సూపర్ సిక్స్, ఇతర హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసేందుకు రంగం సిద్ధం చేశారని దుయ్యబట్టారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు ముందు గవర్నర్ ప్రసంగంలో రాష్ట్ర అప్పు రూ.10 లక్షల కోట్లంటూ గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించారని గుర్తు చేశారు. కానీ.. చంద్రబాబు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024–25 బడ్జెట్‌లో రాష్ట్ర అప్పు రూ.6.46 లక్షల కోట్లేనని తేలిందని ఎత్తి చూపారు. తద్వారా చంద్రబాబు ఆర్గనైజ్డ్ క్రైమ్ ఎలా చేస్తారన్నది బట్టయలైందని చెప్పారు. వైఎస్ జగన్ ఇంకాఏమన్నారంటే..

ఎనిమిది నెలలయ్యాక బడ్జెట్ ప్రవేశపెట్టడమా?

- ఈ బడ్జెట్ కేవలం ప్రజలను మభ్యపెట్టేందుకు మాత్రమే ప్రవేశపెట్టిన డాక్యుమెంట్‌లా ఉంది. నిజంగా ఎవరైనా ఎన్నికలైన వెంటనే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెడతారు. కానీ ఆర్థిక సంవత్సరం ప్రారంభమై 8 నెలలు గడిచాక.. కేవలం మరో నాలుగు నెలలు సమయం మాత్రమే ఉన్న పరిస్థితుల్లో ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌ను చూస్తే ఆశ్చర్యమేస్తోంది. పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే చంద్రబాబు మోసాలు, అబద్ధాలు అన్నీ బయటకొస్తాయని ఇలా చేశారు.
- ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలకు కేటాయింపులు జరపకపోతే మా సూపర్ సిక్స్ ఏమైంది.. సూపర్ సెవెన్ ఏమైందని ప్రజలు నిలదీస్తారని తెలుసు కాబట్టే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టకుండా సాగదీస్తూ వచ్చారు. దీనికి రకరకాల కారణాలు చెబుతూ వచ్చారు. పరిమితికి మించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పులు చేసిందని.. రాష్ట్రాన్ని శ్రీలంక చేసిందని.. ప్రజలను మభ్యపెట్టే విధంగా అబద్ధాలు ప్రచారం చేశారు. రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని చెబుతూ.. సూపర్ సిక్స్ సహా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

రాజకీయ లబ్ధి కోసమే దుష్ప్రచారం

- ఏ రాష్ట్రమైనా, ఏ ప్రభుత్వమైనా రాష్ట్ర అవసరాలకు తగినట్టుగా అప్పులు చేయడం బడ్జెట్‌లో భాగం. ఇది సర్వసాధారణంగా జరిగే కార్యక్రమం. ప్రతి రాష్ట్రానికి, ప్రతి ప్రభుత్వానికి ఎంత పర్సంటేజ్‌లో అప్పులు చేయాలో ఎఫ్‌ఆర్‌బీఎం నిర్దేశిస్తుంది. ఏ ప్రభుత్వమైనా జీఎస్‌డీపీలో 3 శాతం నుంచి 3.5 శాతంలోపే అప్పులు తీసుకుంటుంది. అంతకు మించి తీసుకునే అవకాశం ఉండదని అందరికీ తెలుసు.
- చంద్రబాబు, ఆయన కూటమి, ముఠా సభ్యులు మాత్రం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పులపై ఏ విధంగా ప్రచారం చేశారో అందరికీ తెలిసిందే. ఏ బ్యాంకు అయినా ప్రభుత్వాలకు రుణాలు ఇవ్వాలంటే ఒక పద్ధతి ఉంటుంది. కార్పొరేషన్ల ద్వారా కూడా ఇష్టమొచ్చినట్టు రుణాలు తీసుకోవడానికి అవకాశం లేదు. చంద్రబాబు సుందర ముఖారవిందం చూసో, జగన్ ముఖారవిందం చూసో ఏ బ్యాంకులు అప్పులు ఇవ్వవు. ఇవన్నీ వాస్తవాలు. కేవలం వారు రాజకీయంగా లబ్ధి పొందేందుకే ఇలా చేశారని స్పష్టమైంది.

అధికారంలోకి వచ్చాక కూడా విష ప్రచారమే

- అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా చంద్రబాబు తన తప్పుడు ప్రచారం మానలేదు. జూలై 10వ తేదీన ఆర్థిక శాఖపై సమీక్ష చేస్తూ 'రాష్ట్రం మొత్తం అప్పులు రూ.14 లక్షల కో ట్లు' అని లీకులిస్తాడు. ఈనాడులో రాస్తారు.. ఈటీవీలో చూపిస్తారు. ఎందుకంటే పూర్తి స్థాయి బడ్జెట్ పెట్టేందుకు చంద్రబాబుకు కారణాలు కావాలి. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్'కు కేటాయింపులు చేయకపోతే ప్రజ లు నిలదీస్తారని తెలుసు. అందుకే అధికా రంలోకి వచ్చిన తర్వాత కూడా తన దుష్ప్రచారం కొనసాగించారు.

బడ్జెట్ సాక్షిగా దుష్ప్రచారం బట్టబయలు

- అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ డాక్యుమెంట్‌లో రాష్టానికి ఎంత అప్పులు ఉన్నాయో చూపించాలి. అది తప్పనిసరి. ఈ బడ్జెట్ డాక్యుమెంట్‌లో రాష్ట్రానికి ఎవరి హయాంలో ఎంత అప్పులున్నాయో స్పష్టంగా వాళ్లే పేర్కొన్నారు. 14, 16 పేజీలను గమనిస్తే.. 2018–19 నాటికి.. అంటే చంద్రబాబు దిగిపోయే నాటికి అప్పులు రూ.2,57,509 కోట్లు. వీటికి ప్రభుత్వ గ్యారంటీతో వివిధ కార్పొరేషన్లు తీసుకున్న అప్పులు కూడా కలుపుకుంటే మరో రూ.55వేల కోట్లు. అంటే చంద్రబాబు దిగిపోయే నాటికి (2018–19) రూ.3.13 లక్షల కోట్ల అప్పులున్నాయి.
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చే నాటికి రూ.3.13 లక్షల కోట్లు ఉన్న అప్పులు, మా ప్రభుత్వం దిగిపోయే నాటికి రూ.4.91,774 కోట్లకు చేరాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీతో వివిధ కార్పొరేషన్లు తీసుకున్న అప్పులు మరో రూ.1.54 లక్షల కోట్లు.. రెండు కలిపితే రూ.6.46 లక్షల కోట్లు. అలాంటప్పుడు వాళ్లు ప్రచారం చేసినట్టుగా ఎక్కడ రూ.10 లక్షల కోట్లు, ఎక్కడ రూ.11 లక్షల కోట్లు, ఎక్కడ రూ.12.50 లక్షల కోట్లు, ఎక్కడ రూ.14 లక్ష లు కోట్లు అప్పులు? ఇవన్నీ దుష్ప్రచారాలే కదా?

అప్పుల రత్న బిరుదు ఎవరికివ్వాలి?

- చంద్రబాబు అధికారంలోకి వచ్చే నాటికి రూ.1.32 లక్షల కోట్ల అప్పులు ఉంటే.. ఆయన దిగిపోయేసరికి రూ.3.13 లక్షల కోట్లు అప్పులుగా ఉన్నా యి. అంటే అప్పుల సగటు వార్షిక వృద్ధిరే టు (సీఏజీఆర్) 19.54 శాతం. అదే మా హయాంలో అప్పు రూ.3.13 లక్షల కోట్ల నుంచి రూ.6.46 లక్షల కోట్లుకు చేరుకుంది. అంటే అప్పుల సగటు వార్షిక వృద్ధి రేటు 15.61 శాతం. అంటే.. చంద్రబాబు కంటే 4 శాతం తక్కువగా అప్పులు చేశాం.
- ఇక ప్రభుత్వ రంగ సంస్థల నాన్ గ్యారంటీ అప్పులు చూసినా.. 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చే నాటికి రూ.8,638 కోట్లు ఉన్న నాన్ గ్యారంటీ అప్పులు.. ఆయన దిగిపోయే నాటికి రూ.77,228 కోట్లకు చేరాయి. పవర్ సెక్టార్, డిస్కమ్‌లకు చేసిన అప్పులు ఏకంగా 54.98 శాతం పెరిగాయి. మేము డిస్కమ్‌లు కాపాడేందుకు, పబ్లిక్ సెక్టార్, నాన్ గ్యారంటీడ్ లయబులిటీస్ అయినా సరే దాన్ని తగ్గించే కార్యక్రమం చేశాం. రూ.77,228 కోట్ల నుంచి రూ.75,386 కోట్లకు తగ్గించాం. అంటే మా హయాంలో రుణం పెరగకపోగా – 0.48 శాతం తగ్గించాం.
- ప్రభుత్వ అప్పు, గ్యారంటీ అప్పు,. నాన్ గ్యారంటీ అప్పులు అన్ని కలిపి చూస్తే చంద్రబాబు అధికారంలోకి వచ్చే నాటికి అంటే 2014 నాటికి రూ.1.40 లక్షల కోట్లు ఉంటే.. ఆయన దిగేపోయే సరికి రూ.3.90 లక్షల కోట్లు చేరాయి. అంటే అప్పుల వార్షిక వృద్ధి రేటు 22.63 శాతం ఉంటే.. మా హయాంలో రూ 3.90 లక్షల కోట్లు రూ.7.21 లక్షల కోట్లు అయ్యింది. 13.57 శాతంగా అప్పుల వార్షిక వృద్ధి రేటు నమోదైంది. అది కూడా రెండేళ్లు కోవిడ్ దుర్భర పరిస్థితుల్లో. నిజంగా ఏదైనా అవార్డు ఇవ్వాలంటే మా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఇవ్వాలి. చక్కగా ఆర్థిక క్రమశిక్షణ పాటించినందుకు. చంద్రబాబుకు అప్పుల రత్న బిరుదు ఇవ్వాలి.

మాకు రూ.42,183.80 కోట్లు బకాయిల బహుమతి

- చంద్రబాబు పోతూ పోతూ రూ.42,183.80 కోట్లు బకాయిలు మాకు గిఫ్ట్‌గా ఇచ్చి పోయాడు. అవన్నీ మేము కట్టాం. ఉపాధి హామీ బకాయిలు రూ.2,340 కోట్లు, ఉద్యోగులకు రెండు డీఏలు బకాయి పెట్టాడు. ఆరోగ్యశ్రీ రూ.640 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2,800 కోట్లు, రైతులకు ధాన్యం సేకరణ బకాయిలు రూ.960 కోట్లు, విత్తన బకాయిలు రూ.380 కోట్లు, పంటల బీమా బకాయిలు రూ.500 కోట్లు, చివరికి పిల్లలకు మధ్యాహ్న భోజనం వండే ఆయాలకు, కోడిగుడ్లకు కూడా బకాయిలు పెట్టాడు.
- ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే ఏ ప్రభుత్వ హయాంలోనైనా కొన్ని బకాయిలు మామూలే. ఏటా ఈ బకాయిలు క్లియర్ అవుతూనే ఉంటాయి. దీన్నేదో చంద్రబాబు వక్రీకరించి.. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ ఎగరగొట్టాలనే దూరపు ఆలోచనతో కొత్త కథను బిల్డప్ చేస్తున్నాడు. సూపర్ సిక్స్ సహా ఎన్నికల్లో తాను ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసేందుకు అబద్ధాలకు రెక్కలు కట్టాడు. ఇలా చంద్రబాబు ఆర్గనైజ్డ్ క్రైమ్‌లో ఎవరెవరు భాగస్వాములై ఉన్నారో సాక్ష్యాధారాలతో సహా మీ ముందు పెట్టాను.

ఎవరి ప్రోగ్రెస్ ఏమిటి..?	2014-19	2019-24
అప్పులు (ప్రభుత్వ గ్యారెంటీలతో కలిపి)	రూ.3,13,018 కోట్లు (బాబు దిగిపోయే నాటికి)	రూ.6,46,531 కోట్లు (జగన్ దిగిపోయే నాటికి)
అప్పుల్లో సగటు వార్షిక వృద్ధి రేటు	19.54 శాతం	15.61 శాతం
ప్రభుత్వ అప్పులు, గ్యారెంటీ, నాన్ గ్యారెంటీ అప్పులు	రూ.3.90 లక్షల కోట్లు (బాబు దిగిపోయే నాటికి)	రూ.7.21 లక్షల కోట్లు (జగన్ దిగిపోయే నాటికి)
అప్పుల్లో సగటు వార్షిక వృద్ధి రేటు	22.63 శాతం	13.57 శాతం
ప్రభుత్వ ఉద్యోగాలు	-----	6.31 లక్షలు
జీడీపీలో రాష్ట్ర వాటా	4.47 శాతం	4.83 శాతం
డిస్కమ్‌లకు ప్రభుత్వ సాయం	రూ.13,255 కోట్లు	రూ.47,800 కోట్లు
ప్రభుత్వ ఆదాయం(తొలి ఆరు నెలలు)	రూ.41,570 కోట్లు	రూ.42436 కోట్లు
మూలధన వ్యయం	రూ.13,860 కోట్లు	రూ.15,632 కోట్లు
దేశ వస్తు ఉత్పత్తిలో రాష్ట్రం వాటా	2.86 శాతం	4.07 శాతం
డిస్కంల నష్టాలు	రూ.22 వేల కోట్లు	రూ.395 కోట్లు
ఇసుక ద్వారా ప్రభుత్వానికి ఆదాయం	సున్నా	రూ.750 కోట్లు

వైఎస్ జగన్ హయాలో సగటున ఏడాదికి రూ.47 వేల కోట్ల రుణాలు తీసుకుంటే.. చంద్రబాబు ఈ ఐదు నెలల్లో రూ.68,742 కోట్లు అప్పులు చేశారు.

మరిన్ని వివరాలు, వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

యుద్ధప్రాతిపదికన ట్రాక్‌ల పునరుద్ధరణ

- క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్న రైల్వే జీఎం అశోక్‌కుమార్ జైన్
- ఒకలైన్ అందుబాటులో తెచ్చేందుకు యత్నం



పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్ రామగుండం మధ్య గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో ధ్వంసమైన రైల్వే ట్రాక్ (ఇన్‌సెట్‌లో) ట్రాక్ పునరుద్ధరణ పనులు చేస్తున్న దృశ్యం

సాక్షి, పెద్దపల్లి/రామగుండం: ధ్వంసమైన మూడు ట్రాక్‌లను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నారు. ఐరన్ కాయిల్స్ లోడ్‌తో వెళుతున్న 44 వ్యాగన్లు ఉన్న గూడ్సు రైలు మంగళవారం రాత్రి రామగుండం–రాఘవాపూర్ రైల్వేస్టేషన్ల మధ్య కన్నాల గేట్ వద్ద పట్టాలు తప్పిన విషయం తెలిసిందే. బుధవారం రాత్రి వరకు ఒక ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేలా పనులు వేగంగా కొనసాగిస్తున్నారు. వందలాదిమంది కూలీలు, భారీయంత్రాలను వినియోగించి పట్టాలపై పడిపోయిన వ్యాగన్లను తొలగించారు. దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

39 రైళ్లు రద్దు.. 61 రైళ్లు దారిమళ్లింపు

కాజీపేట–బల్హార్షా మీదుగా నడిచే 39 రైళ్లను పూర్తిగా, 7 రైళ్లను పాక్షికంగా రద్దు చేసిన అధికారులు.. 61 రైళ్లను దారిమళ్లించారు. మరో 7 రైళ్లను రీషెడ్యూల్ చేశారు. దీంతో ప్రయాణికులు గమ్యస్థానాలు చేరుకునేందుకు ఎలాంటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివిధ స్టేషన్లలోని ప్రయాణికులు సమీప ఆర్టీసీ బస్టాండ్లకు చేరుకోవడంతో బస్సులు కిక్కిరిసిపోయాయి. రామగుండం మీదుగా దేశవ్యాప్తంగా నిత్యం ప్రయాణించేవారు వేల సంఖ్యలో ఉంటారు. టికెట్ రిజర్వేషన్ చేయించుకున్న వారు రైళ్ల రద్దుతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ప్రయాణికులకు సేవలు అందించడం, సమాచారం తెలియజేయడానికి రామగుండం రైల్వేస్టేషన్‌లో అధికారులు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు.

ప్రమాదాన్ని గుర్తించలేదా?

ఇటీవల ట్రాక్‌ల సామర్థ్యం పెంచారు. దీంతో గూడ్సు రైలు ప్రమాదానికి వేగం కారణం కాదని రైల్వే అధికారులు భావిస్తున్నారు. ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల సెల్సియస్ కన్నా తక్కువ ఉంటే పట్టాలు సంకోచ, వ్యాకోచాలకు లోనవుతాయని, ప్రమాద సమయంలో ఉష్ణోగ్రతలు ఆ స్థాయిలో లేవని వారు అంచనా వేస్తున్నారు. రైలు ఇంజిన్ నుంచి తొమ్మిదో నంబరు వ్యాగన్ పట్టాలు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుందని అంటున్నారు. ప్రమాదాన్ని పసిగట్టని లోకోపైలెట్ వేగం తగ్గించకుండా ముందుకు వెళ్లడంతో పట్టాలు తప్పిన 11 వ్యాగన్లు సుమారు కిలోమీటరు పొడవున అలాగే వెళ్లిపోయాయా? దీంతోనే భారీ నష్టం వాటిల్లిందా? లేదా మరేదైనా కుట్ర ఉందా? అనే కోణంలో డివిజనల్ సేఫ్టీ కమిటీతో పాటు రైల్వే ఇంటెలిజెన్స్ అధికారులు విచారణ జరుపుతున్నారు.

దిక్కుతోచడం లేదు



మా సొంతూరు వెళ్లేందుకు సంతోషంగా రైలెక్కిన. పెద్దపల్లి నుంచి కరీంనగర్, నిజామాబాద్, నాగపూర్ మీదుగా తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌ను నడిపిస్తే గమ్యస్థానం చేరుకునేవాడిని. రైళ్ల గురించి అడిగితే అధికారులు సమాధానం చెప్పడం లేదు. ఎలా వెళ్లాలో అర్థం కావడం లేదు.

– ప్రధాన్, ప్రయాణికుడు, ఝాన్సీ, ఉత్తరప్రదేశ్

12 గంటల ప్రయాణమైంది



దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో నాగ్‌పూర్ వెళ్లాలి. స్టేషన్‌కు వచ్చాక రైళ్ల రద్దు విషయం తెలిసింది. రిజర్వేషన్ ప్రయాణికులకు రైల్వేశాఖ సెల్‌నంబర్లు ఇస్తే బాగుంటుంది. బస్సులో నాగ్‌పూర్ వెళ్తున్న. రూ.500 ఖర్చుతో ఆరు గంటల్లో మా ఊరు చేరుకునేవాడిని. రైళ్ల రద్దుతో రూ.2వేల ఖర్చు, 12 గంటల సమయం పడుతుంది.

– సత్యం, ప్రయాణికుడు, నాగ్‌పూర్, మహారాష్ట్ర

కులగణన టీచర్లపై వేధింపులు ఆపాలి: పీఆర్టీయూటీఎస్

సాక్షి, హైదరాబాద్: కుల గణన చేస్తున్న టీచర్లను ఉన్నతాధికారులు వేధించడం మానుకోవాలని పీఆర్టీయూటీఎస్ అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుల్లం దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి బుధవారం లేఖ రాశారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 5 గంటల వరకే సర్వే చేపట్టమని ప్రభుత్వం సూచిస్తే, అధికారులు మాత్రం ఉదయం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు, సెలవు దినాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సర్వే చేయాలని అధికారులు ఆదేశించడం దారుణమన్నారు. సర్వే గడువును మరో ఐదు రోజులు పొడిగించాలని కోరారు. అత్యవసర పనులు, అనారోగ్యం వల్ల బాధపడే వారికి ఉదయం సెలవు పెట్టుకునే అవకాశం ఇవ్వాలని విన్నవించారు.

15న మినహాయింపు ఇవ్వాలి: పీఎస్‌టీయూ

కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈనెల 15న సర్వే నుంచి టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని ప్రైమరీ స్కూల్ టీచర్ల సంఘం అధ్యక్షుడు శిరందాసు రామదాసు, కోశాధికారి పానుగంటి నర్సింహాచారి ప్రభుత్వాన్ని కోరారు. సర్వే కోసం టీచర్లకు టార్గెట్లు పెట్టడాన్ని వారు వ్యతిరేకించారు. ప్రతీ వ్యక్తికి 50 కుటుంబాలే కేటాయించాలని, ఇతర గ్రాడ్యుయేట్లను కూడా సర్వేకోసం వినియోగించుకోవాలని సూచించారు.

డిసెంబర్ 31 వరకు 'కాళేశ్వరం' కమిషన్ గడువు!

- పీసీఘోష్ కమిషన్ గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు నెలలు పొడిగించింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేసినట్టు సమాచారం. గత నెలాఖరుతోనే ఈ కమిషన్ గడువు ముగియగా, తాజాగా డిసెంబర్ 31 వరకు పొడిగించింది. ఆలోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని కోరింది. ఈ ఏడాది మార్చి 14న చంద్రఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, ఇప్పటికే పలు దఫాలుగా కమిషన్ విచారణ నిర్వహించింది. మూడో విడత క్రాస్ ఎగ్జామినేషన్‌లో భాగంగా ఈ నెలలో ఐఏఎస్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులను విచారించనుంది. వచ్చే నెలలో గత ప్రభుత్వంలోని కీలకంగా వ్యవహరించిన ప్రజాప్రతినిధులను క్రాస్ ఎగ్జామినేషన్ చేసి నివేదికను సమర్పించే అవకాశం ఉంది.



బుధవారం మహారాష్ట్రలోని లాతూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేతో కలిసి అభివాదం చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వెన్నుపోటుదారులకు బుద్ధి చెప్పండి

▶ మొదటి పేజీ తరువాయి

వర్లీ, ధారావి, సైన్ కోలివాడల్లో ఎంవీఏ అభ్యర్థులకు మద్దతుగా బహిరంగ సభలు, రోడ్‌షోల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికార మహాయుతి కూటమిపై విమర్శలు గుప్పించారు. ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు ఆదిత్య ఠాక్రేను వర్లీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి, నిజామాబాద్ కోడలైన వర్షా గైక్వాడ్‌ను ధారావి నుంచి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇక్కడి తెలుగు ప్రజల సమస్యలన్నింటినీ ఎంవీఏ ప్రభుత్వం పరిష్కరించేలా తాను హామీగా ఉంటానని తెలిపారు. కాగా వర్లీ బీడీడీ చాల్స్‌లో నివసించే స్థానిక తెలంగాణ ప్రజలు రేవంత్‌రెడ్డి రోడ్డు షోకు బ్రహ్మరథం పట్టారు. దీంతో రేవంత్‌రెడ్డి కూడా తాను ముంబైలో కాకుండా నిజామాబాద్, కరీంనగర్‌లో ఉన్నట్టుగా అనిపిస్తోందని అన్నారు. రోడ్డు షోకు ముందు రేవంత్‌రెడ్డి వర్లీ బీడీడీ చాల్స్‌లోని శ్రీ వేంకటేశ్వర (బాలాజీ) స్వామి ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తెలంగాణ ప్రజలు వారి సమస్యలు తెలుపుతూ వినతిపత్రాలు సమర్పించారు.

'మేడిగడ్డ'లో భారీ కుట్ర!

▶ మొదటి పేజీ తరువాయి

డివిజన్–1 ఈఈ (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) సీహెచ్ తిరుపతిరావు, ఎస్ఈ బీవీ రమణారెడ్డి సర్టిఫికెట్ జారీ చేశారు. ఈ విషయంలో అధికారులిద్దరూ నిర్మాణ సంస్థ 'ఎల్ అండ్ టీ'తో కుమ్మక్కై అనుచిత లబ్ధి కల్పించారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగిస్తూ.. ఒప్పందంలోని 42వ క్లాజ్ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరపకుండానే పనులు పూర్తయినట్టు తప్పుడు ధ్రువీకరణ ఇచ్చారు. నిర్మాణ సంస్థ విజ్ఞప్తిని సరిగ్గా పరిశీలించలేదు. ఏ పని పూర్తయిందో స్పష్టంగా పేర్కొనలేదు. ప్రభుత్వ ఖజానాకు రూ.22.9 కోట్ల నష్టం వాటిల్లింది. ఎస్ఈ, ఈఈతోపాటు నిర్మాణ సంస్థ కూడా సంబంధిత చట్టాల కింద క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు అర్హులే.

తప్పుడు వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్..

మేడిగడ్డ బరాజ్ మిగులు పనులు పూర్తిచేయాలని... దెబ్బతిన్న సీసీ బ్లాకులు, వియరింగ్ కోట్‌కు మరమ్మతులు చేయాలని 2021 ఫిబ్రవరి 17న కాంట్రాక్టర్‌కు జారీచేసిన నోటీసులను విస్మరిస్తూ, 2021 మార్చి 15న వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చారు. బరాజ్‌లో లోపాలు సరిదిద్దాలంటూ 2020 మే 18న స్వయంగా తానే జారీ చేసిన నోటీసులను విస్మరిస్తూ.. వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్‌పై ఎస్ఈ రమణారెడ్డి కౌంటర్ సంతకం చేసి ఒప్పందంలోని 52.2(సీ) క్లాజును ఉల్లంఘించారు. మిగులు పనుల పూర్తి, మరమ్మతుల నిర్వహణలో ఎల్ అండ్ టీ విఫలమైంది. మెజర్‌మెంట్ బుక్ నం.56/2000 పేరుతో వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్ జారీ చేశారు. కానీ అసలు అలాంటి సర్టిఫికెటే లేదని తేలింది. అంటే పనులు పూర్తయ్యాయా లేదా అన్నది పరిశీలించలేదని అర్థమవుతోంది. ఉద్దేశపూర్వకంగానే నిర్మాణ సంస్థకు అనుచిత లబ్ధి కలిగించారు. బరాజ్ దెబ్బతిన్నా నిర్మాణ సంస్థను బాధ్యులుగా చేయలేని పరిస్థితి కల్పించి ప్రభుత్వాన్ని ఇబ్బందికర పరిస్థితిలో పడేశారు. గడువుకు ముందే బ్యాంకు గ్యారంటీలనూ తిరిగి ఇచ్చేయడం కూడా.. నిర్మాణ సంస్థతో మరమ్మతులు చేయించే అవకాశానికి గండికొట్టింది.

నిర్వహణలో నేరపూరిత నిర్లక్ష్యం

బరాజ్ ప్రారంభించిన నాటి నుంచే డ్యామేజీలు, లీకేజీలు బయటపడినా.. అధికారులు, నిర్మాణ సంస్థ మరమ్మతులు చేపట్టలేదు. డ్యామ్ అధికారులు నిర్వహణను గాలికి వదిలేసి, నిర్మాణ సంస్థకు లేఖలు రాయడంతో సరిపెట్టారు. డ్యామ్ అధికారుల నేరపూరిత నిర్లక్ష్యంతోనే బరాజ్ కుంగిపోయి ఖజానాకు తీవ్ర నష్టం కలిగించింది. అధికారులు, కాంట్రాక్టర్‌ను ప్రాసిక్యూట్ చేయాలి.

నాణ్యత పరీక్షలు లేకుండానే చెల్లింపులు

బరాజ్‌లకు నాణ్యత పరీక్షలు నిర్వహించకుండానే కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించారు. నాణ్యత పరీక్షలు నిర్వహించకుండా క్షేత్రస్థాయి ఇంజనీర్లు, క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్లు భారీ తప్పిదం చేశారు..'' అని విజిలెన్స్ మధ్యంతర నివేదికలో పేర్కొంది.

కొంపముంచిన కాఫర్ డ్యామ్!

బరాజ్ నిర్మాణానికి ముందు వరదను మళ్లించడానికి ఏర్పాటు చేసిన కాఫర్ డ్యామ్, దానికి సంబంధించిన షీట్‌పైల్స్‌ను నిర్మాణం పూర్తయిన తర్వాత సంపూర్ణంగా తొలగించలేదు. అవి నదిలో సహజ వరద ప్రవాహానికి అడ్డంకిగా మారి బరాజ్‌కు ముప్పు కలిగించాయి. కాఫర్ డ్యామ్ తొలగించడం పూర్తిగా కాంట్రాక్టర్ బాధ్యతే. బరాజ్‌ను ప్రారంభించాక కాంట్రాక్టర్‌కు అధిక చెల్లింపులు చేసి.. ఉద్దేశపూర్వకంగా నిధుల దుర్వినియోగానికి పాల్పడేందుకు కాఫర్ డ్యామ్ అంచనాలను రూ.61.21 కోట్లకు పెంచారు. ఈ అంశంలో అధికారులు, కాంట్రాక్టర్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి.

- డీవాటరింగ్ పనుల్లో అధికారులు కాంట్రాక్టర్‌కు రూ.39.43 కోట్ల అనుచిత లబ్ధి కలిగించారు. పని విలువలో డీవాటరింగ్ వ్యయం 3శాతంలోపే ఉండాలి. కానీ 2017 డిసెంబర్ 9న నాటి సీఎం నిర్వహించిన సమీక్షలో 5 శాతానికి మించిన వ్యయంతో సవరణ అంచనాలను ఆమోదించారు.

సాక్షి బిజినెస్
గురువారం
14-11-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
984	324
77,691	23,559

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	19,314	▲	33
డోజోన్స్	44,068	▲	157
ఎఫ్‌టీఎస్ఈ 100	8,030	▲	5
డాక్స్	19,003	▽	31
షాంఘై	3,439	▲	17
నికాయ్	38,722	▽	654

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	75,166	▽	266
బంగారం (99.5 స్వచ్ఛత)	74,865	▽	265
వెండి (కిలో)	89,654	▽	1,265

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	84.00	85.02
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	106.33	109.16
€	యూరో	ఒకటి	88.48	91.08
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	53.93	55.30
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.15	56.34
S$	సింగపూర్ డాలర్	[illegible]	60.74	66.12
SAR	సౌదీ రియాల్	[illegible]	21.61	23.15
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	23.09	23.85
¥	చైనా యువాన్	[illegible]	10.80	12.63

స్విగ్గీ 'లాభాల' డెలివరీ

మెప్పించిన లిస్టింగ్

- తొలి రోజే షేరు 17% జంప్



ముంబై: ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ సంస్థ స్విగ్గీ షేరు లిస్టింగ్ రోజే ఇన్వెస్టర్లకు 17% లాభాలు డెలివరీ చేసింది. ఎన్ఎస్ఈలో ఇష్యూ ధర (రూ.390)తో పోలిస్తే 8% ప్రీమియంతో రూ.420 వద్ద లిస్టయ్యింది. నష్టాల మార్కెట్లో ఈ షేరుకు డిమాండ్ లభించింది. ఇంట్రాడేలో 19.50% పెరిగి రూ.466 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 17% లాభంతో రూ.456 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1.03 లక్షల కోట్లుగా నమోదైంది.

■ ఐపీఓ లిస్టింగ్‌తో స్విగ్గీ కంపెనీలో 500 మంది ఉద్యోగులు కోటీశ్వరులయ్యారు. పబ్లిక్ ఇష్యూ కంటే ముందే స్విగ్గీ తన 5,000 మంది ఉద్యోగులకు ఎంప్లాయీ స్టాక్ ఓనర్‌షిప్ ప్లాన్ (ఈ–సాప్స్) కింద పెద్ద మొత్తంలో షేర్లు కేటాయించింది. ఐపీఓ గరిష్ఠ ధర శ్రేణి రూ.390 ప్రకారం వీటి విలువ రూ.9,000 కోట్లుగా ఉంది. దలాల్ స్ట్రీట్‌లో షేరు రూ.420 వద్ద లిస్ట్ కావడంతో ఉద్యోగులకు కేటాయించిన షేర్ల విలువ అమాంతం పెరిగింది. దీంతో సుమారు 500 మంది ఉద్యోగులు ఒక్కొక్కరి దగ్గర షేర్ల విలువ రూ. కోటికి పైగా చేరింది.

■ స్విగ్గీ షేర్లు మార్కెట్లోకి లిస్ట్ కావడంపై జొమాటో సీఈఓ దీపిందర్ గోయల్ శుభాకాంక్షలు తెలిపారు. స్విగ్గీ, జొమాటోకు సంబంధించిన ఒక ఫొటోను 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేస్తూ 'నువ్వు, నేను ఈ అందమైన ప్రపంచంలో..' అంటూ రాసుకొచ్చారు.

5 ఏళ్లలో పటిష్ట వృద్ధి: సీఈఓ శ్రీహర్ష

వచ్చే 3–5 ఏళ్లలో పటిష్ట వృద్ధి పథంలో దూసుకెళ్తామని స్విగ్గీ సీఈఓ శ్రీహర్ష ఆశాభావం వ్యక్తం చేశారు. ఇన్‌స్టామార్ట్ నెట్‌వర్క్‌ను మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తామన్నారు. పెద్ద డార్క్ స్టోర్లను ప్రారంభిస్తామని చెప్పారు. పెద్ద నగరాల్లో సగటు డెలివరీ సమయం 17 నిమిషాల నుంచి 12 నిమిషాలకు తగ్గిందన్నారు.

4 నెలల కనిష్టానికి నిఫ్టీ

- సెన్సెక్స్ 984 పాయింట్ల పతనం
- బ్యాంకులు, ఆటో షేర్లలో భారీ అమ్మకాలు



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి బుధవారమూ కొనసాగింది. రిటైల్ ద్రవ్యోల్బణం అక్టోబర్‌లో 14 నెలల గరిష్టానికి చేరుకోవడంతో పాటు విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. సెన్సెక్స్ 984 పాయింట్లు పతనమై 77,691 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 324 పాయింట్లు క్షీణించి 23,559 వద్ద నిలిచింది. ఈ సూచీకి ఇది అయిదోరోజూ నష్టాల ముగింపు. నాలుగు నెలల కనిష్ట స్థాయి. ఉదయం స్తబ్దుగా మొదలైన సూచీలు అంతర్జాతీయ మార్కెట్లోని ప్రతికూల సంకేతాలతో నష్టాల బాటపట్టాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,141 క్షీణించి 77,533 వద్ద, నిఫ్టీ 373 పాయింట్లు కోల్పోయి 23,510 వద్ద కనిష్టాలను తాకాయి. ఇంట్రాడేలో అన్ని రంగాల షేర్లలోనూ విక్రయాలు వెల్లువెత్తాయి. అత్యధికంగా రియల్టీ ఇండెక్స్ 3.2% క్షీణించింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ ఏకంగా 3% పతనమైంది. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.5% పడింది.

- సెన్సెక్స్ రెండు రోజుల్లో 1,805 పాయింట్ల పతనంతో ఇన్వెస్టర్ల సంపద రూ.13.07 లక్షల కోట్లు హరించుకుపోయింది. దీంతో బీఎస్ఈలో మార్కెట్ విలువ రూ.429.46 లక్షల కోట్లకు దిగివచ్చింది.
- ఆక్మే సోలార్ లిస్టింగ్ నిరాశ పరిచింది. ఇష్యూ ధర(రూ.289)తో పోలిస్తే బీఎస్ఈలో 10% డిస్కౌంటుతో రూ.259 వద్ద లిస్టయ్యింది. ఒక దశలో 14% పతనమై రూ.249 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 12% నష్టంతో రూ.254 వద్ద ముగిసింది.

జోయ్ అలుక్కాస్ 'స్ప్రెడింగ్ జాయ్' అరబిక్ ఎడిషన్



దుబాయ్: జోయాలుక్కాస్ గ్రూప్ ఛైర్మన్, ఎండీ జోయ్ అలుక్కాస్ స్వీయ జీవిత చరిత్ర 'స్ప్రెడింగ్ జాయ్'ను అరబిక్ ఎడిషన్‌లో విడుదల చేశారు. భారత్‌లో తన వ్యాపార ప్రయాణాన్ని ప్రారంభించి.., అంతర్జాతీయ స్థాయిలో జోయాలుక్కాస్ విస్తరింపజేసిన 'జోయ్ అలుక్కాస్' జీవిత గాథ తనకెంతో ప్రేరణ అని యూఏఈ విదేశీ వాణిజ్య శాఖ సహాయ మంత్రి హెచ్ఈ డాక్టర్ థానీ బిన్ అహ్మద్ అల్ జాయోదీ కొనియాడారు. యూఏఈ, భారత్‌ల మధ్య వాణిజ్య సంబంధాన్ని మరింత బలోపేతం చేయడంతో జోయ్ కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో కన్సూల్ జనరల్ ఆఫ్ ఇండియా సతీష్ కుమార్, కన్సూల్ జనరల్ ఆఫ్ దుబాయ్ రాబర్ట్ రైన్స్ ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

టీఎస్ఐ ఇండియా చేతికి టీసీపీఎస్ఎల్

టాటా కమ్యూనికేషన్స్ నుంచి టాటా కమ్యూనికేషన్స్ పేమెంట్ సొల్యూషన్స్‌లో (టీసీపీఎస్ఎల్) 100% వాటాలను కొనుగోలు చేసేందుకు ట్రాన్సాక్షన్ సొల్యూషన్స్ ఇంటర్నేషనల్ ఇండియా (టీఎస్ఐ ఇండియా) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ రూ. 330 కోట్లుగా ఉంటుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఎన్‌టీపీసీ గ్రీన్ రూ. లక్ష కోట్ల పెట్టుబడి
ఐటీసీ చైర్మన్‌గా అరవిందర్ సింగ్ సాహ్నీ

సన్‌రూఫ్.. సూపర్ క్రేజ్!

కారు ప్రియులను ఆకట్టుకుంటున్న ఫీచర్ | అన్ని మోడల్స్‌లోనూ కోరుకుంటున్న కస్టమర్లు | టాప్‌గేర్‌లో దూసుకెళ్తున్న మార్కెట్ | ఉత్పత్తి భారీగా పెంచుతున్న దిగ్గజ సంస్థలు | హై డిమాండ్‌తో పెట్టుబడులకు క్యూ...

బీచ్ రోడ్డులోనో... ఫారెస్ట్ దారిలోనో కారులో అలా ఓ లాంగ్ డ్రైవ్‌కెళ్లాలని ఎవరికుండదు చెప్పండి? దీంతో పాటు కారులో సన్‌రూఫ్ కూడా ఉంటే... మజామజాగా ఉంటుంది కదూ! దేశంలో కారు ప్రియుల మది దోచేస్తున్న క్రేజీ ఫీచర్ ఇది. ఒకప్పుడు లగ్జరీ కార్లకే పరిమితమైన ఈ అదిరిపోయే ఫీచర్ ఇప్పుడు చిన్న కార్లలోనూ వచ్చి చేరుతుండటం దానికున్న క్రేజ్‌కు నిదర్శనం! – సాక్షి, బిజినెస్ డెస్క్

దేశీ ఆటోమొబైల్ రంగంలో ఇప్పుడు సన్/మూన్ రూఫ్ మాంచి ట్రెండింగ్‌లో ఉంది. యువ కస్టమర్ల జోరుతో ఈ ఫీచర్ 'టాప్'లేపుతోంది. దీంతో ఆటోమొబైల్ కంపెనీలు ఎస్‌యూవీలు, సెడాన్‌లతో పాటు హ్యాచ్‌బ్యాక్స్‌లోనూ దీన్ని చేర్చేందుకు సై అంటున్నాయి. డిమాండ్ 'రూఫ్'ను తాకుతుండటంతో ప్రపంచ స్థాయి తయారీ సంస్థలు దీన్ని సొమ్ము చేసుకోవడానికి తహతహలాడుతున్నాయి. మార్కెట్లో అధిక వాటా కోసం భారీ పెట్టుబడులతో ఉత్పత్తి పెంచే పనిలో ఉన్నాయి. నెదర్లాండ్స్‌కు చెందిన ఇనాల్ఫా రూఫ్ సిస్టమ్స్ దాని భాగస్వామ్య సంస్థ గాబ్రియెల్ ఇండియాతో కలిసి తయారీని పరుగులు పెట్టిస్తోంది. వచ్చే ఏడాది కాలంలో సన్‌రూఫ్‌ల ఉత్పత్తిని రెట్టింపు చేయాలనేది ఈ జాయింట్ వెంచర్ (ఐజీఎస్ఎస్) లక్ష్యం. ఈ ఏడాది ఆరంభంలో చెన్నైలో తొలి ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన ఐజీఎస్ఎస్‌కు ఏటా 2 లక్షల సన్‌రూఫ్‌ల తయారీ సామర్థ్యం ఉంది. హ్యుందాయ్, కియా కంపెనీలకు ఇది సన్‌రూఫ్‌లను సరఫరా చేస్తోంది. ఇక జర్మనీకి చెందిన గ్లోబల్ సన్‌రూఫ్ తయారీ దిగ్గజం వెబాస్టో కూడా తయారీ గేరు మార్చింది. ప్రస్తుతం ఏటా 5 లక్షల యూనిట్లను ఉత్పత్తి చేస్తుండగా... 2027 నాటికి రెట్టింపు స్థాయిలో 9.5 లక్షల యూనిట్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. రూ.1,000 కోట్లకు పైగా ఇన్వెస్ట్ చేస్తోంది.

ట్రెండ్ రయ్ రయ్...

దేశీ వాహన రంగంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా యువ కస్టమర్ల అభిరుచులకు తగ్గట్లుగా కొంగొత్త ఫీచర్లను ప్రవేశపెట్టేందుకు కార్ల కంపెనీలు పోటీ పడుతున్నాయి. అత్యధికంగా కారు ప్రియులు కోరుకుంటున్న ఫీచర్లలో సన్‌రూఫ్ శరవేగంగా దూసుకుపోతోందని యూనో మిండా చైర్మన్, ఎండీ ఎన్‌కే మిండా చెబుతున్నారు. దేశంలోని దిగ్గజ వాహన విడిభాగాల సంస్థల్లో ఇది ఒకటి. సన్‌రూఫ్‌ల తయారీ కోసం తాజాగా జపాన్‌కు చెందిన ఐసిన్ కార్ప్‌తో సాంకేతిక లైసెన్స్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ప్రపంచంలోని టాప్–10 వాహన విడిభాగాల ఉత్పత్తి కంపెనీల్లో ఐసిన్ కార్ప్ కూడా ఒకటి. కాగా, యూనో మిండా 80,000 యూనిట్ల వార్షిక సామర్థ్యంతో హరియాణాలో కొత్త ప్లాంట్ నెలకొల్పుతోంది. 'ఈ మధ్య కాలంలో సన్‌రూఫ్‌ల వాడకం ఓ రేంజ్‌లో పెరుగుతోంది. గతంలో బడా ఎస్‌యూవీలు, లగ్జరీ కార్లకే పరిమితమైన ఈ ట్రెండ్ మరింత జోరందుకోనుంది. ఇప్పుడు హ్యాచ్‌బ్యాక్ (చిన్న కార్లు) కస్టమర్లు సైతం ఈ ఫీచర్ కోసం ఎగబడుతుండటమే దీనికి కారణం' అని మిండా వ్యాఖ్యానించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో మాదిరే ఇక్కడా వినూత్న ఫీచర్లు, కస్టమైజేషన్లకు ప్రాధాన్యమిచ్చే ట్రెండ్ కనిపిస్తోందన్నారు.



స్టేటస్ సింబల్...

ఇప్పుడు కారే కాదు అందులోని ప్రీమియం ఫీచర్లు కూడా స్టేటస్ సింబల్‌గా మారుతున్నాయి. ఇందులో సన్‌రూఫ్ కూడా ఒకటి. క్రూయిజ్ కంట్రోల్, కళ్లు చెదిరే డిస్‌ప్లేలు, అధునాతన డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ లాంటి ఫీచర్లకు ఉండే క్రేజ్ వేరే లెవెల్. వీటి వాడకం అరుదుగానే ఉన్నప్పటికీ, భారతీయ రోడ్ల పరిస్థితులకు పెద్దగా ఉపయోగకరం కానప్పటికీ.. కస్టమర్లు మరిన్ని ప్రీమియం ఫీచర్లు కోరుకుంటుండటంతో కార్ల కంపెనీలు వాటిని తప్పనిసరిగా అందించాల్సిన పరిస్థితి నెలకొందని జాటో డైనమిక్స్ ప్రెసిడెంట్ రవి భాటియా పేర్కొన్నారు.

ప్రతి నాలుగు కార్లలో ఒకటి...

జాటో డైనమిక్స్ గణాంకాల ప్రకారం.. ప్రస్తుతం దేశంలో అమ్ముడవుతున్న ప్రతి నాలుగు కార్లలో ఒక కారుకు (27.5%) ఈ లగ్జరీ ఫీచర్ ఉంది. ఐదేళ్ల క్రితం 12.7%తో పోలిస్తే కస్టమర్లు దీనికి ఎలా ఫిదా అవుతున్నారనేది ఈ జోరు చాటిచెబుతోంది. కాగా వచ్చే ఐదేళ్లలో (2029 నాటికి) ఈ విభాగంలో 17.6 శాతం వార్షిక వృద్ధి (సీఏజీఆర్) నమోదవుతుందనేది వాహన పరిశ్రమ అంచనా. ముఖ్యంగా ఎస్‌యూవీల్లో సన్‌రూఫ్ ఫీచర్‌కు ఫుల్ డిమాండ్ ఉంది. ఈ ఏడాది జనవరి–ఆగస్ట్ మధ్య ఏకంగా 44.7% వృద్ధి ఈ విభాగంలో నమోదైంది. మరోపక్క, భారతీయ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా తయారీ సంస్థలు అధునాతన గ్లాస్ టెక్నాలజీతో సన్‌రూఫ్‌లను ప్రవేశపెడుతున్నాయి. వేడిని బాగా తట్టుకోవడం, యూవీ కిరణాల నుంచి రక్షణతో పాటు సన్‌రూఫ్‌లను 'స్మార్ట్‌రూఫ్'లుగా మార్చేస్తున్నాయి. పానోరమిక్ సన్‌రూఫ్‌లు కారు లోపల మరింత విశాలమైన స్పేస్ ఫీలింగ్‌ను కూడా అందిస్తాయని భాటియా చెబుతున్నారు.



భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

గెయిల్(ఇండియా) లిమిటెడ్‌లో 261 పోస్టులు

న్యూఢిల్లీలోని గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(గెయిల్) దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న గెయిల్ వర్క్ సెంటర్లు/యూనిట్‌లలో వివిధ విభాగాల్లో ఈ1, ఈ2 గ్రేడ్ కేడర్‌లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 261.
» పోస్టుల వివరాలు: సీనియర్ ఇంజనీర్(రెన్యూవబుల్ ఎనర్జీ)–06, సీనియర్ ఇంజనీర్(బాయిలర్ ఆపరేషన్స్)–03, సీనియర్ ఇంజనీర్(మెకానికల్)–30, సీనియర్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)–06, సీనియర్ ఇంజనీర్(ఇన్‌స్ట్రుమెంటేషన్)–01, సీనియర్ ఇంజనీర్ (కెమికల్)–36, సీనియర్ ఇంజనీర్(గెయిల్‌టెల్–టీసీ/టీఎం)–05, సీనియర్ ఆఫీసర్(ఫైర్ అండ్‌సేఫ్టీ)–20, సీనియర్ ఆఫీసర్(సి–పి)–22, సీనియర్ ఇంజనీర్(సివిల్)–11, సీనియర్ ఆఫీసర్(మార్కెటింగ్)–22, సీనియర్ ఆఫీసర్(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్)–36, సీనియర్ ఆఫీసర్(హ్యూమన్ రిసోర్స్)–23, సీనియర్ ఆఫీసర్(లా)–02, సీనియర్ ఆఫీసర్(మెడికల్ సర్వీసెస్)–01, సీనియర్‌ఆఫీసర్(కార్పొరేట్ కమ్యూనికేషన్)–4,ఆఫీసర్(ల్యాబొరేటరీ)–16, ఆఫీసర్(సెక్యూరిటీ)–4, ఆఫీసర్(అఫీషియల్ లాంగ్వేజ్)–13.
» అర్హత: పోస్టును అనుసరించి బీఏ, బీకాం, బీఎస్సీ ఎల్ఎల్‌బీ, ఎంబీబీఎస్, ఎమ్మెస్సీ, సీఏ, సీఎంఏ, పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» గరిష్ఠ వయో పరిమితి: సీనియర్ ఆఫీసర్(మెడికల్ సర్వీసెస్)/ఆఫీసర్(ల్యాబొరేటరీ) పోస్టులకు 32 ఏళ్లు. ఆఫీసర్(సెక్యూరిటీ) పోస్టులకు 45 ఏళ్లు. ఆఫీసర్(అఫీషియల్ లాంగ్వేజ్)పోస్టులకు 35 ఏళ్లు, ఇతర పోస్టులకు 28 ఏళ్లు మించకూడదు.
» పే స్కేల్: నెలకు సీనియర్ ఇంజనీర్/సీనియర్ ఆఫీసర్ పోస్టులకు రూ.60,000 నుంచి రూ.1,80,000, ఆఫీసర్ పోస్టులకు రూ. 50,000 నుంచి రూ.1,60,000 ఉంటుంది.
» ఎంపిక విధానం: గ్రూప్ డిస్కషన్, ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది: 12.11.2024
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:11.12.2024
» వెబ్‌సైట్: https://gailonline.com

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, మెదక్‌లో 86 పోస్టులు

ఆర్మ్‌డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్(ఏవీఎన్ఎల్)కు చెందిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్(ఓఎఫ్ఎమ్‌కె) ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 86.
» పోస్టుల వివరాలు: జూనియర్ మేనేజర్–50, డిప్లొమా టెక్నీషియన్–21, అసిస్టెంట్–11, జూనియర్ అసిస్టెంట్–04.
» విభాగాలు: మెకానికల్, ప్రొడక్షన్, క్వాలిటీ, ఇంటిగ్రేటెడ్ మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రికల్,మెటలర్జీ,టూల్ డిజైన్, డిజైన్, క్వాలిటీ అండ్ ఇన్‌స్పెక్షన్,హెచ్‌ఆర్,స్టోర్స్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా,డిగ్రీ(బీఏ/బీఎస్సీ/బీకామ్)బీఈ/బీటెక్,పీజీ(ఎంఏ/ఎంఎస్సీ/ఎంకామ్/ఎంబీఏ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వేతనం: నెలకు జూనియర్ మేనేజర్ పోస్టులకు రూ.30,000, డిప్లొమా టెక్నీషియన్ పోస్టులకు రూ.23,000, అసిస్టెంట్ పోస్టులకు 23,000, జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు రూ.21,000.
» వయసు: 30ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» ఎంపిక విధానం: విద్యార్హతలు,పని అనుభవం, స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» దరఖాస్తులకు చివరితేది: నోటిఫికేషన్ వెలువడిన 21 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలి.
» నోటిఫికేషన్ వెలువడిన తేది: 11.11.2024.
» వెబ్‌సైట్: https://avnl.co.in

టీఐఎస్ఎస్, ముంబైలో 33 పోస్టులు

ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టీఐఎస్ఎస్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 33
» పోస్టుల వివరాలు: ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్–01, ప్రోగ్రామ్ కోర్డినేటర్‌లు–01, అకౌంటెంట్–01, అప్పర్ డివిజన్ క్లర్క్‌లు(యూడీసీ)–02, ప్రోగ్రామ్ అసిస్టెంట్స్ కమ్ ఫీల్డ్ ఆఫీసర్–02, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్–25, ఆఫీస్ అసిస్టెంట్–01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వేతనం: నెలకు ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు రూ.85,000, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్స్ పోస్టులకు రూ.65,000, అకౌంటెంట్ పోస్టులకు రూ.45,000, ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు రూ.25,000, మిగతా పోస్టులకు రూ.35,000.
» ఎంపిక విధానం:రాతపరీక్ష,ఇంటర్వ్యూ ఆధారంగా
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» పని చేయాల్సిన ప్రాంతాలు: ముంబై, డెహ్రాడూన్, ఉత్తరాఖండ్.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.11.2024.
» వెబ్‌సైట్: https://www.tiss.edu

ఆస్ట్రేలియాలో అవకాశాలకు మేట్స్!

విదేశీ విద్య, ఉద్యోగాల పరంగా అమెరికా, బ్రిటన్, కెనడా తర్వాత ఎక్కువ మంది భారతీయులు చూసేది ఆస్ట్రేలియా వైపే! ఇలాంటి వారికి ఆస్ట్రేలియా ప్రభుత్వం మరో కొత్త విధానంతో స్వాగతం పలుకుతోంది! స్పాన్సర్‌షిప్ లేకున్నా.. నేరుగా వర్క్ వీసాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తోంది! అదే.. మొబిలిటీ అరేంజ్‌మెంట్ ఫర్ టాలెంటెడ్ ఎర్లీ ప్రొఫెషనల్స్ స్కీమ్ (మేట్స్). గత ఏడాది భారత్, ఆస్ట్రేలియాల మధ్య కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందం మేరకు రూపొందించిన ఈ స్కీమ్ తాజాగా అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో.. మేట్స్ స్కీమ్ వివరాలు, భారతీయులకు ప్రయోజనాలు, అర్హతలు, వీసా ప్రక్రియ తదితర వివరాలు..



జాబ్స్ అబ్రాడ్

» తాజాగా అమల్లోకి మేట్స్ స్కీమ్
» ఏటా మూడు వేల వర్క్ వీసాలు
» స్పాన్సర్‌షిప్ లేకున్నా దరఖాస్తుకు అవకాశం

ఆధునిక నైపుణ్యాల విషయంలో భారత్‌లో విస్తృత టాలెంట్ ఉంది. అదే సమయంలో పలు దేశాలను ప్రతిభావంతుల కొరత వేధిస్తోంది. ఆస్ట్రేలియాలోనూ ఇదే పరిస్థితి. దీన్ని గుర్తించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం భారతీయ టాలెంట్‌ను ఆకర్షించేందుకు తెచ్చిన పథకమే మేట్స్.

ఇరు దేశాల ఒప్పందం

భారత్, ఆస్ట్రేలియా దేశాల మధ్య గతేడాది జరిగిన ద్వైపాక్షిక ఒప్పందం మేరకు.. మొబిలిటీ అరేంజ్‌మెంట్ ఫర్ టాలెంటెడ్ ఎర్లీ ప్రొఫెషనల్స్ స్కీమ్ (మేట్స్)కు రూపకల్పన చేశారు. ఈ ఏడాది నవంబర్ నుంచి దీన్ని అమలు చేసేలా ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. రెండు దేశాల మధ్య టాలెంట్ ట్రాన్స్‌ఫర్ అనే కోణంలో ఈ ఒప్పందం అమల్లోకి వచ్చింది. దీనికి అనుగుణంగా మేట్స్ స్కీమ్ భారతీయులకు కొత్త అవకాశాలు కల్పిస్తుందని భావిస్తున్నారు.

కీలక రంగాల్లో టాలెంట్ కోసం

ఆస్ట్రేలియా, భారత్ మధ్య జరిగిన మేట్స్ స్కీమ్ ప్రధాన ఉద్దేశం.. ఆస్ట్రేలియాలోని కీలక రంగాల్లో నెలకొన్న నిపుణుల కొరత సమస్యకు పరిష్కారం. అదే సమయంలో భారతీయ యువతకు సదరు రంగాల్లో ఉద్యోగాలు చేసుకునే అవకాశం కల్పించడం. దీంతో మేట్స్ స్కీమ్ ద్వారా మన దేశ యువతకు ఆస్ట్రేలియాలో కొలువులు లభించనున్నాయి.

ఏటా మూడు వేల వీసాలు

మేట్స్ పథకం ద్వారా ఏటా మూడు వేల వర్క్ వీసాలను ఆస్ట్రేలియా ప్రభుత్వం మంజూరు చేయనుంది. ఎంప్లాయర్ స్పాన్సర్‌షిప్ ఉన్నా, లేకున్నా ఈ స్కీమ్ ద్వారా ఆస్ట్రేలియాలో ఉద్యోగాలు పొందేందుకు వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. నిర్దేశిత అర్హతలు ఉంటే వీసా మంజూరు చేస్తారు.

తొలుత రెండేళ్ల వ్యవధి

మేట్స్ పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి తొలుత రెండేళ్ల వ్యవధికి అక్కడ కంపెనీల్లో ఉద్యోగం చేసుకునే విధంగా వీసా మంజూరు చేస్తారు. ఆ తర్వాత దానిని పొడిగించుకునే అవకాశం ఉంటుంది. ఈ స్కీమ్ ద్వారా వీసా పొందినవారు.. ఆస్ట్రేలియాలో అడుగు పెట్టి.. ఏడాది పాటు ఉద్యోగాన్వేషణ చేసుకోవచ్చు. అంటే.. ఉద్యోగం కోసం ఇచ్చే రెండేళ్ల వీసానే కాకుండా.. ఉద్యోగాన్వేషణకు కూడా ముందుగా ఒక ఏడాది గడువు కల్పిస్తారు.

అర్హతలు ఇవే

18 నుంచి 30ఏళ్ల లోపు వయసుతోపాటు ఆయా రంగాలకు సంబంధించిన సబ్జెక్టులలో గ్రాడ్యుయేషన్, పీజీ పూర్తి చేసుకున్న వారు మేట్స్ స్కీమ్‌కు అర్హులు. అంతేకాకుండా ఈ స్కీమ్ ద్వారా వీసాకు దరఖాస్తు చేసుకునే సమయానికి గడిచిన రెండేళ్లలో ఆస్ట్రేలియా లేదా భారత్‌లో డిగ్రీ లేదా పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఈ విభాగాల్లో అకడమిక్ ఉత్తీర్ణత

మేట్స్ స్కీమ్ ద్వారా వీసాకు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు.. రెన్యువబుల్ ఎనర్జీ, మైనింగ్, ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీ (ఐసీటీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫైనాన్షియల్ టెక్నాలజీ (ఫిన్‌టెక్), అగ్రికల్చరల్ టెక్నాలజీ (అగ్రి టెక్) స్పెషలైజేషన్లలో బ్యాచిలర్ లేదా ఆపై స్థాయి కోర్సుల్లో ఉత్తీర్ణత కలిగుండాలి.

ఐఈఎల్‌టీఎస్ తప్పనిసరి

మేట్స్ స్కీమ్ ద్వారా వీసాకు దరఖాస్తు చేసుకునే వారు అకడమిక్ అర్హతలతోపాటు.. ఇంగ్లిష్ లాంగ్వేజ్ స్కిల్స్ కూడా కలిగుండాలి. ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్ట్ అయిన ఐఈఎల్‌టీఎస్‌లో కనీసం ఆరు బ్యాండ్స్ స్కోర్ కలిగుండాలి. ఈ టెస్ట్‌లోని నాలుగు విభాగాల్లో (లిజనింగ్, రైటింగ్, స్పీకింగ్, రీడింగ్).. ఒక్కో విభాగంలో అయిదు బ్యాండ్స్ స్కోర్ సొంతం చేసుకోవాలి.

వీసా సబ్ క్లాస్ 403

మేట్స్ ద్వారా ఉద్యోగాల కోసం వీసాకు దరఖాస్తు చేసుకునే వారికి ముందుగా వీసా సబ్ క్లాస్ 403 కింద వీసా మంజూరు చేస్తారు. ఇందుకోసం అభ్యర్థులు 365 ఆస్ట్రేలియన్ డాలర్లను దరఖాస్తు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది.

డిపెండెంట్స్‌ను తీసుకెళ్లొచ్చు

మేట్స్ స్కీమ్ ద్వారా వీసా పొందిన వారు డిపెండెంట్స్‌ను తీసుకెళ్లే అవకాశం కూడా ఉంది. అక్కడ డిపెండెంట్స్ తమ అర్హతలకు సరితూగే ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకొని వీసా పొందొచ్చు. ఇతర వీసా విధానాల ద్వారా ఉద్యోగాలు పొందిన వారు డిపెండెంట్స్‌ను తీసుకెళ్లే విషయంలో కొన్ని పరిమితులు ఉన్నాయి. కానీ మేట్స్ స్కీమ్‌లో మాత్రం ఆ పరిమితి లేదు.

ఆకర్షణీయ వేతనం

ఆస్ట్రేలియాలో ఉద్యోగం సొంతం చేసుకున్న వారికి వేతనాలు కూడా ఆకర్షణీయ స్థాయిలో లభిస్తున్నాయి. ఆస్ట్రేలియా ఫెయిర్ వర్క్ కమిషన్ నిబంధనల మేరకు.. కనీస వేతనం గంటకు 24.10 డాలర్లుగా ఇటీవల నిర్ణయించారు. అభ్యర్థుల అర్హతలు, ఉద్యోగ స్థాయిని అనుసరించి ఇంతకంటే ఎక్కువగా వేతనాలను సంస్థలు అందిస్తున్నాయి. ఎంట్రీ లెవల్ ఉద్యోగాలకు ఏడాది 90 వేల డాలర్లు, పని అనుభవం ఉన్న వారికి ఏడాది 1.5 లక్షల డాలర్ల వేతనం లభిస్తోంది.

పెరుగుతున్న విద్యార్థులు

ప్రస్తుత గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే.. మన దేశం నుంచి ఆస్ట్రేలియా వెళుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 2022లో 96 వేల మంది; 2023లో 1,24,829 మంది, 2024లో ఇప్పటి వరకు 1,22,202 మంది విద్యార్థులు ఆస్ట్రేలియాలో ఉన్నత చదువుల కోసం అడుగు పెట్టారు. వీరంతా తమ చదువు పూర్తయ్యాక పోస్ట్ స్టడీ వర్క్ అవకాశాల కోసం అన్వేషణ సాగించే వారే. ఇలాంటి వారికి తాజాగా అమల్లోకి వచ్చిన మేట్స్ స్కీమ్ ప్రయోజనకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రస్తుతం పోస్ట్ స్టడీ వర్క్ ఇలా

ప్రస్తుతం ఆస్ట్రేలియాలో పోస్ట్ స్టడీ వర్క్ అవకాశం అందుబాటులో ఉంది. దీని ప్రకారం–విద్యార్థులు తమ కోర్సును చదివిన ప్రాంతాన్ని బట్టి ఈ పర్మిట్ కాల పరిమితిని నిర్ణయిస్తున్నారు.బ్రిస్బేన్, సిడ్నీ, మెల్‌బోర్న్‌లలో చదువుతున్న విద్యార్థులకు రెండేళ్ల కాల పరిమితితో, ఇతర ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు మూడు లేదా నాలుగేళ్ల కాల పరిమితిలో పోస్ట్ స్టడీ వర్క్ పర్మిట్‌ను పొందేందుకు అనుమతి లభిస్తుంది. మేట్స్ ద్వారా వీసా పొందితే రానున్న రోజుల్లో తొలుత రెండేళ్ల వ్యవధికి వర్క్ వీసా మంజూరు చేస్తారు.

ఇంజనీరింగ్, ఎంబీఏలకు అనుకూలం

మేట్స్ స్కీమ్ ద్వారా ఇంజనీరింగ్, ఎంబీఏ ఉత్తీర్ణులు ఆస్ట్రేలియాలో ఉద్యోగాలు దక్కించుకునే అవకాశం ఎక్కువగా ఉందని చెబుతున్నారు. ముఖ్యంగా ఏఐ–ఎంఎల్, ఫిన్‌టెక్‌లలో నైపుణ్యం ఉన్న వారికి సులభంగా ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది.

వీరితోపాటు ఆయా రంగాల్లో అక్కడి కంపెనీలకు అవసరమైన అర్హతలు, స్కిల్స్ ఉన్న అభ్యర్థులు అవకాశాలు పొందే వీలుంది.



గబ్బిలాలు అంటేనే కాస్త జలదరింపు.. అందులోనూ రక్తం తాగే గబ్బిలాలు ఇవి. వాటి పేరే 'వాంపైర్ (రక్తపిశాచి) బ్యాట్స్'.. కానీ అవి మన కోసం పరుగెడుతున్నాయి.. పగలు, రాత్రి తేడా లేకుండా, అవసరమైనప్పుడల్లా ట్రెడ్‌మిల్‌పై పరుగెడుతున్నాయి.. ఇదేంటి రక్తపిశాచి గబ్బిలమేంటి? మన కోసం ట్రెడ్‌మిల్‌పై పరుగెత్తడమేంటి? అని డౌట్ వస్తోందా.. ఇదైతే హండ్రెడ్ పర్సెంట్ నిజం.. ఓ పరిశోధనలో భాగం.. ఆ వివరాలేమిటో తెలుసుకుందామా..

రక్తం తాగే గబ్బిలం..

పరుగెడుతోంది మన కోసం..

ఆహార అలవాటే కీలకం..

సాధారణంగా జంతువులు, కీటకాలు వేటికైనా ప్రొటీన్లు, విటమిన్లు, అమైనో ఆమ్లాలు, కొవ్వు పదార్థాలు, కార్బోహైడ్రేట్లు (షుగర్స్) వంటి అన్ని పోషకాలు ఉండే ఆహారం కావాల్సిందే. లేకుంటే అవి ఆరోగ్యంగా ఉండవు. బతకవు కూడా. శరీరంలో వివిధ జీవక్రియలు సరిగా సాగాలంటే.. వేర్వేరు పోషకాలు తప్పనిసరికావడమే దీనికి కారణం. కానీ వాంపైర్ గబ్బిలాలు చాలా చిత్రం. అవి కేవలం జంతువుల రక్తం మాత్రమే తాగుతూ బతికేస్తుంటాయి. అలా ఎలా జీవించ గలుగుతున్నాయన్నది తేల్చేందుకు టొరంటో స్కార్బో యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పరిశోధనలు మొదలుపెట్టారు.

ట్రెడ్‌మిల్‌పై పరుగుపెట్టించడం ఎందుకు?

సాధారణంగా జంతువులు కదలడానికి, వేటాడటానికి, తినడానికి.. ఇలా అన్నింటికీ శక్తి అవసరం. చాలా వరకు కార్బోహైడ్రేట్లు (షుగర్స్), కొవ్వుల నుంచే అవి శక్తిని ఉత్పత్తి చేసుకుంటాయి. శాఖాహార, మాంసాహార జంతువులకు అవి తినే ఆహారం నుంచి ఇవి అందుతాయి. కానీ రక్తంలో కార్బోహైడ్రేట్లు, కొవ్వులు అతి తక్కువ... ప్రొటీన్లు, అమైనో ఆమ్లాలే ఎక్కువ. కేవలం వీటితోనే వాంపైర్ గబ్బిలాలు ఎలా శక్తిని ఉత్పత్తి చేసుకుంటున్నాయన్న దానిపై శాస్త్రవేత్తలు దృష్టిపెట్టారు. ఇందుకోసం జంతువుల రక్తంలో.. కాస్త రసాయన మార్పులు చేసిన అమైనో యాసిడ్లు కలిపి గబ్బిలాలకు తాగించారు. తర్వాత వాటిని చిన్నపాటి ట్రెడ్‌మిల్‌పై నిమిషానికి 10, 20, 30 మీటర్ల వేగంతో పరుగులు పెట్టించారు. ఆ సమయంలో వాటి శరీరంలో శక్తి ఎలా ఉత్పత్తి అవుతోంది, ఏ ప్రొటీన్లు, అమైనో ఆమ్లాలు.. ఏరకంగా జీర్ణం అవుతున్నాయన్నది పరిశీలించారు.



దీనివల్ల మనకేంటి లాభం?

సాధారణంగా జంతువుల్లో వివిధ రకాల ప్రొటీన్లు, ఎంజైమ్‌లు ఉత్పత్తికావడానికి, అవయవాలు సరిగా పనిచేయడానికి అమైనో ఆమ్లాలు అవసరం. కానీ వాంపైర్ గబ్బిలాలు అమైనో ఆమ్లాలను నేరుగా శక్తి ఉత్పత్తి కోసం వాడుకుంటున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇందుకోసం వాటిని అత్యంత వేగంగా జీర్ణం చేసుకుంటున్నట్టు తేల్చారు. దీన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే.. క్షీరదాలు భౌతికంగా ఎదురయ్యే సవాళ్లకు అనుగుణంగా శరీరంలో, ఆహారంలో చేసుకునే మార్పులను గుర్తించవచ్చని పరిశోధనకు నేతృత్వం వహించిన శాస్త్రవేత్త డాక్టర్ కెన్నెత్ వెల్చ్ తెలిపారు. మనలో జీర్ణ వ్యవస్థ లోపాలను సరిదిద్దడం, సమస్యలకు ఔషధాల రూపకల్పన, పోషకాహార లోపానికి చేపట్టాల్సిన చర్యలు వంటి ప్రయోజనాలు ఎన్నో ఉంటాయని వెల్లడించారు.

\- సాక్షి సెంట్రల్ డెస్క్

క్లుప్తంగా...

రక్షణ, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను స్థాపించండి

కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ఎంపీ మల్లు రవి విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: నాగర్‌కర్నూల్‌లో రక్షణ, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి పలు అంశాలపై వినతిపత్రాన్ని అందజేశారు. నాగర్‌కర్నూల్‌లో ఆర్మీ సెలెక్షన్ సెంటర్, ఎన్‌సీసీ ట్రైనింగ్ సెంటర్, ఆక్సిలరీ డిఫెన్స్ ప్రొడక్షన్ సెంటర్, ఆర్మీ రిక్రూట్‌మెంట్ కోసం నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. వీటి ఏర్పాటుతో నాగర్‌కర్నూల్ ప్రాంతం ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక సమస్యలకు, యువత ఎదుర్కొంటున్న ఉపాధి, నైపుణ్యాభివృద్ధి లోటు సమస్యలకు సరైన పరిష్కారం లభిస్తుందని కేంద్రమంత్రికి వివరించారు.

రాంగోపాల్ వర్మకు ఏపీ పోలీసుల నోటీసులు

బంజారాహిల్స్ (హైదరాబాద్): సినీ డైరెక్టర్ రాంగోపాల్ వర్మకు ఒంగోలు జిల్లా మద్దిపాడు పోలీసులు నోటీసులిచ్చారు. ఏపీ సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ను కించపరిచే విధంగా రాంగోపాల్ వర్మ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మార్ఫింగ్ చేసిన ఫొటోలు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆ మేరకు రాంగోపాల్ వర్మ విచారణకు హాజరుకావాలని పోలీసులు బుధవారం నోటీసులిచ్చారు.

ఇంటర్ బోర్డ్ కార్యదర్శిగా కృష్ణ ఆదిత్య బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ బోర్డ్ కార్యదర్శి, ఇంటర్మీడియెట్ విద్యా డైరెక్టర్‌గా కృష్ణ ఆదిత్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా పనిచేయాలని, ఏ సమస్య తలెత్తినా తన దృష్టికి తేవాలని సూచించారు. ఇంటర్ విద్యలో సంస్కరణలు చేపట్టే యోచన ఉందని, నాణ్యతా ప్రమాణాలపై ప్రధానంగా దృష్టి పెట్టాలని ఆయన తెలిపారు.

అన్ని వేళలా సహకరిస్తాం: రామకృష్ణగౌడ్

ఇంటర్ విద్యలో సమస్యల పరిష్కారానికి అన్ని వేళలా సహకరిస్తామని ఇంటర్ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ (టిగ్లా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణగౌడ్ తెలిపారు.

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల ధ్రువపత్రాల పునఃపరిశీలన

సాక్షి, హైదరాబాద్: డీఎస్సీ స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల ధ్రువపత్రాలను పునఃపరిశీలించాలని తెలంగాణ విద్యాశాఖ నిర్ణయించింది. ఈనెల 20, 21, 22 తేదీల్లో ధ్రువపత్రాలు పరిశీలించనుంది. నకిలీ పత్రాలు పెట్టి స్పోర్ట్స్ కోటాలో ఎంపికైనట్లు ఫిర్యాదులు రావడంతో విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో మొత్తం 393 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను అధికారులు మరోసారి పరిశీలించనున్నారు. ఈ మేరకు అభ్యర్థులకు విద్యాశాఖ సమాచారం అందించింది.

19న ఓయూ 'ఎంప్లాయ్‌మెంట్' టెక్నీషియన్ పోస్టులకు జాబ్‌మేళా

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్న ఎంప్లాయ్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ఈనెల 19న టెక్నీషియన్ పోస్టులకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎంప్లాయ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఒక ప్రకటనలో తెలిపింది. బొండాడ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్‌మేళా ద్వారా 50 టెక్నీషియన్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు వెల్లడించింది. ఐటీఐ, డిప్లొమా, బీటెక్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఇతర వివరాలతో ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని పేర్కొంది. మరిన్ని వివరాలకు హెచ్‌ఆర్ విభాగం ప్రతినిధి రాహుల్‌ను 9398722629 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించింది.

భగ్గుమంటున్న డీఏపీ!

ఎరువు ధర బస్తాకు ఏకంగా రూ.300 పెంపు ● ఇప్పటివరకు రూ.1,350 ఉండగా.. ఇప్పుడు రూ.1,650 వసూలు

సాక్షి, హైదరాబాద్: రైతులు పొలాల్లో వాడే డీఏపీ ఎరువు ధర భారీగా పెరిగింది. ఒక్కో బస్తాపై ఏకంగా రూ.300 పెరిగిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 50 కిలోల బస్తా డీఏపీ ధర రూ.1,350 ఉండగా.. రూ.1,650కు పెంచడం గమనార్హం. అయితే ఈ పెంపు పాత స్టాక్‌కు వర్తించదని మార్క్‌ఫెడ్ అధికా రులు చెప్తున్నా.. వ్యాపారులు మాత్రం పాత స్టాకు కు కూడా కొత్త ధర వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం దుక్కిలో వేసేందుకు డీఏపీ, యూరియా అవసరమని... ఇలాంటి తరుణంలో మార్కెట్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. మరోవైపు నానో డీఏపీ, నానో యూరియాతీసుకోవాలంటూ వ్యాపారులు ఒత్తిడి చేస్తున్నారని చెప్తున్నారు. నానో యూరియా బాటిల్ ధర రూ.252 ఉంటే.. దానికి కూడా రూ.300 వరకు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు ఇలా ధర పెంచి అమ్ముతున్నా మార్క్‌ఫెడ్ గానీ, వ్యవసాయశాఖగానీ పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

రాష్ట్రంలో డీఏపీ కొరత...

యాసంగి సీజన్ అక్టోబర్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమైంది. రైతులు ఓవైపు వానాకాలం సీజన్ పంటలను మార్కెట్లో అమ్ముకుంటూ.. మరోవైపు రెండో పంటకు సిద్ధమవుతున్నారు. యాసంగి సీజన్ పంటల సాధారణ సాగు విస్తీర్ణం 63.54 లక్షల ఎకరాలుకాగా.. ఇప్పటివరకు 3.14 లక్షల ఎకరాల్లో సాగు మొదలైంది. ఇందులో ఆహార ధాన్యాలు 1.57 లక్షల ఎకరాల్లో, నూనె గింజలు 1.32 లక్షల ఎకరాల్లో వేశారు. చాలా మంది రైతులు పంటలు వేసేందుకు పొలాల్లో దుక్కులు దున్నుతున్నారు. ఈ సమయంలో డీఏపీ, ఇతర ఎరువులు వేస్తారు. దీనితో ఎరువులకు డిమాండ్ నెలకొంది. మరోవైపు రాష్ట్రంలో డీఏపీ నిల్వలు కేవలం 4 వేల టన్నులే ఉన్నాయని మార్క్‌ఫెడ్ అధికారులు చెప్తున్నారు. యాసంగి సీజన్‌కు 20వేల టన్నుల నుంచి 30వేల టన్నుల వరకు డీఏపీ అవసరమని.. వచ్చే వారం దాదాపు 9 వేల టన్నుల స్టాక్ రాష్ట్రానికి రానుందని మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాసరెడ్డి తెలిపారు.



- రాష్ట్రంలో పాత స్టాక్‌కు కూడా అదనపు రేటు తీసుకుంటున్న వ్యాపారులు
- పట్టించుకోని మార్క్‌ఫెడ్ అధికారులు.. పలుచోట్ల డీఏపీ కొరత
- బ్లాక్ మార్కెట్‌కు తరలించి అడ్డగోలు ధరకు అమ్ముతున్న తీరు..
- యాసంగి సీజన్ సాగు కోసం రైతుల ఇక్కట్లు..

బ్లాక్ చేసి అధిక ధరకు అమ్ముకుంటున్న వ్యాపారులు

అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా దేశంలోకి డీఏపీ దిగుమతులు తగ్గాయని.. రాష్ట్రంతోపాటు పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోనూ డీఏపీ కొరత ఉందని వ్యవసాయ వర్గాలు చెప్తున్నాయి. అయితే హరియాణా వంటి రాష్ట్రాల్లో రైతులు డీఏపీ కొరతపై ఇప్పటికే ఆందోళనలు చేస్తున్నారు. మన వద్ద కూడా సకాలంలో డీఏపీ అందుబాటులోకి రాకపోతే రైతులు ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. దీన్ని ఆసరాగా తీసుకుని దళారులు, కొందరు వ్యాపారులు డీఏపీని బ్లాక్ మార్కెట్‌కు తరలించి, అడ్డగోలు ధరలకు విక్రయిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

అమ్మేసుకుని చెప్పక.. కేంద్రం నుంచి స్టాక్ రాక..

రాష్ట్రంలో ఎరువులు పుష్కలంగా ఉన్నట్లు వ్యవసాయ శాఖ రికార్డులు చెప్తుండగా... వాస్తవానికి క్షేత్రస్థాయిలో నిల్వలు లేవని సమాచారం. కంపెనీల నుంచి ఆయా ప్రాంతాలకు సరఫరా అయిన ఎరువులను ఎప్పుడో అమ్మేశారని... కానీ ఈ సమాచారాన్ని రికార్డుల్లో నమోదు చేయకపోవడంతో కేంద్రం కొత్త కేటాయింపులు జరపడం లేదని తెలిసింది. దీనితో ఎరువుల కొరత ఏర్పడింది. ఇదే అదనుగా ఎరువుల కొరతను కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఉన్న కొద్దిపాటి నిల్వలను బ్లాక్ మార్కెట్‌కు తరలించేసి, ఎక్కువ ధరకు అమ్ముతున్నారని రైతులు పేర్కొంటున్నారు.

పాత స్టాక్‌కు పాత ధరే చెల్లించాలి..

డీఏపీ ధర బస్తాకు రూ.300 పెరిగి.. రూ.1,650 అయింది. అయితే పాత స్టాక్‌కు ఈ పెరిగిన ధర వర్తించదు. పాత ధరకే అమ్మాలి. కొత్త స్టాక్‌ను మాత్రమే పెరిగిన ధరకు అమ్మాలి. రైతులు దీనిని గమనించి వ్యాపారులకు సొమ్ము చెల్లించాలి.

\- శ్రీనివాసరెడ్డి, ఎండీ, మార్క్‌ఫెడ్

ఈశాన్య రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టండి

మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు



సాక్షి, హైదరాబాద్: ఈశాన్య రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టాలని మిజోరం రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులు ముందుకొస్తే ఆ ప్రాంత్రాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈశాన్య రాష్ట్రాల ప్రభుత్వాలు, ఫిక్కీ, ఇన్వెస్ట్ ఇండియా సహకారంతో బుధవారం హైదరాబాద్‌లో 'నార్త్ ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఈశాన్య రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులతో పాటు కేంద్ర, రాష్ట్రాల సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ హరిబాబు మాట్లాడుతూ, ఈశాన్య రాష్ట్రాల్లో గతంలో కంటే ఇప్పుడు రోడ్లు, రైల్వే, విమాన సౌకర్యాలు బాగున్నాయని తెలిపారు. అలాగే జల విద్యుత్, సౌర విద్యుత్, సహజ వాయువు, వెదురు పుష్కలంగా ఉందన్నారు. అదేవిధంగా పర్యాటక రంగానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని వివరించారు. ఈ అంశాలను పారిశ్రామికవేత్తలు పరిగణనలోకి తీసుకోవాలని, ఆ రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

క్యూలైన్‌లో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య!

సాధారణ వ్యక్తి మాదిరిగా కంటి పరీక్షలు



క్యూలో వేచి ఉన్న గుమ్మడి నర్సయ్య

పాల్వంచ: ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా నిరాడంబర జీవనం గడిపే ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఏళ్లు గడుస్తున్నా అదే ఒరవడి సాగిస్తున్నారు. సైకిల్‌పై వెళ్లడం, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం వంటివి ఆయన విషయంలో సర్వసాధారణంగా కనిపిస్తాయి. ఇదే క్రమాన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రిలో కంటి పరీక్షల కోసం బుధవారం ఆయన వచ్చారు. అక్కడ అందరితోపాటే ఓపీ చీటీ తీసుకుని వైద్యుల గది ముందు క్యూలో వేచి ఉండి తన వంతు వచ్చాక పరీక్ష చేయించుకున్నారు. వార్డుమెంబర్, ఎంపీటీసీలే హంగూ ఆర్భాటాలతో జీవిస్తుండగా 25 ఏళ్లు ఎమ్మెల్యేగా కొనసాగిన గుమ్మడి నర్సయ్య అందుకు విరుద్ధంగా వ్యవహరించడాన్ని పలువురు అభినందించారు.

1,401 కేంద్రాల్లో గ్రూప్–3 పరీక్షలు

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సీఎస్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఈనెల 17 నుంచి రెండ్రోజుల పాటు జరిగే గ్రూప్–3 పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. గ్రూప్–3 పరీక్షల ఏర్పాట్లు, వరి, పత్తి కొనుగోళ్ల పురోగతి, నూతన నర్సింగ్, పారామెడికల్ కాలేజీల ప్రారంభం, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే తదితర అంశాలపై బుధవారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,401 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్–3 పరీక్షలు జరుగుతాయని, 5.36 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నట్లు సీఎస్ తెలిపారు. జిల్లా కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు స్వయంగా పర్యవేక్షించి అన్ని పరీక్షా కేంద్రాల వద్ద విస్తృత బందోబస్తు నిర్వహించాలన్నారు. పరీక్షల నిర్వహణకు చేసిన ఏర్పాట్లను ఈ సందర్భంగా టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి వివరించారు. ధాన్యం రాకను ప్రతిరోజూ నిశితంగా పరిశీలించి, వరి దిగుబడికి అనుగుణంగా కొనుగోళ్లు జరిగేలా జాగ్రత్త వహించాలని కలెక్టర్లకు సీఎస్ సూచించారు. అధికారులందరూ ప్రతిరోజూ తప్పనిసరిగా కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కొత్తగా మంజూరైన నర్సింగ్, పారామెడికల్ కాలేజీలకు సంబంధించి మిగిలిపోయిన మరమ్మతు పనులను కూడా గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీజీపీ జితేందర్, ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

కన్ఫర్డ్ ఐఏఎస్‌గా కె.చంద్రశేఖర్‌రెడ్డికి పదోన్నతి

ఉత్తర్వులు జారీ చేసిన డీవోపీటీ

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రానికి చెందిన సీనియర్ అధికారి కె.చంద్రశేఖర్‌రెడ్డికి కన్ఫర్డ్ ఐఏఎస్‌గా పదోన్నతి కల్పిస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు బుధవారం కేంద్ర ప్రభుత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ) అండర్ సెక్రటరీ అన్షుమాన్ మిశ్రా ఉత్తర్వులు జారీ చేశారు. ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ నిబంధనలను అనుసరించి నాన్ స్టేట్ సివిల్ సర్వీస్‌లో సేవలందిస్తోన్న చంద్రశేఖర్‌రెడ్డికి పదోన్నతి కల్పించినట్లు పేర్కొన్నారు. కన్ఫర్డ్ ఐఏఎస్‌గా చంద్రశేఖర్‌రెడ్డి నియామకానికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేసినట్లు తెలిపారు. జనవరి 1, 2023 నుంచి డిసెంబర్ 31, 2023 వరకు రాష్ట్రంలో ఏర్పడ్డ ఖాళీల్లో చంద్రశేఖర్‌రెడ్డి ఎంపికైనట్లు వెల్లడించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు చంద్రశేఖర్‌రెడ్డి ప్రొహిబిషన్ పీరియడ్‌లో ఉంటారని, ఆయన్ను తెలంగాణకు కేటాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి గ్రూప్–1 పోస్టుల్లో కోఆపరేటివ్ సర్వీస్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం నాన్ రెవెన్యూ కేటగిరీలో కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్‌లో సేవలందిస్తున్నారు. ఈ కన్ఫర్డ్ ఐఏఎస్ కోసం రాష్ట్రం నుంచి ముగ్గురు పోటీ పడగా చంద్రశేఖర్‌రెడ్డికి పదోన్నతి దక్కింది.

డీహెచ్ రవీంద్ర నాయక్‌కు చార్జి మెమో

- ఉద్యోగుల బదిలీల్లో అవకతవకలు జరిగినట్లు విజిలెన్స్ నిర్ధారణ
- ఆయనపై వేటుకు రంగం సిద్ధం



సాక్షి, హైదరాబాద్: ప్రజారోగ్య సంచాలకుడు (డీహెచ్) డాక్టర్ రవీంద్ర నాయక్‌కు ప్రభుత్వం చార్జి మెమో జారీచేసింది. రెండు మూడు అంశాల్లో తీవ్రమైన ఆరోపణలు రావడంతో చార్జి మెమో జారీ చేసింది. దీంతో వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. కీలక స్థానంలో అధికారిపై చార్జి మెమో జారీచేయడంతో అతనిపై వేటు పడుతుందని, సస్పెండ్ చేసే అవకాశాలు ఉన్నాయని ఉన్నతాధికారులు చెప్పారు. కొద్దిరోజుల్లో పదోన్నతులు చేపట్టనున్న నేపథ్యంలో ఆయనకు చార్జి మెమో జారీకావడం గమనార్హం. ఈ ఏడాది సర్కారు చేపట్టిన ఉద్యోగుల సాధారణ బదిలీల్లో ఆయనపై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. దాంతో సర్కారు విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఆ వ్యవహారంలో భారీగా డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపించాయి. ఉద్యోగులు కోరుకున్న చోటుకు ఆఫీసు బేరర్ల లేఖల సాయంతో పోస్టింగ్‌లు ఇచ్చినట్లు అప్పట్లో ఉద్యోగులు ఆరోపించారు. దీనిపై నర్సులు, ఇతర సిబ్బంది పెద్ద ఎత్తున ఆందోళనలు చేసిన సంగతి తెలిసిందే. అలాగే రాత్రికి రాత్రే సీనియారిటీ జాబితాలు మారిపోయాయి. ఏళ్ల తరబడి ఒకేచోట ముఖ్యంగా హైదరాబాద్‌లో పనిజేస్తున్న వారికి బదిలీల నుంచి మినహాయించారు. దీనిపైనా పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. వీటిపై విజిలెన్స్ విచారణ చేపట్టగా.. అక్రమాలు నిజమేనని తేలింది. ఈ నేపథ్యంలో కొత్త డీహెచ్‌ను నియమించే పనిలో సర్కారు ఉన్నట్లు తెలిసింది.

రైతుల పొలాల్లో సోలార్ ప్లాంట్లు



పీఎం కిసాన్ పథకం కింద 4 వేల మెగావాట్ల ఉత్పత్తికి రాష్ట్ర సర్కారు నిర్ణయం

- రైతులు తమ అవసరాలకు వాడుకోగా మిగిలిన విద్యుత్ డిస్కంలకు విక్రయించే చాన్స్
- ఒక్కో యూనిట్‌కు రూ.3.13 చొప్పున చెల్లించనున్న విద్యుత్ సంస్థలు
- యూనిట్ల కేటాయింపులో మహిళా సంఘాలకు తొలి ప్రాధాన్యం
- పొలాలను లీజుకు తీసుకుని ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే వెసులుబాటు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని రైతుల పంట పొలాల్లో 4 వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పీఎం కుసుమ్ (ప్రధానమంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఏవమ్ ఉత్థాన్ మహాభియాన్) పథకం కింద 2024–25 ఆర్థిక సంవత్సరంలో వీటిని ఏర్పాటు చేస్తారు. ఈ పథకానికి సంబంధించి తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో)ను నోడల్ ఏజెన్సీగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ఏడాదిలో 300 రోజుల పాటు సౌరవిద్యుత్ ఉత్పాదనకు అనుకూలత ఉంది.

చిన్న చిన్న ప్లాంట్లతో..

పీఎం కుసుమ్ పథకం కింద 2026 డిసెంబర్ 31 నాటికి దేశవ్యాప్తంగా 30,800 మెగావాట్ల సామర్థ్యమున్న సౌర విద్యుత్ ప్లాంట్లను రైతుల పంట పొలాల్లో ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పొలాల్లో 0.5 మెగావాట్ల నుంచి 2 మెగావాట్ల వరకు సామర్థ్యం కలిగిన ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రంలో సౌర విద్యుత్ కేంద్రాల స్థాపనకు పారిశ్రామికవేత్తలు సిద్ధంగా ఉన్నా.. రైతులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించి, ఉత్తర్వులు జారీ చేసింది.

త్వరలో సబ్‌స్టేషన్ల వారీగా నోటిఫికేషన్

రాష్ట్రంలోని అన్ని 33/11 కేవీ సబ్ స్టేషన్ల వారీగా ఎంత స్థాపిత సామర్థ్యంతో కొత్త సౌరవిద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశాలున్నాయో వెల్లడిస్తూ త్వరలో డిస్కంలు నోటిఫికేషన్ ఇస్తాయి. ఆయా సామర్థ్యం మేరకు సౌర విద్యుత్ కేంద్రాల స్థాపనకు రైతుల నుంచి రెడ్కో దరఖాస్తులను స్వీకరించనుంది. రైతులు వ్యక్తిగతంగా, సంఘాలుగా, సహకార సంఘాలుగా ఏర్పడి వీటిని ఏర్పాటు చేసుకోవచ్చు.


మహిళా గ్రూపులకు ప్రాధాన్యత

స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ), మండల సమాఖ్యలు కూడా రైతుల నుంచి పొలాలను లీజుకు తీసుకుని సౌర విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేయవచ్చు. ప్లాంట్ల మంజూరులో వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సౌర విద్యుత్ కేంద్రాల స్థాపనకు అవకాశమిచ్చి సంఘాల మహిళలను కోటీశ్వరులు చేస్తామని ఇప్పటికే సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంత ఎస్‌హెచ్‌జీల్లోని మహిళలు రైతు కుటుంబాల వారేకావడంతో.. సోలార్ ప్లాంట్ల ఏర్పాటు రైతుల చేతుల్లోనే ఉండనుంది. ఎస్‌హెచ్‌జీలకు పావలా వడ్డీకే రుణాలు లభిస్తాయి. ఒక మెగావాట్ ప్లాంట్ నుంచి ఏడాదికి సగటున 15 లక్షల యూనిట్ల విద్యుదుత్పత్తి అవుతుంది. అంటే సుమారు రూ.45 లక్షల ఆదాయం వస్తుంది. మెగావాట్ సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ఆరు ఎకరాల స్థలం, రూ.3 కోట్ల నుంచి రూ.3.5 కోట్ల వరకు వ్యయం అవుతుంది. ఈ మేరకు బ్యాంకులు రుణం ఇవ్వనున్నాయి.

కరెంటు కొననున్న డిస్కంలు

రైతులు తమ పొలాల్లో ఏర్పాటు చేసుకునే సౌర విద్యుత్ కేంద్రాల నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్‌ను రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు కొనుగోలు చేస్తాయి. ఒక్కో యూనిట్ విద్యుత్‌కు రూ.3.13 ధరను తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) ఇప్పటికే ఖరారు చేసింది. సోలార్ ప్లాంట్లలో ఉత్పత్తయ్యే విద్యుత్‌లో రైతులు తమ వ్యవసాయ అవసరాలకు వాడుకోగా.. మిగిలిన విద్యుత్‌ను డిస్కంలకు విక్రయించవచ్చు. డిస్కంలు ప్రస్తుతం సౌర విద్యుత్ ప్లాంట్ల నుంచి సగటున యూనిట్‌కు రూ.2.58 ధరతో విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నాయి. రైతులకు మాత్రం కాస్త ఎక్కువగా యూనిట్‌కు రూ.3.13 ధర చెల్లించనున్నాయి.

ఇన్నేళ్ల తర్వాత వ్యాజ్యమా?



- పిటిషనర్ తీరును తప్పుబట్టిన హైకోర్టు
- ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే కొనసాగాలంటూ పిల్

సాక్షి, హైదరాబాద్: ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే కొనసాగాలంటూ 1988, 2005లో ఇచ్చిన జీవోను అమలు చేయాలని ఇన్నేళ్ల తర్వాత ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) ఎలా వేస్తారని పిటిషనర్ తీరును హైకోర్టు తప్పుబట్టింది. ఆంగ్లంలో ఇస్తున్నా ఏళ్లుగా పాలన సాఫీగానే సాగుతోంది కదా.. బాధితులెవరూ న్యాయస్థానాలను ఆశ్రయించ లేదు కదా అని వ్యాఖ్యానించింది. 72 ఏళ్ల వయసులో ఇలాంటి పిటిషన్లు వేసి పబ్లిసిటీ కోరుకోవద్దని, ఓ దశలో పిటిషన్‌ను కొట్టివేస్తామని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి పిటిషన్లను ప్రోత్సహించ వద్దని న్యాయవాదులకు సూచించింది. యువ న్యాయవాదులు కక్షిదారులు, బాధితుల తరఫున పిటిషన్లు వేస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని అభిప్రాయపడింది. అధికారిక భాషల చట్టం 1966, 1988లో ఇచ్చిన జీవో 587, 1992లో ఇచ్చిన జీవో 455, 2005లో ఇచ్చిన జీవో 420 ప్రకారం ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే కొనసాగాలని, ఆంగ్లంలో ఇవ్వడం చట్టవిరుద్ధమంటూ రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లికి చెందిన ఉమామహేశ్వర్‌రావు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రాష్ట్రంలో 70 శాతం మందికి తెలుగు మాత్రమే వచ్చని, ఆంగ్లం రాదని చెప్పారు. ప్రభుత్వం మాత్రం ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ఆంగ్లంలోనే కొనసాగిస్తోందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఏళ్లు గడిచిన తర్వాత పిల్ దాఖలు చేస్తారా అంటూ ఆక్షేపించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జీఏడీ ముఖ్య కార్యదర్శి, ఎంఏయూడీ ముఖ్య కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



- కంప్యూటర్ కాలంలోనూ విద్యార్థులకు కష్టాలేనా...!
- వయస్సుకు మించిన బ్యాగు బరువు...ప్రైవేట్ స్కూళ్లలో పోటాపోటీ
- చదువే తప్ప ఆటలెక్కడ.. మార్కుల పోటీలో వెంటాడుతున్న భయం
- చిన్నారుల్లో పెరుగుతున్న అనారోగ్య సమస్యలు.. కేంద్ర ఆరోగ్య శాఖ హెచ్చరిక

బ్యాగ్ బరువు తగ్గేదెప్పుడు?

సాక్షి, హైదరాబాద్: బాలల దినోత్సవం రోజైనా.. చిన్నారుల భవితవ్యంపై చర్చ జరగాలని పలువురు విద్యారంగ నిపుణులు కోరుతున్నారు. కంప్యూటర్ల కాలంలోనూ బ్యాగ్‌ల బరువు మోత తప్పడం లేదంటున్నారు. ఆధునిక బోధన విధానంలోనూ చిన్నారులు మానసిక ఒత్తిడి నుంచి బయటపడటం లేదన్న విమర్శలున్నాయి. ఉల్లాసాన్నిచ్చే క్రీడలు కనిపించడం లేదు. ఉత్సాహాన్నిచ్చే వాతావరణానికీ దూరమవుతున్నారు. కేంద్ర విద్యాశాఖ సైతం ఈ వాస్తవాలను ఒప్పుకుంది. చిన్నారులను బరువుల మోత నుంచి బయట పడేయాలని సూచనలు చేసింది. కానీ ఎక్కడా ఇది అమలుకు నోచుకోవడం లేదు.

ఇదీ మన చిన్నారుల పరిస్థితి..

కేంద్ర విద్యాశాఖ అధ్యయనం ప్రకారం..70 శాతం మంది విద్యార్థులు పుస్తకాల బరువుతో అనారోగ్యం పాలవుతున్నారు. కండరాలు, మోకాళ్లపై ఒత్తిడి పడుతోంది. 22 శాతం మందిని వెన్నెముక నొప్పి వెంటాడుతోంది. అతి చిన్న వయసులోనే నీరసం, భుజాలు వంగి పోవడం సర్వసాధారణమైంది. 90 శాతం మందికి ఏడు గంటల నిద్ర కరువే. దీంతో తరగతి గదిలో చురుకుదనం తగ్గుతోంది. బహుళ అంతస్తు భవనాల్లో ప్రైవేట్ స్కూళ్లుంటున్నాయి. బరువు వేసుకొని మెట్లు ఎక్కడంతో అనేక అనారోగ్య సమస్యలొస్తున్నాయి.

ఏవీ ఆ రూల్స్...?

పుస్తకాల బరువుపై కేంద్ర విద్యాశాఖ ఐదేళ్ల క్రితమే హెచ్చరించింది. చిన్నపిల్లల బరువులో పది శాతమే పుస్తకాల బరువు ఉండాలంది. ఇలాంటి పరిస్థితి మరే దేశంలోనూ లేదని బరువులపై అధ్యయనం చేసిన యశ్‌పాల్ కమిటీ చెప్పింది. అధిక బరువుల వల్ల కండరాలపై ఒత్తిడి పడి, భవిష్యత్‌లో దీర్ఘకాల సమస్యలు వెంటాడుతున్నాయని పలు అధ్యయనాలు వెల్లడించాయి. డిజిటల్ బోధన మేలని సూచించాయి. ఇవేవీ పట్టించుకున్నట్టు లేదు. కోవిడ్ తర్వాత ప్రపంచం మొత్తం డిజిటల్ విద్య వైపు మళ్లుతున్నా..మనం ఆ దిశగా అడుగులేయడం లేదు. మార్కుల కోసం గంటల కొద్దీ చదివించే ప్రైవేట్ స్కూళ్లను కట్టడి చేసే దిక్కేలేదు.

బరువు మోతాదు ఇదీ...
(కేంద్ర విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం)

తరగతి	ఉండాల్సిన బరువు (కిలోలు)	ఉన్న బరువు (కిలోలు)
2వ క్లాస్	1.5	9
3-5 క్లాసులు	3	12
5-9 క్లాసులు	4.5	14
10వ క్లాసు	5	17



భుజాలు నొప్పిగా ఉంటాయి

రోజూ 40 పుస్తకాలను స్కూలుకు తీసుకెళ్లాల్సి వస్తోంది. పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, వర్క్‌షీట్స్, నోట్‌బుక్స్ ఉంటాయి. లంచ్ బాక్స్, నీళ్లబాటిల్ అన్నీ బ్యాగులో ఉంటాయి. మూడు అంతస్తులు బరువు వేసుకొని ఎక్కాలి. భుజాలు నొప్పిగా ఉంటాయి.
–సుంకర నవీన్, ఐదవ తరగతి కూకట్‌పల్లి

మానసికోల్లాసం ముఖ్యం



చదువుతో పాటు చిన్నారుల్లో మానసిక ఉల్లాసం పెంచాలి. అప్పుడే వారిలో ఆలోచన శక్తి వస్తుంది. ప్రభుత్వ స్కూళ్లలో తక్కువ పుస్తకాలతో బోధన ఉంటుంది. ప్రైవేట్ స్కూళ్లు ఇష్టానుసారం పుస్తకాలు సిఫార్సు చేస్తున్నాయి. ఇలా చెబితేనే మంచి విద్య అని తల్లిదండ్రులూ నమ్ముతున్నారు. వారి ఆలోచన విధానంలో మార్పు రావాలి.
– పణితి రామనాథం, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

బరువు తగ్గించాల్సిందే



పుస్తకాల బరువు వల్ల అనారోగ్య వాతావరణం కనిపిస్తోంది. బోధన విధానంలో ప్రపంచ వ్యాప్తంగా మార్పులు వస్తున్నాయి. ప్రైవేట్ స్కూళ్లలో అధిక బరువుల మోతను అరికట్టే యంత్రాంగం ఉండాలి. దీనివల్ల జరిగే నష్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారుల మానసిక వ్యథపై ప్రభుత్వాలు స్పందించాలని కోరుతున్నాం. – పింగిలి శ్రీపాల్‌రెడ్డి, పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్రఅధ్యక్షుడు

బాప్ ఏక్ నంబరీ... బేటా దస్ నంబరీ

- ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: బాప్ ఏక్ నంబరీ, బేటా దస్ నంబరీ అన్నట్లుగా కేసీఆర్, కేటీఆర్ వ్యవహారశైలి ఉందని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇరవత్రి అనిల్‌కుమార్ విమర్శించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్‌పార్టీ తరపున ఇచ్చిన ప్రకటనలను చూపెడుతూ వాటిని తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనలుగా కేటీఆర్ మాట్లాడుతున్నారని అన్నారు. అబద్ధాలు మాట్లాడడానికి కేటీఆర్‌కి సిగ్గు ఉండాలన్నారు. ప్రజల సొమ్ము దుర్వినియోగం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని, తెలంగాణ ఖజానాను దోపిడీ చేసింది ఆ పార్టీ నాయకులని విమర్శించారు. అబద్ధానికి ప్యాంటు, షర్ట్ తొడిగి ఎవరని చాట్ జీపీటీని అడిగితే కేటీఆర్ అని సమాధానం వస్తుందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ దొంగలకు అరబ్ దేశాల్లో ఉన్నటువంటి శిక్షలు వేయాలని ఘాటుగా వ్యాఖ్యానించారు.

బీజేపీ సోషల్ మీడియా సెల్ జాయింట్ సెక్రటరీ సస్పెండ్

సాక్షి, హైదరాబాద్: పార్టీ నియమ, నిబంధనలు ఉల్లంఘించి క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడిన బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా సెల్ జాయింట్ కన్వీనర్ గిరీశ్ దరమోనిని పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు బీజేపీ తెలిపింది. ఈ సస్పెన్షన్ వెంటనే అమల్లోకి వస్తుందని పార్టీ కార్యాలయ కార్యదర్శి ఉమాశంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

లగచర్ల ఘటనపై బీఆర్ఎస్‌కు బీజేపీ మద్దతు సిగ్గుచేటు: ఎంపీ చామల



సాక్షి, న్యూఢిల్లీ: లగచర్ల ఘటనపై బీఆర్ఎస్ నాయకుల విమర్శలకు బీజేపీ మద్దతు ఇవ్వడం సిగ్గుచేటని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. కొడంగల్‌లో అభివృద్ధిని ఓర్వలేకే ప్రభుత్వంపై బీఆర్ఎస్ బురదజల్లుతోందని, కేటీఆర్ వాస్తవాలు మాట్లాడాలని వ్యాఖ్యానించారు. బుధవారం ఢిల్లీలో చామల విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్‌పై దాడి చేసింది రైతులు కాదని, బీఆర్ఎస్ నాయకులు దాడి చేశారని రుజువైనా బీజేపీ ఏమీ జరగలేదని చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. కలెక్టర్‌పై దాడిని ప్రతిపక్షాలు ఖండించకపోగా ఈ ఘటనకు కాంగ్రెస్ పార్టీ కారణమనడం అర్థరహితమని తెలిపారు. అమృత్ పథకాన్ని అడ్డుపెట్టుకుని కేటీఆర్ ఢిల్లీలో బీజేపీ పెద్దలతో మంతనాలు చేయడానికి వచ్చాడని చామల ఆరోపించారు. సృజన్ అనే వ్యక్తి రేవంత్ బావమరిది కాదని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అల్లుడని తెలిపారు.

పీఆర్ ఆర్డీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సృజన

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ (పీఆర్ ఆర్డీ) డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి సృజన బాధ్యతలు చేపట్టారు. బుధవారం పీఆర్ ఆర్డీ కమిషనరేట్‌లో బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆమె కొన్ని ఫైల్స్‌ను పరిశీలించారు. త్వరలోనే జిల్లాల్లో పర్యటించి పీఆర్ శాఖకు సంబంధించి చేపడుతున్న కార్యక్రమాలు, ఇతర అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యోగుల తుది కేటాయింపులో భాగంగా ఇటీవలే సృజనను ఏపీ నుంచి తెలంగాణ కేడర్‌కు కేటాయించిన విషయం తెలిసిందే.

కళ్యాణ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి: బార్ కౌన్సిల్

సాక్షి, హైదరాబాద్: న్యాయవాది కళ్యాణ్ వంశీకర్‌పై దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ డిమాండ్ చేసింది. పోలీస్ అధికారులు వెంటనే స్పందించి దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకోవాలని కోరింది. ఈ మేరకు బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల న్యాయవాదులపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. డీజీపీ స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం మార్నింగ్ వాక్‌కు వెళ్లిన న్యాయవాది కళ్యాణ్‌పై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే.

నౌహీరా ఆస్తుల వేలానికి సిద్ధం

సాక్షి, హైదరాబాద్: హీరా గ్రూపు సంస్థల్లో పెట్టుబడి పెట్టిన వేలాది మంది డిపాజిటర్లకు బకాయిలు తిరిగి చెల్లించేందుకు నౌహీరా షేక్ స్థిరాస్తులను వేలం వేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సిద్ధమైంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆస్తులను వేలం వేసి బాధితులకు తిరిగి చెల్లించనున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఈడీ అధికారులు వెల్లడించారు. డిపాజిటర్లకు తిరిగి చెల్లింపులు చేసేందుకు స్థిరాస్తుల వేలానికి అనుమతించాలని ఈడీ అధికారులు సుప్రీంకోర్టును అభ్యర్థించారు. విచారణ అనంతరం న్యాయస్థానం అనుమతించడంతో నౌహీరా షేక్‌కు చెందిన రెండు భవనాలు వేలం వేసేందుకు నిర్ణయించినట్లు ఈడీ అధికారులు తెలిపారు. త్వరలో రూ.25 కోట్లు బాధితులకు తిరిగి చెల్లించనున్నట్లు వెల్లడించారు.

తెలంగాణలో ప్రజారోగ్యం హక్కుగా ఉండాలి

చట్టం కోసం ఆరోగ్య నిపుణుల పిలుపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి సంపూర్ణ, సమగ్ర, సమ్మిళిత ఆరోగ్య సంరక్షణ అనేది ఒక రాజ్యాంగబద్ధమైన హక్కుగా పొందుపరిచేలా ప్రత్యేక చట్టం చేయాలని ఆరోగ్య నిపుణులు, సామాజిక కార్యకర్తల కన్సల్టేషన్ పిలుపునిచ్చింది. ప్రముఖ స్వచ్ఛంద సంస్థ 'చైల్డ్ రైట్స్ అండ్ యూ' మంగళ, బుధవారాల్లో హైదరాబాద్‌లో రెండ్రోజులపాటు 'అందరికీ ఆరోగ్యం'అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించింది. ప్రతి వ్యక్తికీ శారీరక, మానసిక, సామాజిక, పర్యావరణ శ్రేయస్సు లభించేలా సమగ్ర ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ సాధన లక్ష్యంగా ప్రభుత్వ ప్రతినిధులు, ఆరోగ్య నిపుణులు, పౌర సమాజ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ప్రజారోగ్యం, సామాజిక న్యాయం, పర్యావరణ సుస్థిరతకు ప్రాధాన్యం ఇచ్చేలా సమగ్ర ఆరోగ్య హక్కు చట్టం చేయాలని ఈ వర్క్‌షాప్ ఒక డిక్లరేషన్‌ను ఆమోదించింది. ఆ స్వచ్ఛంద సంస్థ సౌత్ రీజియన్ ప్రోగ్రామ్ జనరల్ మేనేజర్ పీటర్ సునీల్ ఈ వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తూ.. తెలంగాణ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలోని వైరుధ్యాలను ప్రస్తావించారు. కొన్ని ఆరోగ్య సూచికలను పరిశీలిస్తే అసమానతలు కనిపిస్తున్నాయని, అట్టడుగు వర్గాల వారి పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని తెలిపారు. పిల్లల ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరచడానికి పోషకాహార లోపాలను పరిష్కరించడం, వైద్య సేవలు అందించడంలో అంతరాలను రూపుమాపడం ముఖ్యమని ఆయన నొక్కి చెప్పారు.



కాళోజీ నిత్య స్మరణీయుడు

నివాళులర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రజాకవి కాళోజీ నారాయణరావు నిత్య స్మరణీయుడని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాళోజీ వర్ధంతి సందర్భంగా బుధవారం ఢిల్లీలోని క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 'అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి.. అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి.. అన్యాయాన్ని ఎదిరించినవాడే నాకు ఆరాధ్యుడు'అని ప్రకటించిన గొప్ప కవి కాళోజీ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, కాంగ్రెస్ నేత రోహిన్‌రెడ్డి పాల్గొన్నారు.



జపాన్ పార్లమెంట్ భవనాన్ని సందర్శించిన శాసనసభ బృందం

సాక్షి, హైదరాబాద్: జపాన్ దేశ స్టడీ టూర్‌లో భాగంగా బుధవారం ఆ దేశ రాజధాని టోక్యో నగరంలోని పార్లమెంట్ భవనాన్ని (నేషనల్ డైట్) శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, లెజిస్లేచర్ సెక్రటరీ వి.నరసింహాచార్యులు తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా నేషనల్ డైట్ అధికారులు జపాన్ పార్లమెంట్ పనితీరును తెలంగాణ శాసన బృందానికి వివరించారు.

నాణ్యమైన విద్యతోనే దేశ భవిష్యత్

కేంద్రమంత్రి సుకాంత మజుందార్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: నాణ్యమైన విద్య, ఆవిష్కరణలపైనే దేశ భవిష్యత్ అభివృద్ధి ఆధారపడి ఉందని కేంద్రమంత్రి సుకాంత మజుందార్ పేర్కొన్నారు. పరిశోధన రంగంవైపు విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, అందులో భాగంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ చేస్తున్న కృషి అభి నందనీయమని వ్యాఖ్యానించారు. అకడమిక్ ఎక్సలెన్స్‌కు ప్రోత్సాహం అందిస్తామన్నారు. బుధవారం ఆయన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యను అందించడంలో విశ్వవిద్యాలయాల పాత్ర ఎంతో ఉందన్నారు. యూనివర్సిటీ విజన్‌కు అనుగుణంగా విద్య, నైపుణ్యాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా మంత్రి చర్చించారు. ఆస్పైర్ బయో నెస్ట్ ఇంక్యుబేషన్ ఫెసిలిటీని (లైఫ్ సైన్సెస్‌లో నాలెడ్జ్-బేస్డ్ ఇంక్యుబేటర్) సందర్శించారు. పరిశోధన రంగంలోని స్టార్టప్‌లతో కేంద్రమంత్రి భేటీ అయ్యారు. అనంతరం 'ఏక్ పేడ్ మా కే నామ్'ప్రచారంలో భాగంగా క్యాంపస్‌లో మొక్కను నాటారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ బీజే రావు, రిజిస్ట్రార్ దేవేశ్ నిగమ్, పాఠశాలల డీన్‌లు, పలు విభాగాల అధిపతులు, తదితరులు పాల్గొన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్‌పై ప్రొఫెసర్ ఘనశ్యామ్ కృష్ణ సంక్షిప్త ప్రదర్శన ఇచ్చారు.


వైద్యులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వాలి

డాక్టర్ కిరణ్ మాదల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: మారుమూల ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వ బోధన వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కిరణ్ మాదల డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆస్పత్రి అనగానే వైద్యులే అనే భావన సమాజంలో నాటుకు పోయిందని, వాటితోపాటు మందులు, పరికరాలు, వసతులు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది చాలా అవసరమని తెలిపారు. అరకొరగా ఉన్న సదుపాయాలతో వైద్య విద్య సతమతమవుతోందన్నారు. ఇందుకు నిర్మాణాత్మక చర్యలు చేపట్టకుండా వైద్యుల లోపాలను భూతద్దంలో చూపించి నిజమైన సమస్యలను మరుగున పడేయాలని వైద్య ఉన్నతాధికారులు భావిస్తున్నట్టుగా ఉందని కిరణ్ ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న కనీస సౌకర్యాలు వైద్య విద్య అధ్యాపకులకు దూరం చేశారని మండిపడ్డారు. సాధారణ సెలవులు పెట్టాలంటే సవాలక్ష నియమాలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రమోషన్ ప్రాంతాల ఎంపికలో ఆప్షన్లు ఇవ్వడం లేదని, నియామకాలు చేపట్టడం లేదని తెలిపారు. ఇప్పటికే ఉన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న ఆశాభావంతో వైద్యులు పనిచేస్తున్నారన్నారు. అయితే ఉన్నతాధికారులు మాత్రం వైద్యులను బూచీగా చూపి సమస్య మొత్తానికి వారే బాధ్యులనే భావన ప్రభుత్వానికి, సమాజానికి కల్పిస్తున్నట్లు తెలుస్తోందని కిరణ్ విమర్శించారు. వారి ధోరణి మార్చుకోకపోతే కోల్‌కతా మాదిరిగా మూకుమ్మడి సెలవులకు సిద్ధమని హెచ్చరించారు.

కొత్తచెరువు ఆక్రమణలు తొలగించండి

- పబ్లిక్ స్థలాల ఆక్రమణలకు సుప్రీం తీర్పు వర్తించదు
- నీటి వనరులు, పర్యావరణాన్ని కాపాడాల్సిందే
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ 26వ తేదీకి వాయిదా



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ గ్రామం పరిధిలోని కొత్తచెరువుకు సంబంధించిన సర్వే నంబర్ 5లోని 5.25 ఎకరాల భూమిలో ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఆక్రమణలపై పిటిషనర్ల ఫిర్యాదులను స్వీకరించి విచారణ జరపాలని, నీటి వనరులను పరిరక్షించాలని జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం బుధవారం స్పష్టం చేసింది. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ), హైదరాబాద్ విపత్తు ప్రతిస్పందన, ఆస్తుల పర్యవేక్షణ, రక్షణ (హైడ్రా) విభాగాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా ముందస్తు అనుమతి లేకుండా కూల్చివేతలు చేపట్టవద్దని సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును కూడా ప్రస్తావించింది. రోడ్లు, వీధులు, ఫుట్‌పాత్‌లు, నీటి వనరులు వంటి పబ్లిక్ స్థలాలను ఆక్రమించి చేపట్టే అనధికార నిర్మాణాలకు అత్యున్నత న్యాయస్థానం ఉత్తర్వులు వర్తించవని తేల్చి చెప్పింది.

ఫిర్యాదులు పరిశీలించాల్సిందే

కొత్తచెరువు శిఖం ఆక్రమణపై తాము సెప్టెంబర్ 6వ తేదీన, అదే నెల 10న అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ ఖాజాగూడకు చెందిన ఆర్.రామకృష్ణతోపాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తప్పుడు పత్రాలతో అత్యంత విలువైన భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారని, వాటిని కూల్చేలా అధికారులను ఆదేశించాలని కోరారు. సోహిని బిల్డర్స్, బెవర్లీ హిల్స్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీతో పాటు భరతేందర్‌రెడ్డి, ఘనేశ్వర్, రాఘవరావు ఈ ఆక్రమణలో కుట్రదారులని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి బుధవారం విచారణ చేపట్టగా.. కొత్తచెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) సుమారు 5.5 ఎకరాల్లో విస్తరించి ఉందని పిటిషనర్ల తరపు న్యాయవాది వాదించారు. అక్రమ నిర్మాణాలు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడంతో ముంపు సమస్య తలెత్తుతోందని, నీటి వనరుల మనుగడకు కూడా ముప్పు వాటిల్లుతోందని తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్లు సమర్పించిన ఫిర్యాదులను అధికారులు తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రైవేట్ ప్రతివాదులకు కూడా నోటీసులు జారీ చేయాలని సూచించారు. శిఖం భూమి లేదా ట్యాంక్ బండ్‌పై ఆక్రమణలు గుర్తిస్తే వాటిని తొలగించాలని, నీటి వనరులను పరిరక్షణతో పాటు పర్యావరణ వ్యవస్థకు మరింత నష్టం జరగకుండా వేగంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తదుపరి విచారణను నవంబర్ 26వ తేదీకి వాయిదా వేశారు.

ప్రతిబిడ్డా ఆనందంగా ఉండాలనే నెహ్రూ ఆకాంక్షే బాలల దినోత్సవం

మహిళా, శిశుసంక్షేమ శాఖమంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: దేశంలోని ప్రతి బిడ్డా ఆనందంగా ఉండాలనే దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆకాంక్షల రూపమే బాలల దినోత్సవమని పీఆర్, మహిళా శిశు సంక్షేమ శాఖమంత్రి అనసూయ (సీతక్క) పేర్కొన్నారు. దేశాన్ని వెనుకబాటుతనం నుంచి వికాసం వైపు నడిపించిన దార్శనికుడిగా నెహ్రూను చిరకాలం ప్రజలు గుర్తు పెట్టుకుంటారన్నారు. పిల్లలను జాతి సంపదగా భావించి వారి భవితవ్యానికి, అభివృద్ధికి నెహ్రూ కృషి చేశారని కొనియాడారు. నెహ్రూ ఆశయాల వెలుగులో పిల్లలకు సరైన విద్య, ఆరోగ్యం, సంక్షేమం అందించేందుకు వారి హక్కుల రక్షణకు తమ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని సీతక్క చెప్పారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు.

దళారులు లేకుండా గొర్రెలు పంపిణీ చేయాలి

సాక్షి, హైదరాబాద్: దళారుల ప్రమేయం లేకుండా నగదు బదిలీ ద్వారా లబ్ధిదారులకు రెండోవిడత గొర్రెలను పంపిణీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిల్లె గోపాల్, ఉడుత రవీందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గొర్రెలు, మేకలకు ప్రభుత్వమే ఉచితంగా ఇన్సూరెన్స్ చేయించాలని బుధవారం వారు ఒక ప్రకటనలో కోరారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి గొర్రెలు, మేకలకు నట్టల మందు వేయాలని, సబ్సిడీ మీద జీవాలకు దాణా సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. పశు వైద్యశాలలు ఉదయం 7 గంటలకు తెరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. 50 ఏళ్లు దాటిన గొర్రెల కాపరులకు నెలకు రూ. 5 వేల పెన్షన్ ఇవ్వాలని, వివిధ ప్రమాదాల్లో చనిపోతున్న గొర్రెల పెంపకందారులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ రాష్ట్రంలో అగ్గి రాజేస్తున్నాయి

బీజేపీ అధికార ప్రతినిధి రాణీరుద్రమ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి అగ్గి రాజేస్తున్నాయని బీజేపీ అధికార ప్రతినిధి రాణీరుద్రమ ఆరోపించారు. లగచర్లలో పెట్టాలనుకుంటున్న ఫార్మా కంపెనీ సీఎం రేవంత్‌రెడ్డి బావమరిది సూదిని సృజన్‌రెడ్డిదేనని చెప్పారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి, కల్వకుంట్ల కవితకు బినామీగా సృజన్‌రెడ్డి అనేక వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులు సృజన్‌రెడ్డి కంపెనీకి దక్కిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కూడా కవితతో పాటు సృజన్ నిందితుడని రాణీరుద్రమ తెలిపారు. కల్వకుంట్ల, రేవంత్ రెడ్డి కుటుంబాలు కలిసి తెలంగాణను దోచుకుంటున్నాయని ఆరోపించారు. అమృత్ టెండర్లు కేటాయించిన కంపెనీలో కూడా కల్వకుంట్ల భాగస్వామ్యం బినామీ పేర్లతో ఉంటుందన్నారు. కేటీఆర్‌ను అరెస్ట్ చేయడం ఇష్టం లేకనే రేవంత్‌రెడ్డి గవర్నర్, కేంద్రంపైకి నెడుతున్నారని రాణీరుద్రమ మండిపడ్డారు.



మలిపొద్దులో వలిసె సొగసు

సూర్యాస్తమయం వేళ వలిసె పూల అందాలు కనువిందు చేశాయి. భానుడి కిరణాలు తాకడంతో కొత్త అందాలు ఆవిష్కృతమయ్యాయి. అరకు నుంచి జైపూర్ వెళ్లే రోడ్డులోని చటువా ప్రాంతంలో ఆ అద్భుత దృశ్యం ప్రకృతి ప్రేమికులను కట్టిపడేసింది.

– సాక్షి, పాడేరు



ఆకాశంలో అద్భుత లోకం

నేల నుంచి నింగిలోకి చూస్తే కనిపించే రంగుల కన్నా.. విను వీధిలోకి వెళ్లి అక్కడి అద్భుతాలను దగ్గరగా చూస్తే కలిగే అను భూతే వేరు. వేల అడుగులపైన మరో అద్భుత ప్రపంచం కళ్లకు కనిపిస్తుంది. స్వర్గాన్ని తలపించేలా ఉన్న ఆ అద్భుత దృశ్యాలను 30 వేల అడుగుల ఎత్తు నుంచి 'సాక్షి' కెమెరా చిత్రీకరించింది.

– సాక్షి, అమరావతి



కారుమేఘాలు కమ్మినవేళ..

నెల్లూరు నగరాన్ని గురువారం కారుమేఘాలు కమ్ముకున్నాయి. పైన వర్షించేందుకు సిద్ధంగా ఉన్న మేఘాలు.. కింద అదే రంగులో బారున నిలిచిఉన్న గూడ్స్ బోగీలు, చుట్టూరా పరచుకున్న పచ్చద నంతో వాతావరణం ఆహ్లాదకరంగా కనిపించింది. ఈ ప్రకృతి అం దాలను పాడుగుపాడు రైల్వే స్టేషన్ వద్ద సాక్షి క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

క్లుప్తంగా...

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి..

ఆహార కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం సరఫరా చేయాలని ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి అధికా రులను ఆదేశించారు. గురువారం అధికారు లతో ఆహార భద్రత చట్టం అమలుపై సమీక్ష నిర్వహించారు. తాను బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో పర్యటించిన సమయంలో విద్యా ర్థులు భోజనంలో నాణ్యత లేని ఆహారం అం దిస్తున్నట్టు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. రేషన్ డీలర్లకు బియ్యం, కందిపప్పు తూకం తక్కువ ఇస్తున్న ఎంఎల్ఎస్ పాయింట్లపై చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖకు సూచించారు. సమీక్షల్లో ఆహార కమి షన్ సభ్యులు లక్ష్మి రెడ్డి, జక్కంపూడి కృష్ణ కిరణ్, గంజిమాల దేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు 'నారాయణ' సహకారం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ జూనియర్ కళాశా లల్లో ఉత్తీర్ణత శాతం పెంపొందించేందుకు నారాయణ విద్యాసంస్థల నుంచి పూర్తి సహ కారం అందిస్తామని మునిసిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. పోటీ పరీ క్షలకు అవసరమైన మెటీరియల్ కూడా నారా యణ గ్రూప్ నుంచి అందిస్తామన్నారు. ఇం టర్ బోర్డు కమిషనర్ కృతికా శుక్లా విజ్ఞప్తి మేరకు గురువారం విజయవాడలో ఇంటర్ బోర్డు నిర్వహించిన వర్క్‌షాప్‌లో మంత్రి పాల్గొని అధ్యాపకులకు సూచనలు చేశారు. ఈ ఏడాది ఈఏపీసెట్ రాసే విద్యార్థులకు నారాయణ విద్యాసంస్థల నుంచి కోచింగ్ మెటీరియల్ అందిస్తానని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లో రాజకీయ కార్యకలాపాలు నిషేధం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ యాజమాన్యం లోని పాఠశాలల్లో రాజకీయ కార్యకలాపాలు నిర్వహించడాన్ని నిషేధిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు గురు వారం ఉత్తర్వులిచ్చారు. రాజకీయ కార్యకలా పాలతో పాటు మతపరమైన సభలు, వివాహాలను సైతం నిర్వహించరాదని పేర్కొన్నారు. ఈ తరహా కార్యకలాపాలకు జిల్లా విద్యాశాఖ అధికారులు అనుమతులు ఇవ్వరాదని ఆదేశించారు.

12 కేజీబీవీలకు సొంత హాస్టల్ భవనాలు

సాక్షి, అమరావతి: మోడల్ స్కూల్స్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు అనుబంధంగా కొనసాగుతున్న రాష్ట్రంలోని 12 కేజీబీవీలకు కేంద్ర విద్య మంత్రిత్వ శాఖ సొంత హాస్టళ్లను మంజూరు చేసింది. ఈ మేరకు భవనాల నిర్మాణ పనులు చేపట్టేందుకు అవసరమైన స్థలం సేకరించి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఆదేశించారు.

కేంద్ర సహాయ మంత్రి అదనపు కార్యదర్శిగా హిమాన్షు

సాక్షి, అమరావతి: సామాజిక న్యాయం, సాధి కార కేంద్ర సహాయ మంత్రి బి.ఎల్.వర్మకు అదనపు కార్యదర్శిగా ఐఏఎస్ అధికారి హిమాన్షు కౌశిక్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఢిల్లీలో ఏపీ భవన్ అదనపు రెసిడెం ట్ కమిషనర్‌గా పనిచేస్తున్న హిమాన్షును రాష్ట్ర సర్వీసు నుంచి రిలీవ్ చేస్తూ సీఎస్ గురువారం ఉత్తర్వులిచ్చారు. అదనపు రెసి డెంట్ కమిషనర్‌గా బాధ్యతలను అంతర్గతం గా ఏర్పాటు చేసుకోవాల్సిందిగా రెసిడెంట్ కమిషనర్‌కు ఉత్తర్వుల్లో సూచించారు.

ఏపీహెచ్ఎస్ఎస్‌పీ డైరెక్టర్‌గా కరుణ

సాక్షి, అమరావతి: ఏపీ హెల్త్ సిస్టమ్ స్ట్రెం థెనింగ్ ప్రాజెక్ట్(ఏపీహెచ్ఎస్ఎస్‌పీ) డైరెక్టర్‌గా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ వాకాటి కరుణకు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) ఇచ్చింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు గురువారం ఉత్తర్వులిచ్చారు.



పూల సేకరణకు ముందు విప్ప చెట్టుకు పూజ చేస్తున్న గిరిజనుడు



విప్ప చెట్టు కింద రాలిన పూలను సేకరిస్తున్న గిరి మహిళ

విప్ప పువ్వు.. కల్పతరువు



గిరిజనులకు అడవి ప్రసాదించిన ఫలాల్లో విప్ప పువ్వు ఒకటి. మన్యం లో విరివిగా లభించే ఇవి గిరిజను లకు మంచి ఆదాయ వనరు. ఇప్ప టివరకు సీజన్‌లో మాత్రమే సేకరించి ఆదాయం పొందేవారు. ఇక నుంచి వీటితో ఏడాది పొడవునా అనుబంధ ఆహార ఉత్పత్తులను తయారు చేసి ఆదాయం పొందే దిశగా గిరి మహిళలు అడుగులు వేస్తున్నారు.

- చెట్టుకు 150 కిలోల పువ్వు **లభ్యం**
- కిలో రూ.50 నుంచి రూ.60**కు విక్రయం**
- కాయలు కిలో రూ.30కు **కొనుగోలు**
- ఆధారిత ఉత్పత్తుల తయారీ **దిశగా** గిరి మహిళల అడుగులు

గిరిజనులకు మంచి ఆదాయ వనరు

చింతూరు: లాటిన్ పరిభాషలో సపోటేసీ జాతికి చెం దిన అడవి చెట్టు విప్ప. ఏటా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పూస్తుంది. చెట్లు కలిగిన గిరిజనులు పూలు రాలడానికి ముందే వాటి చుట్టూ నేలను శుభ్రం చేస్తారు. తెల్లవారుతున్న వేళ విప్పపూలు రాలుతున్న సమయంలో సువాసన వెదజల్లుతుంది. ఇంటిల్లిపాదీ కలసి చెట్టు వద్దకు చేరుకుని బుట్టలు, చేటలతో పూలను సేకరిస్తారు. వీటిని నాలుగైదు రోజులు బాగా ఎండబెడతారు. ఎండిన పూలను సంతలకు తీసుకువెళ్లి విక్రయిస్తారు.

ఏడాది పొడవునా అమ్మకాలు

అల్లూరి జిల్లా చింతూరు ఏజెన్సీలో విరివిగా విప్ప చెట్లు ఉన్నాయి. కొన్ని గిరిజన కుటుంబాలు వీటిపై వచ్చే ఆదాయంతో ఏడాది పొడవునా జీవనం సాగి స్తున్నాయి. సేకరించిన పూలను ఎండబెట్టి చింతూరు, ఏడుగురాళ్లపల్లి, కుంట మార్కెట్లకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. భద్రాచలం, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు భారీగా కొనుగోలు చేస్తున్నారు.

- ఒక చెట్టుకు సుమారు 150 కిలోల విప్ప పువ్వు లభ్యమవుతుంది. దీనిని ఎండబెట్టిన తరువాత వచ్చే పువ్వు కిలో రూ.50 నుంచి రూ.60 ధరకు విక్రయి స్తున్నారు. విప్పకాయలు కిలో రూ.30కు అమ్ముతున్నారు. ఈ చెట్లు విస్తారంగా ఉన్నందున గిరిజనులకు చేతినిండా ఆదాయం వస్తోంది.

పోషకాలెన్నో.. : విప్పపూలలో ఎన్నో పోషక గుణా లున్నాయని నిపుణులు చెబుతున్నారు. రోగాలను హరించే ఔషధ గుణాలు కూడా విప్పపూలలో ఉన్నాయని వారు సూచిస్తున్నారు. అధిక రక్తపోటు, మధుమేహం వంటి రోగాలను నయంచేసే గుణం తోపాటు ప్రొటీన్లు, కార్బొహైడ్రేట్లు, ఎనర్జీ, కాల్షి యం, ఫాస్పరస్, విటమిన్-సి వంటి ఎన్నో పోషక విలువలు ఉన్నాయని వారు చెబుతున్నారు. విప్పకా యలతో చేసిన నూనెతో మసాజ్ చేస్తే కీళ్లనొప్పులు దూరమవుతాయని వారు పేర్కొంటున్నారు.



విప్ప పువ్వులతో తయారుచేసిన హల్వా

స్వీట్ల తయారీ దిశగా అడుగులు

విప్ప పూలను సారా తయారీ, ప్రసాదాల్లో మాత్రమే వినియోగించేవారు. ప్రస్తుతం కొన్ని స్వచ్ఛంద సం స్థల సహకారంతో స్వీట్ల తయారీపై మహిళలు దృష్టి పెట్టారు. చింతూరుకు చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ విప్ప పూల సేకరణ, స్వీట్ల తయారీపై మహిళలకు అవగాహన కల్పిస్తోంది. లడ్డూ, హల్వా, జామ్, కేక్ వంటి తినుబండారాల తయారీపై శిక్షణ ఇచ్చి ఉపా ధిని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తోంది.



విప్ప పువ్వుతో లడ్డూల తయారీ

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి



విప్పపువ్వుల్లో ఎన్నో పోషక విలువలు ఉన్నందున వీటితో స్వీట్లు తయారీపై శిక్షణ ఇవ్వ డంతోపాటు మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తున్నాం. చింతూరు డివిజన్‌లోని గిరిజన గ్రామాల్లో ఈ ప్రక్రియ చేపట్టాం. తాము అందిస్తున్న సహకారం గిరిజన మహిళల ఆర్థికా భివృద్ధికి దోహదపడుతుంది. – సుభాని, కార్యదర్శి, ఆశా స్వచ్ఛంద సంస్థ, చింతూరు

విప్పపువ్వుతో ఆర్థికాదాయం



ప్రతి వేసవిలో ఇంటిల్లిపాదీ కలసి విప్పపూలు సేకరిస్తాం. వాటిని ఆరబెట్టి చింతూరు, మోతుగూడెం సంతల్లో విక్ర యించడం ద్వారా ఆదాయం లభిస్తుంది. దీం తోపాటు మా సంస్కృతిలో భాగంగా విప్పపు వ్వుతో సారా కూడా తయారుచేసి సేవిస్తాం.

– పూసం మహేష్, లక్కవరం, చింతూరు మండలం

శిక్షణ ఎంతో ఉపయోగం



విప్పపువ్వుల సేకరణతో పాటు ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యం లో స్వీట్ల తయారీలో శిక్షణ పొందుతున్నాం. తయారు చేసే విధానంతోపాటు ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తున్నారు. నాణ్యమైన విప్పపూల సేకరణకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నాం.

– వెట్టి కన్నమ్మ, తెరపాడు, చింతూరు మండలం

'ఆద్యం'తో చేనేత జౌళి శాఖ ఎంవోయూ



చేనేత ఉత్పత్తులను పరిశీలిస్తున్న రేఖారాణి, మనిష్ సక్సేనా

సాక్షి, అమరావతి: ఆదిత్యా బిర్లా గ్రూపునకు చెం దిన ఆద్యం హ్యాండ్-వోవెన్‌తో రాష్ట్ర చేనేత జౌళి శాఖ ఒప్పందం చేసుకుంది. హైదరాబాద్‌లో గురువారం జౌళి శాఖ కమీషనర్ రేఖా రాణి, ఆద్యం ప్రతినిధి మనిష్ సక్సేనాలు పరస్పరం అవగాహన ఒప్పందాలు(ఎంఓయూ) మార్చు కున్నారు. రేఖారాణి మాట్లాడుతూ..చేనేత ఉత్ప త్తులకు తగిన మార్కెటింగ్ సౌకర్యం కల్పించి, వాటికి మెరుగైన ప్రాచుర్యం కల్పించాలన్న సీఎం ఆదేశాల మేరకు చేనేత, జౌళి శాఖ వివిధ సంస్థలతో కలిసి పనిచేసేందుకు సంప్రదింపులు జరుపుతోందన్నారు. ప్రస్తుత ఒప్పందంలో భాగంగా ఆదిత్య బిర్లా గ్రూప్ రాష్ట్ర చేనేత ఉత్ప త్తులైన ఉప్పాడ (కాటన్ జమదాని), పులగుర్త (మల్కా ఖాదీ), అంగర (కాటన్ చీరలు) వెంక టగిరి (కాటన్ చీరలు), కోడుమూరు గద్వాల్ కాటన్ చీరలకు మెరుగైన మార్కెటింగ్ అవ కాశం కల్పిస్తారని వివరించారు.

తక్షణమే పత్తి కొనుగోళ్లు చేయాలి



సాక్షి, అమరావతి: తక్షణమే పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోళ్లపై శుక్రవారం కాటన్ కార్పొరేషన్, మార్కెటింగ్ శాఖాధికారులతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. పత్తి రైతులకు కనీస మద్దతు ధర రూ.7,521 చొప్పున లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో నిర్ణయించిన మేరకు 60 జిన్నింగ్ మిల్లులతో పాటు 11 మార్కెట్ యార్డుల్లో విధిగా పత్తి కొనుగోళ్లు చేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ సంచుల్లో కాకుండా లూజుగా కానీ, గన్నీ, జూట్ బ్యాగుల్లో పత్తిని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఈ విషయంలో రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సీసీఐ మార్కెటింగ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్కే పాణిగ్రహి, జనరల్ మేనేజర్ పీ అమరనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంత సంపాదించినా ఒదిగి ఉంటేనే విలువ

- శ్రీకౌముది వెబ్ మేగజైన్ ఫౌండర్ అండ్ ఎడిటర్ కిరణ్ ప్రభ
- 'కౌముది కిరణాలు' పుస్తకావిష్కరణ



మాట్లాడుతున్న కిరణ్ ప్రభ

చేబ్రోలు: విద్యార్థులు జీవితంలో ఎంత సంపాదిం చినా, ఏ హోదాకి వెళ్లినా, ఒదిగి ఉంటేనే విలువ ఉంటుందని శ్రీకౌముది వెబ్ మేగజైన్ ఫౌండర్ అండ్ ఎడిటర్ కిరణ్ ప్రభ తెలిపారు. గుంటూరు జిల్లా, వడ్లమూడి విజ్ఞాన్ వర్సిటీలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ఘనం గా ప్రారంభించారు. ముందుగా ×కౌముది కిరణాల్లు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సం దర్భంగా కిరణ్ ప్రభ మాట్లాడుతూ ఇప్పటివరకు దాదాపు 1350 టాక్ షోలు నిర్వహించానని... దాదాపు 700 మంది ప్రముఖ వ్యక్తుల బయోగ్రఫీలను శ్రోతలతో పంచుకున్నానని తెలిపారు. ప్రముఖ వ్యక్తుల జీవితాల్లోని ఎత్తుపల్లాలను బాగా అధ్యయనం చేసిన తర్వాతే టాక్ షోలో వారి గురించి చెప్తానన్నారు. గొప్ప వ్యక్తుల బయోగ్రఫీలను శ్రోతలు విన్నప్పుడు..అం దులో కొందరికైనా స్ఫూర్తి కలుగుతుందన్నారు. విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ 700 మంది గొప్ప వ్యక్తుల బయోగ్రఫీలను విశ్లేషించి 40 నిమిషాల్లో అర్థమయ్యేలాగా చెప్పగలిగిన ఘనత కిరణ్ ప్రభకే దక్కిందన్నారు.

సెలవులో రెండు డిస్కంల డైరెక్టర్

- నేటితో ముగుస్తున్న చంద్రం పదవీ కాలం
- అయినా అదే హోదాలో సెలవు!
- కొనసాగింపుపై వెలువడని నిర్ణయం



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడితో దండగల చంద్రం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)లో ఫైనాన్స్ డైరెక్టర్‌గానూ, ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) ఇన్‌చార్జ్ ఫైనాన్స్ డైరెక్టర్‌గానూ ఉన్న దండగల చంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు సెలవు మం జూరు చేసింది. వ్యక్తిగత కారణాల రీత్యా ఆయన కోరిన మేరకు ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు 17 రోజులు సెలవు ఇస్తున్నట్లు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్త ర్వులు జారీ చేశారు. అలాగే డిసెంబర్ 1వ తేదీన పబ్లిక్ హాలిడేని వినియోగించుకోవడానికి కూడా చంద్రంకు అనుమతినిచ్చారు. అయితే వాస్తవానికి ఈ నెల 15తోనే చంద్రం పదవీకాలం ముగుస్తోంది. ఇటీవల విద్యుత్ సంస్థల్లో పదిమంది డైరెక్టర్ల చేత బలవంతంగా కూటమి ప్రభుత్వం రాజీనామా చేయించింది. వారితో పాటు ఈ నెలలో పదవీ విరమణ చేయనున్న డైరెక్టర్ల పోస్టుల భర్తీకి విద్యుత్ సంస్థలు నోటిఫికేషన్‌ను జారీ చేశాయి. కానీ చం ద్రం కొనసాగింపుపై నిర్ణయం వెలువడనప్పటికీ ఆ పోస్టుకు మాత్రం నోటిఫికేషన్ ఇవ్వలేదు.

చంద్రంపై ఎందుకంత ప్రేమ..

ప్రభుత్వం మారిన వెంటనే చంద్రం టీడీపీ నేతలతో మంచి సంబంధాలు ఏర్పరచుకున్నారు. ఢిల్లీకి వెళ్లి మరీ కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడిని కలిసి ఫొటోలు దిగి సోషల్ మీడియాలో పోస్ట్ చేయిం చుకున్నారు. వ్యాపార వేత్త అయిన తన మామ సాయంతో రాష్ట్ర మంత్రులను తరచుగా కలుస్తూ తన పోస్టును పదిలం చేసుకోవడానికి అవసరమైన అన్ని ప్రయత్నాలు చేశారు. ఏపీసీపీడీసీఎల్‌లో ఫైనాన్స్ డైరెక్టర్ పోస్టును తనకు ఇవ్వాల్సిందిగా కూటమి మంత్రులను చంద్రం కోరారు. వారి ఆశీ స్సులతో ఫుల్ అడిషనల్ చార్జ్ (ఎఫ్ఏసీ)తో నియ మితులయ్యారు. మునుపెన్నడూ లేని విధంగా రెం డు డిస్కంలకు ఒక్కరే ఫైనాన్స్ డైరెక్టర్ అనే కొత్త సంప్రదాయానికి తెరదీశారు. అయితే చంద్రాన్ని ఇంకా కొనసాగించడానికి నిబంధనలు అడ్డురావ డంతో ఏం చేయాలనేదానిపై ఇంధన శాఖ కసరత్తు చేస్తోంది.


ఇంజనీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

జాతీయ మెటలర్జికల్ సదస్సులో ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్



మెటలర్జీ విభాగం విద్యార్థులు ఏర్పాటు చేసిన మోడల్స్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్, ప్రొఫెసర్లు

నూజివీడు: ఇంజనీరింగ్ విద్యార్థులు తమలో నైపు ణ్యాలను పెంచుకునేందుకు నిరంతరం కృషి చేయాలని ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ సూచిం చారు. ప్రపంచ మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ దినోత్సవం సందర్భంగా నూజివీడు ట్రిపుల్ ఐటీలో ×నేషనల్ సింపోజియం ఆన్ మెటలర్జీ, మెటీరియల్స్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్౯ అనే అంశంపై జాతీయ సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సద స్సును ప్రారంభించిన డైరెక్టర్ ప్రారంభోపన్యాసం చేశారు. మెటలర్జీ రంగంలో నూతన ఆవిష్కరణలు, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పురోగతుల గురించి విద్యార్థులు తెలుసుకునేందుకు జాతీయ సదస్సులు ఎంతో దోహదపడతాయని చెప్పారు. వరంగల్ ఎన్ఐటీ మెటలర్జీ విభాగాధిపతి ఆచార్య ఎస్.కిశో ర్‌బాబు మాట్లాడుతూ విమాన యాన, నౌకా రంగం లో విరివిగా ఉపయోగించే టైటానియం ఎల్లాయ్స్‌పై ఆధునాతన విధానాల గురించి విద్యార్థులకు అవగా హన కలిగేలా వివరించారు. విజయనగరం జేఎన్ టీయూ కళాశాల మెటలర్జీ విభాగాధిపతి జి.స్వామి నాయుడు మాట్లాడుతూ సివియర్ ప్లాస్టిక్ డీఫా ర్మేషన్ విధానంలో మాన్యుఫ్యాక్చరింగ్ చేసే ప్రక్రి యల గురించి తెలియజేశారు. కుశలవ ఇంటర్నేష నల్ పరిశ్రమ డైరెక్టర్ వై.గోపాలరావు మాట్లాడుతూ ఇంజిన్ లైనర్స్‌లో వాడే పదార్థాలు, వాటి తయారీ విధానాలపై అవగాహన కల్పించారు. బీటెక్ మెట లర్జీ విద్యార్థులు ఇంజనీరింగ్ ప్రాజెక్ట్‌లో భాగంగా చేసిన పరిశోధనలకు సంబంధించిన సైంటిఫిక్ పోస్టర్లను, మెటలర్జీ ఇంజనీరింగ్ టెక్నాలజీకి సంబం ధించిన ప్రోటో టైప్ మోడల్స్‌ను ప్రదర్శించారు. మెటలర్జీ విభాగాధిపతి బి.వెంకటేశ్వర్లు, ఏఓ బి.లక్ష్మ ణరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధా రణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెం ట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 66,441 మంది స్వామివారిని దర్శించుకోగా 20,639 మంది భక్తులు తలనీలాలు సమర్పి ంచారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.12 కోట్లు సమర్పించారు.

భక్తజన సంద్రమైన రత్నగిరి



అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధి గురువారం భక్తజనసం ద్రమైంది. శుక్రవారం కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం సాయంత్రానికే సుమారు 30 వేల మంది భక్తులు తరలివచ్చారు. హైదరాబాద్ , విజయవాడ నుంచి వచ్చిన భక్తులు దేవస్థానం బస్సులు, ఆటోల్లో రత్నగి రికి చేరుకున్నారు. శుక్రవారం నాటికి సుమారు లక్ష మంది రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. పౌర్ణమి సందర్భంగా ఆలయాన్ని తెల్లవారుజామున ఒంటి గంటకు తెరవనున్నారు. ఆలయప్రాంగణం లో తొక్కిసలాట జరగకుండా పశ్చిమ రాజగోపురం వద్ద కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేసి క్రమ పద్ధతిలో భక్తులను దర్శనానికి పంపనున్నారు. గురువారం సుమారు 40 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించి పూజలు చేశారు.

సన్నిధి

సాక్షి ప్లస్

గురువారం ॥ 14-11-2024



అతి పురాతనమైన పార్వతీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం సంగారెడ్డి జిల్లా సదాశివ పేట మండలం నంది కంది గ్రామంలో ఉంది. స్వయంగా శ్రీరాముడు ఈ రామలింగేశ్వర లింగాన్ని ప్రతిష్ఠించినట్లు చెప్పకుంటారు. తర్వాత 11వ శతాబ్దంలో కళ్యాణి చాళుక్యులు ఈ మహాలింగాన్ని గుర్తించి రామలింగేశ్వర ఆలయంగా నక్షత్ర ఆకారంలో గుడిని కట్టడం మరో విశిష్టత. ఇక్కడ 6 శాసనాలు ఉన్నాయి. ఒక్కొక్క శాసనం ఒక్కొక్క విశిష్టత. ఈ ఆరు శాసనాలలో ఆరు రంధ్రాలు ఉండడం విశేషం. ఈ 6 రంధ్రాల నుండి సూర్యుని కిరణాలు రామలింగేశ్వరునిపై పడడం మరో విశిష్టత. రెండవది, ఈ గుడి గర్భగుడి ఆకారం నక్షత్రం ఆకారంలో ఉండడం మరో విశేషం. ఇక్కడ గజ స్తంభాలు కళ్యాణ చాళుక్యుల శిల్ప కళకు నిదర్శనం. ప్రతి శ్రావణ, కార్తీక, మాఘ మాసాలలోరామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు జరుగుతాయి.

అరుదైన నక్షత్రాకారపు కట్టడం

కందినంది రామలింగేశ్వర స్వామి ఆలయం

సంగారెడ్డి నుంచి 15 కి.మీ., మెదక్ నుండి 60 కి.మీ ల దూరంలో ఉన్న నంది కంది ఒక చిన్న గ్రామం నక్షత్ర ఆకారంలో ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయానికి ప్రసిద్ది చెందింది.

11వ శతాబ్దంలో వీర చాళుక్యుల ఆధ్వర్యంలో నిర్మించబడిన నందికందిలోని రామలింగేశ్వర దేవాలయం ప్రత్యేకించి దాని ప్రత్యేక ఆకృతికి ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయం ప్రతి స్తంభం అద్భుతమైన శిల్ప కళతో కనువిందు చేస్తుంది.

సెంట్రల్ హాల్ లేదా నవరంగలోని నాలుగు అలంకార స్తంభాలు దాని అత్యుత్తమ నమూనాలలో ఒకటి. బ్రహ్మ, విష్ణు, శివ, నరసింహ, వరాహ, నటరాజ, దేవి మహిషాసుర మర్దిని, సరస్వతి, గజలక్ష్మి వంటి దేవతల రూపాలు స్తంభాల ముఖభాగం, పక్క గోడలను అలంకరించాయి.

గర్భగృహంలో ఆలయ ప్రధాన దైవాలైన రామలింగేశ్వర స్వామి లింగ రూపం లో కొలువై ఉండగా, పార్వతీ దేవి విగ్రహం అందమైన నల్ల రాతిపై చెక్కబడి ఉంటుంది. ఇతర శిల్పాలలో అప్సరసలు, దిక్పాలకులు, రాక్షసులు, మాతృమూర్తి, దర్పణ యోధుల శిల్పాలు ఉన్నాయి.


ఆలయంలో రామలింగేశ్వరునికి అభిముఖంగా నల్లరాతితో చెక్కి ఉన్న భారీ నంది విగ్రహం మూల విరాట్టులతో పోటీ పడుతున్నదా అన్నంత అందంగా... అద్భుతంగా... ఆకర్షణీయంగా ఉంటుంది.

రామలింగేశ్వర దేవాలయం శిల్పకళా వైభవానికి ఒక ప్రత్యేక నమూనా. దాని అద్భుతమైన శిల్పం చాళుక్యుల శకం నాటి హస్తకళల గురించి చెబుతుంది. చాళుక్య రాజుల నుంచి సంక్రమించిన సంస్కృతి, వారసత్వాన్ని అనుభవించాలనుకుంటే ఈ ఆలయాన్ని మిస్ చేయకూడదు.

సుసంపన్నమైన చారిత్రిక ప్రాముఖ్యత, అద్భుతమైన చెక్కడం వల్ల రామలింగేశ్వర దేవాలయం తెలంగాణలోని పురాతన దేవాలయాల జాబితాలో ఉండాలి.

ఆలయ వేళలు..

ఉదయం 5:30 నుంచి సాయంత్రం 7:00 వరకు











ఎక్కడ బస చేయాలి?

● సంగారెడ్డి, సమీప పట్టణం, కొన్ని మంచి వసతి ఎంపికలను అందిస్తుంది. శ్రీ చంద్ర పార్క్స్ - రిసార్ట్స్ న్యూ గ్రాండ్ హోటల్ లాడ్జ్ కొన్ని ప్రసిద్ధ ఎంపికలు.

● అంతేకాకుండా, హైదరాబాద్‌కు చాలా దగ్గరగా ఉండటంతో, పర్యాటకులు హైదరాబాద్ నుంచి డే ట్రిప్‌లలో సంగారెడ్డికి కూడా ప్రయాణించవచ్చు.

ఇంకా ఏమేం చూడవచ్చంటే..?

● మెదక్ కోట, పోచారం ఆనకట్ట రిజర్వాయర్, పోచారం వన్యప్రాణుల అభయారణ్యం, కోటిలింగేశ్వర ఆలయం, లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, పురావస్తు మ్యూజియం, కొండాపూర్. కళ్యాణి చాళుక్యుల నిర్మాణ శైలికి నిదర్శనం నంది కంది ఆలయం. ఇది క్రీ.శ 1014లో విక్రమాదిత్యుని హయాంలో నిర్మించబడి ఉండవచ్చని చరిత్రకారులు చెబుతున్నారు.

ఆలయం విలక్షణమైన లక్షణాలలో ఒకటి దాని ప్రవేశ తోరణం, తోరణం అని పిలువబడే ఏడు విలోమ తామర నమూనాలతో అలంకృతమై ఉంటుంది. కమలాల మధ్య ఉన్న ఈ ఖాళీలు ఉదయపు సూర్యకాంతిని పరావర్తనం చెందిస్తాయి. లోపలి గర్భగుడిలోని శివలింగాన్ని ప్రకాశవంతం చేస్తాయి, ప్రతి అంతరం ఒక ఋతువును సూచిస్తుంది.

ఈ ఆలయం బ్రహ్మ, విష్ణు, శివుడు, నరసింహ వంటి హిందూ దేవతలతో పాటు వరాహ, నటరాజ, దేవి మహిషాసుర మర్దిని, సరస్వతి, గజలక్ష్మితో సహా క్లిష్టమైన శిల్పాలతో అలంకరించబడింది. ఈ బొమ్మలు నాలుగు కేంద్ర స్తంభాలలో చెక్కబడ్డాయి, ఇవి ఆలయ మండపం లేదా నవరంగాన్ని ఏర్పరుస్తాయి. అదనంగా, ఈ ఆలయంలో దిశాత్మక సంరక్షకులు, సొగసైన బొమ్మలు, పౌరాణిక జీవుల శిల్పాలు ఉన్నాయి. గర్భగుడి నక్షత్రం ఆకారంలో... శిఖరం పద్మాకారంలో రూపొందించబడి ఉంటాయి. ఈ నిర్మాణ అంశాలు, కళాకృతుల కలయిక పురాతన హస్తకళ మత పరమైన కళలపై ఆసక్తి ఉన్నవారికి అపూర్వమైన, అనిర్వచనీయమైన అనుభూతినిస్తుంది. ●

ఎలా చేరుకోవాలంటే..?

● హైదరాబాద్ నుంచి జహీరాబాద్, సదాశివపేట, బీదర్ లేదా పటాన్ చెర్వు మీదుగా నంది కంది చేరుకోవచ్చు. ● రామలింగేశ్వర ఆలయం నంది కంది బస్‌స్టాప్ నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉంది.


● ఓషో వాణి

కళ్ళు మూసుకుంటే సరిపోదు!!

అతను తన గురువుగారి ఆశ్రమంలో విడిగా ఏర్పాటు చేసిన ఓ పూరిపాకలో కూర్చుని స్థిరమైన మనసుకోసం తీవ్రంగా ప్రయత్నించ సాగాడు. ఎవరు చూడడానికి వచ్చినా అతను కళ్ళు తెరచి చూసేవాడు కాదు. ఎవరైనా వచ్చినట్టు అలికిడైనా సరే చూసేవాడు కాదు.

అయితే ఒకరోజు గురువుగారు ఈ శిష్యుడిని చూడడానికి వెళ్ళారు. కానీ శిష్యుడు గురువుగారిని కూడా పట్టించుకోలేదు. అయినా గురువుగారు అక్కడి నుంచి కదల లేదు. పైగా ఆ పూరిపాక గుమ్మంలో ఓ ఇటుకరాయిని మరొక రాయిమీద పెట్టి అరగదీయడం మొదలుపెట్టాడు. అలా గీయడంతో పుట్టిన శబ్దాన్ని శిష్యుడు భరించలేకపోయాడు.

అతను కళ్ళు తెరిచి అడిగాడు - ''మీరేం చేస్తున్నారు...తెలుస్తోందా...''అని.



గురువు చెప్పాడు - ''ఇటుకను అద్దంగా మారుస్తున్నాను'' అని.

అప్పుడతను ''ఇటుకను అద్దంగా మార్చడం సాధ్యమా... దానిని పిచ్చితనమంటారు... మరెంత అరగదీస్తే అంతగా అది అరిగి చివరికి ఇటుకరాయి జాడ కూడా కనిపించకుండా పోతుంది. అలాంటిది అద్దం ఎలా ఏర్పడుతుంది. కాస్త ఆపండి ఆలోచించండి... నన్ను నా మనసు మీద ఏకాగ్రత నిలుపుకోనివ్వండి'' అని చెప్పాడు.

అతని మాటలకు గురువుకు నవ్వొచ్చింది.

''అలాగైతే నువ్వేం చేస్తున్నావు... ఇటుకరాయి అద్దం కాలేని పక్షంలో మనసు ఎలా స్వచ్ఛమైన అద్దమవుతుందో చెప్పు. ముక్కు మూసుకుని కూర్చున్నంత మాత్రాన నిలకడ వచ్చేయదు. దానికో పద్ధతి ఉంది. అది తెలుసుకోకుండా ఎవరినీ చూడనని కళ్ళు గట్టిగా మూసుకుంటే సరిపోతుందని అనుకోవడం ఎంత అవివేకం?'' అని ప్రశ్నించాడు గురువు.


శిష్యుడు సిగ్గుతో తలవంచుకున్నాడు.

– యామిజాల జగదీశ్

● పరిహారం

ఆర్థిక ఇబ్బందులా? పరిహారాలివిగో!

ఒక్కొక్కసారి ఎంత కష్టపడుతున్నా ఆర్థిక ఇక్కట్ల నుంచి గట్టెక్కడం కష్టంగా ఉంటుంది. కాలం పగబట్టిందేమో అనేంతగా గడ్డు పరిస్థితులు ఎదురవుతూ ఉంటాయి. ఎన్ని ప్రయత్నాలు సాగిస్తున్నా అర్హతలకు, అనుభవానికి తగిన అవకాశాలు దక్కవు. దొరికిన అవకాశాలు తగిన ఆదాయాన్ని ఇచ్చేవిగా ఉండవు. అసంతృప్తి, నిస్పృహ మనసును కుదురుగా ఉండనివ్వవు. అలాంటి పరిస్థితుల్లో ఈ పరిహారాలను పాటించడం వల్ల ప్రయోజనకరంగా ఉంటుంది.



కాకులకు, కుక్కలకు, ఆవులకు ఆహారాన్ని పెట్టండి. ఇంట్లోని బీరువాలు, నగలు వంటి విలువైన వస్తువులను భద్రపరచుకునే పెట్టెలను ఖాళీగా ఉంచకండి. వాటిలో ఉంచడానికి ఏమీ లేనట్లయితే, కనీసం నాలుగు బాదం గింజలైనా వేసి ఉంచండి. ఎలాంటి ప్రలోభాలు ఎదురైనా అనైతిక కార్యకలాపాలకు, అవినీతికి దూరంగా ఉండండి. జూదానికి, స్పెక్యులేటివ్ లావాదేవీలకు దూరంగా ఉండండి.

కుంకుమపువ్వును, కస్తూరిని కలిపి తిలకంగా ధరించండి. నిత్య పూజలో భాగంగా లక్ష్మీదేవిని తెల్లని పూలతో అర్చించండి. తెలుపు రంగు మిఠాయిలను నైవేద్యంగా పెట్టండి.

ప్రవహిస్తున్న నీటిలో చిన్నబెల్లం ముక్కను, అక్షతలను విడిచిపెట్టండి. కనీసం ఆరు ఆదివారాలు నిరుపేద అంధులకు అన్నదానం చేయండి.

వెదురుబొంగులో పంచదార నింపి, నిర్జనప్రదేశంలో దానిని పాతిపెట్టండి. మర్రిచెట్టు మొదట్లో పాలు, కొబ్బరినీరు పోయండి. శనివారం పూర్తిగా మద్య మాంసాలకు దూరంగా ఉండండి. శని త్రయోదశి నాడు శనికి తైలాభిషేకం జరిపించండి. కార్తీక మాసంలో రుద్రాభిషేకం జరిపించడం వల్ల దోషనివారణ జరుగుతుంది.

– సాంఖ్యాయన

● ప్రవక్త పలుకు

సృష్టికర్త మహిమ

అల్లాహ్ యే నీటితో మానవుణ్ణి సృష్టించాడు. తరువాత అతని ద్వారా (తన) వంశం, అత్తవారి వంశం అనే రెండు వేరువేరు బంధుత్వపు క్రమాలను రూపొందించాడు. నీ ప్రభువు సర్వ శక్తి సంపన్నుడు.

(దివ్య ఖుర్‌ఆన్:25:54)

వివరణ: ఒక అల్పమైన నీటిచుక్క ద్వారా మానవుడి వంటి విచిత్రమైన సృష్టిని నిర్మించి నిలబెట్టడమే గొప్ప మహిమ అనుకుంటే అంతకంటే విచిత్రమైన మహిమ ఏమిటంటే మానవుల్లో కూడా ఒకే నమూనా కాదు రెండు వేరువేరు నమూనాలు. అంటే స్త్రీలుగా, పురుషులుగా చేశాడు. వారు మానవులుగా ఒకటే గాని, శారీరక మానసిక ప్రత్యేకతల రీత్యా చాలా భిన్నమైన వారు.ఈ భిన్నత్వం కారణంగా ఈ రెండు నమూనాలు పరస్పరం విరుద్ధం కావు, వ్యతిరేకం కావు. ఒకదానికొకటి పూరకాలు. కానీ ఈ జతల్ని కలిపితే వింతైన సంతులనంతో ఇందులో మరెవరి ఏ ఉపాయానికి కూడా ఏమాత్రం స్థానం లేదు ప్రపంచంలో సృష్టికర్త పురుషులను సృష్టిస్తున్నాడు స్త్రీలను సృష్టిస్తున్నాడు వీరి ద్వారా సంబంధాల పరంపర మొదలవుతుంది. కొడుకులు మనవాళ్లు ఇతర ఇండ్ల నుండి ఇంటి కోడళ్ళను తెచ్చేవారు పుడతారు. వారి ద్వారా మరో పరంపర మొదలవుతుంది. కూతుళ్లు మనవరాళ్ళ క్రమం ప్రారంభమవుతుంది. వారు ఇతర ఇళ్ళకు కోడళ్ళుగా వెళతారు. ఇలా కుటుంబాలతో కుటుంబాలకు సంబంధాలు ఏర్పడి దేశాలకు దేశాలే ఒక సంతతి ఒక నాగరికతతో ముడిపడి పోతారు. ఇక్కడ అతి సూక్ష్మంగా ఒక విషయాన్ని సూచనప్రాయంగా తెలపడం జరిగింది. ఈ జీవన కర్మాగారంలో ప్రత్యేక విజ్ఞత, ఔచిత్యాలు పనిచేస్తాయి. ఈ విధానం ప్రకారమే ఇక్కడ వైవిధ్యం ఉంది. ఈ వైవిధ్యాల కలయిక ద్వారానే సకల ఫలితాలు వెలువడతాయి.



మానవులకు జంతువులకు ఉన్న తేడా ఇదే. ఒక పురుషుడు ఒక స్త్రీ అక్రమంగా కలుసుకుంటే దానిని సమాజం ఏవగించుకుంటుంది. కానీ ఆ కలుసుకోవడమే వివాహం ద్వారా జరిగితే అది గౌరవప్రదంగా ఎంచబడుతుంది. ఇక్కడి నుండే అత్తగారి ఇల్లు మొదలవుతుంది అటు పురుషునికి అత్తగారి ఇల్లు ఇటు స్త్రీకి అత్తగారి ఇల్లు. ఇక్కడ అత్త గారి ఇల్లు అని చెప్పడంలో ఎంతో వైశాల్యం ఉంది.

అదేమిటంటే వారిద్దరికీ కలిగే సంతానం అటు నానమ్మ తాత గారి వంశానికి, ఇటు అమ్మమ్మ తాతగారి వంశానికి సంబంధించిన వారవుతారు అటు నుండి ఇటు నుండి అటు కుటుంబాలు పెరుగుతాయి. వావివరసలు పెరుగుతాయి. ఈ విధంగా ఒక ప్రేమగల సమాజం భూమిపై మన గలుగుతూ ఉంటుంది.

– మొహమ్మద్ అబ్దుల్ రషీద్

కార్తీకమాసంలో ఉసిరిని పూజిస్తే...

పవిత్రమైన కార్తీకమాసంలో తులసి, ఉసిరి కోట ముందు దీపం వెలిగిస్తే సకల దోషాలు తొలుగుతాయి అని కార్తీక పురాణం చెబుతుంది. ఈ మాసంలో ఉసిరిచెట్టును పూజించటం వలన చలికాలంలో వచ్చే అనారోగ్య సమస్యలు దరిచేరవని శాస్త్రాలు చెబుతున్నాయి.

కార్తీక పౌర్ణమి రోజున ఉసిరికాయలతో దీపాలు వెలిగించి ఈ శ్లోకాలు పఠించాలి.

దాత్రీదేవి నమస్తుభ్యం సర్వపాప క్షయంకరి పుత్రాన్ దేహి మహా ప్రాజ్ఞే యశోదేహి బలంచమే

ప్రజ్ఞం మేధాంచ సౌభాగ్యం విష్ణు భక్తించ శాశ్వతీం నిరోగం కురుమాం నిత్యం నిష్పాపం కురు సర్వదా


ఉసిరి చెట్టు పూజ సాధారణంగా అమావాస్య, పూర్ణిమ, ఇతర ముఖ్యమైన పండుగలు, పర్వదినాలలో నిర్వహిస్తారు. పూజ సమయంలో, చెట్టు వద్ద ఒక చిన్న, లోతులేని గొయ్యి తవ్వి, దానిలో ప్రమిదను ఉంచి దీపాన్ని వెలిగిస్తారు. చెట్టుకు పూలు, పండ్లు, ఇతర పూజాద్రవ్యాలను సమర్పించి శ్లోకాలను పఠిస్తారు. ఉసిరి చెట్టు చెట్టును విష్ణువుకు ప్రతిరూపంగా పరిగణిస్తారు. అందువల్ల ఉసిరి చెట్టును పూజించడం ద్వారా విష్ణుమూర్తి అనుగ్రహాన్ని పొందవచ్చు. అంతేకాదు, కార్తీక మాసంలో ఉసిరి చెట్టును, తులసి చెట్టును నాటడం వల్ల శ్రేయస్సు, సంతోషం కలుగుతాయంటారు. అందువల్ల ఏకాదశి, ద్వాదశి, పూర్ణిమ వంటి పర్వదినాలలో ఆలయాలలో ఉసిరి, తులసి మొక్కలను కూడా భక్తులకు ప్రసాదంగా పంచుతారు. పండ్లకు బదులు మనం ఎవరికైనా మొక్కలను కూడా పంచవచ్చు.



● సువార్త

వయోవృద్ధుల జ్ఞానం-అనుభవం

మానవులకు దేవుడిచ్చిన ప్రధానమైన వరం కుటుంబ వ్యవస్థ. ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలంటే సంతానం విద్య, ఉద్యోగం, వివాహం ప్రభువు చిత్తానుసారంగా జరగాలి. పరిశుద్ధ గ్రంథంలో గొప్ప వ్యాపారవేత్త, సైన్యం కలిగి దేవుని చిత్తానుసారంగా జీవించినవాడు 'అబ్రహాము' అనే పేరు గల నీతిపరుడు కుమారుడైన ఇస్సాకుకు వివాహ విషయంలో ఏ విధంగా జ్ఞాన యుక్తంగా, కర్తవ్యంగా ఎలా నిర్వర్తించాడో పరిశీలిద్దాం. ఆయన బహు వృద్ధుడయ్యాడు. ఆయన వయస్సు 140 సంవత్సరాలు. అతని భార్య మరణించి అప్పటికి మూడు సంవత్సరాలైంది. వృద్ధుడైన అబ్రహాము తన కుమారునికి పెళ్ళి చేయాలనుకున్నాడు. తన పనివారిలో పెద్దతనితో నేను జీవిస్తున్న ఈ కనానుదేశం వారితో కాకుండా నా స్వదేశంలోని నా బంధువుల దగ్గరకు వెళ్ళి నా కుమారుడగు ఇస్సాకుకు భార్యను చూడమని, అతని చేత ఆకాశం, భూమికి దేవుడైన యెహోవా మీద ప్రమాణం చేయించుకుని పంపాడు.



ఇది వృద్ధులకుండవలసిన బాధ్యత, జ్ఞానం. ఇస్మాయేలు కోసం తన తల్లి హాగరు ఐగుప్తునుండి అమ్మాయిని తీసుకొనివచ్చి పెళ్ళి చేసింది. తల్లి ఇష్టప్రకారమే ఇస్మాయేలు ఆ యువతిని పెళ్ళిచేసుకున్నాడు. కావున బిడ్డలు భవిష్యత్తులో సుఖంగా వుండాలని కోరుకోవడం వృద్ధుల జ్ఞానం, బాధ్యతగా గుర్తించాలి. (ఆదికాండం 24 : 1-7).

ఇశ్రాయేలీయులు అరణ్యంలో 40 సంవత్సరాలు కనానుదేశం వెళ్ళడానికి నడిచారు. అప్పుడు యెహోషువా అనగా మోషే (ప్ర) పరిచారకుడు. అతని వయస్సు 80 సంవత్సరాలు. 40 సంవత్సరాల వయసులో వున్న బలం 80 సంవత్సరాల వయసులో కూడా ఉన్నదని, యుద్ధాలు చేయగల శక్తి వున్నదని పరిశుద్ధ గ్రంథం చెప్తుంది. (యెహోషువా 14: 10-11).

మోషే (ప్ర) చనిపోయినప్పుడు 120 సంవత్సరాలు, ఆ వయసులో అతనికి దృష్టిమాంద్యం లేదని బైబిల్ చెపుతుంది. (ద్వితి 34:7).

ఇంకో విషయం బైబిల్‌లోని ఆదాము అవ్వల వంశావళిలో 969 సంవత్సరాలు జీవించింది 'మెతూషెల' కాగా అత్యల్పం 367 సంవత్సరాలు జీవించిన వ్యక్తి హనోకు. కానీ అతడు దేవునితో ఆరోహణమయ్యాడు. (ఆది 5వ అధ్యా).

ఇంకో వయో వృద్ధుడైన దావీదు మహారాజు గూర్చి తెలుసుకుందాం. దావీదునకు మరణకాలం సమీపించినపుడు కుమారుడైన సాలోమానును చెంతకు పిలిచి ''కుమారా! లోకులందరూ పోవలసిన మార్గమున నేను పోవుచున్నాను. నీవు మన దేవుడైన యెహోవా (సర్వశక్తిగల ప్రభువు) అప్పగించిన, ధర్మశాస్త్రంలో రాసిన కట్టడులను, విధులను, శాసనములు గైకొనుము, అట్లు చేసిన యెడల నీ పిల్లలు వారి ప్రవర్తన విషయం జాగ్రత్తగా వుంటారని నా రాజ్యం (ఇశ్రాయేలు రాజ్యం) స్థిరంగా ఉండును'' అని కుమారునికి ఆజ్ఞ యిచ్చాడు. కావున వృద్ధాప్యంలో బిడ్డలకు అప్పగించవలసినది దేవుని ధర్మశాస్త్ర ప్రకారం నడుచుకోవాలని బిడ్డలకు బోధించాలి. ఇది వయోవృద్ధుల కర్తవ్యం, జ్ఞానం.

– కోట బిపిన్ చంద్రపాల్

ధర్మ సందేహాలు

మనవద్ద దానం తీసుకున్న వారు ఆ దానద్రవ్యాన్ని మరెవరికైనా ఇచ్చేయవచ్చా?

ఏ వస్తువుని దానమియ్యాలనేది ఇచ్చేవాని ఆలోచనకీ స్తోమతుకీ లోబడి వుంటుంది. అందుచేత ఎదుటివానికి ఏ వస్తువుని ఇస్తే దాన్ని ఎవరికీ అతడు దానాన్ని చెయ్యడో- లేక ఇచ్చి వెయ్యలేడో అలాంటి వస్తువుని ఎంచుకోవాలి దాత. ఇక రెండవ అంశం- దానమంటూ ఒకసారి ఇచ్చేశాక - తుభ్యమహం సంప్రదదే న మమ- నీకిచ్చేస్తూ, నేను ఈ వస్తువు మీదున్న అధికారాన్ని కోల్పోతున్నానంటూ చెప్పేశాక - ఆ వస్తువుని ప్రతిగ్రహీత (దానం తీసుకున్న వ్యక్తి) ఏంచేసినా మాట్లాడే హక్కు దాతకి వుండనే వుండదు. అందుకే 'పాత్రత ఎరిగి (అర్హుడా కాదా?) ఆ వస్తు అవసరం వున్నవాడా? కాడా? అని ఆలోచించి దానం చెయ్యాలంది శాస్త్రం.

దానాలు ఇవ్వలేనప్పుడు... తీసుకునేవారు దొరకనప్పుడు ఏం చేయాలి?

వివిధ రకాల గ్రహదోషాలకు, జాతక దోషాలకు పురోహితులు, పండితులు దానాలు చేయమని చెబుతుంటారు. ఒకోసారి ఆ దానాలు పుచ్చుకునేవారు దొరకకపోవచ్చు. అలాంటప్పుడు ఏం చేయాలంటే... పూజ అనంతరం దానం ఇచ్చినట్లుగా సంకల్పం చెప్పుకుని ఆ ధాన్యాన్ని లేదా దాన వస్తువులను జీవనదిలో లేదా ఏదైనా ప్రవాహంలో కలపవచ్చు. అవకాశం లేనివారు వాటిని నీటిలో తడిపి ఆ ధాన్యాన్ని తినగల జంతువులకు ముఖ్యంగా ఆవుకు, గేదెకు, శునకాలకు, కాకులకు పెట్టవచ్చు లేదా ఎవరూ తొక్కనిచోట చల్లి రావచ్చు. దానివల్ల దోషపరిహారం జరుగుతుంది.



జాతకం... ముహూర్త నిర్ణయం... అన్నీ ఒకటికి రెండుమార్లు చూపించి చేసినా ఆ వివాహం నిలబడలేదు. ఎందుకని?

తలరాత ఎనభైపాళ్లు. జాతక పరిశీలనం ముహూర్త నిర్ణయం పదిపాళ్లు. ఆ మిగిలిన పదిపాళ్లూ మన ప్రవర్తన - వెరసి వివాహం నూరుపాళ్లు. జ్యోతిశ్శాస్త్రం సరైనదే. అయితే, పరిశీలకులు చెప్పిన ఫలితాలు ఫలించాలంటే ఆ జ్యోతిష్యుడు నిత్యం అనుష్ఠానాన్ని చెయ్యాలి. అది ఎందరిలోనో కనిపించని కారణంగానే ఆ పదిపాళ్ల ముహూర్త నిర్ణయం జాతక పరిశీలనం కూడా సక్రమంగా ఉండడం లేదు. తలరాతకి ఎనభై పాళ్ల శక్తి ఉంది కాబట్టే బీజగణితాన్ని కనుక్కున్న భాస్కరాచార్యుడు గొప్ప ముహూర్తాన్ని పెట్టినా కూతురికి వైధవ్యం కలిగింది. పరీక్షిన్మహారాజుని ఎంత రక్షించాలని చూసినా పాము కరవనే కరిచింది. ●

బిజినెస్ రీల్

ఫుడ్ డెలివరీకి కొత్త నిబంధన

న్యూఢిల్లీ: ఆహారోత్పత్తులు విక్రయించే ఈ–కామర్స్ కంపెనీలకు ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) కొత్త నిబంధన విధించింది. ఏదైనా ఆహారోత్పత్తి గడువు ముగిసే తేదీకి కనీసం 30 శాతం లేదా 45 రోజులు ముందుగా కస్టమర్‌కు చేరాలని స్పష్టం చేసింది. అంటే షెల్ఫ్ లైఫ్ కనీసం 45 రోజులు ఉన్న ఉత్పత్తులను డెలివరీ చేయాల్సి ఉంటుంది. కాలం చెల్లిన, గడువు తేదీ సమీపిస్తున్న ఉత్పత్తుల డెలివరీలను కట్టడి చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన.

ఎంటీఎన్ఎల్ రూ. 5,726 కోట్లు డిఫాల్ట్

న్యూఢిల్లీ: నష్టాల్లో కూరుకుపోయిన ప్రభుత్వ రంగ ఎంటీఎన్ఎల్ వివిధ బ్యాంకులకు రూ. 5,726 కోట్ల రుణాల చెల్లింపులో డిఫాల్ట్ అయ్యింది. ఇందులో రూ. 5,492 కోట్లు అసలు ఉండగా, మిగతాది వడ్డీ అని స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ తెలిపింది. మొత్తం రుణ భారం రూ. 32,097 కోట్లుగా ఉన్నట్లు వివరించింది. ఇది కంపెనీ వార్షికాదాయం రూ. 798 కోట్లతో పోలిస్తే 40 రెట్లు అధికం. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఎంటీఎన్ఎల్ అత్యధికంగా రూ. 3,481 కోట్లు డిఫాల్ట్ అయ్యింది. మరోవైపు, ఎంటీఎన్ఎల్‌కు ప్రభుత్వ ఊతం ఉన్నందున, అది సమీకరించిన రుణాలకు సంబంధించి ఆందోళన చెందనక్కర్లేదని మంత్రి చెప్పారు. దాని వ్యాపారం బీఎస్ఎన్ఎల్‌కు బదిలీ అవుతుందని పేర్కొన్నారు.

ఇన్వెస్ట్ ఇండియాతో ఫెడెక్స్ జట్టు

ముంబై: దేశీయంగా చిన్న వ్యాపార సంస్థల (ఎస్ఎంఈల) అభివృద్ధికి తోడ్పడే దిశగా ఇన్వెస్ట్ ఇండియాతో చేతులు కలిపినట్లు రవాణా సేవల సంస్థ ఫెడెక్స్ వెల్లడించింది. విదేశీ మార్కెట్లను కూడా ఎస్ఎంఈలకు అందుబాటులోకి తెచ్చేందుకు, షిప్పింగ్ ప్రక్రియలను క్రమబద్ధీకరించేందుకు తమ అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను, లాజిస్టిక్స్ అనుభవాన్ని ఫెడెక్స్ ఉపయోగించనుంది. జిల్లాకో ప్రాధాన్య ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ కార్యక్రమానికి (ఓడీఓపీ) తోడ్పాటు అందించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. వివిధ జిల్లాలకు చెందిన ఎస్ఎంఈలు తమ విశిష్టమైన ఉత్పత్తులను ప్రదర్శించేందుకు, వాటి బ్రాండ్ విజిబిలిటీని పెంచేందుకు సహాయ సహకారాలు అందించనున్నట్లు వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

14-11-2024

విశాఖ	525–00
చిత్తూరు	593–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	535–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	525–00
వరంగల్	527–00
రిటైల్ ధర	5.85

నేటి బోర్డు సమావేశాలు

ఏబీసీ ఇండియా, అవంతి ఫుడ్స్, బజాజ్ హెల్త్‌కేర్, బాలాజీ టెలిఫిల్మ్స్, బల్లార్‌పూర్ ఇండస్ట్రీస్, భారత్ డైనమిక్స్, భారత్ ఫోర్జ్, జీఎండబ్ల్యూ ఇండస్ట్రీస్, ఢిల్లీవరీ, డెల్టా ఇండస్ట్రీస్, ఈజీ ట్రిప్ ప్లానర్స్, ఈఐడీ ప్యారీ, గ్లెన్‌మార్క్ ఫార్మా, గ్రాసీం ఇండస్ట్రీస్, హీరో మోటోకార్ప్, హోండా ఇండియా, హెచ్ఎంటీ, ఐటీఐ

నిఫ్టీ 50 – టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BRITANNIA	5,047.50	0.4
GRASIM	2,530.00	0.35
TATAMOTORS	786.85	0.25
ASIANPAINT	2,478.00	0.13
NTPC	380.45	0.04

నిఫ్టీ 50 – టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HEROMOTOCO	4,525.15	-4.21
M&M	2,798.00	-3.47
HINDALCO	629.5	-3.4
TATASTEEL	139.69	-3.11
EICHERMOT	4,598.80	-2.94

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,889
ఎన్ఎస్ఈ	1,01,536
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,23,956
ఎఫ్ఐఐ	- 2,503
డీఐఐ	+ 6,145

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.58	$ 68.12
బ్రెంట్	72.42	$ 71.89

ఎన్‌టీపీసీ గ్రీన్ రూ. లక్ష కోట్ల పెట్టుబడి

- సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటు
- ఐపీవో నవంబర్ 19 నుంచి ప్రారంభం
- కంపెనీ సీఎండీ గుర్‌దీప్ సింగ్ వెల్లడి



ముంబై: ఐపీవో బాటలో ఉన్న ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ 2026–27 నాటికి సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల్లో రూ.1 లక్ష కోట్ల వరకు పెట్టుబడి పెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. పెట్టుబడిలో 20 శాతం ఈక్విటీ రూపంలో రావాలంటే.. విస్తరణ కోసం రూ.20,000 కోట్ల సొంత నిధులు అవసరమవుతాయని సంస్థ సీఎండీ గుర్‌దీప్ సింగ్ వెల్లడించారు. రాబోయే ఐపీవో ద్వారా రూ.10,000 కోట్ల నిధులు వస్తాయని అన్నారు. కంపెనీ అంతర్గత వనరుల ద్వారా మిగిలిన మొత్తాన్ని సేకరించగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వివిధ ఏజెన్సీల నుండి కంపెనీ మెరుగైన క్రెడిట్ రేటింగ్‌ను పొందుతోందని, ఇది పోటీ కంపెనీలతో పోల్చినప్పుడు తక్కువ రేట్లతో రుణాన్ని అందుకునేందుకు వీలు కల్పిస్తుందని సింగ్ చెప్పారు.

ఇతర విభాగాల్లోకీ ఎంట్రీ..

ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ కేవలం విద్యుత్ ఉత్పత్తికి మాత్రమే పరిమితం కాకూడదని, గ్రీన్ హైడ్రోజన్, పంప్డ్ స్టోరేజ్ పవర్, ఎనర్జీ స్టోరేజీ విభాగాల్లో ఎంట్రీపై కూడా ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన చెప్పారు. దిగుమతి చేసుకున్న బొగ్గు ఆధారిత పవర్ ప్లాంట్‌ను నెలకొల్పడానికి విశాఖపట్నం సమీపంలోని 1,200 ఎకరాల భూమిని చాలా సంవత్సరాల క్రితం ఎన్‌టీపీసీ తీసుకుంది. ఇక్కడ గ్రీన్ హైడ్రోజన్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామని సింగ్ వెల్లడించారు.

2027కల్లా 19,000 మెగావాట్లు..

ప్రస్తుతం 3,220 మెగావాట్ల స్థాపిత సామర్థ్యాన్ని కలిగి ఉన్న ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ.. 2025 మార్చికి 6,000 మెగావాట్లకు, 2026 మార్చి నాటికి 11,000 మెగావాట్లకు, 2027 మార్చి కల్లా 19,000 మెగావాట్లకు సామర్థ్యాన్ని పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే 11,000 మెగావాట్లకు సమానమైన ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని సింగ్ వెల్లడించారు.

నవంబర్ 19 నుంచి ఐపీవో..

ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ఐపీవో నవంబర్ 19న ప్రారంభమై 22న ముగుస్తుంది. ఒక్కొక్కటి రూ.102–108 ప్రైస్ బ్యాండ్‌తో రూ.10,000 కోట్ల వరకు విలువైన తాజా షేర్లను జారీ చేయడానికి కంపెనీ ప్రణాళిక చేస్తోంది. ఇన్వెస్టర్లు కనీసం 138 షేర్లతో కూడిన లాట్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అంతకు మించి వాటాలు కావాల్సినవారు మరిన్ని లాట్స్‌కు బిడ్లు వేసుకోవచ్చు. ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు 75 శాతం, నాన్–ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు 15 శాతం, రిటైల్ ఇన్వెస్టర్లకు 10 శాతం వాటాలు కేటాయిస్తారు. అర్హత కలిగిన కంపెనీ ఉద్యోగులకు ఒక్కో షేరుపై రూ.5 డిస్కౌంట్‌ను ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ఆఫర్ చేస్తోంది. ఉద్యోగుల కోటాకై రూ.200 కోట్ల విలువైన షేర్లను కేటాయించారు. హ్యుందై మోటార్ ఇండియా, స్విగ్గీ తర్వాత ఈ ఏడాది మూడవ అతిపెద్ద ఐపీవోగా ఇది నిలవనుంది.

ఏఐతో గొప్ప ప్రయోజనాలు

- ఉద్యోగ నష్టం కంటే ప్రయోజనాలు ఎక్కువ
- నాస్కామ్ చైర్‌పర్సన్ సింధు



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలకుతోడు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావంతో 2025లో, టెక్నాలజీ అమలు, వ్యూహాత్మక భాగస్వామ్యాలకు ప్రాధాన్యం పెరుగుతుందని నాస్కామ్ చైర్‌పర్సన్ సింధు గంగాధరన్ అభిప్రాయపడ్డారు. ఏఐతో పెద్ద ఎత్తున ఉద్యోగ కోతలు ఉంటాయన్న అంశంపై స్పందిస్తూ.. నైపుణ్యాల పెంపు, ఉత్పాదకత పెంపొందించడంలో ఏఐని సహాయకారిగా చూడాలన్నారు. దీన్ని అసాధారణ సాంకేతికతగా అభివర్ణించారు. దీని వల్ల ఉద్యోగాల నష్టం తక్కువేనంటూ.. ఉత్పాదకతను గణనీయంగా పెంచుతుందని, ఎన్నో ప్రయోజనాలను అందిస్తుందని పేర్కొన్నారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా కొనసాగాలంటే వ్యాపార సంస్థలు అత్యాధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాల్సి ఉంటుందని ఆమె చెప్పారు. ఇందుకు సంస్థ పరిమాణంతో సంబంధం లేదన్నారు. టెక్నాలజీ పరంగా వస్తున్న మార్పుల నేపథ్యంలో బలమైన భాగస్వామ్యాలతోనే పెద్ద సవాళ్లను అధిగమించి, రాణించగలమన్నారు. లాంగ్వేజ్ నమూనాలను అర్థం చేసుకుని, వాటిని ఏ విధంగా వినియోగించుకోగలమో చూడాలని సూచించారు. భారత్‌లో ఏఐ మిషన్, నైపుణ్యాల పెంపునకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎస్ఏపీ ల్యాబ్స్ ఇండియా చీఫ్‌గానూ పనిచేస్తున్న గంగాధరన్ ఏటా 2,500–3,000 మేర ఉద్యోగులను పెంచుకుంటున్నట్టు చెప్పారు. బెంగళూరు, గురుగ్రామ్, పుణె, ముంబై, హైదరాబాద్‌లో ఎస్ఏపీకి కేంద్రాలున్నాయి. ఇక్కడ అత్యుత్తమ నైపుణ్యాలను గుర్తించడం తమకు కీలకమన్నారు. ఎస్ఏపీకి భారత్ అత్యంత వేగవంతమైన వృద్ధి కేంద్రంగా ఉందని సంస్థ సీఈవో క్రిస్టియన్ క్లీన్ తెలిపారు. భవిష్యత్‌లో అతిపెద్ద కేంద్రాల్లో ఒకటిగా అవతరిస్తుందన్నారు. ప్రస్తుతం ఎస్ఏపీకి టాప్–10 దేశాల్లో ఒకటిగా ఉన్నట్టు చెప్పారు.

ఏఐపై భారీగానే ఇన్వెస్ట్ చేస్తున్నాయి.. కానీ...

సైబర్ రిస్కులను ఎదుర్కొనడంలో సర్వసన్నద్ధంగా లేవు ● దేశీ వ్యాపార సంస్థలపై నివేదిక

కృత్రిమ మేధ (ఏఐ) ప్రయోజనాలను గరిష్ట స్థాయిలో పొందే ఉద్దేశంతో భారతీయ వ్యాపార సంస్థలు గణనీయంగా పెట్టుబడులు పెడుతున్నాయి. కానీ ర్యాన్సమ్‌వేర్ దాడులు సుదీర్ఘకాలం కొనసాగితే నిలబడగలిగేలా సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలను పటిష్టం చేసుకోవడంపై మాత్రం అంతగా దృష్టి పెట్టడం లేదు. కేవలం 39 శాతం సంస్థలే ఇందుకోసం సర్వసన్నద్ధంగా ఉన్నాయి. సైబర్ సెక్యూరిటీ సంస్థ సోఫోస్ ఆవిష్కరించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ఈ ఏడాది జూలైలో నిర్వహించిన సర్వేలో భారత్, ఆస్ట్రేలియా, జపాన్, మలేషియా, ఫిలిప్పీన్స్, సింగపూర్ దేశాలకు 900 కంపెనీలు పాల్గొన్నాయి. ఇందులో భారత కంపెనీలు 200 ఉన్నాయి. కంపెనీలకు ఏఐపరమైన అధునాతన సైబర్ ముప్పులు పొంచి ఉన్నాయని, వీటిని ఎదుర్కొనేందుకు మరిన్ని భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నివేదిక తెలిపింది. సర్వేలో పాల్గొన్న వాటిలో 70 శాతం పైగా సంస్థలు క్లౌడ్ సెక్యూరిటీ వ్యూహాలను అమలు చేస్తూనే ఉన్నా, దాదాపు సగం సంస్థలు ఏఐ ఆధారిత సెక్యూరిటీ చర్యలపై ఇన్వెస్ట్ చేస్తున్నా కూడా సంపూర్ణ సన్నద్ధత విషయంలో మాత్రం తారతమ్యాలు ఉంటున్నాయి. సైబర్ సెక్యూరిటీ అవసరాల కోసం 71% సంస్థలు మూడు లేదా అంతకు మించిన సంఖ్యలో సెక్యూరిటీ వెండార్ల సర్వీసులు పొందుతుండగా, 5% సంస్థలు మాత్ర మే ఏకైక వెండార్‌పై ఆధారపడుతున్నాయని సోఫోస్ వైస్ ప్రెసిడెంట్ సునీల్ శర్మ తెలిపారు. సైబర్ సెక్యూరిటీపరంగా ఏఐకి రెండు పార్శ్వాలు ఉన్నాయని పేర్కొన్నారు. కంపెనీలు దీన్ని శక్తిమంతమైన నేస్తంగాను అలాగే పెను ప్రమాదకారిగాను చూస్తున్నట్లు వివరించారు.

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు — Q2 RESULTS

కల్యాణ్ జ్యువెలర్స్ లాభం డౌన్

క్యూ2లో రూ. 346 కోట్లు



న్యూఢిల్లీ: బంగారు ఆభరణాల రిటైలర్ కల్యాణ్ జ్యువెలర్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం స్వల్పంగా 3 శాతం నీరసించి రూ. 130 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 135 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 37 శాతంపైగా జంప్‌చేసి రూ. 6,065 కోట్లను అధిగమించింది. గత క్యూ2లో రూ. 4,415 కోట్ల టర్నోవర్ అందుకుంది. కాగా.. తాజా త్రైమాసికంలో కస్టమ్స్ డ్యూటీ కోత కారణంగా రూ. 69 కోట్ల మేర అనూహ్య నష్టం వాటిల్లినట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 5 శాతం పతనమై రూ. 670 వద్ద ముగిసింది.

టొరెంట్ పవర్ లాభం క్షీణత



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ టొరెంట్ పవర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 9 శాతం నీరసించి రూ. 496 కోట్లకు పరిమితమైంది. రుతుపవనాలు దీర్ఘకాలం కొనసాగడంతో విద్యుత్‌కు డిమాండ్ మందగించడం ప్రభావం చూపింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 543 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 7,069 కోట్ల నుంచి రూ. 7,301 కోట్లకు పుంజుకుంది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 6,328 కోట్ల నుంచి రూ. 6,612 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో టొరెంట్ పవర్ షేరు బీఎస్ఈలో 0.8% నష్టంతో రూ. 1,645 వద్ద ముగిసింది.

వొడాఫోన్ ఐడియా నష్టాలు తగ్గాయ్

క్యూ2లో రూ. 7,176 కోట్లు



న్యూఢిల్లీ: మొబైల్ టెలికం దిగ్గజం వొడాఫోన్ ఐడియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర నష్టం తగ్గి రూ. 7,176 కోట్లకు పరిమితమైంది. జులైలో టారిఫ్‌ల పెంపు చేపట్టడంతో ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) మెరుగుపడటం ఇందుకు దోహదపడింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 8,747 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం 2 శాతం స్వల్ప వృద్ధితో రూ. 10,932 కోట్లను అధిగమించింది. గత క్యూ2లో రూ. 10,716 కోట్ల టర్నోవర్ సాధించింది. ఏఆర్‌పీయూ 8 శాతం పుంజుకుని రూ. 166ను తాకింది. మొత్తం వినియోగదారుల సంఖ్య 20.5 కోట్లకు చేరింది. కాగా.. మూడేళ్ల కాలంలో నెట్‌వర్క్ పరికరాల సరఫరా కోసం నోకియా, ఎరిక్సన్, శామ్‌సంగ్‌లతో 3.6 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 30,000 కోట్లు) విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకున్న సంగతి తెలిసిందే.

ఫలితాల నేపథ్యంలో వొడాఫోన్ ఐడియా షేరు బీఎస్ఈలో 4 శాతం క్షీణించి రూ. 7.37 వద్ద ముగిసింది.

నష్టాల బాటలో డిష్ టీవీ



న్యూఢిల్లీ: డిష్ టీవీ సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికి రూ.37 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో సంస్థ రూ.5.41 కోట్ల లాభాన్ని నమోదు చేయడం గమనార్హం. ఆదాయం సైతం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.479 కోట్లతో పోల్చి చూసినప్పుడు 17 శాతానికి పైగా క్షీణించి రూ.396 కోట్లకు పరిమితమైంది. ఈ షేరు 3 శాతానికి పైగా తగ్గి రూ.11.77 వద్ద ముగిసింది.

ఐఓసీ చైర్మన్‌గా అరవిందర్ సింగ్ సాహ్నీ

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద చమురు సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) కొత్త చైర్మన్‌గా అరవిందర్ సింగ్ సాహ్నీ నియమితులయ్యారు. పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. 54 సంవత్సరాల సాహ్నీ ప్రస్తుతం ఐఓసీలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (బిజినెస్ డెవలప్‌మెంట్– పెట్రోకెమికల్స్)గా విధులు నిర్వహిస్తున్నారు. ఆగస్టులోనే ఈ బాధ్యతలకు ఎంపికైన ఆయన, అటు తర్వాత కొద్ది నెలల్లోనే సంస్థ చైర్మన్‌గా నియమితులు కావడం విశేషం.



బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఐదేళ్లు లేదా పదవీ విరమణ పొందే వరకూ లేదా ప్రభుత్వ తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ (ఏది ముందైతే అది) సాహ్నీ ఐఓసీ చైర్మన్‌గా ఉంటారు. శ్రీకాంత్ మాధవ్ వైద్య తన పొడిగించిన పదవీకాలాన్ని ఈ ఏడాది ఆగస్టు 31న పూర్తి చేసుకున్న నాటి నుంచి ఈ ఫార్చ్యూన్ 500 కంపెనీ చైర్మన్ పదవి ఖాళీగా ఉంది. 2014 జూలైలో బీ అశోక్ తర్వాత బోర్డు అనుభవం లేకుండానే కంపెనీ ఉన్నత ఉద్యోగానికి పదోన్నతి పొందిన రెండవ వ్యక్తి సాహ్నీ.

పటేల్ ఇంజినీరింగ్ లాభం జంప్...

క్యూ2లో రూ. 73 కోట్లు



న్యూఢిల్లీ: ఈపీసీ కంపెనీ పటేల్ ఇంజినీరింగ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 95 శాతం జంప్‌చేసి రూ. 73 కోట్లను అధిగమించింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 38 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,046 కోట్ల నుంచి రూ. 1,231 కోట్లకు ఎగసింది. 2024 సెప్టెంబర్ 30కల్లా స్థూల రుణభారం రూ. 1,438 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో పటేల్ ఇంజినీరింగ్ షేరు బీఎస్ఈలో 2.3% లాభంతో రూ. 50 వద్ద ముగిసింది.

ఐషర్ మోటార్స్ లాభం ప్లస్



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం ఐషర్ మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 8 శాతం వృద్ధితో రూ. 1,100 కోట్లను తాకింది. విభిన్న విభాగాలలో అమ్మకాలు పుంజుకోవడం ప్రభావం చూపింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,016 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 4,115 కోట్ల నుంచి రూ. 4,263 కోట్లకు బలపడింది. వెరసి కంపెనీ చరిత్రలోనే క్యూ2లో అత్యధిక ఆదాయాన్ని సాధించింది. ఈ కాలంలో మోటార్‌సైకిళ్ల విభాగం రాయల్ ఎన్‌ఫీల్డ్ 2,25,317 వాహనాలను విక్రయించింది.

ఫలితాల నేపథ్యంలో ఐషర్ షేరు బీఎస్ఈలో 3.2% నీరసించి రూ. 4,589 వద్ద ముగిసింది.

నాల్కో దూకుడు



న్యూఢిల్లీ: మెటల్ రంగ పీఎస్‌యూ నేషనల్ అల్యూమినియం(నాల్కో) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం ఐదున్నర రెట్లు జంప్‌చేసి రూ. 1,046 కోట్లను తాకింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 187 కోట్లు ఆర్జించింది. నవరత్న కంపెనీ వాటాదారులకు షేరుకి రూ. 4 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం సైతం రూ. 3,044 కోట్ల నుంచి రూ. 4,001 కోట్లకు ఎగసింది. కంపెనీలో ప్రభుత్వానికి 51.28 శాతం వాటా ఉంది.

ఫలితాల నేపథ్యంలో నాల్కో షేరు బీఎస్ఈలో 3 శాతం క్షీణించి రూ. 220 వద్ద ముగిసింది.

ఆర్‌పవర్‌కు భారీ లాభాలు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ రిలయన్స్ పవర్ రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై–సెప్టెంబర్(క్యూ2)లో నష్టాలను వీడి రూ. 2,878 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది (2023–24) ఇదే కాలంలో రూ. 238 కోట్ల నికర నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 2,116 కోట్ల నుంచి రూ. 1,963 కోట్లకు క్షీణించింది. కాగా.. అనుబంధ సంస్థను విడదీయడంతో రూ. 3,230 కోట్లకు పైగా లాభాన్ని కంపెనీ అందుకుంది.

ఆర్‌పవర్ షేరు బీఎస్ఈలో 5 శాతం పతనమై రూ. 36.56 వద్ద ముగిసింది.

ఎన్‌బీసీసీ లాభం జూమ్



న్యూఢిల్లీ: ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ పీఎస్‌యూ ఎన్‌బీసీసీ (ఇండియా) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 53 శాతం జంప్‌చేసి రూ. 125 కోట్లను అధిగమించింది. ఇతర ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 82 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,134 కోట్ల నుంచి రూ. 2,526 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో ఎన్‌బీసీసీ షేరు బీఎస్ఈలో 4.4 శాతం పతనమై రూ. 89 వద్ద ముగిసింది.

టీమ్‌లీజ్, ఉపాధి కల్పన శాఖల టైఅప్

ఇంటర్న్‌షిప్‌తో కూడిన డిగ్రీ ప్రోగ్రామ్‌లు



న్యూఢిల్లీ: మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో కేంద్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ, మానవ వనరుల సేవలను అందించే టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ చేతులు కలిపాయి. యూనివర్సిటీ విద్యార్థులకు నూతన కెరీర్ అవకాశాలు కల్పించేందుకు వీలుగా అవగాహన ఒప్పందం కుదిరింది. ఉపాధి ఆధారిత డిగ్రీ కార్యక్రమాలను ఆఫర్ చేయనున్నట్టు టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ ప్రకటించింది. కేంద్ర ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ కెరీర్ సర్వీస్(ఎన్‌సీసీ) పోర్టల్‌పై 200 వరకు ఉపాధి ఆధారిత డిగ్రీ ప్రోగ్రామ్‌లను అందించనున్నట్టు తెలిపింది. ప్రతి ప్రోగ్రామ్ విడిగా రూ.5 లక్షల మందికి పైగా ఇంటర్న్‌షిప్ అవకాశాలతో అధ్యయన అవకాశాలు కల్పించనుంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాండవీయ మాట్లాడుతూ.. టీమ్‌లీజ్ సహకారంతో అందించే డిగ్రీ ప్రోగ్రామ్‌లు అభ్యాసంతోపాటు, ప్రత్యక్ష అనుభవాన్ని సమన్వయం చేస్తుందని, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.

ఆర్‌సీఎఫ్ పోత్సాహకరం



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ (ఆర్‌సీఎఫ్) సెప్టెంబర్ త్రైమాసికంలో పనితీరు పరంగా రాణించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 55 శాతానికి పైగా పెరిగి రూ.79 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలానికి లాభం రూ.51 కోట్లుగానే ఉండడం గమనార్హం. ఇక ఆదాయం రూ.4,332 కోట్లకు పెరిగింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.4,222 కోట్లుగా ఉంది. ఇదే కాలంలో వ్యయాలు రూ.4,149 కోట్ల నుంచి రూ.4,226 కోట్లకు పెరిగాయి. షేరువారీ ఆర్జన రూ.1.42గా నమోదైంది. బీఎస్ఈలో ఆర్‌సీఎఫ్ షేరు 4 శాతానికి పైగా నష్టపోయి రూ.152 వద్ద ముగిసింది.

వొకార్డ్‌కు తగ్గిన నష్టాలు

రూ. 16 కోట్లకు పరిమితం



న్యూఢిల్లీ: ఫార్మాస్యూటికల్ రంగ కంపెనీ వొకార్డ్ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర నష్టం భారీగా తగ్గి రూ. 16 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 73 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 753 కోట్ల నుంచి రూ. 809 కోట్లకు స్వల్పంగా బలపడింది.

ఫలితాల నేపథ్యంలో వొకార్డ్ షేరు బీఎస్ఈలో 0.7 శాతం బలపడి రూ. 1,190 వద్ద ముగిసింది.


సిరాజ్


గిల్

ప్రాక్టీస్ మొదలైంది

నెట్స్‌లో చెమటోడ్చిన భారత క్రికెటర్లు

పెర్త్: వరుసగా మూడోసారి ఆస్ట్రేలియా గడ్డపై 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'ని సొంతం చేసుకునే లక్ష్యంతో భారత క్రికెటర్లు తమ సన్నాహాలు మొదలు పెట్టారు. బుధవారం మధ్యాహ్నం వెస్టర్న్ ఆస్ట్రేలియా క్రికెట్ అసోసియేషన్ (వాకా) మైదానంలో భారత జట్టు సభ్యులంతా ముమ్మర ప్రాక్టీస్ చేశారు. ఆస్ట్రేలియాలో అనధికారిక టెస్టులు ఆడేందుకు వచ్చిన పలువురు భారత్ 'ఎ' జట్టు ఆటగాళ్లు సీనియర్ జట్టు సభ్యులను కలిశారు. 'కింగ్ కోహ్లి' బ్యాటింగ్ ప్రాక్టీస్‌లో తలమునకలై చెమటోడ్చాడు. అతనికి, రిషభ్ పంత్‌కు సిరాజ్, ఆకాశ్‌దీప్‌లు బౌలింగ్ చేశారు. మిగతా బ్యాటర్లు సైతం నెట్స్‌లో శ్రమించారు. అయితే భారత కెప్టెన్ రోహిత్ శర్మ టీమిండియాతో ఇంకా కలవలేదు. అతని భార్య ప్రసవ తేది సమీపిస్తుండటంతో శ్రీమతికి తోడుగా ముంబైలో ఉన్నాడు. కాగా భారత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్... తొలిటెస్టు కల్లా తమ కెప్టెన్ అందుబాటులోకి వస్తాడని చెప్పాడు.

ఆసీస్ మీడియా అసత్య ప్రచారం

అభిమానులు, ప్రేక్షకులకు దూరంగా స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తామని టీమిండియాగానీ, భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)గానీ చెప్పలేదు. క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ)ను కోరలేదు. అయినా సరే ఆసీస్ మీడియా పనిగట్టుకొని అసత్య కథనాలు ప్రచురిస్తోంది. 'వాకా' గ్రౌండ్‌లో గేట్లు మూసి నెట్స్‌లో ప్రాక్టీస్ చేసేందుకే భారత ఆటగాళ్లు మొగ్గుచూపారని, అక్కడి భారతీయులకు దూరంగా, వేరెవరిని అనుమతించకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసుకున్నారని 'ది ఆస్ట్రేలియన్' పత్రిక రాసింది. నిజానికి 'వాకా'లో నవీకరణ పనులు జరుగుతున్నాయి. ఏడీసీఓ కన్‌స్ట్రక్షన్స్ అనే కంపెనీ ఈ పనులు చేస్తోంది. ఇది పక్కనబెట్టి సదరు పత్రిక భారత క్రికెటర్లు 'నో డ్రోన్ ఫ్లయ్ జోన్' ఏర్పాటు చేసుకున్నారని, సాధారణ ప్రజానీకం, క్రికెట్ అభిమానులెవర్నీ అనుమతించడం లేదని, ఫొటోలు, వీడియోలు తీసేందుకు కఠినమైన ఆంక్షలు విధించారని ఓ కథనాన్ని ప్రముఖంగా ప్రచురించింది. మంగళవారం నుంచి ఆదివారం వరకు భారత జట్టుతో పాటు, అక్కడే ఉన్న భారత్ 'ఎ' ఆటగాళ్లు ప్రాక్టీస్‌లో పాలుపంచుకుంటున్నారు. శుక్రవారం నుంచి సీనియర్ భారత్, 'ఎ' జట్ల మధ్య 'సెంటర్ వికెట్ ట్రెయినింగ్'లో భాగంగా వార్మప్ మ్యాచ్ జరుగనుంది. దీనికి ప్రేక్షకులను అనుమతించాల్సిందిగా భారత జట్టు మేనేజ్‌మెంట్ కోరింది.


నితీశ్ రెడ్డి


రవీంద్ర జడేజా

సింధు శుభారంభం



- ప్రపంచ 11వ ర్యాంకర్‌పై విజయం
- కెరీర్‌లో 19వసారి బుసానన్‌పై నెగ్గిన భారత స్టార్ షట్లర్

కుమమోటో: జపాన్ ఓపెన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నమెంట్‌లో భారత స్టార్ పీవీ సింధు శుభారంభం చేసింది. బుసానన్ ఒంగ్‌బమ్‌రుంగ్‌ఫన్ (థాయ్‌లాండ్)తో బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు 21–12, 21–8తో అలవోకగా గెలిచింది. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 11వ స్థానంలో ఉన్న బుసానన్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రపంచ 20వ ర్యాంకర్ సింధు కేవలం 38 నిమిషాల్లో విజయాన్ని సొంతం చేసుకొని ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఓవరాల్‌గా సింధు, బుసానన్‌ల మధ్య ఇది 20వ ముఖాముఖి పోరు కావడం విశేషం. సింధు ఏకంగా 19 సార్లు గెలుపొందగా... థాయ్‌లాండ్ ప్లేయర్ ఒక్కసారి మాత్రమే సింధును ఓడించింది. బుసానన్ ఆటతీరుపై స్పష్టమైన అవగాహన ఉన్న సింధుకు తొలి గేమ్ ఆరంభంలో గట్టిపోటీ లభించింది. ఒకదశలో సింధు, బుసానన్ (11–10) మధ్య ఒక్క పాయింటే అంతరంగా నిలిచింది. అయితే నెమ్మదిగా సింధు జోరు పెంచగా... థాయ్‌లాండ్ ప్లేయర్ తడబడింది. స్కోరు 14–12 వద్ద సింధు చెలరేగిపోయింది. ఒకటి కాదు, రెండు కాదు, మూడు కాదు... వరుసగా ఏడు పాయింట్లతో అదరగొట్టిన సింధు తొలి గేమ్‌ను 21–12తో దక్కించుకుంది. రెండో గేమ్‌లోనూ ఆరంభంలో ఇద్దరూ పోటాపోటీగా తలపడ్డారు. స్కోరు 5–4 వద్ద సింధు విజృంభించి వరుసగా ఐదు పాయింట్లు నెగ్గి 10–4తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత బుసానన్ వరుసగా మూడు పాయింట్లు సాధించి ఆధిక్యాన్ని తగ్గించే ప్రయత్నం చేసింది. కానీ స్కోరు 10–7 వద్ద సింధు వరుసగా 10 పాయింట్లు సంపాదించి 20–7తో ముందంజ వేసింది. ఆ తర్వాత బుసానన్ ఒక పాయింట్ సాధించిన వెంటనే సింధు కూడా ఒక పాయింట్ నెగ్గడంతో భారత స్టార్ విజయం ఖరారైంది.

పోరాడి ఓడిన లక్ష్య సేన్

పురుషుల సింగిల్స్ విభాగంలో భారత కథ తొలి రౌండ్‌లోనే ముగిసింది. భారత స్టార్ లక్ష్య సేన్ 74 నిమిషాల పోరులో కీలకదశలో తడబడి మూల్యం చెల్లించుకున్నాడు. ప్రపంచ 31వ ర్యాంకర్ జున్ హావో లియోంగ్ (మలేసియా)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 17వ ర్యాంకర్ లక్ష్య సేన్ 22–20, 17–21, 16–21తో ఓడిపోయాడు. గతంలో జున్ హావోపై మూడుసార్లు నెగ్గిన లక్ష్య సేన్ ఈసారి అదే ఫలితాన్ని పునరావృతం చేయలేకపోయాడు.

5 వికెట్లతో మెరిసిన అర్జున్ టెండూల్కర్



పనాజీ: క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ (5/25) రంజీ ట్రోఫీలో తొలిసారి 5 వికెట్లతో మెరిశాడు. ప్లేట్ గ్రూప్‌లో భాగంలో అరుణాచల్ ప్రదేశ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో అర్జున్ గోవా తరపున సత్తా చాటాడు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన అరుణాచల్ ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 30.3 ఓవర్లలో 84 పరుగులకు ఆలౌటైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన గోవా ఆట ముగిసే సమయానికి 54 ఓవర్లలో 2 వికెట్లకు 414 పరుగులు చేసింది. కశ్యప్ (179 బ్యాటింగ్), స్నేహల్ (146 బ్యాటింగ్) సెంచరీలు చేశారు.



తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్‌లో సత్తా చాటిన 10 మంది ప్లేయర్లు జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. అండర్–19 బాలికల విభాగంలో అస్మ, శ్లోక, రితిక, రవళిక, తన్మయి... బాలుర విభాగంలో ఇమ్రోస్, చిద్విలాస్ సాయి, విరించి, అమర్‌నాథ్, మార్టిన్ జాతీయ పోటీలకు అర్హత సాధించారు.

సినెర్ అలవోకగా...

టూరిన్ (ఇటలీ): సొంతగడ్డపై ఇటలీ టెన్నిస్ సూపర్‌స్టార్ యానిక్ సినెర్ మరోసారి అద్భుత ప్రదర్శన చేశాడు. పురుషుల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్‌లో టాప్ సీడ్ సినెర్ వరుసగా రెండో విజయం సాధించాడు. 'ఇలీ నస్టాసే గ్రూప్'లో భాగంగా టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)తో జరిగిన మ్యాచ్‌లో సినెర్ 6–4, 6–4తో గెలుపొందాడు. ఈ విజయంతో సినెర్‌కు సెమీఫైనల్ బెర్త్ దాదాపు ఖరారైంది. గంటా 40 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సినెర్ ఆరు ఏస్‌లు సంధించాడు. ఒక్క డబుల్ ఫాల్ట్ కూడా చేయలేదు. ఒక్కో సెట్‌లో ఒక్కోసారి ఫ్రిట్జ్ సర్వీస్‌ను సినెర్ బ్రేక్ చేశాడు. నెట్ వద్దకు 10 సార్లు దూసుకొచ్చి 9 సార్లు పాయింట్లు గెలిచాడు. 21 విన్నర్స్ కొట్టిన అతను 22 అనవసర తప్పిదాలు చేశాడు. మరోవైపు ఫ్రిట్జ్ ఏడు ఏస్‌లతో రాణించినా తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి మూల్యం చెల్లించుకున్నాడు. 20 విన్నర్స్ కొట్టిన ఫ్రిట్జ్ 31 అనవసర తప్పిదాలు చేశాడు.

'జాన్ న్యూకోంబ్ గ్రూప్'లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ తొలి విజయం నమోదు చేసుకున్నాడు. ఆంద్రీ రుబ్లెవ్ (రష్యా)తో జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో అల్‌కరాజ్ 6–3, 7–6 (10/8)తో గెలుపొందాడు. గంటా 36 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ 10 ఏస్‌లు సంధించాడు. రెండుసార్లు రుబ్లెవ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన అల్‌కరాజ్ 33 విన్నర్స్‌తో అలరించాడు.

బోపన్న జోడీకి మరో ఓటమి

ఇదే టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి వరుసగా రెండో పరాజయం ఎదురైంది. మార్సెలో అరెవాలో (ఎల్ సాల్వడార్)–మ్యాట్ పావిచ్ (క్రొయేషియా) జంటతో జరిగిన మ్యాచ్‌లో బోపన్న–ఎబ్డెన్ జోడీ 5–7, 3–6తో ఓడిపోయింది.


సినెర్

క్వార్టర్ ఫైనల్లో అనిరుధ్–నిక్కీ జోడీ

సాక్షి, హైదరాబాద్: హైగో నోవా చాలెంజర్ ఏటీపీ–100 టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ పురుషుల డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. జపాన్‌లోని కూబె నగరంలో ఈ టోర్నీ జరుగుతోంది. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో అనిరుధ్–నిక్కీ కలియంద పునాచా (భారత్) ద్వయం 6–3, 6–7 (8/10), 11–9తో 'సూపర్ టైబ్రేక్'లో ప్రుచాయో ఇసారో (థాయ్‌లాండ్)–జోషువా పారిస్ (బ్రిటన్) జంటపై గెలిచింది. 2 గంటల 3 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అనిరుధ్– నిక్కీ ద్వయం రెండు ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. నిర్ణాయక 'సూపర్ టైబ్రేక్'లో కీలకదశలో అనిరుధ్–నిక్కీ పాయింట్లు గెలిచి విజయాన్ని ఖరారు చేసుకున్నారు. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో సాకేత్ మైనేని (భారత్)–రే హో (చైనీస్ తైపీ) ద్వయం 6–7 (4/7), 5–7తో షింజి హజావా–మసామిచి ఇమాముర (జపాన్) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది.




గుర్‌ప్రీత్ సింగ్

జాతీయ జట్టులోకి విదేశీ ఆటగాళ్లు!

- ఈ విషయంపై భారత ఫుట్‌బాల్ సమాఖ్య, కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేయాలి
- ఇతర దేశాల్లో ఈ నిబంధన అమలులో ఉంది
- భారత జట్టు గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధు మనోగతం
- ఈనెల 18న మలేసియాతో ఫ్రెండ్లీ మ్యాచ్‌కు టీమిండియా సన్నాహాలు

సాక్షి, హైదరాబాద్: ఇతర దేశాల్లో మాదిరిగా భారత్‌లో కూడా విదేశీ ప్లేయర్లను జాతీయ జట్టు తరపున ఆడించే నిబంధనలను అమల్లోకి తెస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని భారత ఫుట్‌బాల్ జట్టు గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ అభిప్రాయపడ్డాడు. చాలా దేశాల్లో విదేశీ క్రీడాకారులు నిర్దిష్ట సమయంపాటు నివసిస్తే వాళ్లకు ఆ దేశం తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం ఇచ్చే నిబంధన అమల్లో ఉంది. అయితే భారత్‌లో మాత్రం అలాంటి అవకాశం లేదు. ఈ నేపథ్యంలో మన కేంద్ర ప్రభుత్వం, అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) ఆ దిశగా ఆలోచన చేయడం మంచిదని గుర్‌ప్రీత్ సూచించాడు. దాని కోసం ప్రత్యేక నిబంధనలు తీసుకువస్తే మంచిదని సూచనాప్రాయంగా అన్నాడు. ఇలా విదేశీ ప్లేయర్లు జాతీయ జట్టు తరఫున ఆడితే... మన ప్లేయర్లకు కూడా చాలా ఉపయుక్తకరంగా ఉంటుందని పేర్కొన్నాడు. ఏఎఫ్‌సీ ఆసియా కప్‌నకు అర్హత సాధించడమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమన్న గుర్‌ప్రీత్... కొత్త కోచ్ మానొలో సారథ్యంలో జట్టు మంచి విజయాలు సాధించగలదని ఆశాభావం వ్యక్తం చేశాడు. వచ్చే ఏడాది జరగనున్న ఆసియా కప్ క్వాలిఫయింగ్ టోర్నీకి ముందు భారత్ చివరి అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్ ఈ నెల 18న హైదరాబాద్ వేదికగా మలేసియాతో తలపడుతుంది. మలేసియా జట్టులో పలువురు విదేశీ ప్లేయర్లు ఉన్న నేపథ్యంలో గుర్‌ప్రీత్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్న భారత జట్టు ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టింది. ఈ నేపథ్యంలో బుధవారం గుర్‌ప్రీత్ ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ... 'గతం గురించి ఎక్కువ ఆలోచించడం లేదు. జరిగిందేదో జరిగింది. ప్రతీసారి గెలవాలనే లక్ష్యంతోనే మైదానంలో అడుగు పెడతాం. కొన్నిసార్లు అది సాధ్యం కాదు. మలేసియాతో పోరు కోసం బాగా సన్నద్ధమవుతున్నాం. ఆసియా కప్ క్వాలిఫయర్స్‌కు ముందు మాకు ఇదే చివరి మ్యాచ్. మలేసియా జట్టులో విదేశాలకు చెందిన 14 మంది ప్లేయర్లు ఉన్నారు. స్పెయిన్‌కు చెందిన మారాలెస్, బ్రెజిల్‌కు చెందిన ఎన్‌డ్రిక్ డాస్, సాన్‌టోస్ వంటి పలువురు ఆటగాళ్లు మలేసియా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నిబంధన వల్ల వాళ్లకు అదనపు ప్రయోజనం చేకూరడం ఖాయం. మనం కూడా ఆ దిశగా ఆలోచిస్తే మంచిది. శ్రీలంక జట్టు కూడా ఇలా విదేశీ ఆటగాళ్లకు అవకాశం ఇస్తోంది' అని అన్నాడు. భారత్‌లో మాత్రం అలాంటి అవకాశం లేదు. ఏఐఎఫ్‌ఎఫ్ అధ్యక్షుడు కల్యాణ్ చౌబే గతంలో విదేశాల్లో స్థిరపడిన భారత సంతతి ఆటగాళ్లను తిరిగి తీసుకువచ్చే ప్రయత్నం చేసినా... అది కార్యరూపం దాల్చలేదు.

హరియాణా స్టీలర్స్ 'టాప్' షో

పట్నా పైరేట్స్ పై ఘన విజయం ● ప్రొ కబడ్డీ లీగ్



నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో హరియాణా స్టీలర్స్ జోరు కొనసాగుతోంది. బుధవారం జరిగిన పోరులో హరియాణా స్టీలర్స్ 37–32 పాయింట్ల తేడాతో పట్నా పైరేట్స్‌ను చిత్తు చేసింది. లీగ్‌లో హరియాణా జట్టుకు ఇది వరుసగా నాలుగో విజయం కాగా... 36 పాయింట్లు ఖాతాలో వేసుకున్న స్టీలర్స్ పట్టికలో అగ్రస్థానానికి చేరింది. హరియాణా తరఫున వినయ్, మొహమ్మద్ రెజా చెరో 6 పాయింట్లతో సత్తా చాటారు. పట్నా తరఫున దేవాంక్, అయాన్ చెరో 7 పాయింట్లు సాధించినా ఫలితం లేకపోయింది. మరో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 47–28 పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్‌పై గెలుపొందింది. తాజా సీజన్‌లో గుజరాత్‌కు ఇది రెండో విజయం కాగా... బెంగాల్‌కు మూడో పరాజయం. లీగ్‌లో భాగంగా నేడు జరగనున్న మ్యాచ్‌ల్లో యూపీ యోధాస్‌తో తెలుగు టైటాన్స్ (రాత్రి 8 గంటలకు), తమిళ్ తలైవాస్‌తో యు ముంబా (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.

మహాయుతికి ఉల్లిమంట



సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఉల్లి ధరలు సామాన్యులకు కంటతడి పెట్టిస్తుంటే మరోపక్క ప్రస్తుత మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతిలో భాగమైన అధికార పార్టీ నేతలకు మంట పుట్టిస్తోంది. ఓ పక్క పెరుగుతున్న ధరలతో సామాన్యులు అధికార కూటమి ప్రభుత్వంపై నిప్పులు గక్కుతున్నారు. ఎగుమతులపై నిషేధంతో తమకు గిట్టుబాటు తగ్గిందని రైతులు సైతం గగ్గోలు పెడుతుండటం మహాయుతి కూటమికి సంకటంగా మారింది. దేశీయ అవసరాలకు అవసరమైన ఉల్లిలో 40 శాతం మహారాష్ట్ర నుంచే సరఫరా అవుతుండగా, ప్రస్తుత సీజన్‌లో భారీ వర్షాల కారణంగా ఉల్లి దిగుబడి గణనీయంగా తగ్గింది. దీంతో మహారాష్ట్రలోని నాసిక్, లాసల్‌గావ్ మార్కెట్లకు తరలివస్తున్న ఉల్లి సరకు పరిమాణం బాగా తగ్గిపోయింది. గత సంవత్సరం ఉల్లిసీజన్‌లో ప్రతి రోజూ దాదాపు 2,000 టన్నుల ఉల్లి మార్కెట్‌వ వచ్చింది. అది ప్రస్తుతం 300–400 టన్నుల మధ్య తచ్చాడుతోంది. దీనికి తోడు గత రబీలో సేకరించి పెట్టిన ఉల్లి నిల్వలు పూర్తిగా అడుగంటడం ధరల పెరుగుదలకు కారణమయ్యాయి.

దీంతో గత నెల రోజుల వ్యవధిలోనే ఉల్లి ధర కిలో రూ.40–50 నుంచి రూ.90–100కి ఎగబాకింది. దీని ప్రభావం మహారాష్ట్ర ఎన్నికలపై నేరుగా పడుతుందని ముందే పసిగట్టిన బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ధరల కట్టడికి రంగంలోకి దిగింది. ధర మరీ పెరిగిపోకుండా కట్టడిచేసేందుకు 4.7లక్షల టన్నుల బఫర్ నిల్వ లోంచి 1.50లక్షల టన్నుల మేర విడుదలచేసింది. దీంతో నాసిక్ నుంచి మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లోని విక్రయ కేంద్రాల్లోకి ఉల్లి సరఫరా సాధ్యమైంది. వీటిల్లో కిలో ఉల్లిని రూ.35కే విక్రయిస్తున్నారు. అయినాసరే ధరల పెరుగుదల ఆగడం లేదు. 'గత రబీ సీజన్‌లోని పాత స్టాక్ దాదాపు అయిపోయింది. కొత్త స్టాక్ ఇంకా మార్కెట్లోకి రాలేదు. ఈ సరఫరా–డిమాండ్ అసమతుల్యత ధర పెరుగుదలకు కారణం. దీన్ని చక్కదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని మహారాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ధరల ఉరవడిపై మహా వికాస్ అఘాడీ కూటమిలోని కాంగ్రెస్, శివసేన(యూబీటీ) పార్టీలు షిండే సర్కార్‌పై విమర్శలు ఎక్కుపెడుతున్నాయి.

మహారాష్ట్రలో పెరుగుతున్న ఉల్లి ధరలు

- ముంబైలో కిలో రూ.100
- బఫర్ నిల్వలను విడుదల చేసి సరఫరా చేస్తున్నా తగ్గని ధరలు
- ఉల్లి ఎగుమతులపై నిషేధంతో మహా రైతుల నుంచి వ్యతిరేకత

ఎగుమతుల నిషేధంపై రైతుల్లో ఆగ్రహం

ఉల్లి ఎగుమతులపై నిషేధం విధిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతుల ఆగ్రహానికి కారణమవుతోంది. గడిచిన లోక్‌సభ ఎన్నికల సమయంలో డిసెంబర్ 2023 వరకు ఉన్న ఎగుమతులపై నిషేధాన్ని కేంద్రప్రభుత్వం 2024 మార్చినెల వరకు పొడిగించింది. దీనికి తోడు ఎగమతి సుంకాలను 25 శాతం నుంచి 40 శాతానికి పెంచింది. ఎగుమతి ఆంక్షలు తమ జీవనోపాధిని దెబ్బతీశాయని మహారాష్ట్ర రైతుల ఆవేదన సవ్యక్తంచేస్తున్నారు. ఉల్లి సాగు అధికంగాఉండే ధూలే, దిండోరి, అహ్మద్‌నగర్, పుణె, నాసిక్‌లలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే మహారాష్ట్ర నుంచి ఎగుమతులను నిషేధించిన కేంద్రం తమ పార్టీ ఏలుబడిలో ఉన్న గుజరాత్ నుంచి మాత్రం ఎగుమతులపై ఉన్న నిషేధాన్ని ఎత్తేయాలని నిర్ణయించడంతో మహారాష్ట్ర రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ కారణంగానే ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో 12 ఎంపీ స్థానాల్లో మహాయుతి కూటమి ఓటమిని చవిచూసిందని విశ్లేషణలు వెలువడ్డాయి. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సైతం లోక్‌సభ ఎన్నికల్లో మహాయుతి పేలవ ప్రదర్శన వెనుక ఉల్లి రైతుల ఆగ్రహం ఉందని అంగీకరించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్రం మహారాష్ట్రలోని ఉల్లి రైతుల కంటే గుజరాత్‌లోని ఉల్లి రైతుల గురించే పట్టించుకుంటోందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఉల్లి మంట నుంచి బయట పడేందుకు పాలక కూటమి ఎలాంటి దిద్దుబాటు చర్యలు తీసుకుంటుందన్న దానిపైనే ఎన్నికల్లో సామాన్యులు, రైతుల సానుకూల, ప్రతికూల ఓటింగ్ సరళి ఆధారపడిఉంటుందని తెలుస్తోంది.

ఒకేసమయం నిద్రతో ఒత్తిడికి కళ్లెం



న్యూఢిల్లీ: నిద్ర. అలసిన శరీరాన్ని అమాంతం ఆక్రమించి మరోలోకానికి తీసుకెళ్లే అదృశ్యదేవత. అలాంటి నిద్రాదేవత ఆవాహన చిన్నారుల్లో రోజూ ఒకేసమయంలో జరిగితే ఒనగూరే ప్రయోజనాలు అంతాఇంతా కాదని తాజా పరిశోధనాలో వెల్లడైంది. అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీలోని పరిశోధకులు ఈ మేరకు ఆరేళ్ల వయసు చిన్నారులపై ఒక విస్తృతస్థాయి, సుదీర్ఘ పరిశోధన చేశారు. పుట్టినప్పటి నుంచి రెండున్నరేళ్ల వయసు వచ్చే వరకు కొందరు చిన్నారులను వారి తల్లిదండ్రులు శ్రద్ధాసక్తులతో పెంచేలా ఆ పేరెంట్స్‌కు శిక్షణనిచ్చారు. చిన్నారి వేర్వేరు సందర్భాలకు తగ్గ భావోద్వేగాలు, శారీరక అవసరాలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తీరుస్తూ వారి ఆలనాపాలనా బాధ్యతలను చక్కగా నెరవేర్చేలా చూశారు. మారాంచేసినపుడు గారాబం చేయకుండా పరిస్థితిని చక్కగా విడమరిచి చెప్పేలా తల్లిదండ్రులకు తగు తర్ఫీదునిచ్చారు. అలసపోయి నిద్రలోకి జారుకునేటపుడు నిద్రకు అనువైన వాతావరణం ఉండేలా చూడడం, దీపాలన్నీ ఆర్పేసి చిన్నారులను వీపుపై తడుతూ బుజ్జగించి పడుకోబెట్టడం వంటివి చేయాలని పరిశోధకులు సూచించారు.

పరిశోధనలో ఏం తేలింది?

ఇలా చేయడం వల్ల చిన్నారులు రోజూ ఒకే సమయానికి పడుకోగలిగారు. నిద్రసమయం కూడా దాదాపు వారి వయసుకు తగ్గట్లు ఉండేది. దీంతో చిన్నారులు తమ దైనందిన జీవితంలో చవిచూసిన భావోద్వేగాలను చక్కగా నియంత్రించుకోవడం పరిశోధకులు గమనించారు. ఒకే సమయంలో నిద్రపోవడం వల్ల గాఢ నిద్ర సాధ్యమైంది. ''స్థిరమైన నిద్రాకాలం అనేది పిల్లల ఎదుగుదలకూ ఎంతో తోడ్పడింది. నిద్ర సరిగా పట్టకపోవడం వంటి సమస్యలు వీరిలో తలెత్తలేదు''అని పరిశోధకులు చెప్పారు. సంబంధిత వివరాలు డెవలప్‌మెంటల్ అండ్ బిహేవియర్ పిడియాట్రిక్స్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

చక్కటి వ్యవహార శైలి అలవడే అవకాశం

- భావోద్వేగాలపై నియంత్రణ
- చిన్నారుల నిద్రపై పరిశోధనలో వెల్లడైన పలు ఆసక్తికర అంశాలు

ఇతర చిన్నారుల్లో ఇబ్బందులు

పరిశోధనకు ఎంచుకున్న పిల్లలతో పోలిస్తే అస్తమానం అస్తవ్యస్త సమయాల్లో నిద్రించే పిల్లల్లో భావోద్వేగాలపై నియంత్రణ చాలా తక్కువగా ఉందని ఈ అధ్యయనంలో కీలక పరిశోధకుడు అద్వా డాడ్జీ చెప్పారు. ఈయన పెన్సిల్వేనియా స్టేట్ వర్సిటీలో బిహేవియర్ హెల్త్ విభాగంలో సేవలందిస్తున్నారు. పరిశోధకులు పిల్లలు రోజు ఏ సమయానికి నిద్రపోతున్నారు, ఎంతసేపు నిద్రపోతున్నారు, గాఢనిద్ర వివరాలు తెల్సుకునేందుకు వాళ్ల మణికట్టుకు మానిటర్‌లను అమర్చారు.

ఎలాంటి ప్రయోగాలు చేశారు?

ఒకేసమయంలో నిద్రించే పిల్లలకు ఒక పెద్ద బొమ్మల సమూహం నుంచి ఒకేఒక్క బొమ్మను తీసుకుని ఆడుకోవాలని సూచించారు. ప్రతి బొమ్మను విడివిడిగా ఒక చిన్న పెట్టెలో తాళం వేసి దాచారు. ఆ పెట్టెల తాళంచెవులను ఇచ్చి తెరచి తీసి ఆడుకోవాలని సూచించారు. ఏ తాళంచెవికి ఏ పెట్టె తెరచుకుంటుందో కనిపెట్టేందుకు.. ఒకేసమయంలో నిద్రించే పిల్లలు మాత్రం శ్రద్ధగా ఒక్కో పెట్టెను తాళం చెవితో తెరచే ప్రయత్నంచేశారు. నిద్రానియమంలేని పిల్లలు మాత్రం ఒక్కో పెట్టెను తెరిచే ఓపికలేక ఆవేశంతో ఆ తాళం చెవులను విసిరిపారేశారు. మరో ప్రయోగంలో రెండు రకాల పిల్లలను ఒకచోటచేర్చి కలిసి ఆడుకోండని సూచించారు. ఈ సందర్భంలోనూ నిద్రనియంత్రణ ఉన్న పిల్లలు తోటి పిల్లలతో కలిసి ఆడుకునే ప్రయత్నంచేశారు. కొందరు పిల్లలను వారంలో ప్రతి రోజూ ఒక 20 నిమిషాలు ముందుగా లేదా 20 నిమిషాలు ఆలస్యంగా నిద్రపోయేలా చేశారు. ఇంకొందరిని వారంరోజులపాటు ఏకంగా రెండు గంటలు ముందుగా లేదంటే ఆలస్యంగా నిద్రపోనిచ్చారు. 20 నిమిషాల తేడాతో నిద్రించిన పిల్లల్లో భావోద్వేగాల నియంత్రణ చాలా ఎక్కువగా ఉన్నట్లు పరిశోధనలో తేలింది.

సొంత కాళ్లపై నిలబడండి

- శరద్ పవార్ ఫొటోలను ప్రచారానికి వాడొద్దు
- అజిత్‌పవార్ వర్గానికి సూచించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఆయనతో సైద్ధాంతిక వైరుధ్యాలున్నాయంటూ వేరుబడిన పార్టీ తీరా ఎన్నికలప్పుడు అదే వ్యక్తి ఫొటో, వీడియోలను ప్రచారంలో వాడుకోవడమేంటని సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తంచేసింది. శరద్‌పవార్ సారథ్యంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ)ని చీల్చి మెజారిటీ ఎమ్మెల్యేల దన్నుతో పార్టీని, ఎన్నికల చిహ్నాన్ని కైవసం చేసుకున్న అజిత్ పవార్ వర్గం వైఖరి పట్ల సుప్రీంకోర్టు బుధవారం అసహనం వ్యక్తంచేసింది. పార్టీని ముక్కలుచేసి బలం తగ్గేలా చేసిన అజిత్ వర్గం ఇప్పుడు తమ నేత ఫొటోలను వాడుతూ మరింతగా ఓట్లు చీలేందుకు కారణమవుతోందంటూ శరద్‌పవార్ వర్గం దాఖలుచేసిన పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం బుధవారం విచారించింది. ఈ సందర్భంగా అజిత్ వర్గానుద్దేశిస్తూ పలు వ్యాఖ్యలుచేసింది. ''శరద్‌పవార్ పాత ఫొటోలుగానీ, వీడియోలుగానీ ఎన్నికల ప్రచారంలో వాడొద్దని మీ పార్టీ శ్రేణులకు చెప్పండి. ఆయనతో మీ పార్టీకి సైద్ధాంతిక విబేధాలు ఉన్నాయంటూనే మళ్లీ శరద్ ఫొటోలు, క్లిప్పులను ఎందుకు వాడతారు?. మీ సొంత కాళ్ల మీద మీరు నిలబడటానికి ప్రయత్నించండి''అని అజిత్ తరఫున హాజరైన సీనియర్ లాయర్ బలిబీర్‌సింగ్‌ను కోర్టు ఆదేశించింది. శరద్ ఫొటోలు, ఆడియోలు, వీడియోలు, క్లిప్పులను వాడకూడదని, వాడబోమని పేర్కొంటూ ఆన్‌లైన్ సర్క్యులర్‌ను మీ పార్టీ శ్రేణులకు పంపాలని కోర్టు సూచించింది. ''అజిత్ వర్గానికి శరద్ మద్దతు పలుకుతున్నట్లు అజిత్ వర్గంలోని ఎమ్మెల్సీ ఒకరు పాత వీడియోను సర్క్యులేట్‌చేస్తున్నారు. అయినా జనాలు తెలివైన వాళ్లు. ఎవరు అజిత్, ఎవరు శరద్ అనే బేధాన్ని తెల్సుకోగలరు''అని శరద్ తరఫు సీనియర్ లాయర్ కపిల్ సిబల్ అన్నారు. తాను స్థాపించిన పార్టీ గుర్తు గడియారం తనకే చెందుతుందని శరద్ వేసిన కేసు ఇంకా పెండింగ్‌లో ఉంది. దాంతో గడియారం గుర్తును అజిత్ వర్గం ఎన్నికల ప్రచారసామగ్రిపై వాడుకున్నాసరే ఈ అంశం ఇంకా కోర్టు పరిధిలోనే ఉందనే విషయాన్ని వాటిపై స్పష్టంగా పేర్కొనాలని కోర్టు సూచించింది. 1999లో కాంగ్రెస్ నుంచి విడిపోయి నాటి లోక్‌సభ స్పీకర్ సంగ్మా, తారిఖ్ అన్వర్‌లతో కలిసి శరద్ ఎన్సీపీని స్థాపించారు. గత ఏడాది జూలైలో ఆ పార్టీని అజిత్ చీల్చారు.

రిజర్వేషన్ల రద్దుకు 'యువరాజు' కుట్రలు: మోదీ

దేవగఢ్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ లక్ష్యంగా ప్రధాని మోదీ ఆరోపణలు గుప్పించారు. దేశంలో రిజర్వేషన్లు రద్దు చేయడానికి కాంగ్రెస్ యువరాజు కుట్రలు సాగిస్తున్నాడని మండిపడ్డారు. స్వార్థ రాజకీయాలే పరమావధిగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను బలహీనపర్చడం కోసం రిజర్వేషన్లు అంతం చేయడానికి ప్రయత్నిస్తున్నాడని చెప్పారు. బుధవారం జార్ఖండ్‌లో రెండు ఎన్నికల ప్రచార సభల్లో మోదీ మాట్లాడారు. రాష్ట్రంలో జేఎంఎం ప్రభుత్వం అక్రమ వలసదార్లను ప్రోత్సహించిందని, సర్కారు అండతో వారంతా శాశ్వత నివాసితులుగా మారిపోయారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల విషయంలో కాంగ్రెస్ ఉద్దేశాలు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. యువ రాజు తండ్రి(రాజీవ్ గాంధీ)రిజర్వేషన్లను వ్యతిరేకించారని గుర్తుచేశారు.

మహారాష్ట్ర ఎన్నికల్లో.. కుటుంబ కథా–చిత్రం!

బరిలో భారీగా నేతల బంధుగణం

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సకుటుంబ, సపరివార కథా చిత్రాన్ని తలపిస్తున్నాయి. ఠాక్రేల నుంచి పవార్ల దాకా అనేక కాకలు తీరిన రాజకీయ కుటుంబాల నుంచి బోలెడంత మంది ఎన్నికల బరిలో నిలిచారు. బాబాయ్, కొడుకులు, తండ్రీ కూతుళ్లు, మామ, అల్లుళ్లు, చివరకు భార్యాభర్తలు కూడా పోటీ పడుతున్నారు. కనీసం ఐదు అసెంబ్లీ స్థానాల్లో దగ్గరి బంధువులే అమీతుమీ తేల్చుకుంటున్నారు!

పవార్ వర్సెస్ పవార్

బారామతి అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయం పవార్ వర్సెస్ పవార్‌గా ఉంది. ఎన్సీపీ (ఎస్పీ) నుంచి రాజకీయ కురువృద్ధుడు శరద్ పవార్ మనవడు యుగేంద్ర పవార్ బరిలో ఉన్నారు. డిప్యూటీ సీఎంగా ఉన్న తన పెదనాన్న, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్‌తో ఆయన పోటీ పడుతుండటం విశేషం. ఇక్కడ ఏకంగా ఏడుసార్లు నెగ్గిన చరిత్ర అజిత్‌ది. ఆయన తమ్ముడు శ్రీనివాస్ పవార్ కుమారుడు యుగేంద్ర. శరద్ పవార్‌కు ఆయన అత్యంత సన్నిహితుడు. బారామతిలో పవార్ వర్సెస్ పవార్ ఇది రెండోసారి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో అజిత్ భార్య సునేత్రను శరద్ పవార్ కుమార్తె సుప్రియా సులే ఓడించారు.

తండ్రీ కూతుళ్ల పోటీ

గడ్చిరోలి జిల్లా అహేరి నియోజకవర్గం తండ్రీ కూతుళ్ల పోటీకి వేదికగా నిలిచింది! ఎన్సీపీకి చెందిన మంత్రి ధర్మారావు బాబా ఆత్రంపై ఆయన కుమార్తె భాగ్యశ్రీ ఆత్రం హల్గేకర్ పోటీ చేస్తున్నారు. మాజీ మంత్రి అంబరీశ్ రావు ఆత్రం స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉండటంతో ఇక్కడ ముక్కోణపు పోరు నెలకొంది. లోహా–కంధర్ నియోజకవర్గంలో ఎన్సీపీ అభ్యర్థి ప్రతాప్‌రావ్ పాటిల్ చిక్లీకర్ తన బావమరిది శ్యాంసుందర్ షిండేతో తలపడుతున్నారు. షిండే గతంలో చిఖలీకర్ మద్దతుతోనే అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గడం విశేషం! సింధ్‌ఖేడ్ రాజా నియోజకవర్గంలో ఎన్సీపీ (ఎస్పీ)కి అభ్యర్థి రాజేంద్ర షింగ్నే తన మేనకోడలు గాయత్రి షింగ్నేపై పోటీ చేస్తున్నారు. ఆమె అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. నాసిక్‌లోని చాంద్వాడ్ నుంచి బీజేపీ అభ్యర్థి రాహుల్ అహెర్ తన సోదరుడు కేదా అహెర్‌పై బరిలోకి దిగారు.

ఎందరో వారసులు...

శివసేన (యూబీటీ) చీఫ్, మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు ఆదిత్య ఠాక్రే వర్లీ అసెంబ్లీ స్థానాన్ని నిలబెట్టుకునే ప్రయత్నంలో ఉన్నారు. సీఎం ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేన సిట్టింగ్ రాజ్యసభ సభ్యుడు మిలింద్ దేవ్‌రా ఆయనకు గట్టి పోటీ ఇస్తున్నారు. బాంద్రా ఈస్ట్‌లో ఆదిత్య మేనమామ వరుణ్ సర్దేశాయ్ వాంద్రేతో దివంగత బాబా సిద్ధిఖీ కుమారుడు జిషాన్ (ఎన్సీపీ) తలపడుతున్నారు. ఎంఎన్‌ఎస్ నేత రాజ్ ఠాక్రే కుమారుడు అమిత్ ముంబైలోని మాహిం నుంచి పోటీ చేస్తున్నారు. ముంబై బీజేపీ చీఫ్ ఆశిష్ షెలార్ వాంద్రే, ఆయన సోదరుడు వినోద్ షెలార్; మాజీ సీఎం విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ కుమారులు అమిత్, ధీరజ్; శరద్ పవార్ మనవడు రోహిత్ పవార్ ఎన్సీపీ (ఎస్పీ) మహారాష్ట్ర చీఫ్ జయంత్ పాటిల్ మేనల్లుడు ప్రజక్త్ తాన్పురే, ఎన్సీపీ సీనియర్ మంత్రి ఛగన్ భుజ్‌బల్, ఆయన సోదరుడి కుమారుడు సమీర్ తదితరులు కూడా అసెంబ్లీ బరిలో ఉన్నారు. మోహన్‌రావు హంబర్డే కాంగ్రెస్ నుంచి, ఆయన సోదరుడు సంతుక్‌రావ్ బీజేపీ నుంచి పోటీ చేస్తుండటం విశేషం. గణేశ్ నాయక్ బీజేపీ తరఫున, ఆయన చిన్న కుమారుడు సందీప్ ఎన్సీపీ (ఎస్పీ) అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. విజయ్‌కుమార్ గవిట్ కుటుంబం నుంచి ఏకంగా నలుగురు అసెంబ్లీ బరిలో ఉన్నారు. విజయ్‌కుమార్ బీజేపీ నుంచి, సోదరుడు రాజేంద్ర గవిత్ కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తుండగా మరో సోదరుడు భరత్, కుమార్తె హీనా ఇండిపెండెంట్లుగా బరిలో ఉన్నారు! బీజేపీ ఎంపీ నారాయణ్ రాణే కుమారులు నితేశ్, నీలేశ్ కూడా అసెంబ్లీ బరిలో దిగారు.

భార్యాభర్తల సవాల్

ఛత్రపతి శంభాజీనగర్‌లోని కన్నడ్ అసెంబ్లీ స్థానం ఏకంగా భార్యాభర్తల నడుమ ఆసక్తికర పోరుకు వేదికైంది. శివసేన అభ్యర్థి సంజనా జాదవ్‌పై ఆమె భర్త హర్షవర్ధన్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. వీరిద్దరూ రాజకీయ కుటుంబాల నుంచే వచ్చారు. హర్షవర్ధన్ మాజీ కాంగ్రెస్ ఎమ్మెల్యే దివంగత రైభాన్ జాదవ్ కుమారుడు. ఇక సంజన సీనియర్ బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి రావుసాహెబ్ దన్వే కుమార్తె. హర్షవర్ధన్ 2009లో రాజ్ ఠాక్రేకు చెందిన మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) తరఫున కన్నడ్ అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందారు. 2014లో శివసేన టికెట్‌పై మరోసారి విజయం సాధించారు. మరాఠా కోటా ఉద్యమంపై ప్రభుత్వం ఉదాసీనతను నిరసిస్తూ 2018లో రాజీనామా చేశారు. భార్యాభర్తలిద్దరూ 2019లో విడిపోయినా ఇంకా విడాకులు తీసుకోలేదు. ఇదే విషయాన్ని హర్షవర్ధన్ తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. సంజన మాత్రం తాను వివాహితురాలినేనని పేర్కొన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

సమాధి ఆక్రమణపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని డిఫెన్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్(డీసీడబ్ల్యూఏ)పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేశారు. 700 ఏళ్ల చరిత్ర ఉన్న లోధి హయాం నాటి సమాధిని ఆక్రమించుకోవడం పట్ల మండిపడింది. ఆ సమాధిని ఎందుకు పరిరక్షించకపోతున్నారని భారత పురావస్తు పరిశోధన విభాగాన్ని(ఏఎస్ఐ) ప్రశ్నించింది. ఆ ప్రాచీన కట్టడానికి ఎంత మేరకు నష్టం జరిగిందో అధ్యయనం చేయడానికి, పునరుద్ధరణకు అవసరమైన చర్యలను సూచించడానికి పురావస్తు నిపుణుడిని నియమిస్తామని వెల్లడించింది. 15వ శతాబ్దంలో నిర్మించిన సమాధికి చెందిన స్థలాన్ని, కట్టడాలను 1960వ దశకంలో డీసీడబ్ల్యూఏ ఆక్రమించుకుంది. ఓ గదిలో కార్యాలయం సైతం ఏర్పాటు చేసుకుంది. ఆ ప్రాచీన కట్టడాన్ని సంఘ విద్రోహ శక్తులు చాలావరకు ధ్వంసం చేశామని, అందుకే తాము ఆధీనంలోకి తీసుకున్నామని డీసీడబ్ల్యూఏ వాదించింది. ప్రాచీన కట్టడాన్ని ఆక్రమించుకోవడాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీ డిఫెన్స్ కాలనీకి చెందిన రాజీవ్ సూరీ తొలుత ఢిల్లీ హైకోర్టు ఆశ్రయించారు. ఆ సమాధిని రక్షిత ప్రాంతంగా ప్రకటించాలని, దాన్ని పరిరక్షించేలా ప్రభుత్వ అధికారులకు ఆదేశించాలని కోరారు. ఢిల్లీ హైకోర్టు సానుకూలంగా స్పందించకపోవడంతో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సుధాంశు ధూలియా, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. సమాధికి చెందిన గదిలో ఏసీ కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారని ఆక్షేపించింది. దానికి అద్దె చెల్లిస్తున్నారా? అని ప్రశ్నించింది. ప్రాచీన కట్టడాలను కాపాడాల్సిన ఏఎస్ఐ ఏం చేస్తోందంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది. సమాధి స్థలాన్ని ఖాళీ చేయాలని డీసీడబ్ల్యూఏను ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే ఏడాది జనవరి 21వ తేదీకి వాయిదా వేసింది.

మహారాష్ట్రలో బ్యాగుల గోల

- తమ బ్యాగులను మాత్రమే తనిఖీ చేస్తున్నారన్న ఉద్ధవ్ ఠాక్రే
- తాజాగా సీఎం షిండే, అజిత్ పవార్ బ్యాగులను చెక్ చేసిన అధికారులు

ముంబై: ఎన్నికల వేళ రాజకీయనేతలు ప్రచారాంశమైన ప్రతి ఒక్కదానిపైనా విమర్శలు, ప్రతివిమర్శలు గుప్పించుకుంటారనడానికి మరో ఘటన చక్కటి తార్కాణంలా నిలిచింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా యావత్మాల్, లాతూర్‌లలో పర్యటిస్తున్నపుడు ఎన్నికల అధికారులు తాను ప్రయాణించే హెలికాప్టర్‌లో బ్యాగులను తనిఖీచేశారని సోమవారం శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే ఆగ్రహం వ్యక్తంచేయడం తెల్సిందే. అధికార పార్టీ నేతల బ్యాగులను వదిలేసి విపక్షపార్టీల ముఖ్యులపైనే ఎన్నికల అధికారులు దృష్టిసారించారని మండిపడ్డారు. ''విపక్షనేతల బ్యాగులు, హోటల్ రూమ్‌లు, స్థలాలు, హెలికాప్టర్లను మాత్రమే తనిఖీచేస్తున్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలు ప్రచారం వేళ మహారాష్ట్రలో ప్రయాణిస్తున్న హెలికాప్టర్లను ఏనాడైనా తనిఖీచేశారా?'' అని బీజేపీ, ఎన్నికల సంఘాలకు ఠాక్రే సూటి ప్రశ్నవేయడం తెల్సిందే. సీఎం షిండే, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవిస్, ఎన్సీపీ నేత అజిత్‌పవార్‌ల బ్యాగులను తనిఖీచేశారా అని నిలదీశారు. ఉద్ధవ్ ఠాక్రే



మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్, సీఎం ఏక్‌నాథ్ షిండే బ్యాగులు తనిఖీ చేస్తున్న అధికారులు

కుమారుడు ఆదిత్య సైతం ఆగ్రహిస్తూ 'ఎక్స్'లో ఒక పోస్ట్‌చేశారు. ఈసీ పూర్తిగా పక్షపాతధోరణితో వ్యవహరిస్తోందని ట్వీట్‌చేశారు. దీనిపై బీజేపీ దీటుగా స్పందించింది. తమ నేతల బ్యాగులనూ ఈసీ తరచితరచి చూస్తోందని సంబంధిత వీడియోలను బీజేపీ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌చేసింది. ప్రచారం కోసం పాల్ఘర్‌కు వస్తున్న ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌షిండే ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌ను బుధవారం ఈసీ అధికారులు ఆకస్మికంగా సోదా చేశారు. మంగళవారం లాతూర్‌లో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌నూ అధికారులు తనిఖీచేసిన వీడియోను బీజేపీ షేర్‌చేసింది. విమానాశ్రయం వద్ద ఫడ్నవిస్ బ్యాగులను అధికారులు చెక్‌చేస్తున్న వీడియోనూ అప్‌లోడ్‌చేసింది. '' అతి చేయడం కొందరు నేతలకు అలవాటు. సోదాలు చేస్తే పోయేదేముంది?. తనిఖీ చేసినంత మాత్రాన ఇంతగా అసహనం వ్యక్తంచేయాలా?' అని ఠాక్రేనుద్దేశించి డిప్యూటీ సీఎం ఫడ్నవిస్ అన్నారు. '' హఠాత్తుగా వచ్చి నా హెలికాప్టర్‌నూ చెక్‌చేశారు. తనిఖీల సమయంలో నేను పూర్తిగా సహకరించా. పారదర్శకమైన ఎన్నికలకు ఇలాంటి సోదాలు ఉండాల్సిందే. ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరింత పెంచాలి'' అని అజిత్ అన్నారు.

ఆగని ఇజ్రాయెల్ భీకర దాడులు

గాజా స్ట్రిప్‌లో 46 మంది, లెబనాన్‌లో 33 మంది దుర్మరణం

డెయిర్–అల్–బాలాహ్(గాజా స్ట్రిప్): గాజా స్ట్రిప్, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల ఉధృతి మరింత పెరిగింది. గత 24 గంటల్లో గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 46 మంది ప్రాణాలు కోల్పోయారు. లెబనాన్ రాజధాని బీరూట్ శివారు ప్రాంతాలపై ఇజ్రాయెల్ యుద్ధవిమానాల భీకర దాడుల్లో 33 మంది మరణించారు. ఇజ్రాయెల్‌కు తమ సైనికసాయాన్ని తగ్గించే ప్రసక్తిలేదని అమెరికా తెగేసి చెప్పిన తరుణంలో ఈ దాడులు జరగడం గమనార్హం. బీరూట్ శివారు దహియే ప్రాంతంపై దాడి చేయబోతున్నామని ముందుస్తు హెచ్చరికలు చేసిన 11 గంటల తర్వాత వైమానిక దాడిని మొదలెట్టామని ఇజ్రాయెల్ తెలిపింది. అయితే ముందస్తు హెచ్చరికలు చేయలేదని లెబనాన్ బుధవారం ప్రకటించింది. హెజ్‌బొల్లా మిలిటెంట్ల కమాండ్ సెంటర్లు, ఆయుధ కర్మాగారాలపై బాంబులు, క్షిపణులు వేశామని ఇజ్రాయెల్ తెలిపింది. గాజాపై ఓవైపు దాడులు చేస్తూనే పాలస్తీనియన్లకు మానవతాసాయం పెంచేందుకు ఇజ్రాయెల్ అంగీకరించింది. దీంతో మానవతాజోన్ విస్తృతి పెరగనుంది. రోజూ కనీసం 350 ట్రక్కుల ఆహార, ఔషధ సరకుల రవాణా గాజాలోకి వెళ్లేలా చూడాలని ఐరాస విధించిన 30రోజుల డెడ్‌లైన్ ఈ వారంతో ముగుస్తుండటం తెల్సిందే.

ఈ ఏడాదిలో చివరి సూపర్ మూన్ 16న

2024లో నాలుగో, చివరి సూపర్ మూన్ నవంబర్ 16న కనువిందు చేయనుంది. ఆ రోజు సాయంత్ర వేళ, సరిగ్గా చెప్పాలంటే సూర్యాస్తమయం జరిగిన కాసేపటికి భారత్‌లో దీన్ని వీక్షించవచ్చు. ఆ సందర్భంగా చంద్రుడు సాధారణం కంటే కనీసం 20 శాతం పెద్దగా కన్పించి అలరించనున్నాడు. ఉత్తర అమెరికా సంప్రదాయాల ప్రకారం దీనికి బీవర్ మూన్ అని పేరు పెట్టారు. చలికాలంలో వచ్చే సూపర్‌మూన్‌ను ఫ్రాస్ట్ మూన్, స్నో మూన్ అంటుంటారు. సెవెన్ సిస్టర్స్‌గా పేరొందిన ప్లెయిడాస్ తారాసమూహాన్ని కూడా శుక్రారం వీక్షించవచ్చు.

లీగల్ సర్వీసెస్ కమిటీ చీఫ్‌గా జస్టిస్ సూర్యకాంత్

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ (ఎస్‌సీఎల్ఎస్‌సీ) సారథిగా జస్టిస్ సూర్యకాంత్ వ్యవహరించారు. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా బుధవారం నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటిదాకా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఈ పదవిలో కొనసాగారు. ఆయన ఇకపై నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) చైర్మన్‌గా వ్యవహరిస్తారు. సీజేఐ తర్వాత సీనియారిటీలో తొలి స్థానంలో ఉండే న్యాయమూర్తి నల్సాకు, రెండో స్థానంలోని న్యాయమూర్తి ఎస్‌సీఎల్ఎస్‌సీకు చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

పార్లమెంటరీ వ్యవస్థకు మరో పేరు?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

రాజ్యాంగ అవలోకనం, ముఖ్య లక్షణాలు, ప్రవేశిక


మాదిరి ప్రశ్నలు

1. భారత ప్రభుత్వ చట్టం-1935 ప్రకారం కార్య నిర్వహణ అధికారం ఎవరికి ఉండేది?
ఎ) బ్రిటిష్ రాణి / రాజు
బి) ఇంగ్లండ్ పార్లమెంట్
సి) సమాఖ్య శాసనసభ
డి) కౌన్సిల్‌లోని గవర్నర్ జనరల్
2. బ్రిటిషర్లు బెంగాల్‌లో సుప్రీంకోర్టును ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
ఎ) 1776 బి) 1775 సి) 1777 డి) 1774
3. 1773 నుంచి 1857 వరకు చేసిన చట్టాలను ఎలా వ్యవహరిస్తారు?
ఎ) చార్టర్ చట్టాలు బి) కౌన్సిల్ చట్టాలు
సి) క్రౌన్ చట్టాలు డి) ఏవీకాదు
4. భారత ప్రభుత్వ చట్టం-1935 ప్రకారం ఎన్ని జాబితాలు ఉండేవి?
ఎ) 2 బి) 3 సి) 5 డి) 6
5. భారత్‌లో బ్రిటిష్ సామ్రాజ్యానికి పునాది వేయడానికి కారకుడు?
ఎ) వాట్సన్ బి) రాబర్ట్ క్లైవ్
సి) డూప్లెక్స్ డి) వారెన్ హేస్టింగ్స్
6. భారత ప్రభుత్వ చట్టం 1919లోని ప్రధాన అంశం / అంశాలు?
ఎ) రాష్ట్రాల కార్య నిర్వాహక ప్రభుత్వంలో ద్వంద్వ పాలనను ప్రవేశపెట్టడం
బి) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను నిర్వచించడం
సి) కేంద్ర, రాష్ట్రాలకు శాసన నిర్మాణ అధికారాన్ని సంక్రమింపజేయడం
డి) పైవన్నీ
7. మొదటిసారిగా ఏ బ్రిటిష్ చట్టం భారతీయులకు పాలనలో భాగస్వామ్యం కల్పించడానికి ఉద్దేశించింది?
ఎ) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1861
బి) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1862
సి) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1909
డి) గవర్నమెంట్ ఆఫ్ ఇండియా చట్టం, 1919
8. 'గట్టి బ్రేకులు ఉండి ఇంజన్ లేని యంత్రం' అని నెహ్రూ దేన్ని పేర్కొన్నారు?
ఎ) కేబినెట్ ప్లాన్
బి) మౌంట్‌బాటన్ ప్లాన్ సి) వేవెల్ ప్లాన్
డి) 1935 భారత ప్రభుత్వ చట్టం
9. మత ప్రాతిపదిక నియోజకవర్గాల పితామహుడిగా ఎవరిని పేర్కొంటారు?
ఎ) లార్డ్ మింటో బి) లార్డ్ బెంటింక్
సి) వారెన్ హేస్టింగ్స్ డి) రాబర్ట్ క్లైవ్
10. భారతదేశంలో ఏ చట్టం ద్వారా తొలి అధికారిక శాసనసభను ఏర్పాటు చేశారు?
ఎ) చార్టర్ చట్టం, 1833
బి) చార్టర్ చట్టం, 1853
సి) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1861
డి) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1892
11. మౌంట్ బాటన్ ప్రణాళిక లక్ష్యం?
ఎ) సమాఖ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం
బి) రాజ్యాంగ సభ ద్వారా భారత రాజ్యాంగ రూపకల్పనకు మార్గదర్శకాలు ఇవ్వడం
సి) బ్రిటిషర్ల నుంచి భారతీయులకు అధికారాన్ని బదిలీ చేసే పద్ధతి
డి) ఆ కాలంలో చెలరేగిన మతకల్లోలాలను నివారించడానికి ప్రణాళిక
12. ద్వంద్వ పరిపాలనను ఎప్పుడు ప్రవేశపెట్టారు?
ఎ) ఇండియన్ కౌన్సిల్ చట్టం - 1892
బి) భారత ప్రభుత్వ చట్టం - 1909
సి) భారత ప్రభుత్వ చట్టం - 1919
డి) గాంధీ-ఇర్విన్ ఒప్పందం
13. రాజ్యాంగ వాదాన్ని మొదటిసారి శాస్త్రీయంగా వివరించిన తత్వవేత్త?
ఎ) అరిస్టాటిల్ బి) రూసో
సి) చార్లెస్ డార్విన్ డి) ప్లేటో
14. కింది వాటిలో ఏ చట్టాన్ని మొదటి లిఖిత రాజ్యాంగంగా అభివర్ణిస్తారు?
ఎ) పిట్ ఇండియా చట్టం - 1784
బి) రెగ్యులేటింగ్ చట్టం - 1773
సి) చార్టర్ చట్టం - 1313
డి) చార్టర్ చట్టం - 1853
15. మొదటిసారిగా మత ప్రాతిపదికన ప్రత్యేక నియోజక గణాల ఏర్పాటుకు అవకాశం కల్పించిన చట్టం?
ఎ) 1909 బి) 1919
సి) 1935 డి) ఏవీకాదు
16. రాష్ట్రాల్లో ద్విసభా పద్ధతికి అవకాశం కల్పించిన చట్టం?
ఎ) 1935 బి) 1919
సి) 1909 డి) ఏదీకాదు
17. కింది వాటిలో భారత ప్రభుత్వ చట్టం - 1935లో సరికాని అంశం?
ఎ) ఫెడరల్ న్యాయస్థానం ఏర్పాటు
బి) సమాఖ్య వ్యవస్థ ప్రతిపాదన
సి) ఆర్.బి.ఐ. ఏర్పాటు
డి) సార్వజనీన ఓటుహక్కు
18. కింది వాటిలో ఏ చట్టం ద్వారా 'గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్' పదవిని 'గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా'గా మార్చారు?
ఎ) 1833 బి) 1813 సి) 1861 డి) 1858
19. సైమన్ కమిషన్ ముఖ్య ఉద్దేశం?
ఎ) 1919 చట్టం ద్వారా ప్రవేశపెట్టిన సంస్కరణలను సమీక్షించడం
బి) రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలించడం
సి) డొమినియన్ ప్రతిపత్తిని సమీక్షించడం
డి) పైవన్నీ
20. కింది వాటిలో ఏ ప్రతిపాదనను భారత ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల మాగ్నా కార్టాగా పేర్కొంటారు?
ఎ) వేవెల్ ప్రతిపాదన
బి) క్రిప్స్ ప్రతిపాదన
సి) కేబినెట్ రాయబార ప్రతిపాదన
డి) విక్టోరియా రాణి ప్రకటన
21. మహాత్మా గాంధీ హాజరైన రౌండ్ టేబుల్ సమావేశం?
ఎ) మొదటి రౌండ్ టేబుల్ సమావేశం
బి) రెండో రౌండ్ టేబుల్ సమావేశం
సి) మూడో రౌండ్ టేబుల్ సమావేశం
డి) ఏదీకాదు
22. భారత ప్రభుత్వ చట్టం - 1935ను బానిసత్వానికి నూతన పత్రంగా పేర్కొన్నవారు?
ఎ) కె.టి. షా బి) జవహర్ లాల్ నెహ్రూ
సి) మహాత్మాగాంధీ డి) సర్దార్ పటేల్
23. కింది వాటిలో ఏ ప్రతిపాదనల మేరకు రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటయ్యింది?
ఎ) కేబినెట్ ప్రతిపాదనలు
బి) మౌంట్ బాటన్ ప్రతిపాదనలు
సి) క్రిప్స్ ప్రతిపాదనలు డి) ఏవీకాదు
24. భారతదేశంలో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన రోజు?
ఎ) 1946 సెప్టెంబర్ 2
బి) 1946 అక్టోబర్ 2
సి) 1946 నవంబర్ 1
డి) 1947 నవంబర్ 1
25. భారత రాజ్యాంగ రచనలో అత్యంత ప్రభావం చూపిన అంశం?
ఎ) అమెరికా రాజ్యాంగం
బి) బ్రిటిష్ రాజ్యాంగం
సి) ఐరిష్ రాజ్యాంగం
డి) భారత ప్రభుత్వ చట్టం
26. జతపరచండి.
1. పోర్ట్ పోలియో పద్ధతి — ఎ. లార్డ్ మెకాలే
2. సివిల్ సర్వీస్ సులభతరం — బి. లార్డ్ కార్న్‌వాలిస్
3. మత నియోజక వర్గాలు — సి. లార్డ్ కానింగ్
4. భారత న్యాయ సంస్కరణలు — డి. లార్డ్ మింటో
ఎ) 1-సి, 2-బి, 3-డి, 4-ఎ
బి) 1-బి, 2-సి, 3-ఎ, 4-డి
సి) 1-డి, 2-ఎ, 3-బి, 4-సి
డి) 1-ఎ, 2-బి, 3-డి, 4-సి
27. కింది వాటిని ప్రవేశపెట్టిన కాలానుగుణంగా క్రమంలో రాయండి.
1. ప్రత్యేక నియోజకవర్గాలు
2. శాసన అధికారాల బదలాయింపు
3. ద్విసభా విధానం
4. డొమినియన్ ప్రతిపత్తి
ఎ) 1, 2, 3, 4 బి) 2, 1, 3, 4
సి) 3, 2, 1, 4 డి) 3, 4, 1, 2
28. రాజ్యాంగ వికాసానికి సంబంధించి సరైన క్రమాన్ని గుర్తించండి.
ఎ) మాగ్నాకార్టా, యు.ఎస్. రాజ్యాంగం, బిల్ ఆఫ్ రైట్స్, సెటిల్‌మెంట్ చట్టం
బి) మాగ్నాకార్టా, బిల్ ఆఫ్ రైట్స్, సెటిల్‌మెంట్ చట్టం, యు.ఎస్. రాజ్యాంగం
సి) బిల్ ఆఫ్ రైట్స్, మాగ్నాకార్టా, సెటిల్‌మెంట్ చట్టం, యు.ఎస్. రాజ్యాంగం
డి) పైవేవీ కాదు
29. ప్రభుత్వానికి ఉండే అధికారం కింది వాటిలో దేనికి ఉదాహరణ?
ఎ) సంప్రదాయ అధికారం
బి) సమ్మోహన అధికారం
సి) చట్టబద్ధ - హేతుబద్ధ అధికారం
డి) పైవన్నీ
30. కింది వాటిలో భారత రాజ్యాంగానికి ఏ లక్షణాన్ని ఆపాదించలేం?
ఎ) శాసన శాఖ ఆధిక్యత
బి) న్యాయ శాఖ ఆధిక్యత
సి) కార్య నిర్వాహక శాఖ ఆధిక్యత
డి) పైవన్నీ
31. భారత సమాఖ్య స్వభావం?
ఎ) సిద్ధాంత సమాఖ్య బి) అర్ధ సమాఖ్య
సి) విశిష్ట సమాఖ్య
డి) బేరసారాల సమాఖ్య
32. పార్లమెంటరీ వ్యవస్థకు మరో పేరు?
ఎ) కేబినెట్ ప్రభుత్వం
బి) ప్రధానమంత్రి ప్రభుత్వం
సి) పై రెండూ డి) ఏవీ కాదు
33. 'భారత రాజ్యాంగం సుదీర్ఘమైంది' కారణం?
ఎ) ఇతర రాజ్యాంగాల ప్రభావం
బి) భారతదేశ వైవిధ్యం
సి) రాష్ట్రాలకు ప్రత్యేక రాజ్యాంగాలు లేకపోవడం
డి) పైవన్నీ
34. కింది వారిలో ఎవరి జీతభత్యాలను రెండో షెడ్యూల్‌లో పేర్కొనలేదు?
ఎ) పార్లమెంట్ సభ్యులు
బి) స్పీకర్, డిప్యూటీ స్పీకర్
సి) కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్
డి) గవర్నర్
35. భారత రాజ్యాంగానికి, అమెరికా రాజ్యాంగానికి పోలిక?
ఎ) సమాఖ్య వ్యవస్థ బి) న్యాయ సమీక్ష
సి) ప్రాథమిక హక్కులు డి) పైవన్నీ
36. భారతదేశంలో రాజ్యాధికారానికి మూలం?
ఎ) రాజ్యాంగం బి) పార్లమెంట్
సి) ప్రజలు డి) రాష్ట్రపతి
37. భారత రాజ్యాంగ పీఠికలో ఉండే పదాల క్రమం?
ఎ) సార్వభౌమాధికార, ప్రజాస్వామిక, సామ్యవాద, గణతంత్రరాజ్యం
బి) సార్వభౌమాధికార, సామ్యవాద, లౌకిక, గణతంత్ర రాజ్యం
సి) సార్వభౌమాధికార, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక
డి) సార్వభౌమాధికార, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక, గణతంత్ర రాజ్యం
38. భారత రాజ్యాంగ మౌలిక స్వరూపం అంటే?
ఎ) రాజ్యాంగ లక్షణాలు చాలా ముఖ్యమైనవి. వాటిని సవరించడానికి వీలులేదు
బి) ప్రాథమిక హక్కులను కుదించడం గానీ, తొలగించడం గానీ కుదరదు
సి) 368 ప్రకరణ ప్రకారం తప్ప రాజ్యాంగాన్ని సవరించడానికి వీలులేదు
డి) కొన్ని అంశాలను సవరించడానికి పార్లమెంట్‌కు అధికారం ఉండదు
39. ప్రవేశికను భారత రాజ్యాంగానికి ఆత్మ, హృదయం, ఒక ఆభరణంగా వర్ణించినవారు?
ఎ) మహాత్మాగాంధీ బి) అంబేద్కర్
సి) వల్లభ్‌భాయ్ పటేల్
డి) ఠాకూర్‌దాస్ భార్గవ
40. రాజ్యాంగ ప్రవేశిక?
ఎ) సూచనాత్మకమైంది
బి) విషయసూచిక లాంటిది
సి) పై రెండూ డి) పైవేవీ కాదు
41. ప్రవేశిక నుంచి ఏయే అంశాలు తెలుసుకోవచ్చు?
ఎ) రాజ్యాంగ ఆమోద తేది
బి) రాజ్యాంగ ఆధారాలు
సి) రాజ్యాంగ ఆశయాలు
డి) పైవన్నీ
42. 'సమగ్రత' (ఇంటిగ్రిటీ) అనే పదాన్ని 1976లో 42 రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశికకు చేర్చారు. దీని ఉద్దేశం?
ఎ) వేర్పాటువాద శక్తులను అరికట్టడం
బి) భౌగోళిక సామీప్యతను సాధించడం
సి) మతకలహాలను నియంత్రించడం
డి) పైవన్నీ
43. భారత 'సామ్యవాదం' (సోషలిస్ట్) అనే భావజాలం ఎవరి భావాలను ప్రతిబింబిస్తుంది?
ఎ) మార్క్స్, మహాత్మాగాంధీ
బి) గాంధీ, నెహ్రూ సి) మార్క్స్, మావో
డి) మార్క్స్, వినోబా బావే
44. కింది వాటిలో ప్రవేశికకు సంబంధించి సరైంది?
ఎ) రాజ్యాంగంలోని ప్రకరణలతో సంబంధం ఉంటుంది
బి) ప్రత్యేకంగా ప్రవేశికకు ఉనికి ఉండదు
సి) సవరణకు అతీతం కాదు
డి) పైవన్నీ సరైనవే
45. కింది వాటిలో ఏయే అంశాలను వ్యాఖ్యానించడానికి ప్రవేశికను ఆధారంగా తీసుకోవచ్చు?
ఎ) ప్రాథమిక హక్కులు
బి) ఆదేశిక సూత్రాలు
సి) ప్రభుత్వ అధికారాలు డి) పైవన్నీ
46. ప్రవేశికలో పేర్కొన్న 'సమానత్వం' కింది వాటిలో దేనికి హామీ ఇస్తుంది?
ఎ) హోదా బి) అవకాశాలు
సి) ఉపాధి డి) ఎ, బి
47. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) ప్రవేశిక అధికారానికి ఆధారం, పరిమితి కాదు
బి) ప్రవేశిక సవరణకు అతీతం కాదు
సి) ప్రవేశికను రాజ్యాంగ రచన తర్వాత చేర్చారు. ఆఖరున ఆమోదించారు
డి) పైవన్నీ సరైనవే
48. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) అత్యంత దృఢ రాజ్యాంగం - అమెరికా
బి) పరిమాణాత్మక రాజ్యాంగం - ఇంగ్లండ్
సి) చట్టీకృత రాజ్యాంగం - ఇండియా
డి) పైవన్నీ సరైనవే
49. రాజ్యాంగ వాదన అంటే?
ఎ) పరిమిత అధికారాలతో కూడిన పరిపాలన
బి) పరిమిత ప్రభుత్వ వ్యవస్థ
సి) రాజ్యాంగ వికాస దశ
డి) పైవేవీ కాదు
50. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత చేర్చిన అంశాలు?
ఎ) ప్రాథమిక విధులు బి) ట్రిబ్యునల్
సి) సహకార సంస్థలు డి) పైవన్నీ

సమాధానాలు

1) డి; 2) డి; 3) ఎ; 4) బి; 5) బి;
6) డి; 7) ఎ; 8) డి; 9) ఎ; 10) బి;
11) సి; 12) సి; 13) ఎ; 14) బి; 15) ఎ;
16) ఎ; 17) డి; 18) ఎ; 19) ఎ; 20) డి;
21) బి; 22) బి; 23) ఎ; 24) ఎ; 25) డి;
26) ఎ; 27) ఎ; 28) బి; 29) సి; 30) డి;
31) సి; 32) సి; 33) డి; 34) ఎ; 35) డి;
36) సి; 37) డి; 38) డి; 39) డి; 40) ఎ;
41) డి; 42) ఎ; 43) ఎ; 44) డి; 45) డి;
46) డి; 47) డి; 48) డి; 49) ఎ; 50) డి.

ఫిల్మ్ ప్రొజెక్టర్ ఏ రకం బోధనోపకరణం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ - మెథడ్స్ (ఎస్ఏ)

బోధనోపకరణాలు

1. బోధనోపకరణం ద్వారా దృష్టి, వినికిడిని ఏకకాలంలో ఉపయోగించి విద్యార్థి అభ్యసన అనుభవాన్ని పెంపొందిస్తే దాన్ని దృశ్య శ్రవణ బోధనోపకరణం అంటారని నిర్వచించిందెవరు?
1) బర్టన్ 2) కార్టర్ గుడ్
3) ఎడ్గర్ డేల్ 4) జేమ్స్ వాట్
2. చూడడం ద్వారా అభ్యసన స్థాయి శాతం?
1) 11% 2) 35%
3) 83% 4) 100%
3. చెప్పడం, చేయడం ద్వారా స్మృతి స్థాయి శాతం?
1) 60% 2) 75%
3) 50% 4) 90%
4. అభ్యసనానుభవాలను బట్టి బోధనోపకరణాలను మూడు విధాలుగా వర్గీకరించినవారు?
1) జి.ఎస్.బ్రూనర్ 2) కార్టర్ ఎ.గుడ్
3) బర్టన్ 4) ఎడ్గర్ డేల్
5. నమూనాలు ఏ రకానికి చెందిన బోధనోపకరణాలు?
1) ప్రత్యక్షానుభవాన్నిచ్చేవి
2) ఆరోపిత అనుభవాన్నిచ్చేవి
3) గుర్తులతో అనుభవాన్నిచ్చేవి
4) సంకల్పిత అనుభవాన్నిచ్చేవి
6. ప్రయోగాలు చేయడం ఏ రకమైన బోధనోపకరణం?
1) ఆరోపిత 2) ప్రత్యక్ష అనుభవ
3) మాటలు లేదా గుర్తులతో
4) ఏవీకాదు
7. దృశ్య,శ్రవణ,దృశ్య-శ్రవణ, కృత్యాధార అనే బోధనోపకరణాల వర్గీకరణ దేన్ని బట్టి జరిగింది?
1) అనుభవాలు 2) పరిమాణం
3) లభ్యత 4) లక్షణాలు
8. క్షేత్ర పర్యటన ఏ రకం బోధనోపకరణం?
1) దృశ్య 2) దృశ్య-శ్రవణ
3) కృత్యాధార 4) శ్రవణ
9. ఎడ్గర్ డేల్ బోధనోపకరణాలను అనుభవాలను బట్టి ఏ ఆకారంలో అమర్చారు?
1) గోళాకారం 2) చతురస్రాకారం
3) శంఖాకారం 4) చతుర్భుజాకారం
10. ఎడ్గర్ డేల్ శంఖువులో ప్రత్యక్ష అనుభవాల స్థానం?
1) పీఠ భాగం 2) శిఖర భాగం
3) మధ్య భాగం 4) కింది భాగం
11. ఎడ్గర్ డేల్ శంఖువులో శాబ్దిక చిహ్నాల స్థానం?
1) పీఠ భాగం 2) శిఖర భాగం
3) మధ్య భాగం 4) ఎక్కడైనా ఉండొచ్చు
12. పోషకాహార విలువలను నృత్య రూపకంగా చేసి బోధించడం?
1) ప్రత్యక్ష అనుభవం 2) క్షేత్ర పర్యటన
3) ప్రదర్శన 4) నాటకీకరణ
13. ఫ్లానెల్ బోర్డ్ ఏ రకానికి చెందిన బోధనోపకరణం?
1) ప్రదర్శనా ఉపకరణాలు
2) త్రిపరిమాణ ఉపకరణం
3) రేఖీయ చిత్రం 4) ప్రక్షేపిత ఉపకరణం
14. మాతృకలు (స్పెసిమన్) ఏ రకం బోధనోపకరణం?
1) ప్రదర్శన 2) ప్రక్షేపిత
3) కృత్యాధార 4) త్రిపరిమాణ
15. ఫిల్మ్ ప్రొజెక్టర్ ఏ రకం బోధనోపకరణం?
1) ప్రదర్శన 2) ప్రక్షేపిత
3) కృత్యాధార 4) త్రిపరిమాణ
16. ఎడ్గర్ డేల్ అనుభవ శంఖువులో ప్రొజెక్టర్‌ల స్థానం?
1) ప్రదర్శన బల్లలపైన
2) చార్టు తర్వాత 3) చలనచిత్రాలపైన
4) శాబ్దిక చిహ్నాలపైన
17. జంతువుల వర్గీకరణ రాయడానికి ఏ రకం చార్ట్ అవసరం?
1) వ్యవస్థానుక్రమ 2) దత్తాంశ
3) వంశవృక్ష 4) క్రమానుగత
18. బార్ గ్రాఫ్‌లను ఏ విధంగా పిలుస్తారు?
1) హిస్టోగ్రామ్‌లు 2) లైన్ గ్రాఫ్‌లు
3) సెక్టర్ గ్రాఫ్‌లు 4) వ్యంగ్య చిత్రాలు
19. వీటిలో ఏది ప్రత్యక్ష అనుభవానికి దగ్గరగా ఉంటుంది?
1) రేఖా చిత్రం 2) త్రిమితీయ ఉపకరణం
3) రేడియో 4) శాబ్దిక చిహ్నం
20. తోలుబొమ్మలు ఏ రకం బోధనోపకరణం?
1) కృత్యాధార 2) ప్రదర్శన
3) ప్రక్షేపిత 4) త్రిమితీయ
21. అపార దర్శక వస్తువులను ఏ ఉపకరణం ద్వారా ప్రక్షేపితం చేయొచ్చు?
1) ఫిల్మ్ ప్రొజెక్టర్ 2) ఓవర్‌హెడ్ ప్రొజెక్టర్
3) ఎపిడయాస్కోప్ 4) మైక్రో ప్రొజెక్టర్
22. మైక్రో ప్రొజెక్టర్ ప్రత్యేకత ఏమిటి?
1) ఉపాధ్యాయుడి వెనుక ప్రతిబింబం
2) అపారదర్శకత కలిగిన వస్తువుల ప్రక్షేపణ
3) సూక్ష్మదర్శినిలోని స్లైడుల ప్రక్షేపణ
4) సెల్లోఫేన్ పేపర్‌పైన వేసిన బొమ్మల ప్రక్షేపణ
23. ప్రొజెక్టర్ ఉపాధ్యాయుడి దగ్గరే ఉండి ప్రతిబింబం కూడా ఆయన వైపే ప్రక్షేపించడం ఏ ప్రొజెక్టర్ లక్షణం?
1) స్లైడ్ ప్రొజెక్టర్ 2) ఓవర్ హెడ్ ప్రొజెక్టర్
3) ఎపిడయాస్కోప్ 4) మైక్రో ప్రొజెక్టర్
24. భారతదేశంలో దూరదర్శన్ ప్రయోగాత్మక ప్రసారాలు ప్రారంభించిన సంవత్సరం?
1) 1959 2) 1961
3) 1987 4) 1998
25. బడి తోట పెంచడం ఏ కమిటీ సూచించిన SUPWలో ఒక భాగం?
1) మొదలియార్ 2) తారాదేవి
3) ఈశ్వరీబాయి 4) కొఠారీ
26. వైజ్ఞానిక సంఘాలు ఏ రకం బోధనోపకరణాల కిందకు వస్తాయి?
1) ప్రక్షేపిత 2) కృత్యాధార
3) పరోక్ష 4) దృశ్య శ్రవణ
27. 1959లో మొదటి బిర్లా పారిశ్రామిక సాంకేతిక ప్రదర్శనశాలను ఎక్కడ ఏర్పాటు చేశారు?
1) కోల్‌కతా 2) ముంబై
3) హైదరాబాద్ 4) ఢిల్లీ
28. 1977లో ముంబైలో ఏ విజ్ఞాన శాస్త్ర కేంద్రాన్ని ఏర్పాటు చేశారు?
1) బిర్లా ప్లానిటోరియం
2) విశ్వేశ్వరయ్య మ్యూజియం
3) నెహ్రూ విజ్ఞాన కేంద్రం
4) జాతీయ విజ్ఞాన కేంద్రం
29. మొక్కలను లేదా వాటి భాగాలను కొంతకాలం ఎండబెట్టి భద్రపర్చే విధానం?
1) వివేరియం 2) ఛేదనం
3) టెర్రేరియం 4) హెర్బేరియం
30. అక్వేరియం అనేది ఒక?
1) అందాన్నిచ్చే వస్తువు
2) కృత్రిమ జీవావరణ వ్యవస్థ
3) అన్ని రకాల జీవులుండే స్థలం
4) చీకటి జీవులను తెలుసుకునేది
31. ప్రత్యేక స్థలాల్లో జీవించి ఉన్న జంతువులకు సహజ స్థితులను ఏర్పర్చి పరిశీలించడాన్ని ఏమంటారు?
1) వివేరియం 2) అక్వేరియం
3) హెర్బేరియం 4) టెర్రేరియం
32. కీటకాల జీవిత చరిత్రను బోధించేందుకు దేన్ని ఉపయోగించవచ్చు?
1) అక్వేరియం 2) వివేరియం
3) హెర్బేరియం 4) టెర్రేరియం
33. భూచరాలయాన్ని ఏ విధంగా పిలుస్తారు?
1) వివేరియం 2) హెర్బేరియం
3) అక్వేరియం 4) టెర్రేరియం
34. అక్వేరియంలో ఉండే జీవులు?
1) కీటకాలు 2) చేపలు
3) వృక్షాలు 4) మానవులు
35. అక్వేరియంలో ఏ మొక్కలను పెంచుతారు?
1) గులాబీ మొక్కలు 2) కాక్టస్
3) హైడ్రిల్లా 4) గడ్డి మొక్కలు

సమాధానాలు

1) 2; 2) 3; 3) 4; 4) 1; 5) 2;
6) 2; 7) 4; 8) 3; 9) 3; 10) 1;
11) 2; 12) 4; 13) 1; 14) 4; 15) 2;
16) 3; 17) 3; 18) 1; 19) 2; 20) 4;
21) 3; 22) 3; 23) 2; 24) 1; 25) 3;
26) 2; 27) 1; 28) 3; 29) 4; 30) 2;
31) 1; 32) 2; 33) 4; 34) 2; 35) 3.

అనియత విజ్ఞాన శాస్త్ర విద్య

1. ఏ రకమైన నియమ నిబంధనలు లేకుండా సైన్స్ పై అవగాహన ఏర్పర్చి, శాస్త్రీయ వైఖరులను అభివృద్ధి చేయడానికి పాటించే పద్ధతులేవి?
1) విద్యా సాంకేతిక శాస్త్ర కార్యక్రమాలు
2) నిర్బంధ విద్యా కార్యక్రమాలు
3) అనియత విజ్ఞాన శాస్త్ర కార్యక్రమాలు
4) పాఠ్యేతర విజ్ఞాన శాస్త్ర కార్యక్రమాలు
2. వైజ్ఞానిక సంఘాలు, వైజ్ఞానిక ప్రదర్శనలు, మ్యూజియాలు, సైన్స్ కమ్యూనిటీ సెంటర్‌లు.. సైన్స్ ఫెయిర్స్ (ప్రదర్శన)ల ద్వారా అందించే విజ్ఞాన శాస్త్ర విద్య?
1) నియత విజ్ఞాన శాస్త్ర విద్య
2) నిర్బంధ విజ్ఞాన శాస్త్ర విద్య
3) విద్య సాంకేతిక శాస్త్రం
4) అనియత విజ్ఞాన శాస్త్ర విద్య
3. వైజ్ఞానిక సంఘాలు ఏ రంగాలను ప్రభావితం చేస్తాయి?
1) జ్ఞానాత్మక - భావావేశ
2) భావావేశ, మానసిక చలనాత్మక
3) మానసిక చలనాత్మక, జ్ఞానాత్మక
4) జ్ఞాన, భావావేశ, మానసిక చలనాత్మక
4. వైజ్ఞానిక సంఘాలు విద్యార్థులకు పని - అనుభవం కలిగించే ప్రక్రియలు అని తెలిపినవారు?
1) మొదలియార్ 2) కొఠారీ
3) తారాదేవి 4) రాధాకృష్ణన్
5. కిందివాటిలో ఏది వైజ్ఞానిక సంఘ లక్ష్యం కాదు?
1) విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులను పెంపొందించడం
2) అనాదిగా వస్తున్న ఆచారాలను నమ్మడం
3) విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను, పెంపొందించడం
4) విరామకాలాన్ని సద్వినియోగపర్చుకునేలా చేయడం
6. సాధారణ సంఘాలు, ప్రత్యేక అభిరుచి సంఘాలు అనేవి ఏ సంఘంలో రకాలు?
1) వైజ్ఞానిక సంఘం
2) విహార యాత్ర సంఘం
3) సేవా సంఘం 4) శాస్త్రవేత్తల సంఘం
7. ఫొటోగ్రాఫర్ క్లబ్ ఏ రకమైన సంఘం?
1) సాధారణ సంఘం
2) సాంస్కృతిక సంఘం
3) ప్రత్యేక అభిరుచి సంఘం
4) సేవా సంఘం
8. పాఠశాలలో వైజ్ఞానిక సంఘానికి మార్గదర్శి లేదా ప్రతిపాదకుడుగా వ్యవహరించాల్సిన వారు?
1) ప్రధానోపాధ్యాయుడు
2) డీఈవో
3) ఆ ప్రాంతంలోని శాస్త్రవేత్త
4) విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుడు
9. కిందివాటిలో వైజ్ఞానిక సంఘం ఏర్పాటుకు పరిగణనలోకి తీసుకోని అంశం ఏది?
1) ప్రభుత్వ గుర్తింపు
2) కమిటీల ఏర్పాటు
3) నియమాలు
4) సమావేశాలు, కార్యక్రమాలు
10. NCERT సూచనల ప్రకారం వైజ్ఞానిక సంఘంలో ప్రధానోపాధ్యాయుని పాత్ర?
1) మార్గదర్శి 2) నియంత
3) పోషకుడు 4) సేవకుడు
11. సంఘం ఉద్దేశాలను, సంఘ కార్యక్రమాలను, ప్రదర్శనలు, వైజ్ఞానిక నాటకాల గురించి పరిసర సమాజానికి తెలియజేసే వైజ్ఞానిక సంఘ నిర్వాహక కమిటీ వ్యక్తి?
1) అధ్యక్షుడు 2) కార్యదర్శి
3) పోషకుడు 4) ప్రచారాధికారి
12. కిందివాటిలో ఏది వైజ్ఞానిక సంఘ కార్యక్రమం కాదు?
1) క్షేత్ర పర్యటన
2) మాక్ పార్లమెంట్ నిర్వహణ
3) బడి తోట నిర్వహణ
4) పర్యావరణ దినోత్సవ నిర్వహణ
13. విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులు, తగిన నైపుణ్యాలు పెంపొందించి వారు భావి శాస్త్రవేత్తలుగా రూపుదిద్దుకొనేందుకు ప్రతి ఏటా వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేసేవారు?
1) మండల విద్యాశాఖ
2) రాష్ట్ర విద్యాశాఖ
3) NCERT 4) CBSE
14. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిల వైజ్ఞానిక ప్రదర్శనలు ఎవరి ఆర్థిక సహాయంతో జరుగుతాయి?
1) NCERT- SCERT
2) విద్యా శాఖా మంత్రి
3) ముఖ్యమంత్రి 4) డీఈవో
15. జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన కమిటీ చైర్మన్‌గా వ్యవహరించేవారు?
1) కలెక్టర్ 2) డీఈవో
3) డైట్ ప్రిన్సిపాల్
4) జిల్లాలో అవార్డు తెచ్చుకున్న సైన్స్ టీచర్
16. లైబ్రరీ అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
1) గ్రీకు 2) పర్షియా
3) ఇంగ్లిష్ 4) లాటిన్
17. 'లైబర్' అనే మాటకు అర్థం?
1) పుస్తకం 2) రాయడం
3) జ్ఞానం 4) సేకరించడం
18. విజ్ఞాన శాస్త్ర గ్రంథాలయం ఎవరి ఆధీనంలో ఉంటుంది?
1) ప్రధానోపాధ్యాయుడు
2) జిల్లా విద్యాశాఖాధికారి
3) తరగతిలో, సైన్స్‌లో తెలివి కలిగిన విద్యార్థి
4) విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుడు
19. వేటి నిర్వహణలో ఇండెక్స్ కార్డ్, క్యాటలాగ్‌లను తప్పనిసరిగా ఏర్పర్చాలి?
1) సైన్స్ క్లబ్ 2) సైన్స్ లైబ్రరీ
3) సైన్స్ ఫేర్ 4) ఫీల్డ్ ట్రిప్
20. ప్రతి పాఠశాలలో ప్రత్యేక విజ్ఞాన శాస్త్ర గ్రంథాలయం ఉండాలి అని ప్రతిపాదించిన వారు?
1) కొఠారీ కమిషన్
2) మొదలియార్ కమిషన్
3) ఆలిండియా సైన్స్ సెమినార్
4) రాధాకృష్ణన్ కమిషన్
21. హైదరాబాద్‌లోని ప్లానిటోరియం పేరు?
1) బిర్లా 2) టాటా
3) గెలాక్సీ 4) గెలీలియో
22. విక్రం సారాభాయ్ సమాజ విజ్ఞాన కేంద్రాన్ని 1966లో ఎక్కడ ప్రారంభించారు?
1) అహ్మదాబాద్ 2) ముంబై
3) లక్నో 4) అలహాబాద్

సమాధానాలు

1) 3; 2) 4; 3) 4; 4) 2; 5) 2;
6) 1; 7) 3; 8) 4; 9) 1; 10) 3;
11) 4; 12) 2; 13) 3; 14) 1; 15) 2;
16) 1; 17) 1; 18) 4; 19) 2; 20) 3;
21) 1; 22) 1;

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
గురువారం । 14-11-2024

పరిశ్రమల అభివృద్ధి, క్రమబద్ధ చట్టం లక్ష్యాలు?

* ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల పాత్ర; దేశీయ, విదేశీ పెట్టుబడులు; సాంకేతిక పరిజ్ఞానం మొదలైన వాటి విషయంలో ప్రభుత్వ వైఖరిని సంబంధిత దేశ పారిశ్రామిక విధానంలో వివరిస్తారు.
* ఒక దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వనరులను అభిలషణీయంగా ఉపయోగించుకోవాలి. నిర్దేశిత లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. దీనికి సంబంధించి ఉత్పత్తి ప్రక్రియలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల పాత్రను పారిశ్రామిక విధానం వివరిస్తుంది.
* స్వాతంత్ర్యానికి పూర్వం భారతదేశానికి సరైన, కచ్చితమైన పారిశ్రామిక విధానం లేదు. స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం పారిశ్రామిక విధానం ఆవశ్యకతను గుర్తించి 1948, ఏప్రిల్ 6న మొదటి పారిశ్రామిక విధాన తీర్మానాన్ని ప్రకటించింది.

మొదటి పారిశ్రామిక విధాన తీర్మానం

* ఈ తీర్మానంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల పరిధిని స్పష్టంగా పేర్కొంటూ పరిశ్రమలను నాలుగు వర్గాలుగా విభజించారు. ఈ తీర్మానంతో మన దేశం మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకొంది.
* **మొదటి వర్గం (ప్రభుత్వ ఏకస్వామ్యం):** ఈ వర్గంలోని పరిశ్రమలు ప్రభుత్వ గుత్తాధిపత్యంలో ఉంటాయి. మూడు రకాల కార్యకలాపాలను నిర్వహించే పరిశ్రమలను ఈ వర్గంలో చేర్చారు. అవి..

1. దేశ రక్షణ, తత్సంబంధ పరిశ్రమలు, ఆయుధ సామగ్రి, ఆయుధాల ఉత్పత్తి, నియంత్రణ.
2. అణుశక్తి ఉత్పత్తి, నియంత్రణ.
3. రైల్వేలు వాటి నిర్వహణ, యాజమాన్యం

రెండో వర్గం (మిశ్రమ రంగం): ఇందులో ఆరు కీలక, మౌలిక పరిశ్రమలను చేర్చారు. అవి..
1. బొగ్గు, 2. ఇనుము, ఉక్కు, 3. విమానాల ఉత్పత్తి, 4. నౌకా నిర్మాణం,
5. టెలిఫోన్, టెలిగ్రాఫ్, వైర్‌లెస్ పరికరాల ఉత్పత్తి, 6. ఖనిజ నూనెలు.

* ఈ తీర్మానం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఈ వర్గంలోని పరిశ్రమల్లో కొత్త వాటిని ప్రైవేటు రంగంలో స్థాపించడానికి వీల్లేదు. ఇకపై వీటిని ప్రభుత్వ రంగంలోనే స్థాపిస్తారు. అప్పటికే ప్రైవేటు రంగంలో ఉన్న వాటిని కొనసాగించవచ్చు. అవసరమనుకుంటే పదేళ్ల తర్వాత నష్టపరిహారం చెల్లించి వాటిలో దేన్నయినా ప్రభుత్వం జాతీయం చేయొచ్చు.

మూడో వర్గం (ప్రభుత్వ నియంత్రణ): ఈ వర్గంలో జాతీయ ప్రాముఖ్యం ఉన్న 18 పరిశ్రమలను చేర్చారు. వీటిని ప్రభుత్వం నిర్వహించనప్పటికీ వీటి నియంత్రణ, అజమాయిషీ ప్రభుత్వానికి ఉంటుంది. ప్రభుత్వ నియమ, నిబంధనలకు లోబడి వీటి ఉత్పత్తులు కొనసాగాలి. ఇందులో ఆటోమొబైల్స్, భారీ రసాయనాలు, భారీ యంత్రాలు, యంత్ర పరికరాలు, ఎరువులు, ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్, పంచదార, కాగితం, సిమెంట్, వస్త్రాలు మొదలైన పరిశ్రమలను చేర్చారు.

నాలుగో వర్గం (ప్రైవేటు రంగం): పై మూడు వర్గాల్లో లేని పరిశ్రమలను ఇందులో చేర్చారు. వీటిని ప్రైవేటు రంగానికి వదిలేశారు. అయితే వీటిపై ప్రభుత్వం సాధారణ అజమాయిషీ కలిగి ఉంటుంది.

1951-పారిశ్రామిక లైసెన్సింగ్ విధానం

(పరిశ్రమల అభివృద్ధి, క్రమబద్ధ చట్టం)

* మన దేశంలో ప్రైవేటు రంగ పరిశ్రమల అభివృద్ధిని క్రమబద్ధం చేయడం, వాటిని నియంత్రించడం అనే రెండు ప్రధాన ఉద్దేశాలతో 1951, అక్టోబర్‌లో పారిశ్రామిక లైసెన్సింగ్ విధానాన్ని (పరిశ్రమల అభివృద్ధి, క్రమబద్ధ చట్టం) పార్లమెంటు చట్టం ద్వారా రూపొందించారు. ఈ చట్టం 1952, మే 8 నుంచి అమల్లోకి వచ్చింది.

ఈ చట్టం లక్ష్యాలు

1. ప్రణాళికా లక్ష్యాలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా పారిశ్రామిక పెట్టుబడులు, ఉత్పత్తులు ఉండేలా చూడటం.
2. పెద్ద పరిశ్రమల పోటీ నుంచి చిన్న పరిశ్రమలను రక్షించడం.
3. ఏకస్వామ్యాలను నిరోధించడం.
4. సంతులిత ప్రాంతీయాభివృద్ధి.
5. వెనుకబడిన ప్రాంతాల్లో పెట్టుబడులను ప్రోత్సహించడం.
6. దేశీయ మార్కెట్లో సప్లై, డిమాండ్‌ల మధ్య సహ సంబంధాన్ని తీసుకురావడం.
7. సామాజిక మూలధనాన్ని అభిలషణీయంగా ఉపయోగించుకోవడం.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ

* ఈ చట్టం పరిధిలోకి వచ్చే పరిశ్రమలు ప్రారంభంలో 37 ఉండగా, తర్వాత కాలంలో 70కి పెంచారు. ఇందులోని పరిశ్రమలు రిజిస్టర్ చేసుకొని లైసెన్స్ పొందాలి.
* 1953లో రూ.1 లక్ష కంటే ఎక్కువ పెట్టుబడి కలిగిన పరిశ్రమలను దీని పరిధిలోకి తెచ్చారు. అయితే లైసెన్సింగ్ అథారిటీపై పరిపాలన పరమైన భారం, ఒత్తిడి మూలంగా 1956లో ఈ నిర్ణయాన్ని ఉపసంహరించారు.
* 1956లో విద్యుత్‌ను ఉపయోగించి, 50 మంది శ్రామికులతో ఉత్పత్తిని చేపట్టే పరిశ్రమలు (లేదా) విద్యుత్‌ను వాడకుండా 100 మంది శ్రామికులతో ఉత్పత్తిని నిర్వహించే పరిశ్రమలను ఈ చట్టం పరిధిలోకి చేర్చారు.
* ఈ చట్టం పరిధిలోకి వచ్చే పరిశ్రమల పెట్టుబడి పరిమితిని 1960లో రూ.10 లక్షలకు పెంచారు. ఈ పరిమితిని 1963లో రూ.25 లక్షలకు పెంచారు. 1970లో రూ. కోటికి పెంచారు. 1978లో రూ.3 కోట్లకు పెంచారు. ఆ తర్వాత పెట్టుబడి పరిమితిని రూ.5 కోట్లకు పెంచారు.
* 1988-89లో ప్రభుత్వం లైసెన్సింగ్ విధానంలో విప్లవాత్మక నిర్ణయాన్ని ప్రకటించింది. దీని ప్రకారం అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో రూ.15 కోట్లు, వెనుకబడిన ప్రాంతాల్లో రూ.50 కోట్లకు పైబడిన పెట్టుబడి గల పరిశ్రమలు మాత్రమే లైసెన్స్ పొందాల్సి ఉంటుంది. లిబరలైజేషన్ పాలసీ (సరళీకృత విధానం)లో భాగంగా లైసెన్స్‌ల రద్దు వైపు ప్రభుత్వం మొగ్గు చూపింది.

రెండో పారిశ్రామిక విధాన తీర్మానం-1956

* 1956, ఏప్రిల్ 30న భారత ప్రభుత్వం రెండో పారిశ్రామిక విధాన తీర్మానాన్ని ప్రకటించింది. 1956 నాటికి మన దేశంలో అనేక రాజకీయ, ఆర్థిక మార్పులు సంభవించాయి.
* 1956 నాటికి మొదటి పంచవర్ష ప్రణాళికను పూర్తి చేసుకోవడం, రెండో ప్రణాళికలో భారీ, మౌలిక పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వడం, సమ సమాజ స్థాపనను లక్ష్యంగా నిర్ణయించుకోవడం మొదలైనవి 1956 పారిశ్రామిక విధాన తీర్మాన ప్రకటనకు కారణమయ్యాయి.

మూడు జాబితాలు:

* 1956 పారిశ్రామిక విధాన తీర్మానంలో పరిశ్రమలను ఎ, బి, సి అనే మూడు జాబితాలుగా వర్గీకరించారు.
* జాబితా-ఎ: ఇందులో 17 పరిశ్రమలను చేర్చారు. దేశ రక్షణ, తత్సంబంధ పరిశ్రమలు దీనిలో ఉన్నాయి. వీటిలో ఆయుధాలు, అణుశక్తి, విమాన రవాణా, రైల్వే రవాణా పరిశ్రమలు ప్రభుత్వ గుత్తాధిపత్యంలో ఉంటాయి. మిగతా 13 పరిశ్రమలను ఈ తీర్మానం తర్వాత నుంచి ప్రభుత్వమే స్థాపిస్తుంది. అప్పటికే ప్రైవేటు రంగంలో ఉన్నవి కొనసాగవచ్చు. అవసరమైతే వీటిని ప్రైవేటు రంగంలో కూడా నెలకొల్పే అవకాశం కల్పించారు. ఈ తీర్మానంలో పరిశ్రమలను జాతీయం చేసే ప్రతిపాదన లేదు.
* జాబితా-బి: అన్ని రకాల ఖనిజాలు, లోహాలు, యంత్ర పనిముట్లు, మిశ్రమ లోహాలు, ఎరువులు, రబ్బరు, బొగ్గు తదితర 12 పరిశ్రమలను ఇందులో చేర్చారు. ప్రభుత్వం నూతన సంస్థలను స్థాపించి తన భాగస్వామ్యాన్ని పెంచుకోవచ్చు. అయితే ప్రైవేటు రంగం కొత్త సంస్థలను స్థాపించడానికి, ఉన్న వాటిని విస్తృతం చేసుకోవడానికి ఏ ఆటంకం ఉండదు.
* జాబితా-సి: ఎ, బి జాబితాల్లో లేని పరిశ్రమలను ఇందులో చేర్చారు. ఈ జాబితాలోని పరిశ్రమల అభివృద్ధి ప్రైవేటు రంగం చొరవపై ఆధారపడి ఉంటుంది. పారిశ్రామికీకరణ లక్ష్యాలకు అనుగుణంగా ఈ జాబితాలోని పరిశ్రమలను ప్రభుత్వం ప్రోత్సహించడమే కాకుండా నియంత్రిస్తుంది.
* 1970, 1973, 1975ల్లో పారిశ్రామిక విధాన తీర్మానాలను ప్రకటించినా, వాటికి 1956 తీర్మానమే ప్రాతిపదికగా నిలిచింది. ఈ తీర్మానాల్లో మౌలిక మార్పులు లేకుండా కేవలం కుటీర, చిన్నతరహా పరిశ్రమల నిర్వచనాల్లో, లైసెన్సింగ్ విధానంలో, విదేశీ మూలధనం విషయంలో స్వల్ప మార్పులు చేశారు.

జనతా ప్రభుత్వ పారిశ్రామిక విధానం-1977

* 1977లో అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం, తన శైలిలో 1977 డిసెంబర్ 23న నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది. గాంధేయ విధానానికి అనుగుణంగా దీన్ని రూపొందించారు.
* చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి ఇందులో అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

నూతన పారిశ్రామిక విధానం-1991

* 1980 నుంచి మొదలైన సరళీకృత విధానం, నిర్ణయాలకు అనుగుణంగా దీన్ని రూపొందించారు.
* పి.వి.నరసింహారావు ప్రధానిగా, మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా 1991, జూలై 24న దీన్ని ప్రకటించారు.
* ప్రపంచ మార్కెట్‌తో భారత ఆర్థిక వ్యవస్థను అనుసంధానం చేసి, విదేశీ పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, యంత్ర సామగ్రి దిగుమతులను పెంచి, వేగవంతమైన అభివృద్ధిని సాధించడం ఈ తీర్మానం ముఖ్య ఉద్దేశం.
* సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ లక్ష్యాలకు అనుగుణంగా ఆర్థిక వ్యవస్థలో పెను మార్పులకు శ్రీకారం చుట్టారు.
* ఈ పారిశ్రామిక విధాన తీర్మానంలో లైసెన్సింగ్ విధానంలోని నిబంధనలను గణనీయంగా సడలించారు.

1991 పారిశ్రామిక విధాన తీర్మానం ప్రధాన లక్ష్యాలు

* సాధించిన ఆర్థిక ప్రగతి ఫలాలను ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు ఉపయోగించడం.
* ఆర్థిక ప్రగతికి ఆటంకం కలిగించే అంశాలను సరిచేయడం.
* ఉత్పత్తి, ఉద్యోగితల్లో సుస్థిర వృద్ధిని నిలుపుకోవడం.
* అంతర్జాతీయంగా ఎదురయ్యే పోటీని తట్టుకోవడం.

The antonym of Critical is..

Directions (Q.No. 1-5): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

Climate change poses potentially devastating effects on India's agriculture. While the overall parameters of climate change are increasingly accepted – a 1 °C average temperature increase over the next 30 years, sea level rise of less than 10 cm in the same period, and regional monsoon variations and corresponding droughts- the impacts in India are likely to be quite site and crop specific. Some crops may respond favourably to the changing conditions, others may not. This emphasizes the need to **promote** agricultural research and create maximum flexibility in the system to permit adaptations.

The key ingredient for "drought proofing" is the managed recharge of aquifers. To ensure continued yields of important staple crops, it may also be necessary to shift the locations where these crops are grown, in response to temperature changes as well to water availability. The latter will be a key factor in making long term investment decisions.

For example, water runoff from the Himalayas is predicted to increase over the next 30 years as glaciers melt, but then decline substantially thereafter. It will be **critical** to provide incentives to plan for these large-scale shifts in agro-ecological conditions.

India needs to make long term investment in research and development in agriculture. India is likely to experience changed weather patterns in future.

1. Consider the following statements: Climate change may force the shifting of locations of the existing crops due to
   a) Melting of glaciers
   b) Water availability and temperature suitability at other locations
   c) Poor productivity of crops
   d) Wider adaptability of crop plants
   Which of the statements given above are correct?
   1) a, b, & c 2) b & c only
   3) a & d only 4) a & c
   5) a, b, c, & d
2. To promote agricultural research in India is important because:
   1) To predict variations in monsoon patterns and to manage water resources.
   2) To make long term investment decisions for economic growth.
   3) To facilitate wider adaptability of crops.
   4) To predict drought conditions and to recharge aquifers.
   5) Changed weather patterns in future.
3. The spillover from the Himalayas is due to
   1) large-scale shifts in agro-ecological conditions.
   2) changed weather patterns in future
   3) productivity of crops
   4) melting of glaciers
   5) adaptability of crop plants
4. The antonym of **Critical** is
   1) waver 2) steady 3) unsure
   4) insecure 5) fasten
5. The synonym of **promote** is
   1) encompass 2) encourage
   3) entangle 4) entrust 5) encode

Directions (Q.No. 06-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that the best fits the meaning of the sentence as a whole.

6. There is a ____ gap between rich and poor.
   1) vary 2) variety 3) similar
   4) reported 5) yawning
7. She ____ to escape from her office job.
   1) earned 2) yelled 3) yearned
   4) yielded 5) learn
8. The seriousness of the situation is ____ to appreciate in its ____.
   1) easy; complete
   2) different; wholesome
   3) difficult; totality
   4) hard; completeness
   5) tough; compliment
9. The new policy was adopted in the ____ of fierce ____.
   1) wake; opponent
   2) show; postponement
   3) teeth; criticism
   4) course; outcome
   5) reality; injustice
10. The computer is now an ____ tool for the family doctor.
    1) value 2) valid
    3) price 4) worth 5) invaluable

Directions: (Q.No. 11-15): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. The magazine is issued year two times.
    1) year twice 2) twice yearly
    3) yearly two 4) two yearly
    5) no correction required
12. She yelled at the child to getting down from the wall.
    1) got down 2) get down
    3) getting away 4) get upon
    5) no correction required
13. All her yesterday's has vanished without a trace.
    1) Have 2) had
    3) has been 4) have being
    5) no correction required
14. My son's 13 but he's younger for his age.
    1) Youngest 2) youth
    3) older 4) young
    5) no correction required
15. When the needle enters the red zone the engine is indicator hot.
    1) Too 2) much
    3) becomes 4) left
    5) no correction required

Directions (Q.No. 16-25): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

16. Exam results (1)/ are not the only (2)/ yard stick of a (3)/ school performance. (4)/ no error (5)
17. I have always (1)/ had a yen (2)/ to travel (3)/ around the world. (4)/ no error (5)
18. Because of the rapid progress (1)/ that science has made (2)/ the universe is slow yielding (3)/ up its secrets. (4)/ no error (5)
19. She brings to the job (1)/ a rare combination (2)/ of youth and (3)/ experiences. (4)/ no error (5)
20. The group was made up of (1)/ people with a range of age, (2)/ professions, incomes and (3)/ computer expertise. (4)/ no error (5)
21. Between 1957 and 2007 expenditures (1)/ in all 5 categories changed to some extent, (2)/ but the most marked change (3)/ was in the food category. (4)/ no error (5)
22. It seems that the man (1)/ who is dropping (2)/ off his own water bottle in the recycling bin (3)/ drove there in his car. (4)/ no error (5)
23. Reality TV shows involve real people perform (1)/ ridiculous and often dangerous acts (2)/ and generally behaving horribly (3)/ towards each other. (4)/ no error (5)
24. It is a legal requirement (1)/ for airline operators to provide (2)/ suitable refreshment (3)/ in the event of a long delay. (4)/ no error (5)
25. For some people, the huge increase in public surveillance (1)/ is a threat to the individual's social liberties (2)/ and was a sign that society (3)/ is becoming increasingly authoritarian. (4)/ no error (5)

Directions (Q.No. 26-30): Read each sentence which has four parts to find out whether there is any grammatical mistake or spelling mistake in it. Certain words are given in bold in each part to identify the error. Mark the number of that part with error as your answer.

26. Several **alarming** (1) incidents **occurred in** recent years (2) and **was widely** (3) **reported in** (4) the press.
27. **A** (1) general public should **rise to** (2) address the **social evil of** (3) corporal **punishment.** (4)
28. The teacher **was sought** (1) not only for imparting knowledge **and** (2) skills to students **but for also** (3) shaping their minds **and character.** (4)
29. **Prolonged** (1) television **viewvers** (2) have a higher **risk of** (3) fatal pulmonary **embolism.** (4)
30. **I want to** (1) travel to **sea** (2) the world **around** (3) and appreciate new **cultures.** (4)


Directions (Q.No. 31-35): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Thomas Smart conferred upon Sastri the appellation "Silver Tongued Orator of the British Empire" and he was so called all over the United Kingdom.
B) Srinivasa Sastri was known for his mastery over the English language and his oratory. As a student, he once corrected a few passages in J. C. Nesfield's "English Grammar".
C) The Master of Balliol, Arthur Lionel Smith swore that he had never realized the beauty of the English language until he heard Sastri, while Lord Balfour remarked that listening to Srinivasa Sastri made him realize the heights to which the English language could rise.
D) Whenever he was on visit to the United Kingdom, Sastri was often consulted over spellings and pronunciations.
E) Srinivasa Sastri's inspirations were William Shakespeare, Sir Walter Scott, George Eliot, John Stuart Mill, Thomas Harvey, Victor Hugo and Valmiki - Indian sage and the author of the Hindu epic Ramayana.
F) His mastery over the English language was recognized by King George V, Winston Churchill, Lady Lytton and Lord Balfour who rated him amongst the five best English-language orators of the century.

31. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
32. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
33. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
34. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) E 5) F
35. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q.No. 36-40): Choose the word which is wrongly spelt from the five options given.

36. 1) pedagogue 2) vilify
    3) extraneous 4) bucollic
    5) conundrum
37. 1) powwow 2) malignant
    3) untenable 4) capricious
    5) dissipete
38. 1) railery 2) splenetic
    3) palaver 4) lachrymose
    5) tenacity
39. 1) exiguity 2) pillary
    3) concomitant 4) surfeit
    5) adjudicate
40. 1) promulgate 2) cataclysm
    3) deluge 4) simulacrom
    5) mural



BANK EXAMS
GENERAL ENGLISH

Answers

1) 1; 2) 4; 3) 4; 4) 2; 5) 2;
6) 5; 7) 3; 8) 3; 9) 3; 10) 5;
11) 2; 12) 2; 13) 2; 14) 4; 15) 1;
16) 3; 17) 5; 18) 3; 19) 4; 20) 2;
21) 1; 22) 4; 23) 1; 24) 3; 25) 3;
26) 3; 27) 1; 28) 3; 29) 2; 30) 2;
31) 1; 32) 4; 33) 2; 34) 1; 35) 3;
36) 4; 37) 5; 38) 1; 39) 2; 40) 4.